# దేవుడు ఎవరు?!

## Who is GOD?!

## परमेश्वर कौन है?!

డా॥ బి. జాన్

INSTITUTE OF BIBLE TECHNOLOGY, HYD.
WORD OF GOD
C.G.S.T. HYDERABAD - INDIA.
ESTD : 1992

# దేవుడు ఎవరు?!

## (త్రిత్వమా?! ఏకత్వమా?!)

డా॥ బొంకూరి జాన్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి, హైదరాబాద్
ఆంధ్రప్రదేశ్, ఇండియా.

**దేవుడు ఎవరు? WHO IS GOD?!**

ప్రథమ ముద్రణ : మార్చి 2014

ప్రతులు : 1000

వెల : రూ. 100/-

© సర్వ హక్కులు రచయితవి.

డిజైన్ & ప్రింటింగ్

ఎ. శ్యాంసన్ - 9550015417

మంగళగిరి

రచయిత మరియు ప్రతులకు :

**Dr. JOHN BONKURI,**
Director & Founder.
Institute of Bible Technology, Hyderabad &
Temples of God Meet Here Church Building,
H.No:06 - 264 / 13 / 1 / 6H, HAL/Raghavendra Colony,
Suchitra X Road to Quthbullapur Road,
Behind Indian Oil Petrol bunk,
Quthbullapur (GHMC), HYDERABAD - 500067, INDIA.
Res Phone:+91 040 20000700,
Mob: +91 9440142887
website : www.bibletechnology.net
www.instituteofbibletechnology.com
E-mail : bibletechnology@gmail.com

ప్రతులకు :

**Bro. J. Ravi** (IBT Adminstrator & Correspondent)
H.No. 7-1-38/1/33, BJR Nagar,Ameerpet, Hyderabad-500 016
Cell : 9676744233, 9440792192

# అంకితం

దేవుడన్నాడనియు, ఆ ఉన్నవాడు ఒక్కడేననియు నమ్మి ఆయన చిత్తాన్ని నెరవేర్చుటకు పరిశుద్ధాత్మ సహాయంతో క్రీస్తు యేసుద్వారా పరిశుద్ధులు, నిర్దోషులై పరలోకం చేరాలని పరితపిస్తూ, తమకు కలిగిన ఈ భాగ్యాన్ని అనేకులకు ప్రకటిస్తూ తమకు తెలిసిన వారందరని అజ్ఞానంలో నుండి విజ్ఞానంలోనికి నడిపించాలనే ఆశ–ఆశయం కల్గిన దేవుని పిల్లలందరికి ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

మీ

**డా॥ జాన్ బొంకూరి**

# ముందుమాట



**తిప్పారపు సుధాకర్**
B.Teh (Civil)

**స**ర్వశక్తిమంతుడైన దేవాధిదేవునికి స్తోత్రములు. క్రీస్తునందు అత్యంత ప్రియులు, ఆత్మీయముగాను, శరీరకముగాను నాకు సోదర సోదరీమణులైన వారందరికి ప్రభువైన యేసు నామములో వందనములు.

ఈ చిత్రవిచిత్రమైన జగత్తులో ఒక గమ్యంతో జీవనయానం చేస్తున్న మనుషులందరికి ప్రతిసారి వచ్చే ప్రశ్నే **దేవుడు ఎవరు**? మనిషి మతి నుండి పుట్టిన మతాలు ఎందరో దేవుళ్ళను, దేవతలను సృష్టించినా అవిచాలక కళ్ళముందున్న మనుషులను కూడా దేవుళ్ళుగా మార్చేస్తున్నారు. కాని దేవుని మతి నుండి క్రీస్తు మార్గం మాత్రము దేవుడొక్కడేనని చెప్పినా, ఇక్కడ కూడా మనిషి మస్తిష్కం ప్రవేశించి దేవున్ని మూడు ముక్కలు చేసింది. మానవ ఊహానుబట్టి వ్రాసిన గ్రంథాలు, వాటిలో ఉన్న దేవుడు మరియు దేవుళ్ళ జోలికెళ్ళకుండా, వారిపై విమర్శలు చేయకుండా మేము మాత్రమే విశ్వాసులమని విర్రవీగుచున్న కొందరి మనోనేత్రములను ఈ **"దేవుడు ఎవరు?"** అనే పుస్తకం ద్వారా వెలిగించడానికి చక్కగా ప్రయత్నము చేసారు సోదరులు **డా॥ బొంకూరి జాన్ గారు.**

నా 25 సంవత్సరాల క్రైస్తవ జీవితానుభవములో ఆనాటి పౌలు వలె, నిస్వార్థముగా, స్వహస్తాలతో కష్టపడుతూ ప్రయాసపడి, ఎవ్వరికి తలవంచక ఎన్నో శోధనలలో కూడా దేవునిని, క్రీస్తు ద్వారా

మహిమపరుస్తూ, ఈ తరం వారికి దేవుని రాజ్య సువార్తను ప్రకటిస్తున్నాడు. ప్రతి ఆత్మరక్షణార్థమై డా॥ జాన్ గారు వ్రాసిన పుస్తకాలలోను, ప్రసంగాలలోను దేవునిని దేవునిగాను, క్రీస్తును క్రీస్తుగాను, పరిశుద్ధాత్మను పరిశుద్ధాత్మగానే చూపించడం, ఎవరి మహిమను వారికివ్వడం చూశాను, విన్నాను. అయితే ఈయన చెప్పే మాటలు, రాతలు సాతాను మాయ బోధలో ఉన్న వారికి మాత్రమే తప్పుడు బోధలాగ విమర్శ, హెచ్చరికలా అనిపిస్తాయి. ఆత్మచేత నడిపింపబడే వారికి మాత్రం అమితానందాన్ని కలిగించి, ఎంతో ఉజ్జీవాన్ని కలిగిస్తాయి. వీటన్నిటిని చదివి, ఆలోచిస్తే లేదా ఒకసారి స్వయంగా వచ్చి, విని రుచి చూస్తే మీరే తెలుసుకో గలరని నా అభిప్రాయం. మరియు ఒక్కసారి ఐ.బి.టి.లో జరిగే సెమినార్లకు రండి ఆ తర్వాత మీ నోటితో మీరే చెప్పగలరు.

జాన్ అన్న వ్రాసిన పుస్తకాలలో రెండవ దానికి కూడా ఆర్థిక సహాయం చేసి ముందుమాట లేక అభిప్రాయాన్ని వ్రాసే అవకాశాన్ని కల్గించిన తండ్రియైన దేవునికి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేలాది స్తుతులు, స్తోత్రాలు చెల్లిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన **"ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి"** మరియు **"టెంపుల్స్ ఆఫ్ గాడ్ మీట్స్ హియర్"** అనే సంఘానికి సంబంధించిన వారందరికి నా హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను. ఈ లోకంలో ఎందరో వ్రాసిన ఎన్నో పుస్తకాలు చదువుతున్నారు. ఈ పుస్తకాన్ని కూడా ఓసారి జాగ్రత్తగా ఆలోచించి చదివి గ్రహించి దేవుని మహిమార్థమై అనేకులకు పరిచయం చేస్తారని ఆశిస్తున్నాను.

*దేవుని కృపా సమాధానములు మనందరికి తోడైయుండును గాక! ఆమేన్*

---

*ప్రభువైన క్రీస్తు కార్యాలలో పాలివాడైన మీ సోదరుడు*

**తిప్పారపు సుధాకర్** *B.Teh (Civil),* హైదరాబాద్

---

# నా మాట

క్రీస్తు యేసు రక్త సంబంధులైన క్రైస్తవ జనాంగానికి, దేవుని స్వరూపంలో పుట్టి, ఆయన ఆత్మ సంబంధులైన దేవుని ప్రజలందరికి, దేవుని ప్రియకుమారుడు, మన ఆత్మల రక్షకుడైన క్రీస్తు నామములో వందనములు, శుభమని పలికి వ్రాయునది.

**దేవుడున్నాడా?** లేడా? ఉంటే ఆయన ఎవరు? ఎలా ఉంటాడు? అనే సమస్య మానవుడు దేవునికి దూరమైనప్పటి నుండి ఉందని, ఇంకా ఎన్నివేల సంవత్సరాలైనా మానవ మనస్సులో మెదలుతూనే ఉంటుంది. అలాగే చరిత్ర ప్రకారంగా లేదా బైబిల్ పండితుల కథనాల ఆధారంగా క్రీ.శ. 3వ శతాబ్దము నుండి క్రైస్తవ లోకంలో ముగ్గురు దేవుళ్ళు అనే సిద్ధాంతం ముందుకొచ్చిందట. దేవుడు త్రిత్వమని కొందరు, ద్విత్వమని కొందరు, ఏకత్వమని మరికొందరు వాదులాడుకొంటున్నారు. త్రిత్వమా? ఏకత్వమా? అనే ప్రశ్న ఇప్పుడు నేను వేసింది కాదు. అనేక సంవత్సరాలుగా అందరి నోళ్ళలో నానుతూ ఉన్న అతి ప్రాముఖ్యమైన సమస్య. ఈ రోజుల్లో ఇది ఇంకా ఎక్కువ చర్చనీయంగా మారింది.

ఈనాడు నాతరంలో ఉన్న దేవుని ప్రజలందరికి దేవుని గూర్చి పూర్ణముగా తెలియపరచాలని నా వంతు ప్రయత్నం చేశాను. దేశ, విదేశీ బైబిల్ కాలేజీలు, యూనివర్సిటీలలో చదివి బోధిస్తున్న అనేక

మంది చేయలేని లేదా ఒక రకంగా చేయకూడని సాహసాన్ని చేశాను. ఇది దేవుని చిత్తంగనుకనే ఎంతో రిస్కుతో కూడుకొన్నదని తెల్సినా, నాకు అనుగ్రహింపబడిన జ్ఞానాన్ని నాలోనే దాచుకోలేక మీ అందరి ముందు పెట్టాను. నేను చెప్పింది కూడా సముద్రంలో నీటిబొట్టు లాంటిదే అయినా, నీటిబొట్లు లేకుండా సముద్రం లేదు గనుక దేవుని ఆత్మతో, ఆలోచనతో ఈ పుస్తకాన్ని చదివి, ఆలోచించి, గ్రహించి దేవునిని దేవునిగా మహిమపర్చాలనేది నా ఆశ – ఆశయం. ఈ పుస్తకం ద్వారా దేవుని గూర్చియు, క్రీస్తును గూర్చిన సంక్షిప్త సాక్ష్యాన్ని మాత్రమే మీకు తెలియజేశాను. ఇందులో మీకు ఎలాంటి అనుమానమొచ్చినా, అర్థం కాకపోయినా, బైబిల్‌కు వ్యతిరేకంగా అనిపించినా వెంటనే నన్ను ఏ విధంగానైనా సంప్రదించి మిమ్ముల్ని మీరే సరిచేసుకోగలరు లేదా నన్ను సరిజేయగలరని సవినయంగా మనవి చేయుచున్నాను.

మొదటి ముద్రణలో ఈ పుస్తకానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించిన నా ఆత్మీయ సోదరుడు, జతపనివాడు అయిన బ్రదర్. వర్దనపు డేవిడ్ (బోరబండ, హైదరాబాద్) గారికి, వారి కుటుంబమంతటికిని నా హృదయపూర్వక వందనాలు చెల్లిస్తున్నాను. ఈ రెండవ రివైజ్డ్ ముద్రణకు ఆర్థిక సహాయం చేసిన నా ప్రియ మిత్రుడు పిప్పారపు సుధాకర్ మరియు వారి కుటుంబ సభ్యులకు వందనాలు. నేను చేస్తున్న ఈ రాజ్య సువార్తలో పాలిభాగస్తుడై అనుక్షణం నా కన్నా ఎక్కువ భారాన్ని మోస్తున్న సహోదరుడు జె. రవి గారికి (ఐబిటి – అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) వారి కుటుంబానికి నేనెంతో వందనస్తుడను. దేవుని సేవలో సహకరిస్తూ అనేక కాలేజీలను ముందుకు తీసుకెళ్తున్న సోదరుడు దాసి ప్రసాద్‌రావు (ప్రిన్సిపాల్& ఇవాంజలిస్ట్) గారికి ఆయన కుటుంబానికి వందనాలు. అందరికోసం ప్రార్థిస్తూ ఐ.బి.టి. ద్వారా అనేక ప్రాంతాలలో దేవుని రాజ్య సువార్తను దివారాత్రులు ప్రకటిస్తున్న

సువార్తికులు, బైబిల్‌కాలేజీ ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్, విద్యార్థినీ, విద్యార్థులందరికి నా వందనాలు. మరియు తమ సంఘాలలో ఈ రాజ్య సువార్తను ప్రకటించే అవకాశం కల్పిస్తూ, వారి సంఘస్తులను మేము క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్న బైబిల్ రీసెర్చి సెమినార్స్‌కు తప్పనిసరిగా పంపిస్తూ మాకు సహకరిస్తూ మా కోసం ప్రార్థించుచున్న జంటనగరాలు మరియు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులలోని దైవసేవకులందరికి నా ప్రత్యేక హృదయ పూర్వక వందనాలు.

ప్రతి పుస్తకంలో ఎక్కడో ఒకచోట అచ్చు తప్పులున్నట్లే ఇందులో కూడా అచ్చుతప్పులు దొర్లక మానవు. దయచేసి మమ్మల్ని మన్నించి అక్షరంలో దొర్లిన తప్పులు సరిదిద్దుకోవాలని మనవి చేయుచున్నాను. మన విశ్వాసాన్ని పరీక్షించుకొనే అవకాశాన్ని దేవుడు మరోసారి మనకిచ్చాడని తలంచి ఈ పుస్తకాన్ని మొదటి నుండి చివరి వరకు ఓపికతో చదివి, అనేకుల చేత చదివించి దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో మీ వంతు సహాయ సహకారాన్నివ్వాలని మరోసారి కోరుతూ నా స్వహస్తములతో క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన సార్వత్రిక సంఘంలోని సభ్యులందరికి వ్రాయుచున్నాను. ఈ పుస్తకంతో పాటు నేను వ్రాసిన **"యేసుక్రీస్తు ఎవరు?!" "సిలువవేయబడిన క్రీస్తు?"** మరియు **"పరిశుద్ధుని ముసుగులో భ్రష్టుడు?!"** అనే పుస్తకాలను చదివినప్పుడే మీకు దేవుని గూర్చి త్రిత్వమును గూర్చి పూర్తి అవగాహన నకలుగుతుందని చెప్పక తప్పదు. తండ్రియైన దేవుని ప్రేమ, ఆయన ప్రియ కుమారుడైన క్రీస్తు కృప, పరిశుద్ధాత్ముని సమాధానం సదాకాలము మనందరికి తోడైయుండును గాక... ఆమేన్.

రారాజు క్రీస్తు యేసురాజ్య విస్తరణలో

మీ ఆత్మీయ సోదరుడు **బొంకూరి జాన్**

తేది :31-03-2014 కుత్బుల్లాపూర్, హైదరాబాద్.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | దేవుడెవరు? | 11 |
| 2. | దేవుడున్నాడా? | 16 |
| 3. | దేవుని పేరేమి? | 18 |
| 4. | దేవుని నిత్య శక్తి | 26 |
| 5. | దేవత్వము | 29 |
| 6. | ఫరో సామ్రాజ్యము | 32 |
| 7. | బబులోను సామ్రాజ్యము | 34 |
| 8. | మాదీయ - పారసీక సామ్రాజ్యము | 36 |
| 9. | గ్రీకు సామ్రాజ్యము | 38 |
| 10. | రోమా సామ్రాజ్యము | 40 |
| 11. | దేవుడున్నాడనడానికి రుజువులు | 43 |
| 12. | దేవుడు ఆత్మ - తండ్రి | 54 |
| 13. | దేవుడున్నాడు! జాగ్రత్తపడండి! | 58 |
| 14. | దేవుడెక్కడున్నాడు? | 63 |
| 15. | దేవుడెలా ఉంటాడు - ఆయనకు రూపం... | 67 |
| 16. | దేవున్ని ఎవరైనా - ఎప్పుడైనా చూశారా? | 75 |
| 17. | దేవునితో ఎవరైనా ఎప్పుడైనా మాట్లాడారా? | 87 |

| | | |
|---|---|---|
| 18. | దేవుడు త్రిత్వమైయున్నాడా? ముగ్గురు దేవుళ్ళా? | 100 |
| 19. | యేసుక్రీస్తు దేవునితో సమానుడా? | 111 |
| 20. | యేసుక్రీస్తు - దేవుడొక్కడేనా? | 116 |
| 21. | నేను - ఆయనను | 124 |
| 22. | యెహోవా సాక్షులు | 129 |
| 23. | నిజమైన దేవుడెవరు? | 132 |
| 24. | స్తోత్రార్హుడెవరు? | 137 |
| 25. | మహాదేవుడెవరు? | 149 |
| 26. | దేవుడని చిత్తము | 157 |
| 27. | పరిశుద్ధత అనగానేమి? | 174 |
| 28. | ప్రార్థన ఎవరికి చేయాలి? | 183 |

# 1 దేవుడు ఎవరు?

ఈ చిత్ర విచిత్రమైన విశ్వంలో మానవ ఆవిర్భావం చెందిన నాటినుండి ఈనాటి వరకు మరియు ఈ భూమి మీద మానవులు ఉద్భవించుచున్నంత వరకు ప్రతి నిత్యం లేదా ప్రతి క్షణం మనిషికి – అతని మనసుకు మధ్య లేకా మనుష్యుల మధ్యన చర్చనీయాంశమైన అంశమే దేవుడెవరు? దేవుడున్నాడా? ఉంటే ఎలా ఉంటాడు? ఎందుకు ఉన్నాడు? ఎప్పటి నుండి ఉన్నాడు? ఎప్పటి వరకు ఉంటాడు? అని ఇంకా ఎన్నో రకరకాలుగా ఊహించుకుంటున్నారు, ప్రశ్నించుచున్నారు. దేవుడున్నాడని కొందరు, లేదని మరి కొందరు, ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? అని ఇంకెందరో ఇలా తలోక రకంగా వాదించుకొంటూనే సమాధానం దొరికి కొందరు దొరకకుండానే మరికొందరు లేదా సమాధానాన్ని వెతుక్కోకుండానే అర్థాంతరంగా తమ తనువులు చాలించుచున్నారు. కొంచెం తెలివైన వారు నేనే దేవున్నని లేదా దేవుని అవతారానర్నని జనులను అవలీలగా మోసం చేసి తమ పబ్బంగడుపుకుని అనేకులచేత ఆరాధింపబడుతూ సర్వసుఖాలను అనుభవిస్తున్నారు. నేటి సమాజంలో దేవుడు లేదన్న ప్రజలు మాత్రం ఐక్యమత్యంతో ఉండి సమాజసేవ లేదా మానవ కళ్యాణం కోసం ఎంతగానో తోడ్పడుతున్నారు. అయితే దేవుడున్నాడన్న ప్రజలు మాత్రమే

అనైక్యతతో ఒకరిని ఒకరు దూషించుకుంటూ తన్నుకు చస్తుండడమే భయంకరమైన వాస్తవం.

నేడు చాలా మంది తమ తమ స్వార్థంకోసం సంఘంలో, సమాజంలో దేవుని లేదా దేవుళ్ళ పేరుమీద మతాలను సృష్టించి ఆ మతం మత్తులో / ముసుగులో మారణహోమం చేయిస్తున్నారు. మరికొందరేమో అభ్యుదయవాదం, జనవిజ్ఞానం, హేతువాదం పేరిట నాస్తిక వాదులై దేవుడులేడు – దెయ్యం లేదు, స్వర్గం – నరకం అనేదంతా ఓ నాటకం, ఎవడో బ్రతక నేర్చినవాడు ఏపనీ చేయలేక తెలివిగా బ్రతుకడానికి సృష్టించిన సిద్ధాంతమే దైవత్వం అని నమ్మి అనేకులకు భోదించుచున్నారు. ఇది నిజమని నమ్మిన చాలా మంది అమాయకులు ఈ జీవితమే ఒక అదృష్టం అనుకుని, తిను తాగు – సుఖించు ఇదే లోకం మరో లోకం లేదు అంతా మాయ అని జీవితాన్ని తేలికగా తీసుకుంటు ప్రతి క్షణం ఆనందంగా గడపాలి, ఒక్క క్షణం కూడా వ్యర్థం చేయొద్దు అని క్షణకాలపు ఆనందపు అంచులు తాకుతున్నారు.

ఇక క్రైస్తవులనడిగితే యెహోవాయే దేవుడని కొందరు, కాదు యేసుక్రీస్తే దేవుడని మరికొందరు, కాదు అన్నింటికి పరిశుద్ధాత్మయే దేవుడని ఇంకొందరు చెబుతున్నారు. ముస్లిం సోదరులనడిగితే అల్లాయే దేవుడు తప్ప ఆయనకు అవతారాలు మరియు కుమారుడు కూడా లేడని చెబుతున్నారు. హైందవ సోదరులనడిగితే మాకు ముప్పైమూడు (33) కోట్లమంది దేవుళ్ళు, దేవతలున్నారు. ఇంకా ప్రతి యుగంలో ఎన్నో అవతారాలు రావాల్సి ఉంది అని చెబుతున్నారు. ఇది చాలా సున్నితమైన విషయం మరియు ప్రతి మనిషికి కూడా అతి ప్రాముఖ్యమైన విషయం. ఈ లోకంలో ప్రతి మనిషి స్వతంత్రుడు ఎవరి జీవితంపైన వారికి సర్వాధికారమున్నది గనుక ఒకరి విశ్వాసాన్ని మరొకరి మీద బలవంతంగా రుద్దకూడదు.

ఒకరి నమ్మకాన్ని అనవసరంగా విమర్శించడమో, వేలెత్తి చూపడమో చేయకూడదు. కాలాను గుణముగా న్యాయమైన, వాస్తవమైన విధానంలో అవతలి వ్యక్తి ప్రశ్నించినపుడో, సందేహపడ్డప్పుడో తర్కంమాత్రం చేయవచ్చని బైబిల్ ప్రకారంగా నా అభిప్రాయం. ఎందుకంటే ఈ లోకంలో ఒక చోటికి వెళ్ళాలనుకుని బయలుదేరి మరోచోటికి వెళ్ళిపోతున్న వారికి మరియు దారికానిదారిలో వెళుతున్న వారికి సరియైన దారిచూపడం మాత్రం న్యాయమే కదా! ఆలోచించండి. మనకు దొరికిన మేలు ఇతరులకు పంచాలను కోవడమే మానవత్వము కదా!

ప్రతి మనిషి తనుబ్రతికి ఉన్నపుడే దీనిని నిర్ధారించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఇది ఎంతో ప్రాముఖ్యమైన విషయం కదా! దేవునిని గూర్చిన పరిపూర్ణమైన అవగాహన అనగా ఆయన ఉనికి, రూపం, పేరు – ఊరు, ఆయన చిత్తం గుణ లక్షణాలు ఏమిటి? ఇలా అనేక విషయాలను ఖచ్చితంగా తెలుసుకొని తీరాలి. ఎందుకంటే మనకు తెలియని ప్రాంతానికి వెళ్తున్నప్పుడు దాని పూర్తి వివరాలు ముందే తెలుసుకొని బయలు దేరుతాము గదా. అలాగే మనకు తెలియని వ్యక్తిని కలుసుకోవాల్సి వచ్చినప్పుడు పై విషయాలన్నిటినీ ముందే ఎంక్వైరీ చేస్తాం గదా! తెలిసిన వ్యక్తితో కల్సి పని చేయాల్సి వచ్చినప్పుడు కూడా వారి ఇష్టా, ఇష్టాలు అనగా గుణలక్షణాలు తెలుసుకొంటాము గదా! కొన్ని గంటలు లేదా రోజులు చేసే ప్రయాణానికి ముందే రిజర్వేషన్ చేసుపకొనే మనుషులు అలాగే కొద్ది సంవత్సరాల బ్రతుకు కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నప్పుడు, యుగయుగాల జీవితం కోసం మరెన్నో జాగ్రత్తలు తీసుకొని తీరాలి. ఒకవేళ దేవుడు ఉన్నాడు అని అనుకుని నమ్మిచనిపోతే **'నీవు'** అనబడే **'నీ ఆత్మ'కు** నీవు చేరే ఇంకోక లోకం గాని, ఆ లోకంలో **'దేవుడు'** కూడా లేకపోయినా పర్వాలేదు. కానీ దేవుడు

లేదు అనుకుని నమ్మి చనిపోతే తీరా మరో లోకం ఉండి దాంట్లో పరమాత్ముడైన దేవుడు ఉంటే నీ (నా) పరిస్థితి ఏమిటి? అని ఆలోచించమంటున్నాను అంతేసుమా! బలవంతమేమిలేదు.

ఎందుకంటే మనిషి చనిపోతేనే అప్పుడు అంతా అర్థం అవుతుంది అంటున్నాడు దేవుడు కూడా. అయితే నిప్పును చేతితో తాకి చూసి కాలినప్పుడే అది నిప్పు అని నమ్ముతాను అని అనే వారితో ఈ తర్కం అనవసరం. చేతితో తాకకపోయినా నిప్పు కాలుతుంది అని ఇతరులు చెప్పినప్పుడు సత్యం గ్రహించి నమ్మడం వివేకం అంటారు గదా! చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనమేమిటి? అనే సామెత గుర్తుకు తెచ్చుకునే వారిని అదృష్టవంతులు అంటాము గదా! దారిలో ప్రయానించేటప్పుడు హద్దుమీరితే ప్రమాదమనే హెచ్చరిక చూసి ఆలోచించి ఆగిపోతే మంచిదా?, ఏమిలేదు ఉత్తినే పనిలేక ఎవడో పనిలేని వెధవ ఈ బోర్డు పెట్టారు అని అనుకుని ఆలోచించక ఆగకుండా ముందుకుపోతే ఆ తర్వాత ఆలోచించటానికి మనం, మన అడ్రస్ కూడా ఉండదు గదా? దాటి చూస్తాను అని మొండిగా అంటే ఆ తర్వాత ఉండను అనే చేదు నిజాన్ని గ్రహించడం తెలివితనం కాదంటారా?

మార్కెట్లో ఒక దుకాణంకెళ్ళి ఒక వస్తువుకొన్నపుడే అది అసలా (ఒరిజినల్)? లేక నకిలీదా (డూప్లికేట్)? అని ఆ షాపులో ఉన్నప్పుడే తెలుసుకోవాలిగదా! బయటకు వచ్చినాక తెలుసుకుని మోస పోయానని ఎంత మొత్తుకున్నా నీ మొర వినే నాథుడుండడు. అలాగే ఈ లోకమనే మార్కెట్టులో (సంతలో) మనం మన శరీరాలలో ఉన్నప్పుడే మనిషి మతి నుండి ఊహించి పుట్టిన మతం చెప్పిన లేదా చూపిన మార్గము ప్రకారంగా నిజమైన దేవుడెవరు? నిజమేదో? అబద్ధం ఏదో? ఖచ్చితంగా తెలుసుకుని తీరాలి. లేదా దేవుని మతి నుండి పుట్టిన మార్గము (క్రీస్తు) చూపిన దారే ఇది తప్ప మేం

ఊహించి చెప్పినది కాదని చెప్పి ఆచరించి చూపిన వారి మార్గమును కూడా పరిశీలించి పరిశోధించి తెలుసుకొని తీరాలి. అంతేకాని చనిపోయాక చూసుకొందాంలే అని అప్పుడు తెలుసుకుంటే లాభం ఉండదు. అప్పుడు నీకు చెప్పేవారుగాని, నిన్ను నమ్మమనేవారుగాని నీ కోసం ప్రార్థన చేసేవారు గాని ఉండరు. కాబట్టి ఎలా దేవుడెవరో ఆయన ఉన్నాడోలేడో? ఉంటే ఎవరై ఉన్నాడు, ఎలా ఉన్నాడు అని జాగ్రత్తగా ఆలోచించి ఓ నిర్ణయాన్ని తీసుకొందాం.

మామూలుగా ఈ లోకంలో అత్యధికుల అభిప్రాయమే (Majority is Law) న్యాయంగా చలామని అవుతుంది గదా! కాబట్టి ఈ ప్రపంచంలో అత్యధికమైన (Majority) ప్రజలు నమ్ముతున్న పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ అనబడిన దేవుని మాటల ప్రకారం దేవుడున్నాడో లేడో అని ఆలోచిద్దాం. ఈ ప్రపంచంలో ఇప్పటికీ దాదాపు అన్ని భాషలలోనికి తర్జుమాచేయబడి, ప్రతివారు చదివితే సుళువుగా అర్థం చేసుకొనే గ్రహించే రీతిలో ఉన్నదే బైబిల్. ఈ ప్రపంచంలో అనేక దేశాల 'న్యాయం – చట్టం' ఈ గ్రంథంలో నుండే కాపీ చేయబడి లేదా తీసుకొని కొన్ని మార్పులతో ఏదోఒక రూపంలో అమలు చేయబడుతుంది. బైబిల్‌లో చెప్పబడిన ప్రతీమాట ఇంటర్నేషనల్ లేదా యూనివర్సల్ స్టాండర్డ్‌గా గుర్తింపు పొందినది గదా! ఇది ఆ దేవుడే తన పిల్లలైన మనుష్యులతో, మనుష్యులందరి మనుగడ కోసం తన ఆత్మ చేత ప్రేరేపణ చేయించి వ్రాయించినది. (2పేతురు 1:16–21) ఇదే మనుషులందరి బ్రతుకు పుస్తకం (బుక్ ఆఫ్ లైఫ్) తెలుసా? బైబిల్ గ్రంథంగా పిలువబడుతున్న పుస్తకము లేక గ్రంథముల సముదాయమే మానవులందరి జీవగ్రంథం. ఎందుకంటే మనుషులందరిని పుట్టించినది, బ్రతికించినది, బ్రతికించుచున్నది రేపు ఈ సృష్టిని నాశనం చేసేది కూడా ఈ గ్రంథమే.

# 2 దేవుడున్నాడా?

క్రీస్తు పూర్వము సుమారు 1500 సంవత్సరాల క్రితం ఇశ్రాయేలు వంశములో లేవి గోత్రములో పుట్టిన మోషె అనే దైవజనుడు తన మామ యొక్క మందను మేపుతూ దేవుని పర్వతమైన హోరేబు కొండను ఎక్కాడు. అక్కడ ఒక పొద మండుతున్నట్లుగా కనిపించినా అది కాలిపోకుండా ఉండి అందులో ఒక దేవదూత కనిపించి దేవుని తరుపున మాట్లాడుతూ దేవుని ప్రజలుగా, ఎన్నుకొన్న వారైన ఇశ్రాయేలీయులను ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి విడిపించుకొని రమ్మని మోషేతో చెబుతుంది (నిర్గమా కాం 3:1–12).

"అప్పుడు మోషే చిత్తగించుము, నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్ళి వారిని చూచి – మీ పితరుల దేవుడు మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా – ఆయన పేరేమి అని అడిగిన ఎడల వారితో నేనేమి చెప్పవలెనని దేవునినడిగెను" (నిర్గమా కాం 3:13).

మనం ఎవరితోనైనా మనకు తెలియని వ్యక్తిని మీ యొద్దకు ఫలానా ఆయన పంపాడు అని చెబితే ఖచ్చితంగా ఆయన ఎవరు? ఆయన పేరేమి అని అడుగుతాం గదా! మోషేగూడా దేవున్ని అలాగే

అడుగుతున్నాడు. అందుకు దేవుడు తన పేరును ఏమని చెబుతున్నాడో వింటే ఆశ్చర్యం వేస్తుంది. మరియు అమితానందం కలుగుతుంది, ఆ తర్వాత దేవుని గూర్చిన అనుమానాలన్ని పటాపంచలైపోతాయి!

"అందుకు దేవుడు – **'నేను ఉన్నవాడను'** అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన – ఉండుననువాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను". (నిర్గమా కాం 3:14).

ఈ పేరు వినగానే ఈ ప్రపంచప్రజలు ఖచ్చితంగా ఆశ్చర్యపడాలి, ఆలోచించాలి. ఎందుకంటే దేవుడున్నాడా? లేడా? అని కొట్టుకుచస్తున్న వారి ఆలోచనెరిగిన దేవుడు సుమారు నేటికి 3,500 సంవత్సరాల క్రితమే నేను ఉన్నాను అని చెప్పాడు. ఆయనే ఉన్నాను అని చెప్పాడు గనుకనే ఈ లోకజ్ఞానం లేడు అని రుజువు చేయడానికి ప్రయత్నం చేయుచున్నది. అలాగే ఎప్పటినుంచి ఉన్నాడు, ఎప్పటి వరకు ఉంటాడు? అని గూడా అడుగుతారని తెలిసిన దేవుడు, నేను ఎప్పటినుండో (కాలం మనకు చెప్పినా అర్థంకాదని కావచ్చు) ఉన్నవాడను, ఎప్పటికైనా (ఎన్ని కోట్ల సం॥రాలకైనా) ఉండే వాడిని అని చెప్పాడు. ఎంత పెద్ద ప్రశ్నకు చిన్నమాటతో చక్కటి సమాధానం ఇచ్చాడు దేవుడు. ఇక్కడ మోషే అడిగింది పేరు గదా, కానీ దేవుడు తన ఉనికిని అనగా అడ్రస్ మొత్తం ఒక్కమాటలో చెప్పేసాడు. అందుకే నాస్తికులు లేడు అంటే ఆస్తికులు ఉన్నాడు అంటున్నాడు. ఇంతకీ ఆ **'ఉన్నవాడను'** అని మనం ఎప్పుడడిగినా చెప్పేవాడి పేరేమి? ఆయనకు అదే పేరు సరిపోతుందా? మరోపేరు అవసరమా? అని ఆలోచిద్దాం.

# 3 దేవుడి పేరేమి?



**అయితే** పేరుకు బాగా అలవాటు పడ్డ నాటిజనం, నేటికి ఆ పేరుకోసమే పాటు పడువారు దానికోసం పడి చస్తున్న వారు కూడా  చాలామందే ఉన్నారు. అందులో యావే సమాజం అనేది ఒకటి బయలుదేరింది ఈ మధ్యనే. ఆనాటి హీబ్రూ భాషననుసరించి దానిని ఒక పేరుగా మార్చుకున్నారు లేదా మోషే గారే అలా పేరును ఉచ్చరించారు. హిబ్రూ భాషలో "నేను ఉన్నవాడను" అనే పదం ''ఐహ్ యంషిర్ ఐహ్'' అని వ్రాయబడింది. దానినే 'యోద్. హె. వావ్. హె' అన్నారు. దానిని ఇంగ్లీషులో 'I AM WHO I AM' లేదా 'I AM THE I AM' అని తర్జుమా చేసినా హీబ్రూ పేరులోని అక్షరాలను కుదించి ఇంగ్లీషు పొడి అక్షరాలుగా మార్చి YHWH --> YAWEH ---> యావె అని పిలుచుకొన్నారు, వ్రాసుకొన్నారు. దీనినే తెలుగులో "యెహోవా"గా తర్జుమా చేశారు. ఇంగ్లీషులో JEHOVA గా తర్జుమా చేశారు. ప్రపంచంలో అన్ని భాషలలో ఈ పేరు పలకడానికి సుళువుగా వారి వారి భాషలలోనికి తర్జుమా చేశారు. ఆనాటి ఆయా భాషా కోవిదులు.

అదే బైబిల్‌ను కాపీ చేసిన ముస్లిం సోదరుల ప్రవక్తగా నీరాజనాలను అందుకుంటున్న మహమ్మద్ గారు అరబ్బీలో దేవుని పేరును “అల్లాహ్” అనగా మార్పులేనివాడు అనగా ఎల్లప్పుడు ఒకే రీతిగా ఉండువాడు లేదా ఉన్నవాడు అని చెప్పాడు. ఇంకా ఇంగ్లీషు వాడు లార్డ్ (LORD) అనగా ‘ప్రభువు’ అని ‘LORD GOD’ అనగా ప్రభువైన దేవుడు అని తన భాషలో మార్చుకొన్నాడు. తెలుగు వారు తమ భాషలో ‘దేవుడు’ అని ‘ప్రభువైన దేవుడు’, ‘సర్వేశ్వరుడు’, ‘పరమేశ్వరుడు’ అని తర్జుమా చేసుకున్నారు. హిందీ వారు ‘పరమేశ్వర్’ అనియు, ఉర్దూలో ‘ఖుదా’ అనియు జపాన్, చైనా, జర్మనీ, ఇటలీ ఇలా ప్రతి దేశంవారు వారివారి దేశభాషలలో దేవునిని వారికర్ధమయ్యేటట్లు పిలుచుకొంటున్నారు. అయితే దేవుని సంగతులన్నింటిని తమ భాషలోనికి మార్చుకొన్న వారిని చూసి సహించని నాటి మూర్ఖులు, మతఛాందసవాదులు, సర్ప సంతానమైన యూదులకు ఇప్పటికి కూడా అంటకట్టబడ్డామని చెప్పుకుంటున్న మతమూర్ఖులైన ‘యావె సమాజం’ లేదా ‘యాషువా మెస్సయ్య సమాజం’ వారు దీనిని సహించలేమని చెప్పుచూ తప్పుడు త్రోవలోకి వెళ్లిపోయారు. దేవునికి పేరు అవసరం లేదుకదా, భాషతో కూడా సంబంధం లేదు అంటున్న వారిని భయంకరముగా దూషిస్తున్నారు. యెహోవా, యేసుక్రీస్తు అని వాక్యంలోనికి ఎవరైనా తెలిసిగాని, తెలియకగాని పలికినా, పాడినా వారు నరకానికి వెళుతారని భయపెడుతున్నారు.

ఎవడో మనిషి తన మానవ మెదడుతో ఆలోచలించి ఏ భాషలోకెళ్ళినా మనిషి పేరు మారదు గదా! అన్నదానిని బట్టి ఏ

మాత్రం ఆలోచించకుండా అదే కరెక్టు అని నమ్మి బైబిల్‌నే తప్పు అంటున్నారు. ఉదా!! నా పేరు తెలుగులో జాన్, ఇంగ్లీషులో గాని, హిందీలో గాని జాన్ అనే వ్రాయాలి, వ్రాస్తున్నాం గదా అనే ఈ లోక సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. మనిషి పేరును దేవుని పేరుతో సమానంగా చేసి వాదించడమేమిటి? దేవుడి పేరులో అర్థమున్నది. లేకుంటే ప్రపంచంలో భాష ఒక్కటే ఉండాలి. లేదుగదా పైగా దేవుడే మనుషుల భాషలను తారుమారు (బాబేలు) చేశాడని మర్చి పోతున్నారు ఈ అమాయకులు.

ప్రకృతిలోని ప్రతి పదార్థానికి అర్థమున్నది. సూర్యున్ని SUN అని ఇంగ్లీషులో అనాలి, నీటిని పానీ అని హిందీలో అనాలి. అలాగే తినే కూరగాయల పేర్లు, మనిషి అవయవాల పేర్లు భాషలను బట్టి మారుతాయి గదా! అసలు దేవుడికి పేరు అవసరమా? లేదు గనుకనే 'నేను ఉన్నవాడను' అనే మాట చెప్పాడు. అందరికి కావాల్సిన వాటి పేరు వారి వారి భాషలోకి మారి తీరాలి గదా ఈ కాలంలో మనుషులందరి పేర్లు అర్థంతో కూడి పెట్టినవి కాదు. ఎందుకంటే అభిమాన హీరోలు, ప్రకృతిలో ప్రదేశాలు, ఇష్టాలను బట్టి పెట్టిన పేర్లు కాని బైబిల్‌లోని పేర్లన్నీ దేవునికి నచ్చిన వారివి, నచ్చని వారివి కూడా అర్థంతో పెట్టినవే సుమా!

అందుకే దావీదు – డేవిడ్ – దావూద్ అంయింది, జాన్ – యోహాను – యెహన్నా అయింది. అలా అందరి ప్రవక్తలు పేర్లు కూడా అన్ని తర్జుమాలలో మార్చబడ్డాయి. అందుకే యేసు, యెహోవాల పేర్లు కూడా ఆయా భాషలలోని అర్థాన్ని బట్టి మారి పోయాయి. అయితే నేటి మనుషులంతా పాపులు, క్రిమినల్స్ గనుక

మన పేర్లు ఏ భాషలోకెళ్ళినా మారకూడదు. ఇది ప్రతి భాషలో ఉన్న నియమం మరియు గ్రామర్‌కు సంబంధించినదని గుర్తించాలి. మనుషులకు వారి క్రియలకు ఉన్న గ్రామర్ రూల్స్‌వేరు. ప్రపంచంలో దేవుడు అందరికి కావాల్సిన వాటిని సృష్టించాడు వీటికి కూడా అర్థం ఉన్నది గనుక అవి యూనివర్సల్ గ్రామర్ క్రిందికి వస్తాయి. కావున సృష్టిలో మనిషికి కావాల్సినవి అనగా దేవుడిచ్చిన వాటిపేర్లు, దేవుని పేరుతో సహా మారతాయని మర్చిపోవద్దు సోదరీ సోదరులారా. అలాగే దేవుడు ప్రపంచమంతటికి కావాల్సినవాడు అనే సంగతిని ఎప్పుడూ మర్చిపోవద్దు. కాదంటే ఎవరి ఇష్టం వారిది. కాని తర్వాత ఆయనకు లెక్క చెప్పాలి.

దేవుడు, యావే అనే తన పేరును కేవలం ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇచ్చానని బైబిల్‌లోని కొన్ని వందల సార్లు ప్రవక్తలచేత వ్రాయించాడు, కావాలంటే చదవండి. (ద్వితియోప 6:4,10,16,20; 7:6,9; 8:10, యిర్మీయా 11:3, 19:3, కీర్తన 106:48 ఇంకా చాలా చోట్ల ఉంది) ఇంతెందుకు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు కూడా ఆనాటి ఇశ్రాయేలీయులను నేటి క్రైస్తవులను కూడా 'తండ్రీ' అని ప్రార్థన చేయమన్నాడు (మత్తయి 6:11) ఆయన కూడా అలాగే దేవునితో చెప్పాడు (యోహాను 17:1) ఇంకా అనేక సార్లు దేవుడు తనకు తండ్రి అని చెప్పాడు. ఎందుకంటే ఒక తండ్రికి పుట్టిన పిల్లలు ఏనాడు తన తండ్రికి పేరున్నా ఆ తండ్రిని పేరు పెట్టి పిలువరు గదా. వేరే వాళ్లకు చెప్పేవారు అవసరమైతేనే తమ తండ్రి పేరు చెప్పాలి గదా అనే మతి లేని పిచ్చి వాదన చేసేవాళ్ళుంటారు. వేరే వాళ్ళకు కూడా ఆ దేవుడే దేవుడు గదా! ఆయనే అందరికి

తండ్రి గనుక వారికి కూడా తండ్రి పేరుతో పనిలేదు అని పేరుకోసం మూర్ఖంగా వాదించేవారు గ్రహించాలి.

లేకపోతే "ఆయన పేరేమో? ఆయన కుమారుని పేరేమో నీకు తెలియునా?" అని బైబిల్‌ను బట్టే అడుగుతున్నామని విర్ర వీగేవారు అదే బైబిల్‌ను ఒకసారి చూడాలి. అయితే ప్రతిదానికి హిబ్రూ అనే మత్తులో ఉంటే చాలా ప్రమాదం ఎందుకంటే ఏదైనా, ఎవరైనా చెప్పేది మనకు మన భాషలో చేసిన తర్జుమాయే గతి గదా! మనం పుట్టుకతో హిబ్రూ భాష వచ్చినవారం ఏ మాత్రం కాదుకదా! ప్రతి తర్జుమాను నమ్మాలి తప్ప ఒకటి రైటు మిగతాది తప్పు అనే అధికారం, ఆ భాషమీద పట్టు మనకు లేదుకదా! ఇంగ్లీషులో ఉన్నట్లే హిబ్రూ, గ్రీకు, లాటిన్‌లలో కూడా ఎన్నో తర్జుమాలున్నాయి కదా! వాటి సంగతి ఆలోచించండి మరి. నేడు మనకు హిబ్రూ బోధించే వాడు మనవాడే కాని అసలైన హిబ్రూవాడు కాదు గదా!

"నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయై ఉన్నాడు. సైన్యముల కధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు. ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు నీకు విమోచకుడు, **సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు**". (యెషయా 54:5, ఆమోసు 5:27).

ఇక్కడ ఇశ్రాయేలీయులకు మాత్రమే యెహోవా అనియు సర్వలోకానికి అనగా ఆయా భాషలు మాట్లాడువారు, అన్యజనులు, వారిలో నుండి దేవుని కుమారుడైన క్రీస్తును నమ్మి క్రైస్తవులైన వారు కూడా దేవుడనే పేరుతో పిలవాలి అని తెలుగు బైబిల్‌లో చెప్పుచున్నాడు. అలాగే ఈ యెహోవా అనే నామమును మరి

ఎవరికిని ఇవ్వను అన్నాడు. (యెషయా 42:8) కాబట్టి రక్తాన్ని (శరీరాన్ని) బట్టి యూదుడు కానివాడెవడుకూడా తెలుగులో దేవున్ని దేవుడే అనాలి గాని యావే అనకూడదు. ఈ విషయం **'యెహోవా సాక్షులు'** కూడా ఓసారి ఆలోచించాలి. ఈ రోజుల్లో సర్వలోకంలో దేవుని ప్రజలుగా పిలవబడుతున్న క్రైస్తవులు క్రీస్తునందున్న విశ్వాసాన్ని బట్టి అబ్రహాము సంతానమే కాని శరీరాన్ని బట్టి కాదు.

కాబట్టి ఇప్పుడు ఎక్కడా దేవుని పేరుతో మనకు పనిలేదు. ఆయనను ఇప్పుడు అందరూ దేవుడా, తండ్రీ అని ఎవరి భాషలో వారు పలికితే చాలు. ఇప్పుడు ఇశ్రాయేలీయులు కూడా దేవుడా, తండ్రీ అనాలి ఎందుకంటే వారి బలము అనగా వారి నిబంధన లేక ధర్మశాస్త్రము కొట్టివేయబడి చాలా సంవత్సరములు అయ్యింది. ఇంకనూ నమ్మనంటారా? అయితే ఏ అబ్రహాము సంతానమని ఇశ్రాయేలీయులు విర్రవీగారో అదే అబ్రహాముతోను, మోషేతోను దేవుడు చెప్పిన మాటలనే చదువుదాం.

"మరియు దేవుడు మోషేతో ఇట్లనెను – నేనే యెహోవాను; **'సర్వ శక్తి గల దేవుడను'** పేరున అబ్రహాము, ఇస్సాకు, యాకోబులకు ప్రత్యక్షమైతిని గాని, యెహోవా (యావే) అను నామమున నేను వారికి తెలియబడలేదు" (నిర్గమా 6:3, ఆది.కాం. 17:1).

పై వచనాన్ని బట్టి దేవుడు ఇశ్రాయేలీయులకు మాత్రమే ఆ పేరుతో ప్రత్యక్షమయ్యాడు లేదా ఆ పేరును వారినే వాడుకోనిచ్చాడు. మరి అంతకు ముందున్న వారికి వారి తర్వాత వారికి **"సర్వోన్నతుడు", "సర్వశక్తివంతుడు"** అనే బిరుదులు లేక అవి కూడా ఆయన పేర్లే ఎందుకంటే దీనిని All Mighty God అని ఇంగ్లీషులో,

**"ఎల్‌షద్దాయ్"** అని హెబ్రూలో వ్రాయబడినది. దేవుడు సర్వశక్తిమంతుడు అనగా సూపర్ పవర్ (Super Power) అని చెప్పుచున్నాడు. దేవుని కోసం వెతుకుతున్న ప్రతి మనిషి (శాస్త్ర వేత్తలతో సహా) ఈ అనంత విశ్వాన్ని ఏదో అతీతమైన, అనంతమైన శక్తి నడిపించుచున్నదని నమ్ముచున్నారు. ఆ అనంతమైన సర్వశక్తే దేవుడు అని బైబిల్ గ్రంథములో వ్రాయబడింది. ఈ విశ్వంలో దేవుని శక్తి అనేక రూపాలుగా మార్పు చెంది ఉన్నది. ఇంకా చెందుతూనే ఉన్నది. మానవ శాస్త్రంలోని శక్తి నిత్యత్వ సూత్రం ప్రకారం, శక్తికి పుట్టుకలేదు, నాశనం లేదు అది రూపాంతరం చెందుతుందే తప్ప మనిషికంటికి కనిపించదు. దాని క్రియలను బట్టి మాత్రమే తెలుసుకోవాలి. అందుకే దేవుడు కూడా నేను ఉన్నవాడను, ఉండువాడను, ఆది–అంతము లేనివాడను సర్వశక్తిమంతుడను, మార్పులేనివాడను, కనపడను అని చెప్పాడు. ఈ విధంగానైనా ఆయన ఉన్నాడని ఎరుగుట లేదు గనుక మొదటి శతాబ్దము నాటికే ఆయన సర్వమానవాళి మీద కోపంతో ఉన్నాడని వ్రాయబడింది.

"దుర్నీతి చేత సత్యమును (వాక్యమును – బైబిల్‌లోని సంగతులను) అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకమునుండి బయలు పరచబడుచున్నది. ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది, దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టించబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు

నిరుత్తరులైయున్నారు. మరియు వారు దేవుని నెరిగియు ఆనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి". (రోమా 1:18-25). ఈ రోమా పత్రిక క్రీస్తుశకం మొదటి శతాబ్దములోనే వ్రాయబడింది.

పైన వ్రాయబడిన లేఖన భాగములో సర్వ జ్ఞానము ఇమిడియున్నది. దేవుడున్నాడా? లేడా? ఉంటే ఎలా ఉంటాడు? అనే వ్యర్థమైన వాదములను గూర్చి పూర్తిగా వివరించాడు. యుగయుగాలుగా, తరతరాలలో తనేమిటో, తన శక్తి ఏమిటో, తన తత్వమేమిటో వివరిస్తూ వస్తున్నా తనను నమ్మినానని చెప్పిన వారితో సహా ఎవరు ఎరుగుట (గుర్తించుట) లేదు అని తన కోపాన్ని వ్యక్తపరచుచున్నాడు. దేవుడుంటే చూపించమనండి? కనిపించమనండి? అని మూర్ఖంగా వాదిస్తున్న వారితో నేను ఉన్నాను కానీ కనబడను, నన్ను గుర్తు పట్టాలన్నా నా యొక్క అదృశ్య లక్షణాలను గూర్చి తెలుసుకొనుటకు ఈ సృష్టిలో సృష్టింపబడిన అన్ని వస్తువులను గూర్చి ఆలోచించమని మనకన్నా ముందే ఆయనే చెప్పుచున్నాడు. ప్రకృతి మీద ఆధారపడ్డ వారికి అదే ప్రకృతి బోధిస్తున్నదని చెప్పుచున్నాడు. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురము చేయుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది" (కీర్తన 19:1-3)

# 4 దేవుని నిత్య శక్తి

దేవుడు సర్వశక్తి గలవాడు అని ముందే చెప్పాడు గనుక ఆ శక్తి ఒకసారి ఉండేదిగాకుండా నిత్యము ఉండేది (Everlasting Power) గా చెబుతున్నాడు. ఒకసారి పంచభూతములలో మనం నివసిస్తున్న కేవలం భూమిని గూర్చి ఆలోచిస్తే, ఎంతో విశాలమైనదై, బరువు గలదై శూన్యంలో వ్రేలాడదీయబడి, నిత్యం క్రమబద్ధంగా ఎలా తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టు తిరుగుతుందో అని ఆలోచిస్తే మనం నిరుత్తరులం అనగా జవాబులేని వారంగా ఉండి తీరుతాం. ఈ భూమిని తన బ్రమణ పరిబ్రమణంలో తేడాలు రాకుండా తనకు నియమించబడిన కట్టడలో (కక్ష్యలో) లయబద్దంగా తిప్పుతున్న ఆ శక్తి ఏమిటో ఒకసారి ఆలోచించండి లేదా బైబిల్ చదవండి.

"ఆయన వలన నడిపించబడినదై నరులకు నివాసయోగ్యమైన భూగోళము మీద మెరుపును, మేఘమును సంచారము చేయును". (యోబు 37:12-13, 26:7-16).

"భూమిని దాని స్థలములో నుండి కదిలించువాడు ఆయనే..." (యోబు 9:6-10).

“నీకు తెలియలేదా? నీవు వినలేదా? భూదిగంతములను సృజించిన యెహోవా నిత్యుడగు దేవుడు” (యెషయా 40:28).

ఈ కనబడే ప్రకృతిని న్యితము కదిలిస్తున్న నిత్య శక్తిమంతుడే దేవుడు. ఇలా ఎన్నో వాక్యాలు ఆయన నిత్యశక్తిని వివరించేవిగా ఉన్నవి. అది చదువుకొని, ఆలోంచించి గ్రహించి, ఆ దేవునిచే సృష్టింపబడిన సృష్టిలోని వస్తువులను గూర్చి బాగా ఆలోచించి, చూచికాదు సుమా! ఆయన ఉన్నాడని ఎరుగండి. ఉదా॥ మనం సృష్టించిన విద్యుత్ శక్తిని గూర్చి ఆలోచిస్తే కరెంటు స్తంభము పై నుండి వెళ్ళే తీగలో విద్యుత్ శక్తి ఉన్నా అది మన కంటికి కనబడదు కాని దాని అదృశ్య లక్షణమేమిటంటే ఫ్యాన్‌ను తిప్పుతుంది, మోటారును నడిపిస్తుంది, బల్బును వెలిగిస్తుంది. అలాగని ఆ వెలుతురు విద్యుత్ శక్తి కాదు. విద్యుత్ యొక్క ఒక లక్షణము వెలుతురు కదా అని ఆలోచించండి.

ఒకే శక్తి ఎన్ని శక్తులుగా రూపాంతరం చెందింది కాని కంటికి కనబడుటలేదు గదా! అది ఆ తీగలో ఉందోలేదో తెలుసుకోవాలంటే ‘టెస్టర్’ కాని ‘మీటర్’ కాని ఉండాలి. అంతేకాని మన కళ్ళతో చూడలేం, కరెంటును చూడాలనుకుంటే కళ్ళుపోతాయ్, ముట్టుకుంటే మనమే కాలిపోతాం. మనం కనుగొన్న, సృష్టించిన ఈ శక్తే ఇంత భయంకరమైన శక్తి గలదైతే సమస్త శక్తులకు మూలమైన ఆ పరమశక్తి ఎంత గొప్పదో గ్రహించండి! ఆ సర్వశక్తి గల దేవుడిని గూర్చి ఎరుగాలంటే ఎంతగానో ఆలోచించాలి. దేవుడనే శక్తిని అనుభవించాలి లేదా రుచిచూడాలి (యెషయా ) గాని కళ్ళతో చూడకూడదు. ఆయన శక్తి నిత్యము ఏ లోపం లేదా ఏ మాత్రం

తగ్గకుండా భూమిని నడిపిస్తుంది. సూర్యన్ని వెలిగిస్తుంది. చంద్రున్ని, గ్రహాలను తిప్పుతుంది. ఆయన ధనాగారంలో నుండి బయటకొచ్చే గాలికి అంతులేదు. మరియు కాలానికి తరుగు లేదు, మనముండే కొద్దికాలం కాదు మనం పుట్టక ముందునుండే దేవుని శక్తి ఏ మాత్రం తగ్గడం లేదు. మనం సృష్టించిన బ్యాటరీ శక్తి అయితే మాత్రం 8 గంటలకే తగ్గిపోతుంది. దాన్ని మళ్ళీ రీచార్జ్ చేసుకోవాలి గదా!

దేవుని యొక్క నిత్యశక్తిని ఎరుగని నేటి యావె సమాజము వారు యూదులు కాకయే యూదులమని చెప్పుకొంటున్నవారు, దేవుడు ఆరు రోజులు పని చేసి ఏడవ రోజు విశ్రాంతి తీసుకొన్నాడు గనుక మనము విశ్రాంతి దినాన్ని పాటించాలంటున్నారు. చిన్నపిల్ల వానికి చెప్పినట్లు నాటి ఇశ్రాయేలుకు చెప్పాడు గాని పెద్దయ్యాక అనగా పరిపూర్ణులయ్యాక అది కేవలము సృష్టి కార్యాన్ని జరిగించడంతో విశ్రమించానన్నాడు. ఏడవ దినము గూడా సృష్టిని నడిపిస్తూ కాపాడుతున్నాడు. ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు గదా! విశ్రాంతి ఎక్కడిది అని ఆలోచించాలి.

అందుకే నూతన నిబంధనలో పరిపూర్ణులైన క్రైస్తవులకి విశ్రాంతి లేదు. సమయమందును, అసమయమందును పని చేయాలి. క్రీస్తుకు, ఆయన శిష్యులకు చనిపోయాకనే విశ్రాంతి. ఎందుకంటే నిత్యశక్తిమంతుడైన దేవునికి విశ్రాంతి అవసరం లేదు. ఆయన పిల్లలకు క్రీస్తువలె విశ్రాంతితో పనిలేదు. నిత్యము పని చేయాలి.

# 5 దేవత్వము

**దేవుని** యొక్క తత్వమునే దేవత్వము అంటారు. మానవుని తత్వాన్ని మానవత్వం అని, దానవుని తత్వాన్ని దానవత్వం లేక రాక్షసత్వము అంటాము గదా. దేవత్వము అనగా దేవుడి యొక్క నడవడి, ప్రవర్తన గుణలక్షణాలు అని చెప్పుచున్నాడు. దేవుడి తత్వములో అతి ప్రాముఖ్యమైనవి ప్రేమ, క్షమాపణ, కృప, దీర్ఘశాంతము, జాలి, దయ, కనికరము మొదలగునవి. ఆయన పుట్టించిన మానవులు ఆయనను కాదన్నా, ఆయన లేడన్నా, స్తుతించినా, దుర్భాషలాడినా ఆయన మాత్రం అందరిని సమానంగా పక్షపాతం లేకుండా ప్రేమించి, కరుణించి, క్షమించి, దయతో కృపచూపించుచున్నాడు. దేవుని తత్వము అనగా ఆయన స్వభావము, స్వరూపము, ఆలోచన, బుద్ధిని మనం కూడా కలిగియుంటే మనం కూడా దేవత్వాన్ని కల్గినవారము అవుతాము. దేవుడు మనలో ఉండాలి అంటే ఆయన ఆత్మలో భాగమైన మన ఆత్మ ఆయన స్వరూపంలోనికి తిరిగి మారిపోవాలి. అలా మనం దేవునిలో లీనమైపోవాలి. ఆయనను రుచిచూసి ఎరుగాలి అప్పుడే దేవత్వమును గూర్చి పూర్తి అవగాహన వచ్చి ఆయన వాక్యాన్ని ధరించుకొని ఆయనవంటి దైవాలముగా పిలువబడుతాం. ఆయనే వ్రాయించిన

లేఖనాలలో దేవుని దేవత్వాన్ని గూర్చి వ్రాయించిన కొన్ని వాక్య భాగాలను చదివి ఆలోచించి ఆనందించుదాము.

"ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను తన సూర్యున్ని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు". (మత్తయి 5:45).

"దేవుడు ప్రేమాస్వరూపి ప్రేమలేనివాడు దేవునిని ఎరుగడు" (1యోహాను 4:8).

"దేవుడు నిజముగా పక్షపాతికాడని గ్రహించుచున్నాను" (అపో.కా 10:34; 2పేతురు 3:9)

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను..." (యోహాను 3:16). ఒక్క దేవుని దీర్ఘశాంతమును గూర్చి చెప్పాలంటే మళ్ళీ బైబిల్ అంత పుస్తకాన్ని వ్రాయాలి. అయితే ఈ మధ్యనే ఒక సోదరుని వాదనకు నేనిచ్చిన సమాధానాన్ని ఉదహరిస్తాను. ఈ లోకంలో ఇప్పుడు నీతికి, న్యాయానికి, మంచికి స్థానం లేకుండా పోయింది బ్రదర్. పాపాత్ములకు, దుర్మార్గులకే చాలా లాభం చేకూరుతుంది, పాపం చేసినవాన్ని అక్కడికక్కడే దేవుడు చంపొచ్చు గదా! ఎందుకీ ఆలస్యం అన్నాడు. కొన్ని దేశాల్లో దొంగతనం చేస్తే చేతులు నరకడం, కళ్ళు పీకడం, అవయవాలు తీసేయడం బహిరంగంగా ఉరితీయడం, కాల్చి చంపడంలాంటిది బాగుంది అన్నాడు. అప్పుడు నేనన్నాను ఆ దేశంలో దొంగతనం, దోపిడి, వ్యభిచారం తగ్గిందా అని ఆలోచించమన్నాను. అలాగే పాపం లేక తప్పు చేసిన వెంటనే ఆ మనిషిని దేవుడే అప్పటికప్పుడు అనగా చంపేస్తే ఈ పాటికి నీవు – నేను మిగిలేవాళ్ళం కాదు. ఈ భూమి మీద నరమాత్రుడే ఉండి ఉండే వాడుకాదు బ్రదర్ అని అన్నాను. నోరుమూసుకోక తప్పలేదు. సోదరులారా జాగ్రత్తగా ఆలోచించండి దేవునితత్వాన్ని గూర్చి,

అప్పుడర్థమవుతాడు దేవుడు. అంతేగాని సంగతులు పైపైనే చూసి ఊరికెనే మాట్లాడకూడదు. నేటి దినాల్లో దేవుడంటే అందరికి ఓ తమాషాలా ఉంది.

ఇక్కడ ఇంకొక అతి ప్రాముఖ్యమైన విషయాన్ని చెబుతున్నాడు ఉన్నవాడైన దేవుడు. అదేదనగా దేవుడు తనను గూర్చి తెలియ శక్యమైనది ఏదో అది వారికి అనగా మనుష్యులందరికి వివరించాను అని చెప్పుచున్నాడు. ఈ రోమాపత్రిక క్రీ.శ. సుమారు 57-58 సం॥లలో వ్రాయబడినది. అప్పటికీ దేవుడు తననుగూర్చి విశదపరచినా అటు అన్యజనులు, ఇటు ఇశ్రాయేలీయులు తనను మహిమపరచుట లేదు అని కోపగించుకున్నాడు. ఇప్పటికీ మన దేశంలో, మన ప్రాంతంలో అనేక మంది బోధకులు దేవుని గూర్చి చెప్పాలి బ్రదర్ ఆయనను గూర్చి ఎవ్వరికి తెలియదు అని చెబుతున్నారు. ఏది వాస్తవమో చెప్పండి. నూతన నిబంధనలోని క్రీస్తు బోధనలోను, సిలువవేయబడిన క్రీస్తు బోధనలోను సువార్తను, ముఖ్యంగా దేవుని రాజ్యసువార్తను మాత్రమే ముందు బోధించ మన్నాడని గ్రహిస్తే దేవుడు తనను గూర్చి ఎప్పుడు, ఎక్కడ తెలియ జేసాడో అర్థం అయిపోతుంది. అందుకే బైబిల్‌ను ప్రతిరోజు ఆలోచిస్తూ చదవాలి. సంగతులు పైపైన చూడకూడదు. Divinity అనగా దేవత్వము పరీక్షరాస్తేనో, డబ్బులిచ్చి కొనుక్కొంటేనో రాదు. డివినిటీ అనేది కాలేజీలు, యూనివర్సిటీలు ఇచ్చేదికాదు. దేవత్వము నీలో ఉందని దేవుడు లేదా నీ ఎదుటి మనిషి సాక్ష్యము ఇవ్వాలి. దానిని జీవితంలో అనుభవించి క్రియలతో ప్రవర్తించి చూపాలి. ఇది దేవుడు చూపాడు. మనలాంటి శరీరాన్నే ధరించుకున్న యేసుక్రీస్తు కూడా ప్రతి క్షణం తనలో ఆ దేవుని తత్వాన్ని మనకు చూపించి దేవునిచే సర్టిఫికెట్ (సాక్ష్యము) పొందాడు.

# 6 ఫరో సామ్రాజ్యం



**క్రీ.పూ.** రాజరికాలు, సంస్కృతి, నాగరికత ప్రారంభదినాలైన ఐగుప్తు నాగరికత (EGYPT CIVILISATION) చరిత్ర పరంగా మనకు తెలుసు. అబ్రాహాము సంతానముగా పిలువబడి దేవుని ప్రజలుగా దేవుని చేత ఎంచబడిన ఇశ్రాయేలీయుల చేత ఆనాటి ఫరో రాజులు ఇటుకలను చేయించి వాటితో అందమైన భవనాలను, నగరాలను నిర్మింపజేసారు. మరియు పిరమిడ్లు అని పిలువబడుతున్న ఆనాటి రాజుల సమాధులను కట్టించారు. ఫరోలు పెట్టే శ్రమలకు, హింసలకు ఇశ్రాయేలీయులు దుర్మార్గులైపోయారు. అయినా వారి మొరను ఆలకించి అబ్రాహాముకిచ్చిన వాగ్దానమును బట్టి వారిని ఐగుప్తు అనే చీకటి నుండి, పాపమునుండి విడిపించడానికి ఆనాటి మోషే చేసిన అద్భుతాల ద్వారా ఇశ్రాయేలీయులు నమ్మిన సర్వశక్తి గల దేవుడే – నిజమైన దేవుడు అని ఫరో రాజుల ద్వారా ప్రపంచానికి తెలియజేశాడు. వారి సమాధులైన పిరమిడ్స్ నేటికి బైబిల్‌లోని వాస్తవాలకు సాక్షమిస్తున్నాయి గదా! ప్రపంచ వింతలలో అవి కూడా ఒకటి అని మనకు బాగా తెలుసుగదా! మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు, ఫరో ద్వారా అన్యులైన వారికి కూడా దేవుడు

తన్ను గూర్చి తెలియజేశాడని దేవుని వాక్యం చెబుతుంది. నిర్గమాకాండం 9–12 అధ్యాయాలు చదివితే అన్ని గ్రహించవచ్చును మరియు నూతన నిబంధనలో పౌలు గారి ద్వారా ఏమన్నాడంటే...

"మరియు లేఖనము ఫరోతో ఈలాగు చెప్పెను – నేను నీయందు నా బలము చూపుటకును, నా నామము భూలోకమందంతట ప్రచారమగుటకును, అందునిమిత్తమే నిన్ను నియమించితిని" (రోమా 9:17).

నేటి పురాతత్వ శాస్త్రవేత్తలు ఆ పిరమిడ్లను త్రవ్వుతుంటే ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ దేశాలలో భూగర్భాలను పరిశోధిస్తుంటే దేవునికి, ఆయన వాక్యానికి ఎన్నో సాక్ష్యాలు దొరుకుతున్నాయి. బైబిల్‌ను తప్పు చేయాలనుకొనే వారి తలకు బొప్పి కడుతుంది. నాటి ఇశ్రాయేలీయులకే కాదు, నేటి ప్రపంచానికి ఇంకా రాబోయే తరాల వారందరికి దేవున్ని గూర్చిన సాక్ష్యము ప్రకృతిలో ఏదో విధంగా బయలుపడుతూనే ఉంటుంది. అయినా దేవునిని బైబిల్‌లో ఉన్న వాక్యాధారంతో మాత్రమే నమ్మాలి. కాని ప్రకృతిని చూసికాదు. శాస్త్రంగాని, పురాతత్వ శాస్త్రవేత్తల సాక్ష్యాలు లేనపుడే దేవుని పిల్లలైన వారు దేవున్ని విశ్వసించారు (హెబ్రీ 11:1–3).

# 7 బబులోను సామ్రాజ్యం

**మనిషి** వ్రాసిన చరిత్ర ప్రకారంగా క్రీ॥పూ॥ ఈ ప్రపంచాన్ని పరిపాలించిన నాలుగు మహా సామ్రాజ్యాలలో బబులోను సామ్రాజ్యం మొదటిది. దాని రాజు నెబుకద్నేజరు ఇతని కాలంలో కట్టిన వేలాడే ఉద్యానవనాలు (Hanging Gardens) నేటికి ప్రపంచవింతల్లో ఒక వింత. ప్రవక్తయైన దానియేలు ఆ రాజుతో చెప్పిన కలభావాన్ని బట్టి (దాని 2:26–49), అప్పట్లో దేవుడు చూపిన అద్భుతాలను బట్టి అన్యుడైన నెబుకద్నేజరు సర్వశక్తిమంతుడైన దేవునిని ప్రపంచానికి చాటి చెప్పాడు. బైబిల్ ప్రకారంగా కూడా అప్పటికే ఆయన రాజ్యం సర్వలోకమందు విస్తరింపబడియున్నదని వ్రాయబడింది. అందుకే అది లోకంలో మహా సామ్రాజ్యంగా పిలువబడినది.

"రాజా, ఆ చెట్టు నిన్ను సూచించుచున్నది, నీవు వృద్ధిపొంది మహాబలముగలవాడవైతివి. నీ ప్రభావము వృద్ధినొంది ఆకాశమంత ఎత్తాయెను. నీ ప్రభుత్వము లోకమంతట వ్యాపించియున్నది" (దానియేలు 4:22).

దేవుడు, దేవుని మాటలు తప్పుచెప్పుట లేదు గనుక నెబుకద్నేజరు అప్పటికి మన భారతదేశాన్ని కూడా పరిపాలించి ఉండాలి. లోకమంతట అనేమాట ప్రయోగింపబడినది గదా.

లోకంలో మన దేశం గూడా ఉందిగదా. క్రింది వాక్యాలను చూస్తే దేవుడిని గూర్చి నెబుకద్నేజరు ఎలా తన ఆధీనంలో ఉన్న ప్రజలకు పరిచయం చేస్తున్నాడో చూద్దాం. ఇప్పుడు మనలాగా అయ్యా నమ్మండి, బాబూ నమ్మండి అని అడుక్కుతినే వారిలాగా బ్రతిమాలడం లేదు ఎన్నో ఆశలు మాయలు చూపించి నమ్మమని అడుగుట లేదు. ఆ దేవుడిని ఎవరైనా దూషిస్తే నరికేస్తాను అని ఆజ్ఞాపిస్తున్నాడు అంటే దేవుని మాట ఎంత గొప్పదో చూడండి.

"నెబుకద్నేజరు - షద్రకు, మేషాకు, అబేద్నెగోయను వీరి దేవుడు పూజార్హుడు ఆయన తన దూతనంపి తన్నాశ్రయించిన దాసులను రక్షించెను. వారు తమ దేవునికి గాక ఏ దేవునికి సేవింపకయు ఉందుమని తమ దేహములను అప్పగించి రాజు యొుక్క ఆజ్ఞను వ్యర్థపరిచిరి. కాగా నేనొక శాసనము నియమించుచున్నాను ఏమనగా ఇవ్విదముగా రక్షించుటకు సమర్థుడగు దేవుడుగాక మరి ఏ దేవుడును లేడు. కాగా ఏ జనులలో గాని, రాష్ట్రములలో గాని, ఏ భాషమాటలాడు వారిలో గాని షద్రకు, మేషాకు, అబేద్నగోయను వారి దేవునిని ఎవడు దూషించునో వాడు తుత్తునియలుగా చేయబడును. వాని ఇల్లు ఎప్పుడును పెంటగా ఉండును". (దానియేలు 3:28-30; 4:1-3).

ఫరో సామ్రాజ్యములోను, బబులోను సామ్రాజ్యములోను ఎన్నో అద్భుతాలను చూసిన ఇశ్రాయేలీయులు, అన్యులు నిజమైన దేవుని నమ్మక, ఆయనను విడిచి విగ్రహాలు చేసుకుని పూజించినందుకే దేవుని కోపము పరలోకమునుండి అప్పటికే బయలు పడుచున్నదని రోమీయులకు (1:18-25) వ్రాస్తున్నాడు పౌలుగారు. అప్పటి నుండి అనగా మొదటి శతాబ్దము నుండి ఇప్పటి కాలానికి ఆలోచిస్తే దేవుని కోపం ఇంకా ఏ లెవల్‌కు చేరుకుందో ఊహిస్తేనే భయంగా ఉంటుంది. ఆనాటి బబులోనే నేటి ఇరాక్ రాజధాని బాగ్దాద్‌గా మారింది. ఈ 20వ శతాబ్దపు చివరలో ఈ బాగ్దాద్ ఎంత భయంకరంగా మారిందో ఈ తరంలో ఉన్న మనమే చెప్పగలము.

# 8 మాదీయ - పారసీక సామ్రాజ్యము



**క్రీ.పూ.** ప్రపంచాన్ని అంతటిని పరిపాలించిన రెండవ మహాసామ్రాజ్యమైన మాదీయపారసీక సామ్రాజ్యాధినేతల సాక్ష్యాన్ని, మరియు ఆజ్ఞను కూడా చదువుదాం. వారెలా నిజమైన దేవునిని గూర్చి ప్రపంచానికి చాటారో లేదా దేవుని గొప్పదనాన్ని, దేవత్వాన్ని విశదపరిచారో చూద్దాం. ఈ లోక చరిత్రలో సాక్ష్యాలు ఎన్నో ఉన్నా గాని బైబిల్ చరిత్రలో ఉన్నవాటినే మీకు సాక్షంగా చూపిస్తున్నాను. నేటికి నిలకడలేని సైన్సుజోలికి అంతగా వెళ్ళదలచుకోలేదు ఎందుకంటే సృష్టి ఆరంభం విషయంలోనే సైన్సు ఒక ఖచ్చితమైన నిర్ధారణకు ఇంకా రాలేదు గదా. మాదీయ రాజులగు దర్యావేషు, అహష్వరోషు వారి అధికారం క్రింద ఉన్న రాజ్యాలన్నింటిలోని మనుషులందరికి ఏమని ఆజ్ఞ వ్రాయించారో చదువుదాం.

"అప్పుడు రాజగు దర్యావేషు లోకమంతట నివసించు సకల జనులకు, రాష్ట్రములకును, ఆయా భాషలు మాటలాడువారికిని ఈలాగు వ్రాయించెను. మీకు క్షేమాభివృద్ధి కలుగును గాక. నా సముఖమున నియమించిన దేమనగా – నా రాజ్యములోని సకల ప్రాంతములయందుండు నివాసులు దానియేలు యొక్క దేవునికి

భయపడుచూ, ఆయన సముఖమున వణుకుచుండవలెను. ఆయనే జీవముగల దేవుడు. ఆయనే యుగయుగములుండువాడు. ఆయన రాజ్యము నాశనము కానేరదు, ఆయన ఆధిపత్యము తుదమట్టున కుండును.

ఆయన విడిపించువాడును రక్షించువాడునైయుండి, పరమందును భూమి మీదను సూచకక్రియలను, ఆశ్చర్యకార్యములను చేయువాడు. ఆయనే సింహముల నోట నుండి ఈ దానియేలును రక్షించెను అని వ్రాయించెను. ఈ దానియేలు దర్యావేషు ప్రభుత్వ కాలమునందును, పారసీక రాజగు కోరేషు ప్రభుత్వ కాలమందును వర్ధిల్లెను". (దానియేలు 6:25–28).

మాదీయుడైన మరోరాజు అహష్వరోషుకూడా ప్రపంచంలో 127 సంస్థానములను పరిపాలించాడని అందులో కూషు (నేటి ఇతియోపియా) దేశమునుండి మన భారత (హిందూ) దేశం వరకు పరిపాలించాడని దేవుడు తన గ్రంథములో సాక్ష్యమిచ్చాడు (ఎస్తేరు 1:1). జీవము గల నిజమైన దేవుడెవరో మన దేశానికి గూడా అప్పుడే తెలిసి ఉండాలి. అయినా సాతాను తెలివిగా ఆనాటికే తప్పిపోయిన యూదులు, ఇశ్రాయేలీయులను కైబరు బారు కనముల గుండా, బెలుచిస్థాన్ ప్రాంతానికి చేరుకొన్న, ఆర్యులుగా రూపాంతరం చెందిన వారిచే ఎంతో మంది దేవుళ్ళను, దేవతలను, రాక్షసులను, వారికి రూపాలను సృష్టించి దేవునికి దూరం చేశారు. దేవుని కుమారుడు భూమి మీదకు వచ్చేసరికే మన ఆసియా దేశాలలోని అనేక ప్రాంతాలలో సృష్టికర్తను మరచి సృష్టిని పూజించడం బలంగా నాటుకొనిపోయింది. ఆనాడు క్రీస్తు బోధనల ద్వారా కొందరు

యూదులు నమ్మారు, కొందరు ఎదురు తిరిగారు. ఆ దుర్మార్గపు స్వభావముగల యూదా జాతికి చెందిన వారే నేటికీ మన దేశంలో గూడా క్రీస్తును, ఆయన మార్గాన్ని ఎదిరిస్తున్నారు. దేవుని కృపను పొందిన వారు మాత్రమే ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సృష్టికర్తను మాత్రమే పూజిస్తున్నారు. ఇప్పటికీ ఇశ్రాయేల్ దేశంలో, యెరూషలేములో యేసును, వారి మెస్సయ్యగా అనగా క్రీస్తుగా అంగీకరించని వారే ఎక్కువగా ఉన్నారు.

# 9 గ్రీకు సామ్రాజ్యము

క్రీ.పూ. ప్రపంచాన్ని పరిపాలించిన 3వ మహా సామ్రాజ్యము గ్రీకు సామ్రాజ్యము. నెబెకద్నేజరు, దానియేలు కలలో చూపించిన రీతిలో రెండు కొమ్ములు గల పొట్టేలు (మాదీయపారసీక రాజ్యం)ను ఒక కొమ్ముగల బలమైన మేకపోతు గెలవడం చూస్తాము (దానియేలు 8:1–8) ఆ మేకపోతుయే గ్రీకువీరుడైన అలెగ్జాండర్ ది గ్రేట్. ఇతని పేరు బైబిల్‌లో కనబడకపోయినా రూపకాలంకారములో చెప్పబడింది. ఇతడు గ్రీకు దేశస్థుడైనా యవ్వనంలోనే చనిపోయే ముందు దేవుని వాక్యాన్ని ప్రకటించాడు అని చరిత్రలోని చాలా పుస్తకాలలో ఉంది. “అలెగ్జాండరు చనిపోయినాక అతని కోరికమేరకు సమాధి పెట్టెలోనుండి రెండు ఖాళీ చేతులు పైకిపెట్టి, రిక్త హస్తములతో ఈ లోకానికి వచ్చాను, రిక్త హస్తములతో వెళ్ళిపోతున్నాను అని ప్రపంచానికి చెప్పాడు” అని చరిత్ర గ్రంథాలలో సాక్ష్యమున్నది.

అదే “మనమీలోకములోనికి ఏమియూ తేలేదు, ఏమియూ తీసుకుని పోలేము” అను బైబిల్ సారాంశమునే చెప్పిపోయాడంటే అతనికి దేవుడెవరో తెలిసి ఉండాలి. ఆయన బ్రతికున్నప్పుడు కూడా

ఈ విషయాన్ని అందరికి తెలియజేసి ఉంటాడుకదా! ఇతని గురువు అరిస్టాటిల్. ఇతను మన భారతదేశాన్ని జయించి నలందా వరకు వచ్చాడు. పురుషోత్తముడనే రాజును సామంతరాజుగా చేసుకొన్నాడు. యౌవ్వనంలోనే ప్రపంచాన్ని జయించాడు. యౌవ్వన దశలోనే మధ్యలోనే పొడిచుకొచ్చిన కొమ్ము బలముగలదైనా మధ్యలో రాలిపోయింది. ఇతని గుర్తులు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి. అయినా చరిత్ర సాక్ష్యం కన్నా బైబిల్‌లో దేవుడు తనను గూర్చి ఇచ్చిన సాక్ష్యం చాలా ఉంది. అయినా ఇక్కడ దానియేలు చెప్పిన నెబుకద్నేజరు కొచ్చిన కల భావం ముఖ్యం గనుకనే ఈ రాజ్యాల ద్వారా దేవుడు తన ఉనికిని తెలియజేసాడు గనుకనే వీటిని వ్రాశాను.

మరిముఖ్యంగా మనమంతా గుర్తుంచుకోవాల్సిందేమనగా ఇవన్నీ క్రీ.పూ. ప్రవచించబడి క్రీ.పూర్వమే నెరవేర్చబడినవి. దానికి ఈ మనుష్యులు వ్రాసిన చరిత్రను పట్టించుకోనవసరం లేదు గాని దేవుని మాటను పట్టించుకొని, ఆయన తనను గూర్చిన సంగతిని ఆనాటి మనుషులకు విశదపరిచిన విషయాలన్నిటిని మనకు బుద్ధికలుగుటకే వ్రాయబడినవని గ్రహించినవారు ధన్యులు సమా! (2 కొరింథీ 10:1-11; రోమా 15:4). ఈ ప్రపంచానికి ఖగోళశాస్త్రాన్ని తత్వశాస్త్రాన్ని ఇంకా ఎంతో గొప్ప, గొప్ప విషయాలను తెలియజెప్పిన వారే గ్రీకులు. ఇప్పటికీ గ్రీకు భాష ప్రపంచాన్ని శాసిస్తున్నది.

# 10 రోమా సామ్రాజ్యము

క్రీ.పూ.ప్రపంచాన్ని పరిపాలించిన 4వది చివరిదైన మానవ మహా సామ్రాజ్యమే రోమా సామ్రాజ్యం. దీనిని పరిపాలించిన వారిలో ప్రత్యేకంగా అందరికి తెలిసినవాడు జూలియస్ సీజరు. ఇతని పేరుమీదనే జులై నెలకు పేరుపెట్టబడింది. ఆ తర్వాత సీజరు ఆగస్టస్ (కైసరు ఔగుస్తు – లూకా 2:1–2) ఇతని పేరుమీదనే ఆగష్టు నెలకు పేరుపెట్టబడింది. యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చేటప్పుడు రోమా ప్రభుత్వం అధికారంలో ఉంది. యేసు మరణ – సమాధి – పునరుద్ధానం తర్వాత ఆ ప్రభుత్వంలో అన్యులు, అధికారులలో అనేకులు క్రీస్తును నమ్మి ఆనాటి క్రైస్తవులతో రాజీకుదుర్చుకున్నారు. అప్పటి నుంచే క్రీస్తు సంఘానికి రోమన్ కాథలిక్ సంఘమనే పేరు వచ్చింది. యెరూషలేములో ప్రారంభమైన సంఘము అతి తక్కువ కాలంలోనే ఈ రాజ్యము, రాజులు, అధికారుల ప్రభావానికి, ప్రలోభాలకులోనై భిన్నమైన సువార్త తట్టుకు తిరిగి క్రీస్తు సంఘము కాస్తా రోమన్ కాథలిక్ సంఘంగా మారిపోయింది. పౌలు పత్రిక వ్రాసింది కూడా ఈ పట్టణంలో ఉన్న సంఘానికి లేఖ వ్రాస్తు, దేవుని నిత్య శక్తి, దేవత్వము, అదృశ్య

లక్షణాలను బట్టి దేవుడున్నాడు, అతన్నే నమ్ముకొండి, సృష్టమును అనగా దేవుడు సృష్టించిన వాటిని (మనిషితో సహా) పూజింపకండి అని వ్రాసాడు గదా? ప్రకటనలో చెప్పబడిన 'మహాబబులోను' అనే పేరు రోమా పట్టణానిదే.

ఇలా ఆయా తరాలలో, యుగయుగాలుగా ఉన్నవాడైన దేవుడు తన్ను గూర్చి తన ప్రజలకు తన చిత్తాను సారంగా, కాలానుగుణంగా విశదపర్చుచూ, అనగా తెలియజేస్తూ వచ్చాడు. అయినా వారు ఏ మాత్రం మారలేదు అందుకే ఆయన కోపము పరలోకమునుండి బయలుపరచుచున్నాడు. అలా ఆనాటి నుండి ఈ భూమిలో ఉన్నవారైన ప్రజలు గూడా తన పిల్లలకు, వారు వారివారి పిల్లలకు దేవుని గూర్చి చెప్పి ఉండాలి. దేవుడు ఇశ్రాయేలీయులకు ఈ విషయాన్ని ఆజ్ఞగా ఇచ్చాడు కూడా. "నేడు నేను నీ కాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ ఇంట కూర్చుండునప్పుడును, త్రోవను నడుచునప్పుడును, పండుకొనునప్పుడును, లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టు కొనవలెను. అవి నీ కన్నుల నడుమ బాసికమువలె ఉండవలెను. నీ ఇంటి ద్వారబంధముల మీదను, నీ గవునుల మీదను వాటిని వ్రాయవలెను" (ద్వితియోప 6:6-9).

ఇప్పుడైతే దేవుని రాజ్యసువార్తను ప్రతిక్షణము, ప్రతిదినము తన పిల్లలు, కుటుంబసభ్యులు, రక్తసంబంధికులు, బంధుమిత్రులు, సర్వలోకానికి ప్రకటించాలి. అలా చెప్పనివారందరు ఉత్తరవాదులే సుమా! అయినా ఇంకనూ అనేకులు దేవునిని నమ్మలేకపోతున్నారు.

వారికోసము ఇప్పుడైనా కూడా సృష్టిని, వాటిలోని వస్తువులను చూసి ఆలోచించి గ్రహించమంటున్నాడు. దేవుడున్నాడనుటకు మరిన్ని సాక్ష్యాలు బైబిల్‌లో చూద్దాము? అవి చూసిన తర్వాత ఒక నిర్ణయము తీసుకొండి. ఎవరి ఇష్టము వారిదే నేనెవరిని బలవంతము చేయుటలేదు, బెదిరించడమూలేదు, ఎలాంటి ఆశలు చూపించడము లేదు, అబద్ధమాడుట లేదు, సత్యమునే చెప్పడం తప్ప మరొకటి కాదని గ్రహించండి. ఈ రోమా సామ్రారాజ్యము కాలములో చేతి సహాయములేని రాయి (క్రీస్తు) వచ్చి, ఆ రాజ్యాన్ని తుత్తునియలు చేసి తన రాజ్యాన్ని స్థాపించాడు. అదే నేడు సర్వభూతలమంతా అయింది. క్రీస్తుపూర్వమే దేవుని గూర్చిన పూర్తి విషయాలు దేవుడు ఈ లోకమంతటికి తెలియజేసాడనేది మాత్రం స్పష్టమైనది (దానియేలు 2:40–45).

# 11 దేవుడున్నాడనడానికి రుజువులు

ఈ రోజు చాలామంది ప్రతిదానికి కారణం లేదా హేతువు మరియు రుజువులు అడుగుతున్నారు. ఈ రోజుల్లో ఇదొక ఫ్యాషన్ అయిపోయింది. మనిషి ప్రకృతిని చూసి, అందులోనుండి పుట్టిన లేదా కనబడిన రుజువులు చూసి దానికో శాస్త్రమని పేరుపెట్టి దేవుడిని కూడా శాస్త్రపరంగా రుజువు చేయమంటున్నారు. మనం ఇలా అడుగుతామని ముందే దేవుడికి తెలిసే తనుకూడా అవాస్తవం కాదని, వాస్తవం అనియు అందుకే నేను ఉన్నవాడను అని ఖచ్చితంగా చెప్పాడు. తన్ను నమ్మవలసిన వారుకూడా ఉత్తినే నమ్మకూడదని, విశ్వాసానికి రుజువులు కూడా చూపిస్తానని, గుడ్డిగా నన్ను కూడా నమ్మకూడదని ఆ దేవుడే 2 వేల సంవత్సరాల క్రితమే తన భక్తుని ద్వారా తనను గూర్చి తానే సాక్ష్యము చెప్పాడు.

1. “విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది. దానిని బట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి. ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందును బట్టి దృశ్యమైనవి కనబడెడు పదార్థములచేత నిర్మింపబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము” (హెబ్రీ 11:1–3).

క్రైస్తవులకున్న నిరీక్షణ అనగా ఎదురుచూపు, ప్రపంచ ప్రజలు ఎదురుచూస్తున్న సమాధానం యొక్క అసలు రూపం అప్పుడు ఇపుడు కనబడకపోయినా తప్పకుండా ఉన్నదనియు దానికి రుజువులుకూడా ఉన్నాయని దేవుడే పై వచనంలో చెప్పాడు. ఈ రోజుల్లోని శాస్త్రం ప్రకారం ప్రకృతిలో ఉన్నది 10% మాత్రమే మానవుని కంటికి మరియు టెలీస్కోప్ లేదా మైక్రోస్కోప్‌లో కనబడుతున్నది. ఈ అనంత విశ్వంలోని ప్రతి పదార్థం (Matter) కనపడేదానితో తయారుచేబడక, కనపడని పదార్థముతోనే చేయబడింది అని ఈ ప్రపంచాన్ని లేదా ప్రకృతిని వాక్యము ద్వారా కలుగజేసియున్న ఆ దేవుడే చెబుతున్నాడు. నేటి శాస్త్రవేత్తలే పదార్థాన్ని (Matter) కనబడే పదార్థము (Visible Matter) మరియు కనబడని పదార్థం (Dark Matter or Invisible Matter) గా విభజించారని మనకు ముఖ్యంగా దేవున్ని నమ్మలేం అనే వారికి చాలా బాగా తెలుసు. ఈ విశ్వంలో 90% డార్క్‌మేటర్ ఉన్నదని నేటికి అనగా కనపడనిదే ఎక్కువశాతం ఉన్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారంటే దేవుని మాటల్లో ఇంకా ఎంత గొప్ప శాస్త్రమున్నదో గ్రహించండి. కొందరు లేదు అంటున్న దేవుడే ఈ సకల శాస్త్రాలకు మూలమైవున్న ప్రకృతికి మూలపురుషుడు సృష్టికర్త అయితే ఆయన నిజంగా శాస్త్రానికి అతీతుడు గదా! అయినా తను ప్రతిదీ శాస్త్రోక్తంగానే చెప్పాడు. అందుకే ఆయన మనుషులకిచ్చిన ఆజ్ఞలను, నిబంధనను కూడా ధర్మశాస్త్రమనే చెప్పించాడు.

ఈ సృష్టి, దేవుని వాక్కు లేదా మాట వలన కలిగింది అన్నాడంటే ఆయన నోటి నుండి వచ్చిన మాట వలన శబ్దం పుడితే, ఆ శబ్దం వలన శక్తి ఉద్భవిస్తే, శక్తి పదార్థంగా మారిపోయింది. ఇదే నేటి శాస్త్రం కూడా చెప్పింది. ఈ శాస్త్రాలు పుట్టకముందే దీనిని

బైబిల్ చెప్పింది. ఉదా :- కనబడే ఈ ప్రకృతిలోని లేదా పంచభూతాలలో ఒకటైన నీరు మనకు కనిపిస్తుంది గదా. అయితే నీరు రెండు కనబడని వాయువులు లేదా పదార్థాల చేత నిర్మింపబడినదని దేవుడే ఈనాడు మనిషి ద్వారా రుజువుచేయించాడు. రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్షిజన్ పరమాణువు కలిస్తే నీరు తయారై కనబడుతుందని రసాయనశాస్త్రం చదివి ఉద్యోగాలు చేస్తూ బ్రతుకుతున్నవారందరికి తెలుసు. నీటి సూత్రం 2H+O---> $H_2O$ ఇలా ప్రకృతిలో మనకు కనబడే ప్రతి పదార్థం, కనబడని పదార్థంకూడా ఎన్నో కనబడని పరమాణువులచేత కలుగజేయబడినదే గదా! కంటికి కనబడని దేవుని యొక్క వినపడే మాట (మాటకూడా కనపడదు) వలననే కనబడే ఈ ప్రకృతి పుట్టిందనే సత్యమే చాలు దేవుడున్నాడు అనడానికి శాస్త్రపరమైన రుజువు.

క్రీస్తు, అపొస్తలుల బోధ ప్రకారం మరియు మానవ కాలం ప్రకారం మొదటి శతాబ్దము నుండి ఈ లోకాంతము వరకు విశ్వాసమునకు నిర్వచనము మారింది. సృష్టిని గూర్చి ఆలోచించి, రుజువులతో దేవునిని నమ్మకపోయినా, యేసుక్రీస్తు ప్రభువు దేవుని కుమారుడనియు, ఆయన మన పాపముల నిమిత్తము మరణించి, సమాధి చేయబడి, మూడవ దినాన లేపబడ్డాడని మన హృదయములో నమ్మి నోటితో ఒప్పుకోవాలి (రోమా 10:4-17). క్రీస్తును ఈ లోకానికి పంపుట ద్వారా, నేడు ప్రతి మనుష్యునికి తన మాటను (బైబిల్) అందించి ప్రతిరోజు ఏదో విధముగానైనా తనను గూర్చిన సాక్ష్యమును మనకు తెలియజేస్తున్నాడు. నిజంగా దేవుని ప్రేమ ఎంతో గొప్పది. ఇందుకు దేవునికి స్తోత్రము".

2. ''ఆయన ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంతములైన రుతువులను దయచేయుచు, ఆహారమునను గ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచూ, మేలు చేయుటచేత తన్నుగూర్చి సాక్ష్యము లేకుండ చేయలేదని బిగ్గరగా చెప్పిరి" (అపో.కా. 14:17).

"మరియు యావత్తు భూమి మీద కాపురముండుటకు ఆయన యొకనినుండి ప్రతి జాతిమనుషులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడువులాడి కనుగొందురేమోనని, తనను వెదకు నిమిత్తం నిర్ణయకాలములను, వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను యేర్పరచెను. ఆయన మనలో ఎవరికిని దూరముగా ఉండువాడుకాడు. మనమాయనయందు బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము'' (అపో.కా. 17:26-27).

దేవుడున్నాడో లేడో సాక్ష్యము కావాలంటే ఇక్కడ ప్రకృతిలో జరుగుచున్న ప్రతి పనిని చూడండి అంటున్నాడు. సకాలంలో రుతువులు, సంవత్సరంలో సకాలానికి రావాల్సిన వర్షాలు, ఎండలు, చలి ఇలా మనిషి బ్రతుకుకు కావాల్సిన అందమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలుగజేసి హృదయానికి ఆనందాన్నిస్తున్నాడని తెలియజేస్తుంది బైబిల్ గ్రంథము. మనం నీతిగా బ్రతికినా బ్రతకక పోయినా దేవుడు మనకు మేలు చేయుచున్నాడే గాని కీడు చేయడం లేదు. ఆయన ప్రేమలో, దీవెనలో, క్షమాపణలో ఎప్పుడూ మార్పులేదు. అందరికి ఒకేరీతిగా రాత్రి-పగలు కలుగుచున్నవి, ఇలా ఏదీ ఆలస్యము కావడంలేదు. ఒకవేళ ఆలస్యము అయ్యాయి అంటే మనం సృష్టించిన కాలుష్యాల వలననే తప్ప మరొకటి కాదని

గూడా ఈ మనిషే తన ప్రయోగాల ద్వారా రుజువు చేస్తున్నాడు. జనారణ్యంలో కాకుండా నిజమైన అరణ్యములో కెళితే సహజమైన ఆహారము యొక్కరుచి, రుతువుల యొక్క మజా అనుభవించగలము. వీటన్నిటిని ఆయనే సృష్టించాడని, రప్పించుచున్నాడని గ్యారంటీ ఏమిటి అని అడిగితే ప్రతిదాని కదలికకు శక్తి కారణం అయినప్పుడు ప్రకృతిని నడిపిస్తున్నది దేవుడనే సూపర్‌పవర్ అని అనుకోవాలి గదా! (యోబుగ్రంథం 26,37,38 అధ్యాయములు).

అంతెందుకు దేవుడున్నాడా? అని ప్రశ్నించే ఓ మనిషీ నీకు నీ హృదయం ఉందో, లేదో, ఉంటే ఎక్కడుందో చూపించగలవా? నా హృదయం అని గుండె దగ్గర చూపిస్తావు. అక్కడ ఉన్న గుండె కేవలం రక్తాన్ని పంపింగ్ చేసే మాంసపుముద్దే (యంత్రమే) గాని అందులో ఆలోచనలకు, ఇతరులకు స్థానం ఉండదు. పోని మెదడుకూడా భౌతికమే, అందులోని ఆలోచనలను మనం పసిగట్టాలి లేదా గుర్తెరుగాలే గాని చూస్తాను అంటే కుదరదు గదా. నన్ను చూడు అని చెప్పే నీవు-నేను మరియు మనం ఎక్కడున్నామో చెప్పగలవా?, చూపించగలవా? శరీరాన్ని అందులోని అవయవాలను చూపిస్తామే గాని, అరికాలు నుండి నడినెత్తివరకుమన శరీరంలో మనం ఉన్న సంగతి మనకు తెలియాలి (ఫిలిప్పీ 1:24).

భూమిమీద బ్రతుకుతున్న మనల్ని మనమే ఎదుటి వారికి చూపించలేనపుడు మనలోను ఆత్మగా, పరలోకంలో పరమాత్మగా ఉన్న దేవున్ని చూపించమనడం న్యాయమా? ఆలోచించండి. పోనీ చాలాసార్లు నా మనస్సు బాగాలేదు అంటావు అది ఎక్కడుందో, ఎలా ఉంటుందో ఎవ్వరైనా చూపించగలరా? మన శరీరక్రియలను లేదా ప్రవర్తనను బట్టి అనగా గుణ లక్షణాలను బట్టి మన మనస్సు

బాగుందో లేదో చెప్పగలం, చూపగలము. అలాగే దేవుడికి కూడా అదృశ్యమైన (కనబడని) లక్షణాలు ఉన్నాయి. వాటిని చూసి ఆయనను గుర్తుపట్టాలే, ఎరుగాలే తప్ప ఆయనను చూస్తాను, చూపించండి అని అనకూడదు. మనము ఆయనలో, ఆయన మనలో ఉనికిగలిగి చలించుచున్నామంటేనే మనలో దేవుడున్నాడని గుర్తు అని దేవుడే చెప్పాడు.

నేటి భౌతికవాదులకొస్తున్న ఈ అనుమానమే ఆనాటి యేసుక్రీస్తు శిష్యులకొచ్చింది. యేసుక్రీస్తు తండ్రి నాలో ఉన్నాడు అని చెబితే అయితే తండ్రియైన దేవునిని మాకు చూపెట్టవా ప్రభువా అని ఫిలిప్పు యేసునడిగినాడు. 'యేసు–ఫిలిప్పు, నేనింత కాలము మీయొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూసినవాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనపరచమని యేలచెప్పుచున్నావు? తండ్రి యందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నాయంతట నేను చెప్పుటలేదు, తండ్రి నాయందు నివసించుచూ తన క్రియలు చేయుచున్నాడు. "(యోహాను 14:8–11; 8:16–19; 10:15) యెదుట ఉన్న మనిషినే మనం చూడలేము కాబట్టి అతనిని కేవలం యెరుగాలి. అనగా రూపాన్నిబట్టికాక క్రియలచేత ఆయన ఎవరో, ఎలాంటి వాడో, ఎలా ఉంటాడో అనే విషయం తెలిసి పోతుంది. ఒక గడియారం మంచిదా? కాదా? అది ఎలాంటిది అంటే పైనరూపం చూడకూడదు. అది పనిచేసే విధానాన్ని బట్టి చెప్పాలి గదా.

ఇలా ఏ వస్తువునైనా సరే ఈనాడు మనం దాని పనినిబట్టి, క్రియలనుబట్టి ఎరుగుచున్నప్పుడు, దేవునిని కూడా అలాగే ఎరుగాలి

(1యోహాను 4:7–9) తప్పు చూస్తాననడం తప్పుకదా! ఆలోచించండి. విద్యుచ్ఛక్తిలో రెండు ధాతువులు అనగా+ (ప్లస్) మరియు–(మైనస్) కలిస్తే వచ్చే ఫ్లాష్ వెలుగునే నీవు నీ కళ్ళతో చూడలేవుకదా. కావాలంటే ఒకసారి వెల్డింగ్ పనులు జరుగుతున్నప్పుడు డైరెక్టుగా కళ్ళతో చూడండి అప్పుడు తెలుస్తుంది. ఇంతెందుకు మధ్యాహ్నం సూర్యున్ని అద్దాలు లేకుండా చూడండి ఈ లోకంలో మనిషి సృష్టించిన వెలుగును, దేవుడు సృష్టించిన సూర్యుని వెలుగునే చూడలేని మనిషి. ఈ లోకాన్నే కలుగజేసిన వెలుగును చూసి భరించగలడా? దేవుడిని చూపించండి అనే వారికి ఈ మాత్రం కామన్‌సెన్సు ఉండాలా? వద్దా? మీరే చెప్పాలి. కళ్ళముందు ఉన్న అన్నిటిని చూడలేని మనం కనపడను అన్నవాడిని కనిపించూ లేదా చూపించమని అడగడం అవివేకం కదా! మరోసారి ఆలోచించండి.

3. "తాను విశ్వసించిన దేవుని యెదుట, అనగా మృతులను సజీవులుగా చేయువాడును లేని వాటిని ఉన్నట్లుగానే పిలుచువాడునైన దేవుని యెదుట, అతడు మనందరి తండ్రియై ఉన్నాడు" (రోమా 4:17).

మనం అందరం మన ఇష్టానుసారంగా కాని, మన అమ్మా నాన్నల ఇష్టానుసారంగా కాని అనగా వారి వారి కోరికమేరకు కూడా పుట్టుటలేదని ముందుగా గ్రహించాలి. మనల్ని ఆడమనిషి గానో, మగవానిగానో పుట్టించమని గాని, మన అమ్మానాన్నల పూజల, ప్రార్థనల వలననోగాని మనం మనంగా పుట్టలేదు. మనం కూడా ఆడవారిగానో, మగవారిగానో, ఫలనా దేశంలో, ఫలానా వారికి మాత్రమే పుట్టాలనుకుంటే పుట్టలేదు. అలాగే ఈ లోకంలో ఎంతగానో బ్రతకాలనుకొని ప్రార్థించినా, ఆశపడ్డా ప్రయత్నించినా

బ్రతకడంలేదు. మనం అనుకోని సమయంలో అర్థాంతరంగా ఆకురాలినట్లు రాలిపోతున్నాం. మన పుట్టుకను మనం ఎలాగో ఆపలేము, మన చావునుకూడా అలాగుననే ఆపలేము. అందుకే దేవుడే చనిపోయేవారిని బ్రతికించాలన్నా బ్రతికేవారిని చంపాలన్నా నా చేతనే అవుతుంది అని చెప్పిన మాటలను బట్టి ఆనాడు అబ్రహాము అనే భక్తుడు దేవున్నినమ్మాడు. అప్పటి వరకు లేని ఈ ప్రకృతిని శూన్యంలోనుండి ఉన్నట్లుగా అందుకే అతడు నీతిమంతుడు అని దేవుడు పిలువబడ్డాడు పిలిచాడు అని చెప్పాడు. అప్పటి వరకు అనగా ఒకప్పుడు ఈ అనంత విశ్వంలో ఏమీలేవు. అయితే దేవుడే వీటిని కలుగజేశాడు అంటే లేనివాటిని ఉన్నట్టుగా పిలిస్తే అవి కలిగినాయి అని అర్థం.

చాలామంది అభ్యుదయవాదులు మనిషి కోతినుండి పుట్టాడని, ఏకకణ జీవులు మార్పుచెందుతున్నాయని పరిణామ సిద్ధాంతంలో భాగంగానే జీవులు పుట్టుకొస్తున్నాయని వాదిస్తున్నారు. మనిషి యొక్క శరీరనిర్మాణం ప్రత్యేకమైనదని దేవుడు ఎప్పటినుండో చెబుతున్నాడు. జంతువులు, మనుషులు కనుగొన్న 'జీనోము' శాస్త్రం వచ్చేంతవరకు 'డార్విన్' సిద్ధాంతం చెల్లింది కాని, మనిషి యొక్క 'జీనోమ్' వివరాలు తెలిసాక పరిణామవాదం తప్పని, ఏ జీవియొక్క ప్రత్యేక నిర్మాణం దానిదేనని తెల్సిపోయింది. మానవ ఆకార నిర్మాణం, జీవన విధానం, ఆలోచన విధానం లాంటి ఎన్నో వాటికి మూలమైన (డిఎన్ఎ, ఆర్ఎన్ఎ) జీన్స్, క్రోమోజోమ్స్ ఎంతో ముఖ్యమైనవి. వీటిని బట్టి చూస్తే మనిషికి ఎలుకకు, కుందేలుకు, పందికి దగ్గర సంబంధమున్నది. అందుకే ఈ రోజుల్లో శాస్త్రవేత్తలు ఎలుకల మీద, పందులమీద ప్రయోగించిన మందులే ఆ తర్వాత మనుషులకు

వాడుతున్నారు. మనిషికి కోతి లక్షణాల కన్నా పంది లక్షణాలు ఎక్కువ గనుకనే తప్పుచేస్తే ఓరేయ్ ముందు పంది వెధవ ఆ తర్వాత కోతిగా అని తిడుతాం తెలుసా? ఈ ప్రకృతిలో పుట్టిన ప్రతి జీవి దేనికదే ప్రత్యేకమైనది. అన్నీ ఒకేసారి పుట్టాయి గాని ఇప్పుడు క్రొత్తగా పుట్టుకొచ్చినవి, మరియు ఇకముందు కొత్తగా పుట్టబోయేది ఏమి లేవు. అప్పుడు దేవుడు పుట్టించినవే అంతరించిపోతున్నాయి గదా!

దేవుని వాక్కు అయిన బైబిల్ దేని మాంసము రుచిదానిదే, దేనిబుద్ధి, దేని ఆకారము అన్నీ ప్రత్యేకమైనవని చెప్పింది. అలాగే ప్రకృతిలో ప్రాణముండి చలించలేని వృక్షముల డిఎన్ఏ కూడా వేరుగా ఉంటుంది. వాటిలో ఉన్న రుచులు వేరు. వాటిని కూడా విడివిడిగా పుట్టించింది దేవుడే. అనేక చెట్లు మార్పు చెంది పుట్టినవి కావు (1కొరింథి 15:35-41). జీవమున్నా చలనం లేని వృక్షాలలో పరిణామ వాదం లేదు కదా! దేవుని సృష్టికార్యములలో అద్భుతమైనది, ప్రత్యేకమైనది మానవుని ఆకార నిర్మాణమే అనడానికి మరొక అద్భుతమైన రుజువు చూపెడుతున్నాడు దేవుడు జాగ్రత్తగా గ్రహించండి. ఈ లోకంలోని జీవరాశులన్నింటిని నేల, నీరు పుట్టిస్తే, మనిషి శరీరాన్ని దేవుడు తన స్వహస్తములతో తయారు చేశాడు. మరియు మనిషికి తనైన ఆత్మనిచ్చాడు. సకల చరాచర జీవరాశు లకు మాత్రము సేవకులైన దూతల ఆత్మను ఇచ్చాడు. అందుకే ఈ మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేయగలుగుచున్నాడు (ఆది.కా. 1వ అధ్యాయం). మరియు సృష్టికర్తనే సవాలు చేస్తున్నాడు.

4. ''మనుష్యులందరు ఆయన సృష్టికార్యములను తెలిసికొనునట్లు ప్రతి మనుష్యుని చేతిని బిగించి ఆయన ముద్ర వేసియున్నాడు'' (యోబు 37:7).

దేవుడు తాను ప్రత్యేకముగా తయారు చేసిన మనిషి యొక్క చేతిని బిగించి దానికి తన ముద్ర వేసాడంటే (ఈ వాక్యము నేటి మానవ ఆకార నిర్మాణ శాస్త్రము పుట్టకమునుపు వ్రాయబడింది. సుమారు క్రీ॥పూ॥ 2000) మనం జాగ్రత్తగా అర్థం చేసుకుని తీరాలి. ప్రతి మనుష్యుని చేతిని అన్నాడు, మనుషులందరి చేతిని అని లేదుసుమా. ఈ రోజు మన ఇంటిని, ఆస్తినికొనాలనుకున్నా, అమ్మాలన్నా, దొంగతనం జరిగినప్పుడు దొంగను గుర్తుపట్టాలన్నా ఆ మనిషియొక్క చేతి వేలిముద్రలనుబట్టియే గుర్తుపడుతున్నారు. ఈ సృష్టిలో నేడు సుమారు 750 కోట్లమంది జనాభా ఉన్నారని అంచనా. అందులో ఏ ఒక్కరి చేతిలోని వేలిముద్ర మరొక్కరి వేలిముద్రతో సరిపోదు. ఇది నేడు ఎవ్వరూ కాదనలేని పచ్చినిజం. అలా మన శరీరాన్ని నిర్మించిన 'ఆర్కిటెక్' లేదా సివిల్ ఇంజినీర్ దేవుడే సుమా. ఇప్పుడు మీ చేతిని మరోసారి చూసుకొని చెప్పండి దేవుడ ఉన్నాడా? లేడా?

ఇంకా మనిషి ఐచీూ మరే జంతువు ఐచీూ తో సరిపోదు. అలాగే ప్రతి మనిషి ఐచీూ వేరుగా ఉంటుందని, తల్లి పిల్లలు ఆసుపత్రిలో తారుమారైనప్పుడు తల్లి ఐచీూ ఫింగర్ ప్రింట్‌తో బిడ్డ ఐచీూ ఫింగర్ ప్రింట్‌ను పోల్చి గుర్తుపట్టవచ్చు. ఎక్కడ చూసినా 'ఫింగర్ ప్రింట్' అనే మాటలను చూస్తే దేవుని గొప్పతనం, ఆయన ఉన్నాడనే, ఉన్నవాడనే నిజాన్ని తెలియజేస్తుంది. ఆయన ముద్ర వేశానన్నాడంటే అది ఎవడు తీయలేడు. ఆయన తీస్తే వేరొకడు మూయలేడు అని ఆయన తన వాక్యములో చెప్పాడు.

మనం ఎంతగానో, ఎన్నో సంవత్సరాలైనా బ్రతుకాలని కోరుతూ, ప్రార్థిస్తున్నాం గదా! ఎంతటి భక్తుడైనా రౌడియైన చనిపోతున్నాం అంటే ఆలోచించమన్నాడు. మనుషులందరూ

చస్తున్నారా? లేకా దేవుడే వారిని చంపుతున్నాడా? అని ప్రశ్నించుకుంటే జవాబు దేవుడే ప్రతి వారిని చంపుతున్నాడు అని దేవుని వాక్యం సెలవిస్తుంది. (ఆదికాం 3:19; ప్రసంగి 12:7; కీర్తన 90:3, యోబు 10:8,9; 1సమూయేలు 2:6, ద్వితియో 32:39) మన బ్రతుకులు ఈ భూమిమీద కాకతాళీయమో, యాదృశ్చికమో కాదు. మనం అనుకుంటే అనుకొన్నన్ని రోజులు, అనుకొన్న విధంగా బ్రతక గలమా! యాక్సిడెంట్‌లో కారు మూడుఫల్టీలు కొట్టినా, ఎంతో ఎత్తు మీదనుండి పడినా, ఎన్ని తుపాకి గుళ్ళు, కత్తిపోట్లు శరీరానికి తగిలినా బ్రతికినవారున్నారు. బాత్‌రూమ్‌లో కాలు జారిపడి ఆ క్షణంలోనే చచ్చినవారున్నారు కదా! బయటికి ఆరోగ్యంగా ఉండి లోపల క్యాన్సర్ ముదిరి అర్థాంతరంగా చనిపోయినవాళ్ళు లేరా? ఇదంతా ఆ తండ్రియైన దేవుని శక్తి సుమా! దేవుడున్నాడు అని చెప్పడానికి ఈ మాత్రం రుజువులు చాలు. ఇంకా చెప్పాలంటే ఈ భూమండలం సరిపోదు.

ఆ దేవుడు హిందువుల దేవుడా, ముస్లింల దేవుడా? క్రైస్తవుల దేవుడా? అని మరోసారి అడక్కండి. మరియు తక్కువ కులం వారు అనగా మాల, మాదిగవాళ్ళ దేవుడా? ఎక్కువ కులం వాడి దేవుడా? అనే నీచమైన ప్రశ్న అడగకండి. ఇది చదివిన తర్వాత ఎవరు నమ్మిన దేవుడు నిజమైన దేవుడెవరో మీరే నిర్ణయించుకోవాలి. దేవుడు మనిషిని సృష్టించి లేదా కని కాపాడగలడు కాని మనిషి సృష్టించిన దేవున్ని మనిషే కాపాడాలి, రక్షించాలి అనేది మనకళ్ళకు కనపడుతున్న ప్రత్యక్ష సాక్ష్యం అని మాత్రం మరచిపోకండి.

# 12 దేవుడు ఆత్మ - తండ్రి

**దేవుడు** అనగానే ఆయన పురుషుడు గనుక పురుష పక్షపాతి అని ఆడవారు ఫిర్యాదు చేస్తున్నారు. కాదు, కాదు ఆడవారికే చాలా చాలా మేలులు, హక్కులు కల్పించాడు అని పురుషులు అంటున్నారు నిజానికి ఆయన ఆడకాదు. మగకాదు. అలాగని నపుంసకుడు కూడా కాదు సుమా! ఆయనకు సెక్స్‌తో అనగా – మేల్ మరియు ఫీమేల్ ఆకారముతో పనిలేదు. మనుషులకే ఆకారముతో పని. ఆయనకు న్యూట్రల్ జెండర్ వర్తిస్తుంది. ఆయనలో నుండి ఆడవారు పుడుతారు, మగవాళ్ళుపుడుతారు. ఆయన ప్రకృతిలోని ప్రతి అణువును తన మహత్తు (శక్తిగల) గల మాట చేత సృష్టించాడు, నడిపిస్తున్నాడు. దీని వెనుకాల కనపడకుండా ఉంది శక్తిగల దేవుడే ఉన్నారు. దేవునిలో నుండి ఆడవారు వస్తున్నారు, మగవారు వస్తున్నారు. ఈ లోకంలో మనల్ని కనేది తండ్రి గనుక ఆయన కూడా నేను తండ్రిని అని చెప్పాడు. కాని ఆయన ఎప్పుడు మగవారి పక్షపాతి కాడు. అందరిని సమానంగా ప్రేమించే తల్లి+తండ్రి ఆయనే. పాత నిబంధనలో సర్వ శక్తిమంతుడుగా, సర్వ సైన్యాధ్యక్షుడుగా, యజమానిగా, ప్రభువు, దేవుడుగా తన్ను తాను కనబరచుకొన్న లేక బయలు పరచుకొన్న

దేవుడు క్రొత్త నిబంధనకొచ్చే సరికి తను 'ఆత్మ' అని, తండ్రియని, శక్తి కలిగిన వ్యక్తి అనియు పరిచయం చేసుకొన్నాడు. అందుకే ఆయనను పురుషుడుగా చూస్తున్నాము. ఆ దేవుడిని సర్వలోకానికి చివరిసారిగా దేవుని పిల్లలందరికి బయలు పరచడానికొచ్చిన బలమైన వ్యక్తి దేవుని కుమారుడైన క్రీస్తే.

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:19–24).

"యేసు–మీరు నన్నైనను, నా తండ్రినైనను ఎరుగరు, నన్ను ఎరిగియుంటిరా నా తండ్రిని కూడా ఎరిగియుందురని వారితో చెప్పెను" (యోహాను 8:16–19).

"యేసు ఆమెతో నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్నుముట్టుకొనవద్దు. అయితే నా సహోదరుల యొద్దకు వెళ్లి – నా తండ్రియు – మీ తండ్రియు, నా దేవుడును – మీ దేవుడునైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నానని వారితో చెప్పవలెను" (యోహాను 20:17)

"అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోనూ వ్యాపించి, అందరిలో ఉన్నాడు" (ఎఫెస్సీ 4:6; అపొ.కా. 17:26–29).

ఆత్మయై ఉన్నదేవుడు పరలోకంలో ప్రత్యేకమైన శక్తియై ఉన్నాడు గనుక ఈనాడు మనం ఆయనను 'పరమాత్మ' 'పరమాత్ముడు', పరమ తండ్రి' అని సంబోదించుచున్నాము. ఈ లోకంలో ఉన్న మనం ఆ 'ఆత్మ' యొక్క భాగాలం (కీర్తన 16:5; యోబు 27:2; విలాప 3:24) గదా! మనం జీవాత్మలం (ఆది.కా. 2:7). అయితే

ఆయన పరమాత్మ, మనం జీవుడు – ఆయన దేవుడు. ఆయన లేడు అని అంటే మనం కూడా లేనట్లే. మరి మనం లేమా? మనం భూమిమీద ఈ రోజు శరీరంలో ఆత్మగా జీవించుచున్నాం (నేను వ్రాసిన పుస్తకం 'మనిషి జన్మ ఎందుకు?' చదవండి పూర్తిగా అర్థం అవుతుంది). శరీరాన్ని వదిలి అనగా చనిపోతే, ఉంటే నిత్యజీవంలో అనగా స్వర్గంలోనైనా (దేవుడున్న పరలోకంలో) లేదా నిత్యాగ్ని దండనలోనైనా (నరకంలోనైనా) ఉంటాం. మన అడ్రస్ మాత్రం గల్లంతు కాదు.

ఎందుకంటే మన ఆత్మకు మూలం–తండ్రియైన దేవుడు ఉన్నవాడు, ఆది–అంతము లేనివాడు గనుక. మనిషికి ఆది–అంతము లేదు. "దేవుడికి చావుంటే ఈ జీవుడికి చావుంది. అయితే ఈ 'ఆత్మ' ఎలా ఉంటుందో, అనగా దాని రూపురేఖలు – ఆకారం ఎలా ఉంటుందో మాత్రం బైబిల్‌లో చెప్పబడలేదు. ఆడవారిలోనున్నది అదే ఆత్మ, మగవారిలో ఉన్నది అదే ఆత్మ. దీనికి లింగభేదం లేదు. మగవాడికే అధికారం ఇచ్చాడు గనుక మరియు దేవుడు తండ్రి అని చెప్పబడింది గనుక దేవునిని, 'ఆయన' అని అంటున్నాం. అంతే తప్ప దేవుడు కేవలం 'మగవాడా' లేదా స్త్రీయా మరియు 'పురుషుడు' మాత్రమేనా? అని ఆలోచించకూడదు, చెప్పకూడదు. దేవుడు పక్షపాతములేనివాడు గదా! మరియు ఆయన అందరికి న్యాయాధిపతి కూడా.

"ఇప్పుడైతే సీయోనను కొండకును, జీవముగల దేవుని పట్టణమునకును, వేవేలకొలది దేవదూతల యొద్దకును, పరలోకమందు వ్రాయబడియున్న జేష్ఠ్యుల సంఘమునకును, వారి

మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును, సంపూర్ణ సిద్ధిపొందిన నీతిమంతుల ఆత్మలయొద్దకును, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసునొద్దకును హేబేలు కంటె మరి శ్రేష్టముగ పలుకు ప్రోక్షణ రక్తమునకును మీరు వచ్చియున్నారు (హెబ్రీ 12:22-24).

మనం ఆత్మగా మన శరీరంలో ఎక్కడున్నాం అంటే ఒక చోటు అని చెప్పలేం. అరికాలునుండి నడినెత్తి వరకు ఈ శరీరంలో ఉండి దానిని జీవింపజేయునదే ఆత్మ (యోహాను 6:63). ప్రారంభ మానవుడైన ఆదాము జీవుడుగా మట్టి బొమ్మ అనగా ఈ శరీరములోనికి ప్రవేశించిన దేవుని ఆత్మ జీవాత్మగా మారి మన తాత - ముత్తాత - తండ్రుల ద్వారా మనంగా మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. మనం కూడా దేవుడిలాగే శక్తి మంతులం. పరిశు ద్ధులం అన్ని కాగల సత్తా మనలో ఉన్నది. ఎందుకనగా మనం ఆ దేవుని ఆత్మ స్వరూపులమే గదా!

ఈ ఆత్మను కొందరు గాలి అనియు మరికొందరు ఊపిరి, ఆవిరి అని కూడా వ్యాఖ్యానించారు. ఇదీ అని మాత్రం ఖచ్చితంగా చెప్పలేము గనుకనే "ఆత్మ" అని ఒక పేరును ఖరారు చేశారు. ఇది కూడా భాషనుబట్టి, ప్రాంతాన్నిబట్టి మారిపోతుంది. కేవలం పేరు మీద రాద్ధాంతం చేస్తున్నవీరు ఈ "ఆత్మ" అనే పేరు కూడా మారుతుందనే విషయం మర్చిపోయారు. అలాగే తల్లి,తండ్రి, అన్నా-తమ్ముడు, అక్కా-చెల్లెలు ఇలాంటి వరుసలతో కూడిన నామ వాచకాలు కూడా మారిపోతాయి గనుక మనం "ఆత్మ" అనియు దేవుడు "పరమాత్మ" అనియు గ్రహిస్తేచాలు.

# 13 దేవుడున్నాడు! జాగ్రత్తపడండి!

**ఇంతవరకు** చదివినదానిని బట్టి దేవుడున్నాడని ఖచ్చితంగా తెలిసిపోయింది. అయితే ఆ దేవుడు మా దేవుడేనా? అని క్రైస్తవులు, ముస్లిములు, హిందువులు ఇంకా అనేక మతాలు, జాతులు, ప్రాంతాలుగా విడిపోయిన మనుషులు ఆ తర్వాత అడుగుతారని ఆయనకు ముందే తెలుసు. బైబిల్‌ను బట్టి చూస్తే అందరికి దేవుడొక్కడే అని ఉన్నది. నేను కూడా ఎవరి తరుపున మాట్లాడటం లేదు. బైబిల్‌లోని ప్రతి మాట ముఖ్యంగా నూతననిబంధన ప్రపంచ మానవాళి అందరినుద్దేశించి మాట్లాడింది. ఇది కేవలం క్రైస్తవుల మతగ్రంథం కాదని అందరూ గుర్తుంచుకోవాలి. అందుకే ఆయన పైన పేర్కొన్న సంగతులను గూర్చి ఒక అవగాహన మనకు వస్తేనే చాలా బాగుంటుంది. ఒకర్నొకరు విమర్శించుకోవడం ఆపుచేసి, ఆత్మ విమర్శన చేసుకొని ఆలోచించాలి. ఇప్పుడు జాగ్రత్తపడకపోతే ఆ తర్వాత చాలా బాధపడాల్సి ఉంటుంది. నేను చేసేది దేవుడు మరియు క్రీస్తు, పరిశుద్ధాత్మల బోధ గనుక నాకు ఎవరి మీద పక్షపాతము లేదు. నేను క్రైస్తవుల తరుపున కూడా మాట్లాడటం లేదు. ఒకవేళ క్రైస్తవ్యం మతం అని ఎవరైనా భావిస్తే అది దేవుని

మతి నుండి పుట్టింది గనుక అది అందరూ పాటించి తీరాల్సిందే. ఎందుకంటే దేవుడొక్కడేనని క్రీస్తు మాత్రమే చెప్పాడు.

ఈ అందమైన, అద్భుతమైన, అంతుచిక్కని అపురూపమైన జగత్తును అందలి సమస్తమును ముందుగానే నిర్మించి ఆయన కుమారులం, ఆత్మ స్వరూపులమైన మనకోసం దానిని ఒక క్రమమైన పద్ధతిలో మనకోసం మాత్రమే నడిపిస్తూ, శాసిస్తూ మనం ఆయనను మరచిపోయినప్పుడు మనందరికి ఆయన ఉన్నాడనే ఉనికిని గుర్తుచేయడానికి అప్పుడప్పుడు ప్రత్యేక తరహాలో అనగా భూకంపాలు, సునామీలు, వరదలు, కరువు-కాటకాలు రూపంలో రుచిచూపిస్తూ కనబడే ఈ లోకంలో కనపడకుండా ఉన్నవాడే దేవుడు. ఆయనకు ఏ పేరు, ఊరు, కులం, భాష, ప్రాంతం అంటూ ప్రత్యేకంగా లేనివాడై బైబిల్ ప్రకారంగా మూడులోకాలలో (భూలోకం - పరలోకం - పాతాళలోకం) అంతటతా వ్యాపించి ఉన్న సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడే దేవుడు.

యావత్తు భూమి మీదనే (వేరే ఏ గ్రహంలో ఎక్కడా మనిషి జీవించలేడు, భూమి మీద తప్ప) జీవించుటకు తనే ఒకడుగా మట్టి శరీరంలోనికి మనం (మనిషి)గా వచ్చి ఆ ఒకనినుండి మాత్రమే ప్రపంచంలో నాటి ఆదాము నుండి నేటివరకు కోటానుకోట్లుగా విడిపోతున్న ఆయాజాతి మనుష్యులను కని (అనేక మంది మానవులుగా లేక ఆత్మలుగా విడిపోయి), పెంచి, పెద్దచేసి, పోషించి సంరక్షిస్తూ ఆయన అనుకొన్న సమయం అయిపోగానే అందరినీ తనయొద్దకే రమ్మని పిలుస్తూ, ఒకవేళ ఎవరైనా రానని (ప్రార్థన చేసి గోజాడి, ఏడ్చినా) మొండికేస్తే బలవంతంగానైనా (చంపైనా) సరే రప్పించుకొంటున్నవాడు దేవుడే.

మనం ఆయనను నమ్మినా – నమ్మకపోయినా, ఆరాధించినా – దూషించినా అందరిని సమానంగా ప్రేమిస్తూ అందరికి తండ్రియై అందరిలో అందరిగా వ్యాపించి ఉన్నవాడును, మనం నివసిస్తున్న ఈ భూలోకానికి పైనున్న పర (వేరే) లోకంలో ఉండి ఈ లోకంలోని ఆకాశంలో సింహాసనాన్ని కూడా అధిష్టించి ఈ భూమినే తన పాదపీఠంగా చేసుకుని ముల్లోకాలను పరిపాలిస్తున్న స్వయంభువుడు, నిరాకారుడు, సర్వోన్నతుడు, సర్వాధికారియైన, సత్యవంతుడైన ప్రభువు, పక్షపాతంలేని ప్రేమామయుడు, అరి వీర భయంకర – భీకరుడు, రక్తమాంసాలకు రాగద్వేషాలకు అతీతుడైన వాడే మనందరికి తండ్రియైన ఈ దేవాధిదేవుడు.

ఎవరికి లొంగనిది, ఎవరికోసం ఆగనిది, ఎవరు కలుగ జేయనిది, అనంతమైన, అంతుచిక్కటువంటి 'కాలము'ను కలుగజేసి, దానికి కళ్ళెంవేసి మనకోసం దానిని సక్రమంగా నడిపిస్తూ దానికి కూడా తాను అతీతుడై, ఆదియు–అంతము అనగా చావు పుట్టుకలు లేక నిత్యం జీవంకలిగి అమరుడై అందరిని జీవింపజేస్తూ తన పిల్లలైన వారందరికి కూడా అమరత్వం కలుగజేసిన, జీవాధికారి, మహోన్నతుడు, మహాశక్తివంతుడైన 'ఆత్మ'యే దేవుడు. ఈ పరమాత్మనే లేక పరమ శక్తినే నేటి శాస్త్ర ప్రపంచం 1) సర్వశక్తి (Super Power) 2) నిత్య శక్తి (Ever Lasting Power) 3) అదృశ్య శక్తి (Invisible Power) 4) మహాకర్షకశక్తి (Great Attractor) ఇలా ఇంకా అనేక పేర్లతో పిలుచుచున్నది. నేటి అధునాతన మానవ మేధస్సుకు, మరెన్నో సంవత్సరాలకైనా రాబోయే మానవ మెదడు యొక్క ఊహకు కూడా అందని మహామనస్తత్వ శాస్త్రవేత్త, ఇంజనీరు,

వైద్యుడు, న్యాయాధిపతి... ఇలా సర్వంతానై 'ఉన్నవాడు' దేవుడు. ఆ దేవుడు ఒక్కడేనని మరోసారి గుర్తుచేస్తూ మనం నమ్మినా, నమ్మకపోయినా ఇదే సత్యం అని సగర్వంగా ప్రకటిస్తున్నాను లేదా సవినయంగా మనవిజేస్తున్నాను. నమ్మితే మీకే నిత్యత్వమనే లాభం, నమ్మకపోతే నరకమనే నష్టం ఇందులో నాకొచ్చే లాభంగాని, దేవునికొచ్చే లాభముగాని నష్టముగాని ఏమి లేదని గూడా తెలియజేస్తున్నాను.

అయితే దేవుని పేరుననో, ఆయన పేరుల మీదనో మతాల్ని సృష్టించి మానవత్వాన్ని మంటగలుపుతూ, మానవ మేధస్సును మలిన పరుస్తున్నారు కొందరు. పనిచేయడం ఇష్టంలేక మందిమీదపడి దోచుకుతింటున్న సోమరిపోతులైన దొంగ బోధకులను చూసి మేధావులనబడిన అనేకులు దేవుడులేడు అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారేమోనని పిస్తుంది. దేవుడెప్పుడు మన ఈ సోమరితనాన్ని అస్సలు ఒప్పుకోలేదు (సామెతలు 6:6–11; తీతు 1:12) నీవు ఎవరివైనా (అనగా పాస్టర్ అయినా సరే స్వంతంగా పనిచేసి, మరియు స్వహస్తములతో పనిచేసి ఆహారాన్ని భుజింపమన్నాడు (2థెస్స 3:6–15) మతం పేరున మారణహోమం చేయవద్దని అసలు మతం అంటే తనకిష్టం లేదని మతాధికారులనే యేసుప్రభువు తిట్టాడని (మత్తయి 23:15–23వ అధ్యాయం అంతా) మరిచిపోవద్దు.

మతం మత్తు అని నేటి కమ్యూనిష్టు వాళ్ళకన్నా ముందే దేవుడు చెప్పాడు. మానవ మతం ఈ మతనాయకులను ఎలాంటి మత్తులో ఉంచుతుందో కళ్ళముందు జరుగుచున్న వాటినే ఆధారం

చేసుకొనండి. దేవుడున్నాడని న్యాయంగా బ్రతకండని చెప్పేవాడు చేయడంలేదు అనుకొని చెప్పించేవానిని విస్మరించడం న్యాయం కాదు. దేవుడు ఉన్నాడని చెప్పేవాడే ఒకవేళ దుర్మార్గుడైతే దాని ఫలితాన్ని తప్పక అనుభవించితీరుతాడు. మనం ఎవరం అతన్నిబట్టి సృష్టికర్తనే నిందించడానికి, కాదనడానికి. దేవుడు లేడని సమాజంలో ఎన్నో మంచిపనులు చేసి, అభ్యుదయవాదం అని ఆనందిస్తున్నవారు, ఆయన ఉన్నాడని నమ్మి మరింత మంచిపనులు చేయండి, మరిన్ని లాభాలు పొందండి. దేవుడున్నాడు అని దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకొని జాగ్రత్తపడండి.

# 14 దేవుడెక్కడున్నాడు?

**దేవుడున్నాడంటున్నారు** గదా. ఆయన ఇల్లు ఎక్కడుంది? ఊరు ఎక్కడుంది? అని అడిగే వాళ్ళు కూడా ఉన్నారు. మనం నివసిస్తున్న ఈ భూలోకంలోని అనంతవిశ్వాన్ని అనగా ఆకాశమండలాలను దాటి (సూర్య కుటుంబం, పాలపుంత, ఆండ్రోమెడా లాంటి వాటిని దాటాలి) ఇప్పటికి మనకు కంటికి కనపడ్డ నీలి ఆకాశపు అంచులు దాటితే, ఆపైన ఉన్నదే పరలోకం అందులో దేవుడున్నాడని దేవుని పిల్లలైన వారు దేవుని ఆత్మచేత మనకు చెప్పారు. ఆ లోకాన్ని చూసి, ఆ లోకంలో దేవునితో పాటు చాలాకాలం ఉండి, ఆయన ఆజ్ఞ ప్రకారం ఈ భూలోకాన్ని కలుగజేసి మన రక్షణ కోసం ఆ లోకం నుండి, క్రిందనున్న భూలోకానికి దిగి వచ్చిన మనలాగే మనిషిగా జీవించి మరణించి సమాధి చేయబడి తిరిగి మూడవ దినాన లేచినటువంటి దేవుని కుమారుడైన క్రీస్తు చెప్పాడు (యోహాను 3:13; 6:38,41; 8:38; 17:1). ఇది నేటి శాస్త్రానికందని ఆత్మ జ్ఞానం. మామూలు నేత్రములతో కాక. మనోనేత్రములతో (జ్ఞాన నేత్రములతో) చూస్తేనే పరలోకం, భూలోకం, దాని క్రిందనున్న పాతాళ లోకం సంగతి అర్థమవుతుంది.

పరలోకంలో ఉండే దేవుడు ఈ భూలోకంలో కూడా కొంత కాలం (మనిషిలా) మనలా జీవించాలని కోరుకొని ఈ లోకాన్ని సృష్టించి, అందులో ఆయన బ్రతుకడానికి సరియైన వాతావరణాన్ని ఐదు రోజులు కలుగజేసుకొని, ఆ తర్వాత ఆరవదినాన తాను ఉండటానికి ఆయనే స్వతహాగా ఒక ఇల్లు కట్టుకొని అందులోనికి గృహ ప్రవేశం చేశాడు. ఈ ఇంటిని ఆయన తప్ప ఈ లోకంలో ఉన్న మానవమాత్రుడు (క్రీస్తుతో సహా) ఎవ్వరు కట్టలేడు అని గూడా తన భక్తుడు, ప్రియుడైన దావీదు ద్వారా చెప్పాడు.

"యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టు వాని ప్రయాసము వ్యర్థమే..." (కీర్తన 127)

"మనమే ఆయన ఇల్లు" (హెబ్రీ 3:1–6).

ఆయన కట్టిన ఇల్లు ప్రతి మనిషి దేహము, అది ఆడ శరీరము కావచ్చు, మగ శరీరము కావచ్చు. ప్రతి మనిషిలో, మనిషి (ఆత్మ)గా జీవిస్తున్నది కూడా దేవుడే సుమా. ఎదుటి మనిషిలో, నీలో, నాలో అందరిలో ఉన్నది దేవుడైన ఆత్మ గనుక మనం మన పొరుగు వారిని దూషింపక, ప్రేమించి తీరాలి అని దేవుని ఆజ్ఞ.

"అందరికి తండ్రియైన దేవుడొక్కడే, ఆయన అందరికిపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి, అందరిలో (అందరిగా) ఉన్నాడు" (ఎఫెసి 4:6).

ఈ రోజు మానవ మతి నుండి పుట్టిన దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇంట్లోని ఓ చిన్న పూజా గది కాదు దేవుడుండే స్థలం (అపో.కా. 7:50–56) మన దేహమే దేవుని ఆలయం. (నేను

వ్రాసిన "దేవాలయం – దేవుడు కట్టిన ఇల్లు" అనే పుస్తకం చదవండి. దేవుని అడ్రస్ పూర్తిగా తెలుస్తుంది. ఆ పరమపురికి సిద్ధపడండి).

ఇక్కడ మరో సంగతిని గుర్తు చేయాలని గుర్తెరిగి ఒక అద్భుతమైన సంగతిని వ్రాయుచున్నాను. చాలామంది విశ్వాసులమనుకునేవారు, వారిని విశ్వాసంలో ఉంచుతున్నాం పెంచుతున్నాము అని విర్రవీగుచున్నవారు చెప్పేమాటను చూడండి. ఈ లోకంలో దేవుడు లేడనే హేతువాదులు, నాస్తికులు బుద్ధిహీనులనే దేవుని వాక్యాన్ని కీర్తన 14, మరియు 53 అధ్యాయాలను చూపించి చేతులు దులుపుకుంటున్నారు. కాని ఆ కీర్తనలు నిజంగా హేతు వాదులను, నాస్తికులను గూర్చి వ్రాసినవి కావు. దేవుడున్నాడన్న ప్రజలే దేవుడు లేడనుకొని బుద్ధిహీనంగా, చెడు కార్యములను అసహ్యకార్యములు చేస్తున్నారని, దేవున్ని వెతుకుట లేదనియు, వారి నాలుక క్రింద సర్ప విషమున్నదనియు తెలియజేస్తున్నాడు. కీర్తనలు గూడా ధర్మశాస్త్రములో భాగమే గనుక అది ఆనాటి దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులను ఉద్దేశించి వ్రాసినదే మరొకటి కాదు సుమా!

అయితే అది నేటికి కూడా దేవుని ప్రజలమని చెప్పుకుంటున్న బుద్ధిహీనుల యెడల కూడా నెరవేరుచున్నది. దేవున్ని, ఆయన వాక్యాన్ని బైబిల్‌లో వెదకడం మానేసి అన్యుల గ్రంధాలను వెదకుచున్నారు. మతం పేరుతోనే అన్యాయంగా హత్యలు, ఆత్మహత్యలు, మాన భంగాలు, దోపిడీ, మారణకాండలు, మతహింసలు, ప్రార్థనల పేరుతో మూఢనమ్మకాలను పెంచుతున్నారు. ఈ మత మూర్ఖుల ప్రవర్తనబట్టే దేవుడు లేడని చెబుతున్న హేతువాదులు, మన సమాజంలో మతం పేరున జరుగుతున్న

మారణకాండను మూఢనమ్మకాలను, బలులను, కుల–మత, వర్గ–వర్ణ బేధాలను మాన్పడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తూ ఎదుటి మనిషిలో దేవున్ని చూడమని, నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించమనే కార్యాలను చేసి (శరీరకంగానే తప్ప – ఆత్మీయంగా కాదనుకోండి) చూపిస్తున్నారు.

నేటి హేతువాదులకు సరియైన కారణాన్ని చూపితే వారు ఖచ్చితంగా దేవున్ని నమ్ముతారు గాని దేవుని నమ్ముతున్నామని చెప్పే బుద్ధిహీనులు బైబిల్‌లోంచి ఎన్ని వాక్యాలు రుజువు చూపి ఎన్ని రోజులు బోధించినా, తర్కించినా నిజమైన దేవుడెవరో, మరియు బైబిల్‌లో ఉన్న వాటినే నమ్మలేని స్థితిలో ఉన్నారు. నా అనుభవం లోనైతే ఒక అన్యున్ని ఒక గంటలో విశ్వాసిగా మార్చవచ్చును కాని ఒక క్రైస్తవుడైన వానిని క్రీస్తులో ఎన్ని రోజులైనా నిలపడం కష్టంగా ఉంది. దీనికి నా జీవితమే ఉదాహరణ. ఒకప్పుడు దేవుడులేడని, ఉంటే చూపించమని నాకు బాప్తిస్మమిచ్చి, పెండ్లి చేసినవారినే ముప్పుతిప్పలు పెట్టాను. ఒక రాడికల్‌గా ఆలోచించిన నేను కారణం అనగా సరియైన సమాధానం దొరకగానే దేవుడు లేడనే వారికి ఉన్నాడని చెప్పడానికి చాలెంజ్‌గా ఉంటుందని ఈ పుస్తకం వ్రాశాను. దీనికి నా తరంలో చాలామంది సాక్షులు ఉన్నారు. అవునో కాదో అవసరమైతే తెలుసుకొని ఆలోచించండి.

# 15 దేవుడెలా ఉంటాడు - ఆయనకు రూపం (ఆకారం) ఉందా?

**ఉన్నవాడును,** సర్వశక్తిమంతుడును, ఆత్మయైనవాడు, తండ్రిగా తన ప్రేమ చూపిస్తున్నవాడునైన దేవుడు ఇంతకి వ్యక్తికాడా? అని అనేక మందికి అనుమానం వచ్చింది, వస్తూనే ఉంది. తలకొక రీతి ఆలోచించుకొని, ఊహించుకొని, ఆయన రూపాన్ని తమకునచ్చిన రీతిలో తయారుచేసుకుని పూజిస్తున్నారు. విశ్వం అంతటా, అన్ని జీవులలో, అందరిలో వ్యాపించి అన్ని రూపాలలో ఉన్నాడని అనేకుల అభిప్రాయం. బైబిల్‌ను నమ్మినవారు, ప్రకటిస్తున్నవారు కూడా ఆయనకు (దేవునికి) ఆకారాన్నిచ్చి ఆరాధించడమును గూర్చి తప్పకుండా ఆలోచించాలి. మరికొందరు తెలివిగా అనేకుల అమాయకత్వాన్ని బలహీనతలను చూసి ఇప్పుడే నేను దేవున్ని చూశాను. ఆయనే నన్ను మీ దగ్గరకు పంపాడు అని చెప్పడం చూస్తున్నాం. మానవ నేత్రములతో ఎవ్వరైనా ఆ దేవునిని చూచిన వారున్నారా! అని దేవుని గ్రంథమైన బైబిల్‌ను ధ్యానించి ముందుమన క్రైస్తవుల మనోనేత్రములనే వెలిగిద్దాం. ఆ తర్వాత క్రైస్తవేతరులు అందరూ కూడా అర్థం చేసుకుంటారు.

అపొస్తలులు వారి శిష్యుల తరం అంతరించిన తర్వాత అనగా క్రీ.శ. 3వ శతాబ్దంలోనే ప్రారంభ క్రైస్తవ్యానికి దెబ్బ తగిలిందని సంఘ చరిత్రలో ఉన్నది. రోమాలో ప్రారంభమైన సంఘము (రోమన్ కాథలిక్ సంఘము)నకే నేడు క్రైస్తవులుగా గుర్తింపు, అధికారం అనేక దేశాలలో ఉంది. వారికి ఓ ప్రత్యేకమైన దేశమే, 'వాటికన్' పేరుతో ఉన్నది. అనేక దేశాలలో వారికే ఎక్కువ అంగబలం, అర్ధబలం, అధికారబలం ఉన్నది. వారు దేవునికి, దేవుని కుమారుడైన క్రీస్తుకు, ఆయన యొక్క ఈ లోకపు తల్లిదండ్రులైన యోసేపు, మరియమ్మల విగ్రహాలను చేసుకొన్న విధానాన్ని, వాదనలను బైబిల్ పరంగానే ఆలోచించితీరాలి. అసలు క్రీస్తును, మరియమ్మను ఆత్మీయంగానైనా సరే పూజించేవారిని క్రైస్తవులనవచ్చా? అనేది గూడా ఆలోచన చేద్దాం. మొదట దేవునికి ఆకారమున్నదా? ఆయనెలా ఉన్నానని తన వాక్యంలో ఏమైనా చెప్పాడో చదువుదాం. ఆ తర్వాత ఆయనతో ఎవరైనా మాట్లాడారా? ఆయునను చూసినవారున్నారా? తెలుగువారైన మనం ఇప్పుడు మన చేతుల్లో ఉన్న గ్రంథం ప్రకారంగా క్రీస్తును ఆరాధించాలా, పూజించి, స్తోత్రించాలా? అనే అనేక అంశాలను దశలవారిగా ధ్యానించి దేవుని గూర్చిన పూర్తి వివరాలు గ్రహిద్దాం వరుసగా.

"పైన ఆకాశమందే గాని, క్రింద భూమియందే గాని, భూమిక్రింద నీళ్ళయందే గాని యుండు దేని రూపమునైనను విగ్రహమునైనను నీవు చేసుకొనకూడదు. వాటికి సాగిలపడకూడదు, వాటిని పూజింపకూడదు" (నిర్గమా 20:4; ఎఫెసి 5:5; ప్రకటన 21:8).

ఈ ప్రపంచంలో ప్రప్రథమంగా దేవుడు తన ప్రజలనుగా కేవలం ఇశ్రాయేలీయులను ఎందుకొని వారి దేవుడైన యెహోవాగా

తనను తానుగా వారికి ప్రత్యక్ష పరచుకొని, వారికిచ్చిన ధర్మ శాస్త్రములోని 10 ఆజ్ఞలలో అతి ప్రాముఖ్యమైనదే పైన వ్రాయబడిన ఆజ్ఞ ఇది (మత్తయి 22:35–38). మనం ఉన్న ఈ భూలోకంలోగాని అగాధజలాల్లోగాని, ఆకాశజలాల్లోగాని, కనబడే ఏ రూపాన్ని పూజింపకూడదు, ఆరాధించకూడదని దేవుని ప్రజలకు ఆజ్ఞాపించాడు. దీనిని బట్టి ఆలోచిస్తే ప్రపంచాన్ని కలుగజేసి అందులో ఉన్న జీవరాసులలోగాని, జీవంలేనివాటిలోగాని, ఈ సృష్టిలో అధికారం చలాయిస్తున్నది, తన స్వరూపంలో చేశానని చెప్పిన మానవుని ఆకారం కూడా దేవునిది కాదు అని తెలుస్తుంది గదా! సర్వాంతర్యామియైన దేవుడుగా తెలియబడ్డా కనబడుతున్న ఏరూపం ఆయనది కాదని చెప్పుచున్నాడు. ఆఖరున మానవుని రూపం కూడా నాది కాదు అన్నాడంటే బాగా ఆలోచించాలి. నిజం బైటకురావాలంటే అదే వాక్యాన్ని చాలా జాగ్రత్తగా వెతకాలి.

బైబిల్‌లో అనేకచోట్ల నా హస్తములతో నిన్ను కాపాడుతానని, నా కన్నులు నిన్ను చూస్తున్నాయని మనుషులతో చెప్పిన మాటలను బట్టి ఆయనది కూడా మనుష్యరూపమేనని ఆలోచించి మానవ ఆకారాన్ని, దేవుడుగా చేసి పూజించడం మొదలైంది. దేవుని స్వరూపం ఆత్మగనుక, శక్తిగనుక? 'ఆత్మ' మాత్రమే ఆయన స్వరూపం లేదా ఆకారం అని అర్థం చేసుకొని గ్రహించాలి. మనిషి ఆత్మ శక్తివంతమైనది, మన భాషలో ఒక మనిషిచేయి మనకు తోడుగా ఉంటేనే ధైర్యంగా ఉంటాం గనుకనే మనకర్థమయ్యే భాషలో తన హస్తం, పాదం, కన్ను ఇలా నిన్ను నడిపిస్తాయి, కాపాడతాయని, చూస్తున్నాయని చెప్పాడు. ఎందుకనగా మానవ శరీరము నిష్ప్రయోజనమైనది (యోహాను 6:63) మరియు కొద్దికాలం మాత్రమే ఉండి నాశనమయ్యేది (యాకోబు 4:14; ప్రసంగి 12:7)

అందుకే మట్టిలోకములో, మట్టితో లేదా మట్టిలోనుండి గాని, నీళ్ళలోనుండి గాని పుట్టిన ఏ ఆకారము ఆయనకులేదు గనుకనే, ఒక ఆకారాన్ని విగ్రహంగా చేసుకొని ఆయనను ఆరాధించకూడదు. పూజచేయ కూడదు అని చెప్పాడు దేవుడు. ఇది నమ్మలేని నిజం. అందుకే ఇది దేవుని వాక్యంలోని పరమసత్యం. (నేను వ్రాసిన "ఏది నిజమైన దైవారాధన" అనే పుస్తకాన్ని కూడా దయచేసి చదవండి ఆరాధన అంటే పూర్తిగా తెలుస్తుంది).

యేసు తల్లియైన మరియమ్మది, ఆమె భర్త యోసేపుది ఆఖరున యేసుక్రీస్తు శరీరం కూడా మట్టిలో కలిసేవి, కలిసినవే గదా మరియమ్మ, యోసేపుల శరీరాలయితే ఇప్పటికి మట్టిలోనే ఉన్నాయి. యేసుప్రభువు రూపంమాత్రం 3రోజులలోనే మార్పు చెంది మహిమ శరీరంగా మారి పై లోకానికెళ్ళింది. ఈ లోకంలో కనబడే ఏ రూపాన్ని పూజింపకూడదు అంటే యేసు, మరియమ్మ రూపాలను కూడా పూజింపకూడదు, వాటికి సాగిలపడకూడదు. కనబడే ఏ రూపమయినా దేవునిది కాదు, దేవునికి రూపం లేదు. కాని మన సోదరులైన రోమన్ కాథలిక్ సంఘసభ్యులు సాతాను మాయలోపడి అందరిది కాదుకదా, దేవుని కుమారుడు, దేవుడైన క్రీస్తుదే గదా! మరియు తల్లి లేకుండా కుమారుడెక్కడ నుంచి వచ్చాడు, ఆయనకు ఆకారాన్నిచ్చింది మరియమాతనే గదా అని ఆమె విగ్రహాన్ని కూడా పూజిస్తున్నారు. ఇక్కడ బైబిల్‌ను వారు సరిగ్గా గ్రహించలేదు. వారి గురువులు చెప్పిందే నమ్ముతున్నారు తప్ప గురువులకు గురువైన క్రీస్తు, ఆయన తండ్రియైన దేవుని ఆజ్ఞను మరచినారు. కాథలిక్‌లు చేస్తున్న విగ్రహారాధనను వ్యతిరేకించినవారు లేదా ప్రొటెస్ట్ చేస్తున్నవారే మన ప్రొటెస్టెంటు క్రైస్తవులు. వీరి సంఖ్య బలం కాథలిక్‌ల ముందు సంగం కూడా లేదు అని చెప్పవచ్చును. ఇంకా

విగ్రహారాధనతో పాటుగా వివాహము నిషేధం మొదలైన ముఖ్య విషయాలలో రోమన్ కాథలిక్‌లు (ఆర్.సి.యం. వారు) బైబిల్‌కు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారు అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

"దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని, అసహ్యులును, అవిధేయులును, ప్రతి సత్కార్యము విషయములో భ్రష్టులునైయుండి తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు" (తీతు 1:16).

ప్రతి సత్కార్యము అంటున్నాడంటే ఇంతకీ సత్కార్యములు ఏవో తెలుసా? చాలా మంది ఈ లోకములో ఎక్కువ మందికి నచ్చినవి, ఎక్కువ మంది మెచ్చినవి, ఎక్కువ మంది చేసేవి, అందరికి ఈ లోకములో ఉపయోగపడేవే గదా అని అనుకుంటున్నారు. అది ఈ లోక న్యాయ ప్రకారంగా సరియైనదే కాని దేవుని ఆలోచన, సంకల్పము ప్రకారము మనం అనుకునేది 100% కరెక్టుకాదు. ఎందుకంటే మన తలంపులు ఎప్పుడు దేవునికి భిన్నముగా ఉంటాయి గనుక దేవుని ఆలోచనతో ఆలోచిస్తే సత్యమంటే వాక్యము (యోహాను 17:17) అనగా యేసుక్రీస్తు ప్రభువు. సత్కార్యములు అంటే యేసు చెప్పినవి, ఆయన చేసి చూపించినవే సత్కార్యములు. అందరూ స్వంత కార్యములను చూసుకొంటున్నారు గాని యేసుక్రీస్తు కార్యములను చూడటం లేదు, చేయడం లేదు అనే అపొస్తలుల బోధను (ఫిలిప్పీ 2:1-5) జ్ఞాపకం చేసుకొని మన కార్యములతో పాటు, సత్యమైన క్రీస్తు యేసు కార్యములు చేయాలి. అలా చేయని వారు అనగా బైబిల్‌లో ఉన్నవి చేయనివారు దేవునిని చూసినవారు కారు. అనగా ఆయనను ఎరిగిన వారు అస్సలు కాదు.

క్రైస్తవులు, క్రైస్తవేతరులు అనేకులు దేవుడు మాకు బాగా తెలుసని ఎవరికి వారే స్వంత భజన నచేసుకుంటున్నారే తప్ప ఇలా

వారెదుకుతున్న దేవుని సత్యం అనగా వాక్యప్రకారం ఎంతమంది దేవునిని తెలుసుకున్నారో, ఎరుగుతున్నారో ఆలోచించడంలేదు. ఆయన చెప్పిన రీతిలో ఆయనను నమ్మడం లేదా ఎరుగడం న్యాయమా? కాదా? ఆయన చెప్పిన దానికి వ్యతిరేకమేదయినా ఆజ్ఞాతిక్రమమేనని చెప్పాలి. సత్యవేదమైన బైబిల్‌లో దేవునికి రూపం, ఆకారం ఉన్నదని ఎక్కడా చెప్పబడలేదు. ఇంత చెప్పినా హానోకు దేవునితో నడిచాడు గదా దేవునికి ఆకారం, ముఖ్యంగా కాళ్ళు లేకపోతే ఎలా నడుస్తాడు అని అడ్డంగా, మూర్ఖంగా వాదిస్తారా? దేవుని మాటప్రకారంగా హానోకు తన జీవితాంతం దేవుని సాన్నిధ్యంలో తన కాళ్ళమీద దేవుని ఆజ్ఞల ప్రకారం నడిచాడని అదే దేవునితో నడవడం అని అర్థం చేసుకొని గ్రహించి అలా నడచినవారు ధన్యలు. యేసుక్రీస్తుకు శరీరాకారం ఉన్నా, అపొస్తలులు దానిని బాగా తడిమి చూసినా (1యోహాను 1:1,2), బాగా ఎరిగినా ఇక మీదట మనం ఆయన శరీరాన్ని ఎరుగకూడదని శిష్యులు ఖచ్చితంగా చెప్పారు (2కొరంథీ 5:16) క్రీస్తును తమ కళ్ళతో చూసిన వారే ఆనాడే ఆయన రూపాన్ని చూడ వద్దన్నా మేం ఎరుగుతాం అంటున్నారు నేటికి వీళ్ళు. ఇదే అసలైన సాతాను తంత్రం.

దేవదూతలకు రూపాలున్నాయి, మనుషులు చేసిన దేవుళ్ళకు, దేవతలకు ఆకారాలున్నాయి, దేవుని పిల్లలకు వివిధ ఆకృతులున్నాయి, దేవుని సృష్టిలోని సకల చరా,చర జీవరాశు లకు రూపాలున్నాయి. ప్రకృతిలో ఒకటి కనబడుతున్నదంటే దానికి ఒక ఆకారమున్నదని వేరే చెప్పవలసిన అవసరం లేదు. అయితే వీటన్నిటిని పుట్టించిన వానికి మాత్రం రూపం లేదు. ఇదే అద్భుతం, ఆశ్చర్యం, అగమ్యగోచరం అనకతప్పదు. బైబిల్‌తో పాటు చుట్టూ

మనకు ఉన్న ఎన్నో ఆధారాలతో దేవుడున్నా ఆయనకు ఆకారంలేదని నమ్మితీరాలి. అదే క్రైస్తవుల నిజమైన విశ్వాసం. కాని అనేకులు ఏదో ఒక రూపం కనీసం సిలువనో, ఒక అక్షరమో, ఒక అండాకృతియో, దీపమో కళ్ళముందు కనబడితేనే మనకు ధ్యానం, భక్తి పెరుగుతుంది గదా అని వాదించేవారు ఎక్కువగా ఉన్నారు. ఈ బౌతికవాదంతోనే అందరూ దెబ్బతింటున్నారు. దేవునికి చాలా దూరమైపోతున్నారు. కళ్ళుమూసుకుని కనబడనిదానిని మనో నేత్రములతో చూసేవాడే నిజమైన దేవుని కుమారుడు. మరొక విషయం కళ్ళు తెరుచుకొని కనబడుతున్న దానిని చూడక కనపడని దానిని చూసే శక్తియుక్తులు మనలో లేవా? ఆలోచించండి. మరికొన్ని వాక్యాలు చదువుదాం. జ్ఞానికి కన్నులు నెత్తిమీద ఉంటాయి (సామెతలు)

"కావున మీరు ఎవనితో దేవుని పోల్చుదురు? ఏ రూపమును ఆయనకు సాటి చేయగలదు?" (యెషయా 40:18).

"దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు, పశ్చాత్తపపడుటకు ఆయన నరపుత్రుడు కాదు. ఆయన చెప్పి చేయకుండునా" (సంఖ్యా 23:19).

కాబట్టే దేవుడికి మన మనుషుల యొక్క రూపం లేదు, సకలచరాచర సృష్టిలోని ఏ జీవరాశిరూపంలో కూడా ఆయన లేడని చెప్పుచున్నాడు. వాటి రూపాలను చేసుకొని పూజించే వారి మీద ఆయన కోసం పరలోకం నుండి బయలుపరచబడుచున్నదని రోమా పత్రికలో చెప్పినది జ్ఞాపకం చేసుకొండి (రోమా 1:21–25). ఆయనకు మనిషిలాగా చేతులు, కాళ్ళు, కన్ను, ముక్కులాంటివి లేవు. ఇవన్ని మనుషులకున్నాయి. గనుక మనం అర్థం

చేసుకోవడానికి, మనలో మనం తృప్తి పొందటానికే ఆయన నా చెయ్యి నిన్ను విడువదు. నా కన్నులు నిన్ను చూస్తున్నాయి అన్నాడు. ఆత్మకు మన లాంటి రూపం లేకపోయినా అంతా చూడగలడు, చేయగలడు, కాపాడగలడు. అందుకే ఆయన దేవుడు కాబట్టే ఆయనను మాత్రమే స్తుతించాలి, పూజించాలి, ఆరాధించాలి.

మొదట్లో మన పుస్తకాలకు డిటిపి, డిజైన్, ప్రింటింగ్ చేసే ఓ మంచి హైందవ మిత్రుడు చెప్పిన వాస్తవాన్ని మీకు వ్రాయుచున్నాను. మనం హిందూమతానికి చెందిన వారం అనుకుంటున్న వారంతా దైవ దర్శనం కోసం కొన్ని వేల మైళ్ళు ప్రయాణించి, ఆ గుడిలోకెళ్ళి సరిగ్గా దర్శన సమయంలో ఆ విగ్రహాన్ని కళ్ళార్పకుండా చూడక కళ్ళుమూసుకొని, ధ్యానించి దండం పెట్టుకొని వచ్చేస్తారట. దీని వలన వారి ప్రవర్తనే చెబుతుంది ఎంటంటే వారనుకున్న దేవుడు ఆ రూపంలో లేడని, దేవుని రూపం అదికాదని. అంటే తెలియకనే ఆ క్షణంలో దేవుడైన మన ఆత్మ మనల్ని హెచ్చరిస్తుంది సార్ అని చెప్పాడు. అవునోకాదో కొందర్ని అడిగి చూడండి.

పాతకాలంలో అనగా నా చిన్నతనంలో మాత్రము నేను చెప్పిందే వాస్తవం. ఎందుకంటే నేను చాలా సార్లు చూసాను, ఇప్పటికి ప్రసాదం చేతుల్లో పెడితే కళ్ళు మూసుకొని, కళ్ళకద్దుకొని వారి దైవాన్ని దర్శించి తింటారు. అంటే వారి భక్తి సరియైన సమయంలో దేవునికి ఆకారం లేదని చెబుతున్నట్లే కదా! కాని విగ్రహంలో దేవుడున్నాడని, అది దేవుని రూపమని చెప్పడము మాత్రము బైబిల్‌కు వ్యతిరేకమే సుమా!

# 16 దేవున్ని ఎవరైనా ఎప్పుడైనా చూశారా?

**దేవునికి** ఆకారం, రూపం లేదనే విషయం ఇప్పటికే స్పష్టమయ్యింది గదా! మళ్ళీ ఈ ప్రశ్న ఇంకెందుకు అనకండి. ఎందుకంటే ఈ రోజుల్లో అనేకులు, దైవజనులు, పాస్టర్లు, పూజారులు, బాబాలు, యోగులు, మహార్షులు మరియు క్రైస్తవులతో సహా దేవుని పేరుమీదనే దేవున్ని నమ్మిన ప్రజలను ఘోరంగా మోసగిస్తున్నారు. నేను దేవున్ని చూశానని, గుడిలోనో, చర్చిలోనో, ఇంట్లోనో, అడవిలోనో, చూశానని కొందరు, కలలో చూశానని మరికొందరు నేడు చాలాచోట్ల సాక్ష్యమిచ్చుచున్నారు. ఇది వారెలా చెప్పగలుగుతు న్నారంటే వారి బోధకులు బోధించిన వాక్య ఆధారమే. ఆ బోధకులకు బైబిలే ఆధారమని చెబుతూ బైబిల్‌లో వున్న వచనాలనే చూపిస్తున్నారు. ప్రజలు కూడా గొర్రె కసాయివాడిని నమ్మినట్లు వారినే నమ్ముతూ మోసపోతూ తమ సమయాన్ని, ధనాన్ని, విశ్వాసాన్ని పోగొట్టుకొనుచున్నారు.

ఈ మధ్యనే బ్రతుకుదెరువు కోసం బైబిల్ చేతపట్టిన కొందరు బోధకులు నేను ప్రార్థన చేస్తుంటే దేవుడే మీ ఇల్లు చూపించాడు

అందుకే వచ్చానని చెప్పగానే ఆ అమాయకులు ఎగిరిగంతేస్తున్నారు గాని వాస్తవాన్ని గ్రహించడంలేదు. క్రీస్తుబోధలో మీ విశ్వాసాన్ని మీరే పరీక్షించుకోండి (2కొంరింథీ 13:5) అనే విషయాన్ని, మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూసుకొనండి (వ్రాయబడిన లేఖనాలలో మాత్రమే) (మార్కు 4:24) అనే అంశాలను గూర్చి ఎవరూ ఆలోచించడంలేదు, లేఖనాలలో వారు చెప్పేది ఉన్నా అవన్నీ అలాగున్నవో లేవోనని పరిశోధించడం లేదు (అపొ. కా. 17:10,11). ఇలా పరిశోధించి చెక్ చేయమని చెప్పేవారు వారు కూడా కరువయ్యారు.

పాతనిబంధనలో హానోకు దేవునితో నడిచాడని, మోషే, అబ్రాహాము, యాకోబు మొదలగువారు దేవున్ని ముఖాముఖిగా చూచారని బైబిల్‌లో ఉందని చాలా రెఫరెన్సులు చూపిస్తున్నారు. ఇంతకీ మీకు (మనకు) వారు చూపే వాక్యాలు అలాగున్నవో లేవో పరిశీలిద్దాం. మన మనోనేత్రములు వెలిగించుకొని, అనేకులను వెలుగులోనికి నడిపించి తప్పుడు బోధనలను, సాతాను తంత్రములను తరిమికొడుదాం. క్రీస్తు పూర్వమే మోషే దేవునితో దయచేసి నీ మహిమను అనగా రూపాన్ని కాదు కేవలము మహిమను మాత్రమే నాకు చూపమనగా దేవుడు చెప్పిన ఆయనతో దానిని చదివి ధ్యానిద్దాం.

“మరియు ఆయన – నీవు నా ముఖము చూడజాలవు. ఏనరుడును నన్ను చూసి బ్రతుకడనెను. మరియు యెహోవా – ఇదిగో నా సమీపమున ఒక స్థలమున్నది. నీవు బండమీద నిలువవలెను. నా మహిమ నిన్నుదాటి వెళ్ళుచుండగా ఆ బండ

సందులో నిన్ను వుంచి, నిన్ను దాటి వెళ్ళేవరకునా చేతితో నిన్ను కప్పెదను. నేను నా చెయ్యి తీసిన తర్వాత నా వెనక పార్శ్యమును చూచెదవుకాని, నా ముఖము నీకు కనబడదనెను" (నిర్గమ 33:18-23).

ఇక్కడ దేవుడు తన మాటలు వినిపిస్తూ, మనిషికి మనిషి భాషలో చెబితేనే అర్థం అవుతుంది గనుక నా ముఖం, నా చెయ్యి అని మాట్లాడుచున్నాడని గ్రహించాలి. ఆయన ఎప్పుడు అబద్ధము చెప్పలేదు, ఇక ముందు చెప్పబోడు. ఎందుకంటే ఆయన మనిషికాడు. అయితే అతి ప్రాముఖ్యమైన మాట ఏమిటంటే దేవునిని చూసిన ఏ నరుడు బ్రతుకడని చెప్పుచున్నాడు గనుక మోషే సినాయి పర్వతము మీద మండుతున్న పొదలో చూసినది దేవునిని కాదని గ్రహించాలని నూతన నిబంధనలో మనకు వివరంగా తెలియజేశాడు. "నలుబది ఏండ్లయిన పిమ్మట సినాయి పర్వతారణ్యమందు ఒక పొదలోని అగ్నిజ్వాలలో ఒక దేవదూత అతనికి అగపడెను" (అపొ.కా. 7:30-53) (మిగతావివరాలు దేవుని స్వరము ఎవరైనా విన్నారా? అనే అంశంలో ధ్యానిద్దాం).

కాబట్టి దేవుని ప్రజలారా మొదటి మానవుడైన ఆదాము మొదలుకొని నేటివరకు జీవించిన, జీవించుచున్న మరియు రాబోయే కాలంలో కూడా ఏ మానవుడు లేదా నరుడు దేవునిని చూసే అవకాశంలేదు. యాకోబు దేవుడిని చూసాడుగదా, దేవునితో పోరాడాడుగదా అని మరలా బైబిల్ (ఆది.కాం. 32:22-30) చూపించే అవకాశం ఉంది అందులో అతడు ఒక నరునితో, పోరాడుతున్నానని తెలియక దేవుడు అని భావించి పోరాడాడు.

దేవుడు కూడా అతని ఆలోచనను అక్కడ మాత్రమే కొద్దిసేపు బలపరిచాడు. అయితే 30వ వచనములో యాకోబు – నేను ముఖాముఖిగా దేవుని చూసితిని, అయినను నా ప్రాణము దక్కినదని ఆ స్థలమునకు పెనూయేలు అని పేరుపెట్టెను. యాకోబు బ్రతికాడు అంటే అతడు చూసినది, పోరాడినది, దేవుడు కాదని, అతనికి ప్రత్యక్షమైనది ఒక దేవదూత అని, ఆ దూత నరుడి రూపంలో కనిపించిందని అతడే (యాకోబు) మరోచోట చెప్పుచున్నాడు కావాలంటే చదువండి.

యాకోబు తన అవసానదశలో యోసేపును దీవించి – నా పితరులైన అబ్రాహాము, ఇస్సాకులు ఎవరియెదుట నడుచుచుండిరో ఆ దేవుడు, నేను పుట్టినది మొదలుకొని నేటివరకును ఎవడునన్ను పోషించెనో, ఆ దేవుడు, అనగా సమస్తమైన కీడులలోనుండి నన్ను తప్పించిన దూత ఈ పిల్లలను ఆశీర్వదించును గాక" (ఆది.కాం. 48:15,16). తల్లి గర్భమందు యాకోబు తన సహోదరునిమడిమెను పట్టుకొనెను, మగసిరికలవాడై అతడు దేవునితో పోరాడెను. అతడు దూతతో పోరాడి జయముపొందెను" (హోషేయ 12:3,4) అని తర్వాత కాలములో ప్రవక్తయైన హోషేయా ద్వారా చెప్పించాడు. ఇది మనందరికి బుద్ధి కలుగడానికి మాత్రమేనని మరువద్దు.

ఇకపోతే ఇప్పటి క్రైస్తవులు, అపొస్తలులు – ప్రవక్తలు అని తమకు తామే ప్రకటించుకొంటున్న తప్పుడు బోధకుల నమ్మకాలతోనే సమస్యఅంతా. వాళ్లకు అబ్రాహమే ఆనాటి ముఖ్యాధారం. ఎవరు చెప్పినా అబ్రాహామునకు దేవుడు కనబడ్డాడు గదా! అనియు, అక్కడ ఇద్దరు యెహోవాలున్నారనియూ అబ్రాహాముకు కనబడిన ముగ్గురు

వ్యక్తులు లేదా ముగ్గురు యెహోవాలు త్రిత్వ దేవుడికి సాదృశ్యమనియు తమ పుస్తకాలలో వ్రాసారు. ఆనాడు అక్కడ కూడా అబ్రహాము చూసింది, మాట్లాడింది దేవదూతలతోనేనని వివరంగా తర్వాత వ్రాసినా, మొదటి వచన్నాన్నే పట్టుకొని వేలాడుతున్నారు. దేవదూతలు దేవుని తరుపున డైరెక్టు స్పీచ్ (దేవుడే మాట్లాడినట్లుగా)లో మాట్లాడినారు. ఇది తెలియాలంటే పరిపూర్ణులైన వారికి దేవుని జ్ఞానాన్ని బోధించిన అపొస్తులుల బోధను చదివితే అబ్రాహాము తాను చూచిన ఆ ముగ్గురు వ్యక్తులు, లేక దేవదూతలని కూడా తెలియకయే వారికి ఆతిధ్యమిచ్చాడని, ఆ తర్వాత లోతు కూడా అలాగే ఆతిధ్యమిచ్చాడని హెబ్రీపత్రికలో వ్రాయించాడు దేవుడు (హెబ్రీ13:1,2).

మరియు పూర్వకాలమందు తన పిల్లలతో నానా సమయాలలో, నానా విధాలుగా మాట్లాడాడని గూడ అదే పత్రిక (హెబ్రీ 1:1,2)లో దేవుడే వ్రాయించాడు. ఒక దూత యెహోవా అనే పేరుతో అబ్రాహాముతో మాట్లాడినా, దేవుని పేరున, లేకా ఆయన పేరుతో బైబిల్‌లో చాలా మంది ప్రవక్తలు, దూతలు వచ్చారు. చాలా మంది పేర్లు 'ఏల్' అనే అక్షరంతో ముగించినవన్నీ దేవుని నామాలేనని మరచిపోకూడదు. ఇశ్రా'యేలు', దాని'యేలు', నతాని'యేలు', ఇంకా దూతలు మిఖా'యేల్', గాబ్రి'యేల్' ఇలా ఎన్నో చూపొచ్చు. ఆఖరున ఆయన కుమారుడైన క్రీస్తు కూడా తండ్రి నామముననే ఇమ్మానుయేలుగా మనదగ్గరకు వచ్చాడు. అదే ఇమ్మానుయేలు అనే పేరు యేసుకు పెట్టలేదు గదా! ఆయనను దేవుడైన యెహోవా పంపితే వచ్చి మనతో దేవుని సంగతులు

మాట్లాడాడు. అలా దేవుడు క్రీస్తు ద్వారా మనకు తోడై ఉన్నాడు. అంతెందుకు అపొస్తలుడైన పౌలు కూడా దేవుని సంకల్పమంతా పరిశుద్ధాత్మ ప్రేరణతో మనకు తెలియజేశాడు.

కాబట్టి యెహోవా అనే నామము దేవుడు మరొకరికి ఎప్పుడు ఇవ్వలేదు కాని ఆయన నామములో అనగా దేవుని పేరుననే అనగా ఆయన పంపితే వచ్చినవారని ఆలోచించి గ్రహించాలి. ఎవరైనా మన వద్దకు ఏదైనా పని నిమిత్తము వస్తే నేను ఫలానా అతని పేరు మీద అనో, ఫలానా వ్యక్తి అని అతని పేరు చెబుతారు గదా. అలాగుననే ఇది కూడా అంతే వచ్చిన ప్రతివారు దేవుడు కాదు. కావున అబ్రహాముతో మాట్లాడినవారు యెహోవా దేవుడు కాదు, కుమారుడైన యేసుక్రీస్తు కాదు, పరిశుద్ధాత్మ అంతకన్నా కాదు, ముగ్గురు, ముగ్గురు వేర్వేరు శక్తులకు వ్యక్తులకు సాదృశ్యమైతే కావచ్చును. కాని నిజంగా అబ్రాహాము దేవునిని చూస్తే బ్రతుకకూడదు గదా! కాని ఆ తర్వాత చాలా సం॥లు అబ్రాహాము బ్రతికినాడంటే ఆయన చూసింది దేవున్ని కాదనే ఆలోచనే వీరికి రావడంలేదు.

అబ్రాహాము చూసింది కేవలం ముగ్గురు దేవదూతలనని వారు మనుష్యుల రూపంలో వచ్చారని అర్థం చేసుకోలేకపోతున్నారు (ఆది.కాం 18,19 అధ్యాయాలు) జాగ్రత్తగా చదివితే ముందు ముగ్గురు, ఆ తర్వాత ఇద్దరు చివరగా ఒక్కడే మాట్లాడటం చాలించి వెళ్ళిపోతాడు. పాత నిబంధనలో వ్రాయబడిన అనేక సంగతులలో మర్మములున్నవని, వాటిని కొత్త నిబంధనలో దేవుడు ఆ మర్మాలను విప్పాడనే సంగతిని అర్థం చేసుకోలేకపోతున్నారు అమాయకులు.

సిలువ వేయబడిన క్రీస్తు బోధలోని అంతర్యాన్ని గ్రహించలేక పోవుచున్నారు. క్రీస్తు బోధలో ఏముందో ముందు చూద్దాం. అప్పుడైనా వారి మనోనేత్రములు వెలిగించబడుతాయని ఆశిద్దాం. అంతేగాని ఇది చాలా మర్మము, దీనిని మనం గ్రహించలేము చాలా చాలా మర్మము దీని జోలికి అస్సలు వెళ్ళకూడదు అని నోరు పారేసుకోకండి.

"మరియు ఆయన (క్రీస్తు) వారితో ఇట్లనెను – దీపము దీప స్తంభము మీదనుంచబడుటకే గాని కుంచము క్రిందనైనను నుంచబడుటకు తేబడదుగదా! రహస్యమేదైననూ, తేట పరచబడకపోదు, బయలుపరచుబడుటకే గాని యేదియు మరుగు చేయబడలేదు. వినుటకు చెవులెవనికైన నుండిన యెడలవాడు వినునుగాకనెను" (మార్కు 4:21–23, లూకా 16–17).

ఆనాటి పాతనిబంధన క్రింద ఉన్న వారికి మరుగుచేయ బడినది, మనకు విప్పబడినదే ఈ మర్మం లేదా విషయం అయినా మనం ఇంకా అర్థం చేసుకోలేకపోవుచున్నదే దేవునిని చూడటం అనే సమస్య. అందుకు యేసు ఆనాటి వారితోనూ, నేటికిని మనతోనూ మాట్లాడుచున్న మాటను చదువుదాం. దేవుని మనస్సును అర్థం చేసుకోవటానికి ఎరగటానిక ప్రయత్నిద్దాం. మన విశ్వాసంతో పాటు అనేకులను నిజమైన విశ్వాసంలో ఉంచుదాం.

యేసు "మీరు ఏకాలమందైనను ఆయన స్వరము వినలేదు. ఆయన (దేవుని) స్వరూపము చూడలేదు" (యోహాను 5:37).

"ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు. తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" (యోహాను 1:18).

దేవుని యొద్దనుండి వచ్చిన వాడు తప్ప మరియెడవును తండ్రిని చూసి యుండలేదు. ఈయనే తండ్రిని చూచియున్నవాడు” ‘యోహాను 6:46).

యేసు శరీరధారియై స్వయంగా వచ్చి బోధించే సమయానికి ముందున్న ఏ కాలములోనైనా, వారిలో ఎవ్వరూ, ఎప్పుడూ దేవుని స్వరూపము చూడలేదు, ఆయన స్వరాన్ని వినలేదు అంటే దాని భావం నేటికి అర్ధం చేసుకొనుట లేదు. దేవుని స్వరూపంలో వున్న నరుడిగా యేసుగూడా దేవునిని చూడలేదు (యోహాను 8:38) అని అర్థంగదా! అంటే వారిది ఆత్మస్వరూపం గనుక ఎవరూ చూడలేరు అని అర్థమగుచున్నది. ఇక పౌలుగారి ద్వారా సిలువ వేయబడిన క్రీస్తుబోధను ప్రకటించిన పరిశుద్ధాత్ముని బోధలో ఏముందో ఒకసారి పరిశీలిద్దాం.

“ఎట్లనగా - క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియపరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివినయెడల, దానిని బట్టి ఆ క్రీస్తు (వాక్యము) మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు. ఈ మర్మమిప్పుడు ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును, ప్రవక్తలకును బయలుపరచి యున్నట్టుగా పూర్వకాలములయందు మనుష్యులకు తెలియపరచ బడలేదు - దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును, అధికారుల కును, సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి, శోధింపశక్యము కాని క్రీస్తు

ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలమునుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన ఏర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును, పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అనుగ్రహించెను" (ఎఫెసీ 3:3–11).

పూర్వకాలములో ఉన్న మనుష్యులకు చెప్పనిది, యేసుగూడా శరీరధారియై తన సమకాలికులకు పూర్తిగా వివరించనిది అయినటువంటి మర్మములను కూడా సంపూర్ణ సువార్తలో, పూర్ణముగా ప్రకటించినవాడు పౌలుగారు. యేసు స్వయంగా చెప్పినా ఆయన వారు అనగా ఇశ్రాయేలీయులు కూడా ఆనాడు వినలేదు. వారినే కాదు నేడు వాటిని మనం చదివినా మనవారు అయినా ఇప్పటికి వినడంలేదు. అనగా అర్థం చేసుకోవడం లేదు. హానోకు, అబ్రాహాము, యాకోబు, మోషే వీళ్ళంతా మనుషులేకదా! ఆలోచించండి లేదా పరిశుద్ధాత్ముడు అన్యులైన మనందరితో అనగా సంఘముతో చెప్పిన సంగతులను చూద్దాం. పరలోకంలోని దూతలకు కూడా చెప్పని సంగతులన్నియు సిలువవేయబడిన క్రీస్తుబోధలో ఉన్నాయి. ఈ విషయంలో ఇశ్రాయేలీయులకన్నా, అన్యులలోనుండి క్రైస్తవులమైన మనమెంతో ధన్యులం కదా! ఎందుకంటే అందరికన్నా ఎక్కువ తెలిసింది మనకే సుమా!

అయితే సాతాను మాయలో అతి తెలివితోనో, లేకా అర్థం కాకనో యేసు బోధించిన మాటనే "హృదయ శుద్ధి గలవారు ధన్యులు వారు దేవునిని చూచెదరు" (మత్తయి 5:8) అనే వాక్యాన్ని గూడా చూపించే ప్రమాదముంది గనుక దానికి కూడా బైబిల్‌లో సమాధానం

ఉంది. తప్పు చేయకముందు ఆదాము, ఆ తర్వాత నోవాహు, అబ్రాహాము, ప్రవక్తలు, యేసు, అపొస్తలులు ఇలా అపొ.కా. 7వ అధ్యాయము, హెబ్రీ పత్రిక 11వ అధ్యాయంలో చెప్పబడిన అందరూ హృదయ శుద్ధికలవారే కదా. వారు కూడా మానవులే కదా. మరి వారు కూడా చూడలేదు అన్నాడంటే పై వాక్యాన్ని చాలా జాగ్రత్తగా చదివి ఆలోచిస్తే అక్కడ "చూచెదరు" అని ఉంది. అంటే బ్రతికి ఉన్నప్పుడు కళ్ళతో కాదు అని అర్థం. ఆలోచనలో, ఆత్మ నేత్రములతో మాత్రమే చూస్తారని గ్రహించాలి. లేదా చనిపోయాకనే. హృదయ శుద్ధి కలిగి బ్రతికిన వారుఆ తర్వాత మాత్రమే చూస్తారని ఆ బోధ (వాక్యములోని) సారాంశము. కాదంటే నూతన నిబంధనలోని క్రీస్తు, సిలువ వేయబడిన క్రీస్తు బోధ, అనగా అపొస్తలుల బోధ అయినా తప్పు అయి తీరాలి. వారు తప్పుచెప్పే అవకాశం లేదు ఎందుకంటే వారితో పలికించింది దేవుడు గదా!

"శ్రీమంతుడును, అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్తకాలము లయందు ఆ ప్రత్యక్షతను కనపరుచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువైయున్నాడు. సమీపించరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచూ అమరత్వముగలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు ఆయనకు ఘనతయు, శాశ్వతమైన ప్రభావమును కలిగియుండును గాక. ఆమేన్ (1తిమోతి 6:15,16).

"ఏ మానవుడు, దేవుని ఎప్పుడు చూచియుండలేదు..." (1యోహాను 4:12,20).

పైన చెప్పిన సంపూర్ణ సత్యసువార్తలో ఏ మానవుడు, ఎప్పుడైనను దేవునిని చూడలేదు అని దేవుడే చెప్పుచున్నాడు. అనగా క్రీ॥పూ॥లో గాని క్రీ॥శ॥లో గాని, కలలో గాని ఇలలో గాని ఎప్పుడైనను దేవునిని నరుడుగా జీవించిన ఏ మానవుడు చూడలేదు. ఇక చూడబోడు అని ఖచ్చితంగా వ్రాయించాడు గాదా! ఎవరూ సమీపించలేని తేజస్సు అనగా వెలుగులో ఆయన మాత్రమే ఉంటున్నాడు. దేవలోకంలో ఆయనకు నిత్యము సేవచేస్తూ పొగడుతూ ఉండే దేవదూతలు కూడా తమ రెండు కాళ్ళతో తమ ముఖాన్ని కప్పుకున్నాయి. అంటే వారు కూడా చూడలేని తేజస్సులో ఆయన ఉన్నాడు (యెషయా 6:1–3). ఆయన తన ప్రత్యక్షతను యుక్త కాలములో కనపరుస్తాను అంటున్నాడంటే మనం అందరం ఎత్తబడి నప్పుడు మాత్రమే దేవుడెలా ఉంటాడో చూస్తామే తప్ప ఈ లోకంలో మనిషిగా మట్టి శరీరంలో జీవించినంత కాలము ఎప్పుడు, ఎక్కడా, ఎలాగైనా కూడా దేవున్ని చూడలేము. ఇది పరిశుద్ధాత్మ చేత దేవుడు ప్రవక్తల ద్వారా అపొస్తలుల ద్వారా వ్రాయించిన అక్షర సత్యం. అందుకే ఎప్పటికైనా మనిషి కేవలం దేవునిని యెరుగాలే తప్ప చూస్తానని అనకూడదు.

ఇప్పుడు యేసుక్రీస్తును కూడా యెరుగాలి అనగా ఆయన ఎవరో, ఆయన తండ్రియైన దేవుడు ఎవరు తెలుసుకొని, గ్రహించాలి (యోహాను 14:8–11). మరో అద్భుతమైన విషయం ఏమిటంటే తండ్రియైన దేవుని అదృశ్యస్వరూపియై ఉన్నాడని చెప్పబడిన క్రీస్తుయేసు నరుడిగా భూలోకంలో జీవించిన కాలములో గూడా ఎప్పుడు కూడా దేవునిని చూడలేదు. ఎందుకంటే నరుడెవడు చూసే

వీలులేదు, చూస్తే బ్రతుకడానికి వీలులేదుగనుక క్రీస్తు ఈ భూమిమీదకొచ్చిన తరువాత నరుడే అయ్యాడు. ఆయనను గూర్చి అనేకచోట్ల మనుష్యుడు, మనుష్యకుమారుడు అని వ్రాయబడింది. ఆయన కూడా మనలాగా దేవునికి ప్రార్థనలను, యాచనలను సమర్పించాడని (హెబ్రీ 5:4) చెప్పబడింది. క్రీస్తే ఒకచోట ఏమిచెప్పుచున్నాడో జాగ్రత్తగా బైబిల్‌లోని వాక్యాన్ని చదివి గ్రహిద్దాం.

"నేను నా తండ్రియొద్ద చూసిన సంగతులే బోధించుచున్నాను" (యోహాను 8:38).

"దేవుని యొద్దనుండి వచ్చినవాడు తప్ప మరియెవడును తండ్రిని చూచియుండలేదు" (యోహాను 6:46).

క్రీస్తు వాక్యమైన దేవుడుగా దేవుని యొద్ద ఉన్నప్పుడు మాత్రమే ఆయనను చూచియున్నాడని లేఖనము చెప్పుచున్నది. దివి నుండి భూమికి రాకముందే చూచియున్నాడు గనుక, నా తండ్రి యొద్ద చూచిన సంగతులు అని అన్నాడేగాని ఇప్పుడు కూడా చూచుచున్న సంగతులు అని అనలేదు". అయితే (స్తెఫెను) అతడు పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై ఆకాశమువైపు తేరిచూచి, దేవుని మహిమను యేసు దేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుటయుచూచి – ఆకాశము తెరువబడుటయు చూచుచున్నానని చెప్పెను" (అపొ.కా. 7:55–58). ఇక్కడ స్తెఫెను చూచింది కూడా దేవుని మహిమను మాత్రమే అని చెప్పబడింది. అయినా అతడు వెంటనే చనిపోయాడు కూడా. ఇకనైనా వాక్యప్రకారంగా జాగ్రత్తగా ఆలోచించండి.

కావున నేడు ఎవడైనను ఎప్పుడైనను నేను దేవునిని చూశాను అని లేక ఆయన మహిమను చూశాననో చెబితే మనం

నమ్మకూడదు. దేవున్ని చూసిన వాడు బ్రతికాడు అంటే అతడు చూసింది అసలైన దేవుడిని కాదు. తమ బోధకుల బోధనుబట్టియు, దేవుడు నాకు కనబడి తీరాలి అని మనస్సులో పదేపదే అనుకొని, దేవుడి పేరుమీద వేసిన ఫొటోనో, క్యాలెండరులో ఉన్న బొమ్మనో మనస్సులో ముద్రించుకొన్న వారికి, కలలో ఒక తెల్లని బట్టలు ధరించిన వ్యక్తి కనిపించి మాట్లాడుతాడు. అలా దేవుడే కనబడి మాట్లాడాడు అనుకొని భ్రమపడి అమాయకంగా సాక్ష్యము చెప్పుచున్నారు చాలామంది. ఏ మానవుడు, ఎప్పుడైనను అన్నాడంటే బ్రతికియున్న కాలంలో గాని, దర్శనంలో గాని ఎలాగైనా దేవునిని చూసే అవకాశంలేదు. ఎందుకంటే ఆయన ఆత్మ గనుక, ఆయనకు ఏ రూపంలేదు గనుక, బ్రతుకనేర్చి, బైబిల్ చేతపట్టుకొని మనిషి బలహీనతను సొమ్ముచేసుకోవడానికి ఈ దొంగ భక్తులు ఆడుతున్న నాటకమే ఈ దైవదర్శనం కార్యక్రమాలు. దేవుని పిల్లలారా వీరిని గూర్చి జాగ్రత్తపడుడి.

ఎవరు ఏది చెప్పినా, గుడ్డిగా నమ్మక, చంచల మనస్కులు కాక, విశ్వాసమందే నిలకడగా ఉండండి. మోసపోకుడి, మిమ్మును మోసం చేయాలని ప్రయత్నము చేసే వారిని కనిపెట్టుకొని యుండుడి. వారి కొరకు నరకము భద్రము చేయబడిఉన్నది. వారి లక్షణాలను యూదా పత్రికలో వ్రాసాడు చదవండి (యూదా 10-19). కాబట్టి నేను దేవున్ని చూశాను అని చెప్పిన ఏ నరుడిని నమ్మకండి. వారు చెబుతున్నది మన బైబిల్‌లో ఉన్నదో లేదో పరీక్షించండి.

# 17 దేవునితో ఎవరైనా ఎప్పుడైనా మాట్లాడారా?

**దేవునిని** ఎవరు చూడలేదు అనే సంగతి పూర్తిగా అర్థమయింది అనుకుంటున్నాను గనుక ఇక ఆయనతోఎవరైనా మాట్లాడారా? అని కూడా ఓసారి ఆలోచిద్దాం. ఎందుకంటే ఎప్పుడు ఆయనను ఈ కళ్ళతో చూసే భాగ్యం ఎలాగు లేదు అని తెలుసుకొన్న కొందరు మోసగాళ్ళు దేవునితో ముఖాముఖిగా ఇప్పుడే మాట్లాడివస్తున్నాను అని చెప్పడం వింటున్నాం. దేవుడే దర్శనంలో మీ ఇల్లు లేదా సంఘం (చర్చి) చూపించాడు, మీ దగ్గరికి వెళ్ళమని స్వయంగా నాతో చెబితేనేవచ్చాను అని అనేకులను, బోధకులనబడిన వారు అనేకులు నమ్మించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలా మోసపోయిన, పోతున్నవారిని చూసే ఈ సంగతిని వాక్యానుసారంగా అందరికి రుజువు చేయాలని లేఖనాలను పరిశీలించి పరిశోధించి మీకు వ్రాయుచున్నాను. ఎందుకనంగా ఇప్పుడు మనకు వాక్యమే దిక్కు (అపో.కా. 20:24-32) ఇప్పుడు ఎవరి సాక్ష్యము, అనుభవం, ప్రత్యక్షతలు మనకు వద్దు. ఒకవేళ ఎవరి సాక్ష్యాన్ని తీసుకోవాలంటే దానికి ఇద్దరు లేక ముగ్గురి సాక్ష్యము కావాలి. అందుకే బైబిల్ సాక్ష్యము గొప్పది అంటాను.

వారికిచ్చిన పుస్తకాల లేక గ్రంథాలలో వ్రాయబడిన మాటలు మరుగుచేయబడి నాటి ఇశ్రాయేలీయులు వాక్యానుసారంగా దేవునిని ఎరుగలేక, చదివి గ్రహించలేక ఆనాడు దేవుని కుమారున్ని సిలువవేశారు. ప్రారంభ సంఘానికి తెలియజేయబడి ఇప్పుడు మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడిన (రోమా 15:4; 1కొరింథీ 10:11) వాటిని కూడా చదివి, ఆలోచించి గ్రహించే ఓపిక లేని నేటి క్రైస్తవులు అనేకులు క్రీస్తును మరలా సిలువ వేయుచున్నారు. అంతా పాతనిబంధను ఆధారం చేసుకొని మాట్లాడుతున్నారే గాని కొత్తనిబంధనను గూర్చి ఆలోచించడంలేదు. ఈనాడు 90% బోధకులు పాతనిబంధనలోని వాక్యాలతోనే ప్రసంగాలు ప్రారంభిస్తారే తప్ప నూతన నిబంధనలోని వాక్యాలతో ప్రారంభించే వారు చాలా తక్కువ. దేవునితో మాట్లాడటం అనగానే ముందుగా మనకు గుర్తుకువచ్చేది మోషేనే గనుక ఆయనతోనే ప్రారంభిద్దాం. ఆ తర్వాత అబ్రాహాము మరియు ప్రవక్తలతో మాట్లాడిన విధానం గురించి ఆలోచిద్దాం.

“అప్పుడు మోషే– ఆ పొదయేల కాలిపోలేదో నేను ఆ తట్టు వెళ్ళి ఈ గొప్పవింత చూచెదననుకొనెను. దానిని చూచుటకు అతడు ఆ తట్టు వచ్చుట యెహోవా చూచెను. దేవుడు ఆ పొద నడుమనుండి – మోషే, మోషే అని అతనిని పిలిచెను. అందుకతడు చిత్తము ప్రభువా అనెను. అందుకాయన దగ్గరకురావద్దు, నీ పాదములనుండి నీ చెప్పులు విడువుము. నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము అనెను. మరియు ఆయన – నేను నీ తండ్రి దేవుడను, అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడను అని చెప్పగా

మోషే తన ముఖము కప్పుకొని దేవునివైపు చూడవెరచెను…" (నిర్గమా 3వ అధ్యాయము).

"మనుష్యుడు తన స్నేహితునితో మాటలాడునట్లు యెహోవా మోషేతో ముఖాముఖిగా మాటలాడుచుండెను. తరువాత అతడు పాళెములోనికి తిరిగి వచ్చుచుండెను" (నిర్గమా 33:11).

పైన కేవలం రెండు వాక్యాలను మాత్రమే ఉదాహరణగా చూపాను గాని నిర్గమాకాండం నుండి ద్వితియోపదేశకాండము వరకు దేవుడు మోషేతో ముఖాముఖిగా మాట్లాడినట్లుగా ఎన్నోసార్లు వ్రాయబడియున్నది. మనకు కొత్త నిబంధనలో దీని సంగతి వివరించకపోయి ఉంటే వీటిని నూటికి నూరుశాతం ఉన్నది ఉన్నట్లుగా నమ్మితీరాల్సిందే కాని యేసుప్రభువు బోధనలో ఇశ్రాయేలీయులతోను, మన అందరితోను మాట్లాడిని మాటలను ఆధారం చేసుకోగానే "మీరు ఏ కాలమందైననూ ఆయన స్వరము వినలేదు, ఆయన స్వరూపము చూడలేదు" (యోహాను 5:37), మరియు ఈనాడు నాతో దేవుడు మాట్లాడాడు, నీతో కూడా మాట్లాడాడా?, నీకు పిలుపొచ్చిందా? పిలుపు లేకుండా దేవని సేవకు ఎలా వచ్చావని అనేకులను నిలదీస్తున్నారు కొందరు అబద్ద బోధకులు.

ఆయన స్వరం నీకు ఎప్పుడైనా, ఏ విధంగానైనా వినిపించిందా! అని అనేకులు ఎంతో మందిని ప్రశ్నించుచున్నందులకే ఈ విషయాన్ని మరలా వ్రాయుచున్నాను. పిలుపు అనగా దేవుని స్వరము తమ చెవిలో వినబడలేదని ఎంతోమంది తమ మనస్సులో సేవ చేయాలని ఆశ ఉన్నా ఆగిపోతున్నారు. కొందరు స్వరము

విన్నామనుకొని మంచి ఉద్యోగాలు వదులుకొని, ఆ తర్వాత రోడ్డునపడి ఎవడు డబ్బులిస్తే వాడి పాట పాడాలని తిరుగుతున్నారు. వీరి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. కొందరే విదేశీ ధనంతో ఆనందిస్తు అది దేవుని ఆశీర్వాదమని భ్రమపడుతున్నారు. ఈ విషయమై నిజంగా దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము. అందుకే జాగ్రత్తగా మీరేమి చదువుతున్నారో వాక్యముతో సరిచూచుకోండి.

నిర్గమాకాండము 19వ అధ్యాయములో అనగా 10 ఆజ్ఞలనిచ్చేముందు ఇశ్రాయేలీయుల పెద్దలతోను, మోషేతో మాట్లాడినప్పుడు ఆయన స్వరము భూరధ్వనిలాంటిదని, ఆ స్వరము విని వారు వణికారని చెప్పబడింది. అలాగే మిగతా ప్రవక్తలు యిర్మీయా, యెహెజ్కేలు మొదలగువారు వ్రాసిన గ్రంథాలలో ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా– అని వ్రాసి మళ్ళీ నేను యెహోవాను, మీ పితరుల దేవుడను అని వ్రాసినట్లు గమనించగలరు. ఇవన్నీ గమనిస్తే దేవుడు మూడవ వ్యక్తిగా ఉండి ప్రవక్తల ద్వారా, లేదా మరొకరి ద్వారా మాట్లాడినట్లు గమనించగలము. కాబట్టి సిలువవేయబడిన క్రీస్తుబోధలో దీనికి సాక్ష్యముగా మనకు ఒక వాక్యము కనిపించింది.

"పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాట్లాడెను" (హెబ్రీ 1:1,2).

ఇక్కడ దేవుడు నానావిధముల ద్వారానే మనుషులతో మాట్లాడాడు గాని డైరెక్ట్‌గా ఎవరితోను మాట్లాడలేదని అర్థమగు

చున్నది. మరియు ఆయన కుమారుడైన క్రీస్తు ద్వారా మనందరితో మాట్లాడెను అనే మాటనుబట్టి ఈ కాలములో ఎవరితోను, ఏ విధముగానైనను మాట్లాడే అవకాశములేదని అర్థమగుచున్నది. ఎందుకంటే క్రీ.పూ. యెషయా ప్రవక్త ద్వారా ఆనాటి మనుష్యులతోనే చెప్పాడు "యెహోవా మీకు దొరుకుకాలమందు ఆయనను వెదుకుడి" (యెషయా 55:6). కాబట్టి ఈ కాలంలో దేవుడు ఎవ్వరికి దొరికే అవకాశం లేదు. ఆయన మనతో డైరెక్టుగా మాట్లాడే అవకాశమే లేదని గ్రహించి తీరాలి. అనగా నూతన నిబంధనలో గూడా క్రీస్తుద్వారా, అపొస్తలుల ద్వారా మనందరికి కావాల్సిన వాటిని మాటలాడేసాడు అని గ్రహించినప్పుడు ఎలాంటి స్వరాన్ని కూడా ఈ కాలములో ఎవ్వరూ వినే అవకాశంలేదు.

బైబిల్‌లోని వాక్యము చదువుకొన్నప్పుడే క్రీస్తు ద్వారా దేవుడు మనతో మాటలాడుచున్నాడని గ్రహించాలి. చాలామంది అర్థము చేసుకొని ప్రసంగించినట్లు మోషేకు (దేవుడు) ధర్మశాస్త్రాన్ని ముఖా ముఖిగా మాట్లాడి ఇవ్వలేదు. అది మధ్యవర్తి ద్వారా అనగా దేవుని సేవకులైన దూతల ద్వారా ఇవ్వబడినదని మరోచోట వ్రాయబడింది. స్తెఫెను పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై తనను చంపడానికొచ్చిన దుర్మార్గులైన యూదులతో మాట్లాడిన మాటలలో చూస్తే ఈ విషయం పూర్తిగా అర్థం అవుతుంది.

"నలువది ఏండ్లయిన పిమ్మట సీనాయి పర్వతారణ్యమందు ఒక పొదలోని అగ్నిజ్వాలలో ఒక దేవదూత అతనికి కనబడెను... నేను నీ పితరుల దేవుడను, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడను అని ప్రభువు వాక్కు వినబడెను... మోషేకు అతనికి పొదలో

కనబడిన దేవదూత ద్వారా దేవుడు అధికారిగాను, విమోచకునిగాను నియమించిపంపెను... సీనాయి పర్వతము మీద తనతో మాటలాడిన దేవదూతతోనూ మన పితరులతోను అరణ్యములోని సంఘమందు ఉండి మనికిచ్చుటకు జీవవాక్యములను తీసుకొనిన వాడితడే... దేవదూతల ద్వారా నియమింపబడిన ధర్మశాస్త్రమును మీరు పొందితిరిగాని దానిని గైకొనలేదని చెప్పెను'' (అపొ.కా. 7:30-44,53).

"అలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో, ఆ సంతానము వచ్చువకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను అది మధ్యవర్తిచేత దేవదూతల ద్వారా నియమింపబడెను" (గలతీ 3:19).

"ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమము అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా, ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసిన యెడల ఎలాగు తప్పించుకొందుము" (హెబ్రీ 2:2-4).

పైన చెప్పబడిన లేఖనాల ద్వారా మనకర్థమయినదేమంటే దేవుడు మోషేతో మాట్లాడినప్పుడు దేవునికి మోషేకు మధ్యన దేవదూత ఉండి దేవుని మాటలను మోషే భాషలోనికి (హిబ్రూ) డైరెక్టుస్పీచ్‌లో తర్జుమా చేశాడని గ్రహించితీరాలి. ఎందుకంటే దేవుని పర్వతముపై మోషేకు పొదలో దూత కనబడితే ఆ దూత నేను నీ పితరుల దేవుడను అని అంత ధైర్యముగా, డైరెక్టుగా ఎలా అనగలిగిందో ఆలోచించాలి. నాడు భయంకరమైన మనస్థత్వము (1తిమోతి 1:8-11) గల ఇశ్రాయేలీయులకు వాటిని దేవుని

మాటలుగానే పరిచయం చేసిన దేవుడు ఆ తర్వాత కాలంలో మనకైతే దానిలోని మర్మాన్ని పూర్తిగా విప్పాడు (1కొరింథీ 2:1-16). అలాగే అని ప్రవక్తల గ్రంథాలలోని యెహోవా వాక్కులను పరిశీలించినా అర్థం అయిపోతుంది.

అదెలాగంటే ఈ రోజుల్లో మనం స్వాతంత్ర్య దినోత్సవం నాడుగాని, రిపబ్లిక్ డే నాడుగాని మన దేశప్రధాని గాని, అధ్యక్షులు గాని, రేడియో, టెలివిజన్‌లో ప్రసంగించడం వింటున్నాం, చూస్తున్నాం. ఆ పదవిలో ఉన్నవారు వారి భాషలో గాని, జాతీయ భాషలో గాని మాట్లాడుతారు. వెంటనే వాటిని ఏ రాష్ట్రంలోని వారు, వారి రాష్ట్రంలోని మాతృ భాషలోనికి అనువాదం చేసి తిరిగి ప్రసారం చేస్తారు. ఇక్కడ అనువాద ప్రసంగీకులైన టెలివిజన్ / రేడియో వ్యాఖ్యాతలు, ముందుగా మన ప్రధాని, రాష్ట్రపతి ఏమన్నారంటే అని ఆరంభించి, మా / నా ప్రభుత్వంలో ఇది చేశాము, తర్వాత అదిచేస్తాం అని మాట్లాడతారు. మాట్లాడేది వ్యాఖ్యాత అయినా డైరెక్ట్‌స్పీచ్‌లో నేను అనే పదం చాలాసార్లు వాడుతారు. గతంలో ఇలా కొన్ని రోజులు ఇలాగే ప్రసారాలు ఉండేవి అని జ్ఞాపకం చేసుకోండి. ఇప్పుడైతే వారు మాట్లాడుతున్నప్పుడే ప్రాంతీయ భాషలో సబ్-టైటిల్స్ వేస్తున్నారు.

ఇక్కడ క్రీస్తు కాలంలోనే అనగా మొదటి శతాబ్దములోనే జరిగిన ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. అన్యజనుల కోసం గట్టివాడు, విద్యావంతుడైన పౌలును పట్టుకొనేటప్పుడు కూడా యేసుక్రీస్తు కనిపించి స్వయంగా పౌలుతో మాట్లాడలేదు (అపొ.కా. 9:3-9, 22:5-10). అలాగే తనకత్యంత ప్రియుడు, తన రొమ్మున

ఆనుకొన్న శిష్యుడైన యోహానుకు పత్మాసు ద్వీపములో ప్రకటనను / ప్రత్యక్షతను అనుగ్రహించిన యేసు తన దూత ద్వారానే మాట్లాడి, ప్రకటన గ్రంథాన్ని ప్రత్యక్షపరిచాడు (ప్రకటన 1:1,2). చూశారా చనిపోయి తిరిగిలేచాకా, యేసు దేవుని కుడిపార్శ్యమున కూర్చున్న తర్వాత క్రీస్తు రెండవ రాకడ వరకు ఆయనను కూడా చూసే అవకాశంగాని, ఆయన స్వరాన్ని కూడా వినే అదృష్టంగాని మనకు లేదు. ఈ రోజు క్రీస్తు మనతో మాట్లాడాలన్నా బైబిల్‌లో ఉన్న వాక్యాల ద్వారానే మాట్లాడాలి. కావున నా ప్రియ అమాయక, అంధ విశ్వాసుల్లారా మరోసారి ఆలోచించండి, మోసపోకుడి.

అప్పుడు దేవదూతలు గూడా ఇదే విధానిన్ని కొనసాగించారని అర్థమవుచున్నది. పూర్వకాలములో రాజులు తమ ఆజ్ఞలను తమ దేశంలోని ప్రజలందరికి ప్రకటించేటప్పుడు వార్తాహరులు డప్పులతోనో, బూరలతోనో శబ్దముచేసి అందరిని ఒకచోట చేర్చి మన దేశరాజు గారు తన ప్రజలకు ఇలా సెలవిస్తున్నారహో అని చెప్పి, "నా ప్రజల సుఖశాంతుల కోసం, మేలుల కోసం నేను ఎన్నో సంక్షేమకార్యక్రమాలను చేయబోతున్నాను అని ఆతాఖీదులో (ఆర్డర్) ఉన్నది ఉన్నట్లు చదివి వినిపించి" చివరగా ఇదే రాజుగారి ఆజ్ఞఓహో! అని చెప్పడం చూస్తాం. ఇదే విధానం బైబిల్‌లో యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు మొదలగు ప్రవక్తలు కూడా ప్రభువగు యెహోవా సెలవిచ్చినదేమనగా అని ప్రవచనం చెప్పడం ప్రారంభించి ఇదే యెహోవా వాక్కు అని చివరలో ముగించడం చూస్తాము. ఇలా దేవుడు ప్రవక్తల ద్వారా ఆనాటి ప్రజలతో దూతల ద్వారా మాట్లాడాడు. ప్రవక్తలతో నరపుత్రుడా ప్రవచనమెత్తి ఇలా ప్రకటించుమని ప్రతిసారి దేవదూతల చేత ప్రవక్తలతో మాట్లాడాడు.

చాలాసార్లు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపించి మాట్లాడించాడు. ఇలా దేవుడు ప్రవక్తల ద్వారా ఆనాటి ప్రజలతో తనకు నచ్చినట్లు మరియు మనకు అర్థమయ్యేటట్లుగా మాట్లాడాడు. అదే నానా విధాలుగా మాట్లాడటం అంటే. (హెబ్రీ 1:1,2)

కాబట్టి ఆదికాండంలో అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో మాట్లాడినది కూడా దేవదూతల ద్వారానే అని ఇప్పుడు మనందరం గ్రహించాలి. వారు చూసింది, యాకోబు పోట్లాడింది దేవదూతతోనే అని ముందే తెలుసుకొన్నాం గనుక ఇప్పుడు వారు మాట్లాడినది కూడా దేవదూతలతోనే అని ఆలోచించి అర్థం చేసుకోవాలి. దీనిని బట్టి ప్రారంభమానవుడైన ఆదాముతో గూడా దేవుడు డైరెక్టుగా కాక దేవదూతల ద్వారా మాట్లాడాడని అర్థమగుచున్నది. ఏ నరుని కన్ను ఆయనను చూడలేదు. ఏ నరుని మాంసయుక్తమైన (చెవి) కర్ణభేరి ఆయన స్వరాన్ని డైరెక్టుగా లేక స్వయానా వినలేదు అని దేవుడు చెప్పాడని అర్థం చేసుకొని దాని ప్రకారం ప్రవర్తించువారు ధన్యులు అని చెప్పవచ్చు. కాని ఈ మధ్యకాలంఓ అపొస్తలులు కాకయే అపొస్తలుడనని చెప్పుకొనే కొందరు దేవుడు నాకు చెవిలో చెబితేనే, ఆయన స్వరం వినే నేను పుస్తకాలు వ్రాస్తున్నాను అని చెబుతున్నారు. ఇదెంతవరకు సత్మమో మీరే ఆలోచించండి.

కాలాన్ని బట్టి, సందర్భాన్నిబట్టి వాక్యాన్ని చదివి గ్రహించలేని విద్యావిహీనులు వాక్యాలను తమ శరీర దురాశల అవసరాలకోసం, మరియు స్వకీయ నాశనం కోసం వాడుకొంటు అటు దేవునిని, ఇటు దేవుని కుమారులను మోసగించుచున్నారు. మంచి సంఘాన్ని (అనగా బాగా డబ్బున్న సంఘాన్ని అని ఈ కాలంలో అర్థం) ముందే

చూసుకొని తమ బ్రతుకుదెరువు కోసం బైబిల్‌ను చేతబట్టి నాతో దేవుడు మాట్లాడాడు, రాత్రి దర్శనంలో దేవుడుకనబడ్డాడు, మీ దగ్గరకే వెళ్ళమని చూపించాడు అని చెప్పేవారు ఎక్కువగా మన మధ్యన తిరుగుతున్నారు. నాకు దేవుడు కనబడ్డాడు అని చెప్పినవాడు ఏ కాలంలోనైనా అనగా రాత్రి–పగలు, కలలో–ఇలలో ఎప్పుడైనా, బ్రతికి ఉండటానికి వీలులేదు. బ్రతికి వచ్చిమనకు సాక్ష్యం చెబుతున్నాడంటే వాడే నంబర్‌వన్ దొంగ అని గ్రహించండి. ఎందుకంటే అతనికి దేవుడు కనబడి మాట్లాడినదానికి సాక్షులు కావాలి. అలా ఇంతవరకు ఎవరికి లేరు, ఉండరు కూడా.

ఎవడైనా మీ ఇంటికొచ్చి "బ్రదర్ దేవుడు రాత్రి నా కలలో కొచ్చి నడిచి సేవచెయ్యడం భారంగా వుంది గనుక మీరు స్కూటర్ కొనిస్తారని దేవుడు నాతో చెప్పాడని మీతో చెప్పాడనుకోండి" మీరేం చేయాలో తెలుసా? మంచిదిబ్రదర్, దేవునికి స్తోత్రము "ఆయన మాకు కూడా కనీసం కలలోనైనా కనబడి మీకు స్కూటర్ కొనియిమ్మని చెబితే" తప్పక కొనిస్తాం అని చెప్పాలి. అప్పుడు గాని ఈ మాయ బోధకుల ఆటలు కట్టించలేము. వారు కూడా మరోసారి తమ విశ్వాసాన్ని, అనగా దర్శనాలను లేదా ఆత్మ రోగాలను సరిచేసుకొని తీరుతారు. మరియు ముందు ముందు మరొకరిని అడుగటానికి భయపడుతారు. ఇలా చేస్తే దేవునికి భయపడ్డట్లే గాని, దేవున్ని ఎదిరించినట్లు కాదని గమనించండి. (యాకోబు 4:7,8) పైగా అపవాదిని ఎదిరించినట్లే అవుతుంది గదా!

మరో విషయం ఏంటంటే చాలాసార్లు, చాలామందికి చెవిలో కొన్ని మాటలు వినిపిస్తుంటాయిగదా వాటి సంగతేంటి? అని మీరు

అడుగవచ్చు. నిజంగా శబ్దాలు, అడ లేక మగ ఎదో ఓ స్వరం లేదా మాటలు వినిపిస్తాయి కాని అవి దేవుడి మాటలో, దయ్యపుమాటలో కాదు మీ మెదడులో కలిగిన రసాయన క్రియలు లేక ప్రకంపనలే అలా శబ్దాలుగా వినపడి ఒక్కోసారి బయటకు నడు, బయలుదేరు అని ఆజ్ఞాపించినట్లుగా కూడా ఉంటాయి కూడా. వాటిని ఈనాడు శాస్త్ర భాషలో 'స్క్రిజోఫోనియా' అనే వ్యాధిగా పిలుస్తున్నారు. ఈ రోగానికి మందులు, వైద్యం ఈనాడు లోకంలో ఉన్నవి. ఈ మాటలు లేక శబ్దాలు తప్పకుండా కొందరి చెవులలో వినబడతాయి, వినబడకుండా ఎవరు అబద్ధం చెప్పరు కాని అది దేవుని స్వరంకాదని, దయ్యాల స్వరం కూడా కాదని దేవుని వాక్యానికి సాక్షిగా ఈరోజు వైద్యులు, శాస్త్రవేత్తలు, కూడా రుజువుచేస్తున్నారంటే అబద్ధ బోధకుల ఆటకట్టించడానికేనని తెలుస్తుంది. ఇందుకు దేనికి స్తోత్రములు.

ఈలాంటి రోగంతో బాధపడుతున్న వ్యక్తిని ఎంతో మంది పాస్టర్లు తమ ప్రార్థనల చేత బాగు చేయలేకపోయారు, బైబిళ్ళతో కొట్టినా ఆరోగం పోలేదు. మంత్రగాళ్ళు వేపాకులతో, నిమ్మకాయలతో కూడా ఎవరూ పోగొట్టలేదు. నేను కేవలము మాటలతోనే మందులు లేకుండానే ఒక వ్యక్తిని బాగు చేశాను. అతను ఖమ్మం జిల్లా, ఇల్లందు అనే పట్టణంలో ఇప్పటికి ఉన్నాడు. కావాలంటే సాక్ష్యము (అతనితోపాటు కొందరిని) చూపించగలను కాబట్టి చెవులలో వినబడుతున్న మాటలను దేవుని స్వరం అని గాని, లేకా దయ్యపు స్వరం అని గాని మోసపోకుండా మంచి సైక్రియాటిస్ట్‌ను కలిసి ఈ వ్యాధిని నయంచేసుకోండి. భూతవైద్యులను గాని క్రైస్తవ బాబాలను గాని మరే బాబాలను గాని అస్సలు నమ్మకండి.

ఇది చవినాక తెలివిగా నాకు దేవుడు కాదు దేవదూతనే కనిపించి దేవుని తరుపున మాట్లాడింది అని కూడా అతి తెలివిగా చెప్పేవారు బయలుదేరతారనుకోండి అప్పుడేం చేస్తారో చెప్పండి. ఎందుకంటే సాతాను, వాడి అనుచరులు ఎన్నో మార్గాలను వెతుక్కొని మోసం చేసే అవకాశం ఉన్నది గదా. దీనిని గూడాముందే ఎరిగిన దేవుడు మనల్నిముందే హెచ్చరించాడు. "మేము మీకు ప్రకటించిన సువార్తనుగాక మరియొక సువార్తను, మేమైనను పరలోకం నుండి వచ్చిన యొక దూతయైనను ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:6–9) పై వాక్యమును బట్టి బైబిల్ అనగా వాక్యము స్థిరపరచబడిన తర్వాత (హెబ్రీ 2:1–4; రోమా 1:1–7; మార్కు 16:20) ఏ దేవదూత భూమిమీదకు రావడానికి వీలులేదు. మనతో మాట్లాడటానికి అవకాశమే లేదు.

బైబిల్ ద్వారా దేవుడు ఈ మాటతో సర్వలోకాన్ని హెచ్చరించిన తరువాత సుమారు 600 సంవత్సరాలకు ఒక వ్యక్తి ఈ భూమి మీద మనిషిగా పుట్టి ఇప్పటికి రెండవ అత్యధిక జనాభాకల్గిన జనాంగాన్ని ప్రవక్త పేరుతో మోసం చేసాడు, చేస్తూనే ఉన్నాడు, ఇంకా ఉంటాడు. అతనికి ఒక గుహలో దేవుని దూత వచ్చి చెబితేనే తను ఆ దివ్య గ్రంథాన్ని వ్రాసానని, ఎవరైనా దీనిని నమ్మకపోయినా, నమ్మిపాటించక పోయినా కఠినమైన శిక్షలు విధించబడుతాయని చెప్పాడు. అది బైబిల్‌లోని పాతనిబంధనకు వందశాతం కాపీ అని, యూదులు, ఇశ్రాయేలీయులపైన కోపంతోనే వారి నమ్మకాన్ని సపోర్ట్ చేస్తూనే బైబిల్‌కు వ్యతిరేకంగా చాలా సంగతులు వ్రాసిన విషయాలను, ఆయనను గుడ్డిగా వెంబడిస్తున్న సోదరులు గుర్తించలేక అన్యాయమైపోతున్నారు. మనుష్యులతో గొప్ప ప్రవక్తగా పేరు

తెచ్చుకొన్న ఆయనను బైబిల్‌లో దేవుడు 'అబద్ధ ప్రవక్త' అని వ్రాయించాడు. ఎందుకంటే దేవుడు చెప్పనవి, దేవదూత తనతో స్వయంగా చెప్పాడని అబద్ధము చెప్పాడు. కాబట్టి పౌలు గలతీ పత్రికలో వ్రాసిన తర్వాత అప్పుడు–ఇప్పుడు ఎవరు కూడా దేవతూతలతో సంభాషణ కొనసాగించకూడదు. కేవలము బైబిల్‌లో వ్రాయబడినది, స్థిరపరచబడి భద్రం చేయబడి మన చేతుల్లోనూ, మన నోటను మన హృదయాలలోనూ ఉన్న ఈ దేవుని వాక్యమును చదువుకొని గ్రహించి లేదా ఎవరైనా వీటిలో ఉన్నవాటినే చెబితే వాటిని మాత్రమే విని నమ్మాలి (రోమా 10:17) అనేదే దేవుని ప్రణాళిక. కాబట్టి క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమా బహుపరాక్, నిద్రించుచున్న నీవు మేలుకో. నీ క్రీస్తు నీ మీద ప్రకాశించుచున్నాడు. చేతులు కాలాక ఆకులు పట్టుకొంటే ప్రయోజనంలేదు. చనిపోయాక ఎంత మొత్తుకున్నా ఏ మాత్రం ప్రయోజనం లేదు.

ఈ లోకంలో ఉన్నప్పుడు పరీక్షలో ఎన్నిసార్లు తప్పిపోయినా మరోసారి అవకాశం ఉంటుంది. మార్చిలో ఫెయిల్ అయితే వెంటనే సప్లమెంటరి ఉంటుంది. కాని జీవితంలో ఫెయిల్ అయి చనిపోయాక ఏ అవకాశం లేదు. అందుకే బ్రతికి ఉన్నప్పుడు మన నమ్మకాన్ని పరిశీలించుకొని మార్చుకొని మళ్ళీ పాస్ అయ్యే అవకాశమున్నదని, క్రైస్తవులతోపాటు అందరు ఆలోచించి మారుమనస్సు పొందండి. ఎప్పుడు చనిపోతామో తెలియదు గనుక ఇదే అనుకూల సమయం, నేడే రక్షణ దినం అనుకొని స్పందించండి, పోయేదేమి లేదు.

# 18 దేవుడు త్రిత్వమైయున్నాడా? ముగ్గురు దేవుళ్ళా?!



**నేటి** ప్రపంచ జనాభాలో అత్యధిక మెజారిటీ కలిగిన క్రైస్తవులు దేవుని విషయంలో మాత్రము చాలా భిన్నమైన అభిప్రాయములతో ఉన్నారు. క్రైస్తవేతరులలో ముస్లిములను కాక ఎవ్వరినైనా దేవుని గురించి అడిగినా ఒకే రకమైన అభిప్రాయముతో లేరు. అయితే ఏ దేశములోనైనా ఎవ్వరిని, ఎప్పుడు అడిగినా అందరు దేవుడొక్కడే అనే సమాధానాన్ని ఇస్తున్నారు. ఇదే విచిత్రం. అందరూ దేవుడొక్కడే అంటారు. మళ్ళీ వారే మా దేవుడు మాకున్నాడు, మీ దేవుడు మీకున్నాడు అని చెబుతారు. అన్యాయంగా తిట్లుపడ్డవారు, దుర్మార్గంగా తిట్టినవారు ఇద్దరు కూడా చివరలో దేవుడే (దేవుళ్ళు కాదు) చూసుకుంటాడులే నీ సంగతి అని అనడం మరో చిత్రవిచిత్రం. క్రైస్తవేతరులను అడిగితే మీ దేవుడైన క్రీస్తును మేం కూడా నమ్ముతాం, దండం పెట్టుకుంటాం, ఆయన ఫొటోకు దండవేసి దండం కూడా పెడుతున్నాం చూడండి అంటున్నారు కొందరు హైందవ సోదరులు. ఆ మధ్యన మా బైబిల్ కాలేజీ దగ్గరలో ఉన్న ఒక చర్చి పాస్టర్ (రెవరెండు) గారితో దేవుడు ఎవరు అని ఇతరులకు బోధిస్తారు అని వాదించినప్పుడు ఆయన మీరెన్నైనా రెఫరెన్సులు చెప్పండి యేసే

ఈ లోకానికి ఏకైక నిజమైన దేవుడు అని ప్రకటిస్తానన్నాడు. ఇక ఆయనను ఏమనాలో మీరే చెప్పాలి. నేనైతే అనాల్సినది ఆయన ముఖం మీదనే అనేసాను. అయితే తండ్రియైన దేవుడు ఏమైపోవాలి.

అలాగే మా బైబిల్ కాలేజీకి దగ్గరలోనే ప్రఖ్యాతిగాంచినది, ఎన్నోదేశాలలో విస్తరించియున్న క్రైస్తవ సంస్థలో పనిచేసే ఓ డైరెక్టరుగారు కూడా ఈ త్రిత్వాన్ని గురించి మా కాలేజికొచ్చి వాదిస్తూ ఒక త్రికోణాన్ని వేసి ద్వితియోపదేశకాండం 6:3లో ఉన్న "అద్వితీయుడు" అనే మాటను వివరిస్తూ త్రికోణంలో ఉన్న మూడుకోణాలు లేదా మూడులైన్లు ఈ ముగ్గురు. అందరూ సమానమే గనుక దేవత్వములో ముగ్గురు ఇమిడి ఉన్నారు అని వాదించాడు. ఇది 90% క్రైస్తవపండితులు, పాస్టర్ల అభిప్రాయం అయితే ఇది బైబిల్‌లో లేదు. అందుకేనేమో మనుష్యులు కల్పించిన ఆచారాలను, ఆజ్ఞలను నెరవేర్చుటకు వీరు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుచున్నారు (మార్కు 7:6-13) అని యేసన్న మాట 100% సరియైనదే. మరియు యేసు తాను పరలోకం వెళ్ళేముందు చివరలో ఇచ్చిన ఆజ్ఞను ఎక్కడపడితే అక్కడా ఎలా ఉపయోగిస్తున్నారో చూస్తే బాధ కలుగుతుంది. సువార్తను ప్రకటించితే విన్న వారు క్రీస్తును నమ్మితే వారికి బాప్తిస్మమిచ్చేటప్పుడు మాత్రమే వాడమన్న ఆ మాటను ప్రతి పనికిమాలిన చోట వాడుతూ దాని విలువను తీసేస్తున్నారు.

"కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి (సమస్తజనులకు సువార్తను ప్రకటించి) తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి

బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:18-20).

పై వాక్యములో బాప్తిస్మమిచ్చేటప్పుడు మాత్రమే తండ్రి, కుమార పరిశుద్ధాత్మ నామములో ఇవ్వండి అని ఇంత వివరంగా వ్రాసియున్నా. పెండ్లిలో తాళికట్టేటప్పుడు, గృహ ప్రతిష్ఠ, ఆలయ ప్రతిష్ఠ, మరే ప్రతిష్ఠ అయినా చేస్తున్నప్పుడు రిబ్బను కట్ చేస్తూ ఈ మాటను వాడుతారు. ప్రతి దానికి త్రియేకదేవుని నామంలో చేస్తున్నాననో, తాళికట్టండనో ఇలా ఎన్నో సందర్భాలలో చెప్పు చున్నారు నేటి బోధకులు. పుట్టు వెంట్రుకలు తీసినా ఇంకేమి చేసినా ఈ త్రియేక దేవుని నామం పలుకుతూ ఇతరులచేత కూడా బలవంతంగా పలికిస్తూ అనేకులను నరక పాత్రులనుగా చేయు చున్నారు. బైబిల్‌లో లేని వాటిని కలిపినా, ఉన్నవాటిని తీసేసినా పలుకకూడని చోట పలికినా ఆజ్ఞ అతిక్రమం అని మరిచిపోతున్నారు. ఇది కూడా సకల దుర్నీతిలో ఒక భాగం మరియు ఇది ఒకరకంగా మరణకరమైన పాపం అని తెలుసుకోలేక పోవుచున్నారు. వీరికి ఏ యుగంలోను క్షమాపనలేదు అనవచ్చును.

వీరిమాటలను విన్న కొందరు. అసలు ఈ వచనమే బైబిల్‌లో లేదు ఎవడో ఈ వాక్యాన్ని మధ్యలో కలిపాడనే భయంకర వాదనలోనికి యెహోవా సాక్షులు వెళ్ళిపోయారు. ప్రభువైన క్రీస్తు తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మమివ్వండి అని ఎందుకు చెప్పాడు అని ఆలోచించడం మానేసి, మూడు నామాలు ఒక్కటే అదే యేసునామం

అని ఒకడు, కాదు ముగ్గురి నామంలో ఇవ్వాలని మరొకడు, ఆ మూడు నామాలు ఏవి అని మరొకడు కొట్టుకుచస్తున్నారే గాని దేవుని ఆలోచనలతో ఆలోచించి దేవునిని మహిమ పరచడం లేదు. ప్రతి మనిషి రక్షణకు అత్యవసరమైన బాప్తిస్మము విషయములో అది తీసుకొనే పద్ధతి విషయంలో మరియు ఇచ్చే క్రమము విషయంలో ఇంతగా విభేదిస్తుంటే ఇక వేరే విషయాలను గూర్చి చెప్పాలా? అదే చిలకరింపు, జండాక్రింద నుండి వెళ్ళడము, నుదిటి మీద సిలువ గుర్తు ఇలా ఎన్నో వాక్య వ్యతిరేకమైనవి ఉన్నాయి గదా!

దేవుడు తన అనాది సంకల్పాన్నిబట్టి మనల్నికని, మన రక్షణ ప్రణాళికను సిద్ధపరచినాడు గనుక ముందుగా ఆయనను గుర్తుంచుకోవాలి. దేవుని చిత్తానుసారంగానే మనపాప విమోచన కోసం మనల్ని రక్షించడానికి, రక్షణ మార్గాన్ని చూపి మన అందరి కోసమే క్రీస్తు తన రక్తాన్ని చిందించాడు. గనుక ఆయనను కూడా మరచిపోకుండా జ్ఞాపకం చేసుకొని తీరాలి. ఇక రక్షణలోనికి వచ్చి యేసు రాజ్యంలో అనునిత్యము ఆయన ద్వారా (క్రీస్తు) దేవుని లోకానికి చేరేంత వరకు మనలో, మనతో ఉండి మనకు ఆదరణకర్తగా, సంచకరువుగా ఉండి నిత్యము క్రీస్తు ద్వారా దేవునికి ప్రార్థన చేయడమెలాగోనేర్పుతాడు నడిపిస్తాడు గనుక పరిశుద్ధాత్మను గూడా జ్ఞాపకముంచుకొని తీరాలి. అనగా రక్షణ ఇచ్చింది తండ్రి, రక్షించినవాడు కుమారుడు, రక్షణలో ఉంచేది పరిశుద్ధాత్ముడు గనుక దేవుడే ఆ ముగ్గురి నామాలను కలిపి ఒకే మాటగా పలకమని ఆజ్ఞాపించాడు.

ఇంకా బాప్తిస్మము తీసుకొనే వాడు ముందుగా దేవుని కుమారున్ని నమ్మాలి (పేరుతో పనిలేదు. దేవుని కుమారుడు అన్నా కూడా సరిపోతుంది). ఆ తర్వాత తండ్రిని, ఆత్మను కూడా నమ్మాలి గనుక ముందుగా అతడు యేసు నామంలోనే బాప్తిస్మం తీసుకోవాలి లేదా పొందాలి. ఇక బాప్తీస్మమిచ్చేవాడు మాత్రము ముగ్గురిని జ్ఞాపకం చేసి, వారి వారి విధులను వివరించి ఇవ్వాలి. తీసుకొనేవాడు యేసు నామంలోనే (కుమారుడు) తీసుకొంటున్నాడు గాని ఇచ్చేవాడు ముగ్గురి నామంలోనే (నామాలలో కాదు తెలుగు వ్యాకరణ ప్రకారం నామమే సరియైనది) ఇవ్వాలి. అందుకే అపొస్తలులు ఆనాడు ఇశ్రాయేలీయులతో యేసునామంలో బాప్తిస్మం పొందండి అని అన్నిసార్లు అన్నారంటే యేసును దేవుని కుమారుడని నమ్మి బాప్తీస్మము తీసుకొండి అని ఆజ్ఞాపించారు.

కాని వారు యేసునామంలో మాత్రమే బాప్తీస్మమిచ్చారని ఎక్కడా బైబిల్‌లో వ్రాయబడలేదు. ఎందుకంటే వారు ప్రభువైన క్రీస్తు ఆజ్ఞను ఎక్కడా ఎప్పుడు అతిక్రమించలేదు. అంతేకాని ఆనాటి వారు యేసును దేవుని కుమారుడని నమ్మలేదు గనుకనే మీరు యేసును నమ్మి ఆయన నామంలోనే బాప్తిస్మం పొందండి అని చెప్పారు. త్రిత్వనామమని, త్రియేక దేవునిలో పొందమని గాని, ఇచ్చినట్లులేదు. ఒకవేళ తండ్రి, కుమార పరిశుద్ధాత్మ నామంలో వారు ఆనాడు బాప్తిస్మం ఇవ్వకపోతే వారి బోధను మనం నమ్మాల్సిన పనిలేదు. జాగ్రత్తగా దేవుని తలంపులతో ఆలోచించండి. దేవుని వాక్యంలో తప్పక ఐక్యంకండి. అయితే దేవుడు త్రిత్వమా? ఏకత్వమా? (ఒక్కడేనా) అని ఇంకా కొన్ని వచనాలు, కొన్ని సందర్భాలను పరిశీలించి పరిశోదిద్దాం. అబద్ధ బోధలను ఖండిద్దాం.

"నాకు ముందుగా ఏ దేవుడు నిర్మింపబడలేదు, నా తరువాత ఏ దేవుడు నుండడు" (యెషయా 43:10-11). నేను తప్పవేరొక దేవుడు లేడు, నేను నీతిపరుడగు దేవుడను, రక్షించువాడను నేనే. నేను తప్ప ఏ దేవుడును లేదు" (యెషయా 45:6; 21,22; 46:9).

"మనకందరికి తండ్రి యొక్కడే కాడా? ఒక్క దేవుడే మనలను సృష్టింపలేదా? (మలాకీ 2:10).

"దేవుడు యూదులకు మాత్రమే దేవుడా! అన్యజనులకు దేవుడు కాదా? అవును అన్యజనులకును దేవుడే. దేవుడు ఒక్కడే గనుక ఆయన సున్నతిగలవారిని విశ్వాసమూలముగాను, సున్నతి లేని వారిని విశ్వాసము ద్వారాను నీతిమంతులుగా తీర్చును" (రోమా 3:29,30).

"దేవుడొక్కడే, దేవునికిని నరులకు మధ్యవర్తియు ఒక్కడే ఆయన క్రీస్తుయేసను నరుడు" (1తిమోతి 2:5).

కృపావరములు నానావిధములుగా ఉన్నవి గాని ఆత్మ యొక్కడే, మరియు పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి గాని ప్రభువు ఒక్కడే. నానావిధములైన కార్యములు కలవు. గాని అందరిలోను అన్నింటిని జరిగించు దేవుడొక్కడే" (1కొరంథీ 12:6).

"శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే... ప్రభువు ఒక్కడే... అందరికి తండ్రియైన దేవుడొక్కడే. ఆయన అందరికీపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసి 4:4-6).

ఇలా ఎన్నో వాక్యాలలోను దేవుడొక్కడే అని ఖచ్చితంగా వ్రాయబడి ఉన్నది. ఈ ముగ్గురు కూడా దేవుళ్ళే అని గాని, ఒక్క దేవుడే ముగ్గురుగా విడిపోయి మనకు కనిపిస్తున్నాడు గనుక త్రిత్వమైయున్నాడని గాని బైబిల్‌లోని ఏ వర్షన్‌లో కూడా ఎక్కడా

వ్రాయబడలేదు. పరిశుద్ధాత్ముడు దేవుని యొక్క ఆత్మ మరియు దత్త పుత్రాత్మగా చెప్పబడ్డాడు. యేసుక్రీస్తును గూర్చి ఆయనను ముందుగా ప్రవచించిన ప్రవక్తలు గాని, తర్వాత ప్రకటించిన అపొస్తలులుగాని ఎక్కడా ఆయనే దేవుడని చెప్పలేదు. ఈ సృష్టి పుట్టకమునుపు మాత్రమే దేవుని యొద్ద దేవుడైయున్నాడని (యోహాను 1:1,2) మాత్రము యోహాను గారు చెప్పారు. ఈ భూమి మీదకు నరుడిగా దిగి వచ్చినవాడు మాత్రము ఆ దేవుడే అని ఎక్కడా చెప్పలేదు. పైగా మనం యేసు దేవుని కుమారుడని నమ్మితేనే నిత్యజీవం పొందుతా మని అదే యోహాను గారు చెప్పాడు (యోహాను 20:30,31).

ప్రవక్తలు, అపొస్తలులు, ఆనాటి మనుష్యులు అందరు యేసు దేవుని కుమారుడని మాత్రమే సాక్ష్యమిచ్చారు. యేసుక్రీస్తు కూడా నేనే దేవున్నని గాని, నేను కూడా దేవునినే అని గాని ఎక్కడా చెప్పలేదు. అంతటా నేను దేవుని కుమారున్ననే చెప్పాడు. పైగా మనల్ని అందరిని "మీరు దైవములని నేనంటినని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడి యుండలేదా? లేఖనము నిరర్థకము కానేరదు గదా! దేవుని వాక్యమెవరికి వచ్చెనో వారే దైవములని చెప్పిన యెడల - నేను దేవుని కుమారుడనని చెప్పినందుకు..." (యోహాను 10:34-36; కీర్తన 82:1-6). నన్ను రాళ్ళతో కొడతారా? అని అన్నాడు. మనల్ని కూడా దేవుళ్ళుగా పిలిచాడు, దేవుళ్ళనుగా చేయడానికి ప్రయత్నించాడు. దేవుళ్ళుగా మార్పు చెంది దేవుని లాగా ఆలోచిస్తేనే మారుమనస్సు అనేది ఈ లోకంలోని ప్రతి విశ్వాసికి సమస్తము సాధ్యమే (మత్తయి 19:16-26) అని కూడా చెప్పాడు. కాని నేనే ఆ దేవున్ని అని ఎప్పుడూ, ఎవరితోనూ చెప్పలేదు.

అనగా పరిశుద్ధాత్మునికి యేసుక్రీస్తుకు అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే అయి ఉండి అందరిలోను అందరిగా వ్యాపించి ఉన్నాడు అని అర్థమయింది. అంటే దేవుడు అనేకత్వమన్నమాట. అందరు వేరుగా ఉన్నా లేకా వేరే అయినా అందరిలో ఉన్నదీ ఒక్క దేవుడైన ఆత్మ గనుక, దేవుడొక్కడే అని అర్థం చేసుకొని దేవునికి నరునికి మధ్యవర్తియైన దేవుని కుమారుడు లేక మనుష్య కుమారుడు, నరుడైన క్రీస్తు కూడా ఒక్కడేనని వాక్యంలో ఉంది. దేవుడొక్కడే అని మనమే కాదు దయ్యాలు కూడా నమ్మి వణుకుతున్నాయి అని మనకు బుద్ధి రావడానికి వాక్యంలో వ్రాయించాడు" దేవుడొక్కడేనని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే. దయ్యములు నమ్మి వణుకుచున్నవి వ్యర్థుడా! క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలుసుకొనగోరుచున్నావా? (యాకోబు 2:19-20) ఆఖరున దయ్యాలు కూడా దేవుడొక్కడేనని నమ్మి వణుకుతున్నాయని మనకు బుద్ధి రావాలని వ్రాయించాడని వ్రాయబడినా మనవాళ్ళు నమ్మేరకంగా లేరు.

అయినా ఇప్పటికి ముగ్గురూ దేవుళ్లే అని మూర్ఖంగా చాలామంది వాదించుచున్నారు. మన తెలుగు బైబిల్‌లో కొన్నిచోట్ల దేవుడు అనే పదాన్ని ప్రభువుగా (లార్డ్) తర్జుమా చేశారు. అయితే ఈ లోకంలో ఎందరికో ఈ పదం వాడినా బైబిల్‌లో మాత్రం దేవుని తర్వాత క్రీస్తుకు, ఆత్మకు కూడా వాడారు. దేవునికి అనగా తండ్రికి మాత్రం ప్రభువైన దేవుడు (లార్డ్ గాడ్), దేవుడైన ప్రభువు అని ప్రత్యేకంగా వాడారు. అది ఒరిజినల్ హిబ్రూ, గ్రీకులో నుండి తర్జుమా చేసినప్పుడు జరిగింది. పేరులో కూడా సంబోధనలో కూడా దేవుడికే గొప్పదనం వాడబడింది చూడండి. నాకు ముందుగా ఏ దేవుడులేదు

నా తర్వాత మరో దేవుడు ఉండకూడదు అని దేవుడే క్రీస్తుపూర్వం సెలవిచ్చినా ఎందుకు భయపడుతున్నారీ బైబిల్ పండితులు.

ఆత్మ అనగా పరిశుద్ధాత్మ ఒక్కడే, ప్రభువు అనగా యేసుక్రీస్తు కూడా ఒక్కడే వారిద్దరిలో మాత్రమేగాకుండా మనందిలో అందరిగా వ్యాపించి ఉన్నదేవుడు నిజానికి అనేకత్వము అయిఉన్నాడు. కోటానుకోట్ల మానవులుగా విడిపోయిన పరమాత్ముడు ఒక్కడే గనుక ఆయన ఒకేఒక్కడు అని గుర్తుంచుకోవాలి. కొందరు కుమారుడైన దేవుడు అంటే తప్పా? అని కూడా నా మీద ఒత్తిడి తెస్తున్నారు. కుమారుడైన దేవుడు అని బైబిల్‌లో లేదు గదా? కేవలము వాక్యముగా ఉన్నపుడు మాత్రమే దేవుడని ఉంది గదా అని అన్నా వినిపించు కోవడములేదు. కుమారుడైన దేవుడు అంటే దేవుడే కుమారుడుగా వచ్చాడని అర్థమిచ్చుచున్నది గదా! యేసుక్రీస్తును దేవుడు పరలోకంలోనే కన్నాడు గదా! ఆ వాక్యము కుమారుడయ్యాడు కాని, దేవుడు కుమారుడుగా రాలేదు కదా! అందుకే ఏకత్వము మాత్రమే రైటుగా ఉంది. దేవుడు తన నిబంధనలో చేసిన వ్రాయించిన వాటినే చెప్పాలి. అది చెప్పడానికి ఎందుకు భయపడాలి. ఎవ్వరు అడిగినా దేవుడొక్కడే అని ఠకీమని సమాధానం చెప్పినవారే క్రీస్తు శిష్యులు.

దేవున్ని గూర్చి మనకు అనగా క్రైస్తవులకు ఈనాడు పూర్తిగా తెలిసినా, ఆనాడు ఇశ్రాయేలీయులకు తెలిసింది కొద్దిగానే. “ఇవి ఆయన కార్యములలో స్వల్పములు ఆయనను గూర్చి మనకు వినబడుచున్నది మిక్కిలి మెల్లనైన గుసగుస శబ్దము పాటిదే గదా గర్జనలు చేయు ఆయన మహాబలము ఎంతైనది గ్రహింపగల వాడెవడు?” (యోబు 26:14). అయినా వారు దేవుడొక్కడేనని గట్టిగా నమ్మి ప్రపంచాన్ని వణికించారు. ఇప్పటికీ వణికిస్తూనే

ఉన్నారు. యేసుదేవుని కుమారుడు అని చెప్పినందుకే, అనగా దేవుడవని చెప్పుకొను చున్నావనియు, (యోహాను 10:32-39) దేవదూషణ చేయుచున్నావని (యోహాను 10వ అధ్యాయం) ఆయనను చంపేశారుగదా. దేవుని కుమారుడు అంటే దేవుడే అన్నట్లుగా అర్థం వస్తుంది గనుక వేరొక దేవుడుండకూడదనే ఆయనను సిలువేశారు గదా! ఇవన్నీ తెలిసిన మనం దేవుడొక్కడేనని నేటి ప్రపంచానికి ప్రకటించలేక పోతున్నామేమిటి? యేసుక్రీస్తు ప్రభువు తన జీవితకాలములో చేసిన బోధలో ఎప్పుడూ తాను దేవుడనని చెప్పుకోలేదు.

యేసును, నేడు మనలను తప్పుదోవ పట్టించడానికి మాత్రమే నీవు మనుష్యుడవైయుండి దేవుడవని చెప్పుకొంటున్నావని నేరం మోపారు. ఆ తర్వాత చివరి విచారణలో ఆయనను పరమాత్ముడవని చెప్పుకొన్నావు గదా అనక, పరమాత్ముని కుమారుడవు నీవేనా? అని అన్నారంటే యేసు ఎప్పుడు దేవుడనని చెప్పుకోలేదు (మత్తయి 26:62-68; మార్కు 14:55-65; లూకా 22:66-71). క్రీస్తుపై అపవాదు, నేరం మోపడానికే యూదులు పుట్టించిన మాట అది. ఆయన అపొస్తలులు కూడా యేసే యెహోవా అని ఎక్కడా చెప్పలేదు. క్రీస్తు బోధలో, సిలువ వేయబడిన క్రీస్తు బోధలో ఒక్క రెఫరెన్సు కూడా ఈ సర్వ ప్రపంచములో ఏ ఒక్కడు కూడా చూపించలేదు. (ఈ విషయం యేసుక్రీస్తు ఎవరు? అనే పుస్తకంలో వ్రాశాను) దీనిని గూర్చి ముస్లింలు క్రైస్తవులపై ఎప్పుడో సవాలు విసిరారు. అయితే నేను ముస్లింలను సపోర్ట్ ఏ మాత్రం చేయడం లేదు. కేవలం దేవుడొక్కడే అనే విషయంలో మాత్రమే ఏకీభవించుచున్నాను. బైబిల్‌లో భావాను సారమైన తప్పులులేవు. కేవలం తర్జుమా లేక

ప్రింట్ దోషాలు మాత్రము చాలా ఉన్నాయి. అది మానవ తప్పిదమే కాని దైవ తప్పిదము కాదు.

ఒక స్కూల్‌కు ఒకే ప్రధానోపాధ్యాయుడు ఉంటాడు. ఈ లోకంలోనే ఒక రాష్ట్రానికి ఒకే ముఖ్యమంత్రి, ఒక దేశానికి ఒకే ప్రధాని, ఒకే అధ్యక్షుడు ఉన్నప్పుడు, ఒక దేశానికి ఒకే చీఫ్‌జస్టిస్ (సుప్రీం కోర్టు) ఒక కంపెనీకి ఒకే ఎక్జిక్యూటివ్ డైరెక్టరు, ఒకే మేనేజింగ్ డైరెక్టరు ఉంటేనే పనులు సజావుగా జరుగుతున్నాయి, జరుగుతాయి. అదే పోస్టులో ఇద్దరినో, ముగ్గురినో వేయండి ఇక అక్కడ కలగూరగంప పరిస్థితే అవుతుంది గదా. అలాగే ఈ లోకానికి కూడా ఒకే దేవుడు న్నాడు, ఉండాలిగూడా అప్పుడే ఆ లోకం కూడా బాగుంటుంది గదా! కాబట్టి ఒకే దేవుడు ముగ్గురుగా ఉన్నాడనో, ముగ్గురనో, మూడుకోట్లనో చెప్పడం అన్యాయం, అక్రమం అవుతుంది గనుక ఆలోచించి దేవునిని దేవుడుగానే మహిమపరుద్దాం. దేవతలనబడిన వారు అనేకులు (33కోట్లు) ఉండవచ్చునేమోగాని దేవుడు మాత్రం ఒక్కడే (1కొరింథీ 8:5,6).

అయితే ఈ ముగ్గురు ప్రత్యేకమైన వ్యక్తులు, శక్తులు అయినా సర్వమానవాళిని రక్షించి పరలోకం తీసుకొని పోవడానికి మాత్రము ముగ్గురు ఒక్కటై ఉన్నారు. అనగా ఏకమై ఉన్నారు. దేవుని ఈ సంకల్పంను నెరవేర్చే వారు కూడా వారితో ఏకమై ఉన్నారు. ఒక విషయములో కుటుంబం, సంఘం, సంస్థలు ఒక్క త్రాటి మీద ఏకమై నడుస్తారు అంటే అందరు విడివిడిగా ఉన్నా గాని వారి ఉద్దేశ్యములో<sup></sup>నిలో ఏకత్వము ఉన్నదని అర్థము. మనం అందరం క్రీస్తులో అనగా వాక్యములో ఏకమై ఉండాలని యేసుక్రీస్తే దేవునికి ప్రార్థన చేశాడు గదా (యోహాను 17:21). దేవుడు ఏకత్వమే (God is Unity not Trinity) గాని కేవలం త్రిత్వము మాత్రమే కాదు.

# 19 యేసుక్రీస్తు దేవునితో సమానుడా?

**యేసు** ప్రభువే దేవుడని నమ్మి ప్రకటిస్తున్నవారికి మాత్రము ఇదొక పిచ్చిప్రశ్నగానే ఉంటుంది. నేను ఆలాంటి వారికి దొరికితే ఆ క్షణంలో తందామని చూసేవారు, ఇప్పటికే చూస్తున్నవారు కూడా ఉన్నారు. ఎందుకంటే దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మల బోధనలో మనస్సుమార్చుకోండి అన్నాడు గనుక "బలవంతపు మతమార్పిడి నశించాలి" అనే అంశంతో 2013 సం॥లో సెమినార్ పెడితే నన్ను తంతామని, చంపుతామని బెదిరించిది క్రైస్తవలే కాని అన్యులు కాదు సుమా. ఈ ప్రశ్న వేస్తేచాలా మంది అవును యేసుక్రీస్తు దేవునితో సమానుడేకదా అని సమాధానమిచ్చేవారు చాలా మందే ఉన్నారు. అది వారి తప్పుకాదు గాని వారికి బోధించిన బోధకులదే సుమా! మన వాళ్ళలో అనేకులు ఈ బైబిల్‌లో క్లియర్‌గా వివరించి చెప్పేవాటిని వదిలివేసి ఎక్కడో మసక మసకగా ఉన్న క్రీస్తును ప్రకటిస్తున్నారే తప్ప నిజమైన రాజ్యసువార్తను ప్రకటింపలేక పోతున్నారు. అందుకే దేవునికోపం పరలోకంనుండి బయలు పడుతుంది అంటున్నాడు భక్తుడు (రోమా 1:18). అయితే నేటి తప్పుడు బోధకులు వారి బోధకనుకూలముగా చూపిస్తున్న లేఖనాన్ని

ఒకసారి పరిశీలించిన తర్వాత మిగతా వివరంగా ఉన్న వాక్యాలను గూర్చి చర్చిద్దాం.

"క్రీస్తుయేసుకు కలిగిన ఈ మనస్సును మీరును కలిగి యుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదుగాని, మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొనెను" (ఫిలిప్పీ 2:4–11).

క్రీస్తు దేవుని స్వరూపము అంటున్నాడు. మనుషులందరిని కూడా దేవుడు తన స్వరూపంలోనే పుట్టిస్తున్నాడు (ఆది 1:26,27). దానిని పోగొట్టుకున్న మనం క్రీస్తు స్వరూపంలోనికి మారండి అంటున్నాడు పౌలు గారు (గలతీ 4:19) క్రీస్తు స్వరూపములోకి మారుట వలన కూడా మనం క్రీస్తుతో సమానులమా? అని ఆలోచించండి. అలాగే మనం కూడా దేవునితో సమానులమా?

అందుకే పై వచనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే యేసు దేవునితో సమానుడని ఉందా?, దేవునితో సమానముగా ఉండుట అని ఉందా? ఆలోచించండి. దేవాదిదేవుడైన తండ్రితో పరలోకములో ఆయనతో పాటు పరలోకంలో ఉండుట భాగ్యమని ఎంచుకొనలేదు అని అంటున్నాడు. దేవునితో దేవలోకములో ఉండుట దేవునితో సమానముగా అక్కడ ఉండుట అనేది రైటుగాని దేవునితో సమానుడు అని మాత్రం కాదుగదా! అక్కడే ఒక మాట ఉన్నది అది ఏమంటే క్రీస్తుయేసుకు కలిగిన ఈ మనస్సును మీరు కూడా కలిగియుండుడి అని అంటున్నాడు. దేవుని విషయంలో క్రీస్తుయేసుకు కలిగిన మనస్సు ఏమని చెబుతుందో ఆలోచించారా? ఇక్కడ ఆయనకు కలిగిన

మనస్సును కలిగిన వారితో ఏ సమస్య లేదు గాని, ఉంది అని నమ్మిమోసపోతున్న వారితోనే సమస్య అంతా! చూద్దాం క్రీస్తుయేసు బ్రతికి ఉన్నప్పుడేమని అంటున్నాడో చదివి ఆలోచిద్దాం. ఆయన ఏ ఒక్కసారి గూడా నేను దేవునితో సమానున్ని, నేనే దేవున్ని అని ఎప్పుడూ, ఎక్కడా అనలేదు అని మాత్రం ఎన్నడూ మరచిపోవద్దు.

"నేను వెళ్ళి మీ యొద్దకు వచ్చెదనని మీతో చెప్పిన మాట మీరు వింటిరిగదా! **తండ్రి నాకంటే గొప్పవాడు** గనుక మీరు నన్ను ప్రేమించిన యెడల నేను తండ్రి యొద్దకు వెళ్ళుచున్నానని మీరు సంతోషింతురు" (యోహాను 14:28).

క్రీస్తు మొదటి నుండి నా తండ్రి పంపితే వచ్చానని, ఆ తండ్రి పనులమీదనే ఉన్నానని, మనందరి తండ్రి కోరిక / చిత్తము నెరవేర్చుటకే వచ్చానని, తండ్రి దగ్గరకే వెళ్ళుచున్నానని, అక్కడనుండే మళ్ళీ వస్తానని చెప్పుచున్నాడు. ఇక్కడగూడా తండ్రియైన దేవుడు నాకంటే గొప్పవాడు అని అన్నాడు గాని తండ్రి నాతో సమానుడు అని చెప్పలేదు. దీనికి బైబిల్ రెఫరెన్సులు వ్రాసి చూపాలంటే యోహాను సువార్త మొత్తం మళ్ళీ ఇక్కడ వ్రాయాలి. ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుడై ఉండెను (యోహాను 1:1,2) అని వ్రాసిన యోహానుగారే దేవునికి, ఆయన కుమారుడైన క్రీస్తుకు ఉన్నబంధాన్ని, తేడాను చక్కగా వివరించాడు. బహుశా యోహాను సువార్తను ఆత్మీయంగా అర్థం చేసుకోలేని విద్యావిహీనులే, యేసును దేవుడని లేని వార్తను లేదా యేసే దేవుడని పుట్టించారు. యేసు దేవునికంటే గొప్పవాడు అనే విషయం కాదు గాని ఆయనతో సమానుడా? కాదా? అనే మరిన్ని విషయాలు చూద్దాం.

"దాసుడు తనయజమానుని కంటే గొప్పవాడు కాడు "పంపబడిన వాడు తన్నుపంపిన వానికంటే గొప్పవాడు కాడని" మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 13:16).

"వాటిని నాకిచ్చిన తండ్రి **అందరికంటే గొప్పవాడు** గనుక నా తండ్రి చేతిలో నుండి యెవడును వాటిని అపహరింపలేడు" (యోహాను 10:29).

ఇక్కడ ఈ విషయాన్ని చాలా చక్కగా చెప్పాడు ప్రభువు మరియు మరో సంగతి కూడా చెబుతున్నాడు. నేను పంపబడిన వాడినని మరియు దాసుడనని నాలాగే పంపబడిన వాడు కూడా పరిశు ద్ధాత్ముడు కాబట్టి అందరికి తండ్రి అందరికంటే అనగా ఆయనకంటే కూడా దేవుడు గొప్పవాడు అని చెప్పాడు. అంటే పరిశుద్ధాత్మగూడా దేవునితో సమానుడు కాలేడు. నేను చెబుతున్నదానికి వాక్యాధారమున్నది ఊరికెనే మాట్లాడకూడదు, వ్రాయకూడదుగదా! తీయండి మీ చేతిలో ఉన్న మానవులందరి జీవగ్రంథమైన బైబిల్‌ను...

"నీవు ఇతనితో సమానుడని మీరు నన్నెవనికి సాటి చేయుదురు? అని పరిశుద్ధుడు అడుగుచున్నాడు" (యెషయా 40:18,25).

"దేవుడను నేనేమరి ఏ దేవుడును లేడు, నేనే దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు" (యెషయా 46:9).

దేవునితో సమానుడుగాని, దేవునిని పోలినవాడుగాని ఎవడును లేడు అని యెషయాప్రవక్త ద్వారా ఎప్పుడో క్రీ.పూ. 700 సంవత్సరాల క్రితమే ప్రవచించిన విషయాన్ని చదివినాము. కాబట్టి దేవుడు, దేవుడే.

యేసుక్రీస్తు, యేసుక్రీస్తే అని గుర్తించండి. ఆయనకున్న పరిధి వేరు, క్రీస్తు తండ్రి చెప్పిన పనిని నెరవేర్చిన దేవుని అద్వితీయకుమారుడు అనగా దేవునికుమారులలో యేసుక్రీస్తుకు సాటియైన వాడు, సమానుడు మరొకడులేడు అని అర్థం. పరలోకంలోనైనా కూడా యేసుకన్నా గొప్పవాడు దేవుడొక్కడే. అందుకు యేసుక్రీస్తు దేవునికి చేసిన ప్రార్థననే సాక్ష్యము "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" (యోహాను 17:3). దేవుడు అద్వితీయుడు అంటే ఆయనకు సాటియైనవాడు మరొకడు లేడు అని అర్థం. అలాగే యేసుక్రీస్తు కూడా అద్వితీయుడు, అనగా ఆయనకు సాటియైన వాడు మరొకడులేడు. ఇలా ఆలోచిస్తే ప్రతి మనిషికి సాటియైనవాడు కూడా మరొకడు ఉండడు గదా ప్రతి మనిషి ఎవరికి వారు ప్రత్యేకత కలిగినవారు అని కూడా ఆలోచించండి.

ఇన్ని విషయాలను కూళంకషంగా పరిశీలిస్తే ఎక్కడైనా దేడుడొక్కడే అని మనకు తెలిసిపోతుంది. మరి దైవ త్రిత్వమనే మాట ఎక్కడనుండి వచ్చింది? దైవ త్రిత్వములో యేసును రెండవవాడుగా ఈ బోధకులు ఏల చెప్పుచున్నారు? అని తీవ్రంగా ఆలోచించి తర్కించినప్పుడు యేసు తండ్రి నేను ఏకమై ఉన్నాము అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశాడు ఒక భక్తుడు. బహుశా అందువల్లనే ఈ త్రిత్వసిద్ధాంతం పుట్టింది అని అర్థమగుచున్నది. బైబిల్‌ను వక్రీకరించో, తప్పుడు భాష్యం చెప్పినపుడో పుట్టిందే ఈ త్రిత్వము అనే మాటగాని, నిజంగాదేవుడు మనతో చెప్పిందికాదు. ఈ విషయం ముందుముందు మనం చర్చించబోయే మహాదేవుడు,

స్తోత్రార్హుడెవరు? అనే అంశాలలో గూడా వివరంగా తేలిపోతుంది. కొంచెంసేపు ఓపికతో అంతా చదవండి. చాలా మందికి పుస్తకాన్ని అక్కడక్కడ చదివి వదిలిపెట్టే అలవాటు ఉంటుంది. మరికొందరికి కొంచెం చదివి వదిలిపెట్టే అలవాటు ఉంటుంది. మరికొందరికి మొదటినుండి చివరివరకు చదివితేనే సంపూర్ణముగా అందులోని విషయాలు అర్థం అవుతాయి కదా! దేవునంతటి భయంకరుడు, ఆయనంతటి ప్రేమామయుడు ఈ ప్రపంచములో మరొకడు లేడు. ఆయనకు కోపము తెప్పించినవారు క్షణంలో నాశనమయినట్లుగా పాతనిబంధనలో చూడగలం. జీవముగల దేవుని చేతిలోపడుట బహు భయంకరము సుమా!

# 20 యేసుక్రీస్తు - దేవుడు ఒక్కడేనా!

**నేటి** క్రైస్తవలోకంలోని అనేకమందిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎన్నో ప్రశ్నలనే ఒక్కొక్కటి నేనే వేసి వాటికి వాక్యానుసారమైన సమాధానమిస్తున్నాను. పై ప్రశ్నవేస్తే మనలో అనేకులు అవును ఒక్కరేననే సమాధానం ఇస్తారు. ఆయన అనగా దేవుడు ఈయన అనగా క్రీస్తు ఒక్కరే గదా! దేవుడే యేసుక్రీస్తుగా అవతారమెత్తాడు గదా. ఆయనే ఈయన ఈయనే ఆయన అంటూ, డబుల్ యాక్షన్ మరియు పరిశుద్ధాత్మగా త్రిబుల్ యాక్షన్ చేస్తున్నాడు దేవుడు. ఈ మాత్రం మాకు తెలియదా? అని నోరెళ్ళబెడుతారే తప్ప వాక్యప్రకారంగా ఆలోచించడం మానేస్తున్నారు. మరికొందరు ముందు కాలంలో దేవుడు తర్వాత కాలంలో క్రీస్తుగా వచ్చాడు ఆ తర్వాత క్రీస్తుపైకి వెళ్ళి, పరిశుద్ధాత్మగా తిరిగి ఆయనే వచ్చాడు అంటారు. గాని ముగ్గురు, ఎల్లప్పుడు ఒక్కదగ్గరే విడివిడిగా ఉండి ఎవరి పని వారు చేస్తున్నారు అంటే ఒప్పుకొని చావడంలేదు. దేవుడు ఏ యుగంలోను, తరంలోనూ అవతారం ఎత్తలేదు, ఎత్తడు ఆయన తన పనిని మనతోటి, దేవదూతలతోనే చేయించుకొంటాడు. మనం కూడా మరో అవతారం, రూపం లేక జన్మ ఎత్తము అని బైబిల్‌లో

ఉన్నా ఇలాంటి వారు చూపించే బైబిల్ ఆధారమేమిటంటే, యేసుబోధలోనే చూపిస్తారు చూడండి.

"నేనును తండ్రియును ఏకమైయున్నాము అని వారితో చెప్పెను" (యోహాను 10:30).

అనే వాక్యము చూపిస్తారు ఇక్కడ ఏకమైయున్నాము అనగా ఒక్కటే అయి ఉన్నామనే అర్థం వస్తుందిగాని ఇద్దరం కలిసి ఒక్కరమే అనే అర్థం లేదుగదా. ఇద్దరం ఒక్కటే లేదా ఒక్కటైయున్నాము అంటే అర్థము ప్రతివిషయంలో ఒక్కటే అనే అర్థంగదా! మానవాళి సృష్టినుండి వారి పునరుద్ధానము వరకు ప్రతి విషయములో ఏకమైయున్నాము అని అర్థం. ఇద్దరు కలిసి ఒకరుకాదు. ఎలాగంటే దేవుడు ఆత్మ ఆయన మనిషికాడు, మనిషి ఆకారము ఆయనది కాదు. యేసుక్రీస్తు నరుడు, ఆయన శరీరాకారంలో ఉన్నాడు. రెండు లేదా ఇద్దరు శరీర రీత్యా ఒక్కటయ్యే అవకాశమేలేదు. ఉదా:- భార్య, భర్తలను గూర్చి మాట్లాడుతూ వారిద్దరు ఏకశరీరులై ఉందురు అని వ్రాయబడి ఉందిగదా! ఇద్దరికి వేరు, వేరు శరీరాకృతులున్నాయి. పెళ్ళైనా ఎవరి శరీరం వారికున్నది. ఇద్దరు చెరిసగం కలిసి ఒక్కటికాలేదుగదా! మరి ఏకశరీరులు అంటే ఏమిటి? దేవుని విషయంలో, దేవుని చిత్తాన్ని నెరవేర్చే విషయంలో ఒక్కటైపోతారని, పోవాలనే భావంతో ఆ మాట చెప్పాడు దేవుడు. ఎందుకనగా అదే యేసు మరొకచోట ఇదే సంగతిని గూర్చి అన్న విషయాన్ని ఒకసారి చూద్దాం.

"నేను ఒక్కడైయుండక నేనును, నన్నుపంపిన తండ్రియు కూడా ఉన్నాము" (యోహాను 8:16).

నా తండ్రి వేరే మరియు కుమారుడనైన నేనువేరే ఇద్దరం ఉన్నాము అన్నాడే తప్ప ఇద్దరం కల్సి ఒక్కరేకాదు. ఒక్కటి అని చెబుతున్నాడు. ఒక్కటే అనే మాటకు ఒక్కరే అనే మాటకు చాలా తేడా ఉంది. అందుకే సత్యవాక్యాన్ని సరిగ్గా ఉపదేశించువానివలె ఉండమన్నాడు (2తిమోతి 2:15). ఇక్కడ సమాధానం చెబితే మరో వాక్యాన్ని తీసుకొచ్చే అలవాటు చాలామందికి ఉన్నది. ఇది పూర్తిగా వినిగ్రహించకముందే మరో రెఫరెన్సు దగ్గరకెళ్ళి, మరి దీనిసంగతేంటి అని నిలదీస్తారు. ఇలా అపార్థం చేసుకొన్న వాక్యమే ఒకటి చూపిస్తాను. అది అలాగే ఉందో లేదో బైబిల్‌లో చూసుకొనే బాధ్యతగూడా మనదే సుమా! ముగ్గురు ఒక్కరే అయితే ఆశీర్వాదములు ఇచ్చేటప్పుడు పలికే వాక్యము సంగతి ఆలోచండములేదు. అదేదనగా "ప్రభువైన క్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడై ఉండును గాక (2కొరింథీ 13:14). ఇక్కడ ముగ్గురిని విడివిడిగా చూపించాడని ముగ్గురిచ్చే ఆశీర్వాదములు వేర్వేరుగా ఉన్నాయి అని గ్రహించండి.

దేవుడు క్రీస్తు ఒక్కరే అయితే ఈ వాక్యాన్ని గూర్చి ఆలోచించి, ధ్యానించి, సమాధానం చెప్పండి. "యేసు – ఒకడు నన్న ప్రేమించిన యెడల నా మాటగైకొనును. అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతుము" (యోహాను 14:20–23). అలాగుననే బాప్తీస్మం ఇచ్చేటప్పుడు కూడా ముగ్గురిని జ్ఞాపకం చేసుకోమన్నాడు. యేసుక్రీస్తు బాప్తీస్మం తీసుకొనేటప్పుడు ఒకే చోట, ఒకే కాలంలో ముగ్గురు మనకు విడిగా ఉన్నట్లుగా వాక్యము చెబుతుంది. యేసు శరీరధారిగా ఉన్నాడు,

తండ్రిపై నుండి మాట్లాడుతున్నాడు, పరిశుద్ధాత్మ పావురాకారము వలె ఆయన మీదికి దిగివచ్చుట యోహాను గారు చూశానని వ్రాశాడు.

"యేసు "మీరునన్ను ఎరిగియుంటే నా తండ్రిని ఎరిగి యుందురు. ఇప్పటి నుండే మీరు ఆయనను ఎరుగుదురు. ఆయనను చూచియున్నారని చెప్పెను. అప్పుడు ఫిలిప్పు–ప్రభువా తండ్రిని మాకు కనపరచుము మాకంతేచాలునని ఆయనతో చెప్పగా. యేసు, ఫిలిప్పూ నేనింతకాలము మీ యొద్దనున్నా నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనపరచుమని యేల చెప్పుచున్నావు. తండ్రియందునేనును, నాయందు తండ్రియు ఉన్నామని నీవునమ్ముటలేదా? (యోహాను 14:6–12).

ఫిలిప్పు దేవునిని కనపరచమని అడిగితే యేసేమో నన్ను యెరుగవా? అని ప్రశ్నించాడు. అలాగే ఇప్పటినుండే మీరాయను చూచియున్నారని చెప్పాడు. యేసు మీరు నన్ను కూడా చూడలేదు, చూడలేరు గనుక నన్నుమీరు ఎరుగాలి, దేవునిని కూడా ఎరుగాలి అని చెబుతున్నాడు. అంటే దేవున్ని చూసే భాగ్యములేదనే కదా! తండ్రినాలో ఉన్నాడు, నేను ఆయనలో ఉన్నాను, ఆయన నేను వేర్వేరుకాదు ఒక్కరమే డబుల్‌యాక్షన్ లేదా డబుల్‌రోల్ (ఒక్కరే రెండు పాత్రలలో) నటిస్తున్నాము లేదా జీవిస్తున్నాము అని చెప్పలేదు. దేవుడు మనలో కూడా ఉన్నాడు, దేవునిలో మనం కూడా ఉన్నాము. అయితే దేవుడు మనం ఒక్కరమేనా? ఒక్కటా? అలాగే యేసుక్రీస్తు మనలో ఉన్నా ఆయన వేరు మనం వేరుకాదా? యేసు–మనం ఆత్మీయంగా ఒక్కటే, కాని శరీర ప్రకారము ఒక్కరుకాదు.

ఉదా:- ఒక తండ్రికి కుమారుడున్నాడు అనుకొందాం. అతను, తండ్రి ఒకేమాటమీద నిలబడి అన్నీ ఒకరి చేతులమీదుగా ఏ మాత్రం తేడారాకుండా బ్రతుకుతున్నారనుకొందాం. ఎవరైనా వచ్చి బాబు మీనాన్నగారు లేరా అని అడిగితే, మా డాడీతో ఏంపనో చెప్పండి అంకుల్, నాకు చెప్పినా మానాన్నకు చెప్పినా ఒక్కటే, మానాన్నకు నాకు తేడాలేదు ఆయనకిచ్చినా, నాకిచ్చినా ఎవరికిచ్చినా ఒకటే అని అన్నాడనుకో అప్పుడు ఎమన్నట్లు వీళ్ళిద్దరు ఒకేపోలికలతో ఉన్నా ఒకరిని చూస్తే, మరొకరిని చూసినట్లుకాదుగదా! కవలలైనా ఇద్దరు ఒక్కరు కాదు. ఇద్దరూ (దేవుడు - క్రీస్తు) వేర్వేరుగా ఉన్నా మానవాళిని రక్షించే విషయంలో మాత్రం అందరూ ఒక్కటే అని చెప్పాడు అని అర్థం చేసుకోవాలి. మనవాళ్ళు తప్పుగా అర్థం చేసుకొన్న మరొక్క వాక్యంను గూర్చి ధ్యానించి మరోసారి నిజమైన అర్థాన్ని గ్రహించుకొందాం.

"నీళ్ళద్వారాను, రక్తము ద్వారాను వచ్చినవాడు ఆయనే, అనగా యేసుక్రీస్తే. ఈయన నీళ్ళతో మాత్రమే గాక నీళ్ళతోను, రక్తముతోను వచ్చెను. ఆత్మ సత్యము గనుక సాక్ష్యమిచువాడు ఆత్మయే. సాక్ష్యమిచ్చువాడు అనగా ఆత్మయు, నీళ్ళును, రక్తమును ఈ ముగ్గురు ఏకీభవించియున్నారు" (1యోహాను 5:1-10).

ఇక్కడ ముగ్గురు అనేపదం చూసి ఇంకేముంది తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు ముగ్గురు ఏకీభవించియున్నారు గనుక ముగ్గురు ఒక్కరే అనే అర్థం తీసుకొచ్చి త్రిత్వము అనే పదం పుట్టిందేమో? ముగ్గురు దేవుళ్ళు అంటే మళ్ళీ హైందవ సాంప్రదాయము, సంస్కృతియని భయపడి మనుషులు ఊహించి

వ్రాసిన వేదాలను కాదనడానికి దేవుడు ముగ్గురై ఉన్నారని పూర్వము ఎవడో మతినుండి పుట్టిన సిద్ధాంతమే త్రిత్వము కావచ్చును. అయితే ఇక్కడ చూసినట్టు అయితే ఈ ముగ్గురు ఎవరు? ఏ విషయంలో ఏకీభవించియున్నారో వాక్యాధారంతో పరిశీలించాలి. నీళ్ళతో, రక్తముతో వచ్చిన వాడు క్రీస్తే అంటున్నాడు. మిగతా వ్యక్తి ఆత్మ అంటున్నాడు గదా! యేసుక్రీస్తు ఈ లోకానికి నీళ్ళతో వచ్చాడు అనగా మనకు జీవజలాలను తెచ్చాడు. (యోహాను 4:10–14) అలాగే మనకోసం రక్తాన్నికార్చాడు. ద్రాక్షారసాన్ని తన రక్తంగా అనుకొని తాగమన్నాడు గదా. అలంకారములో జీవజలములనగా వాక్యంగనుక, ఈ వాక్యాన్ని గూడా ఒక వ్యక్తిగా చూపిస్తున్నాడు (యోహాను 12:48). ఆ తర్వాత రక్తమాంసములతో క్రీస్తును ఒక వ్యక్తిగా చూపించుచున్నాడు. మూడవదిగా 'ఆత్మ' అనగా పరిశుద్ధాత్మగూడా దేవుని దత్తపుత్రుడుగా చెప్పబడిన మరొకవ్యక్తి గనుక ఈ ముగ్గురు ఏ విషయంలో ఏకీభవించియున్నారో అని మరోసారి ఆలోచిద్దాం.

అదే విధంగా తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ కూడా ఏకీభవించినది ఏ విషయంలో అని ఆలోచిస్తే యోహాను వ్రాసిన సువార్తలోను, పత్రికలలోను, మిగతా సువార్తలన్నిటిలోను ఒక విషయం స్పష్టంగా కనబడుతుంది. పై వాక్యభాగం వ్రాసియున్న 1యోహాను 5వ అధ్యాయంలో కూడా "యేసు దేవుని కుమారుడని నమ్మువాడు తప్పలోకమును జయించినవాడు మరి ఎవడని వ్రాసియున్నది. యేసు తన కుమారుడని తండ్రియైన దేవుడు సాక్ష్యమిచ్చుచున్నాడు. పరిశుద్ధాత్మ కూడా యేసుదేవుని కుమారుడని

బైబిల్ అంతా అనగా ఆయన ప్రేరేపించి వ్రాయించిన వాక్యమంతా సాక్ష్యంగా ఉన్నది. అలాగే యేసుక్రీస్తు కూడా నేను దేవుని కుమారుడను, దేవుడు నాకు తండ్రి అని తనను గూర్చి తాను సాక్ష్యమిచ్చాడు. అనగా ఈ ముగ్గురు 'యేసు దేవుని కుమారుడనే విషయంలో ఏకీభవించారే తప్ప' యేసు, దేవుడు ఒక్కరే అని ఎక్కడా చెప్పబడలేదు. అందరూ ఏకీభవించిన విషయాన్ని క్రైస్తవులలో అనేకులు, వారి బోధకులు ఎందుకు ఏకీభవించలేకపోతున్నారో జాగ్రత్తగా ఆలోచించి చూసుకొని సత్యాన్ని గ్రహించగలరు.

పాత, కొత్తనిబంధన ప్రకారముగా ఏ విషయాన్నైనా దృవీకరించాలంటే ఇద్దరు లేదా ముగ్గురి సాక్ష్యం అవసరం. అందుకే దేవుని గూర్చి యేసు, పరిశుద్ధాత్మ సాక్ష్యమిచ్చారు. యేసు దేవుని కుమారుడని దేవుడు, ఆత్మ, వాక్యము (బైబిల్) సాక్ష్యమిస్తుంది. ఇలా దేవుడిచ్చిన ఆజ్ఞలను దేవుడు కూడా పాటించి ఇద్దరు, లేక ముగ్గురి చేత నేను వేరు, నా కుమారుడు, పరిశుద్ధాత్మ వేరు వేరు గానే ఉన్నాం అని వ్రాయించాడు. ఇలా ఆలోచించి దేవునితో, క్రీస్తుతో, ఆత్మతతో మనం ఏకమైపోవాలి (ద్వితియోప 17:4,5). ఇంకొక మాట నేడు మన ప్రపంచదేశాలలోని చట్టంలో గూడా ఎవరైనా నేరస్థుడు, అన్యాయస్థుడు, వ్యభిచారి, ఇలా ఏదైనా నేరం రుజువు చేయాలన్నా ఇద్దరు లేదా ముగ్గురు సాక్షులు కావాలి. ఒక్కరి సాక్ష్యము చాలదు. ఆఖరున అనాధశవాన్ని ఖననం చేయాలన్నా పోలీసుల పంచనామాలో కనీసం ఇద్దరు సాక్షుల సంతకాలు తీసుకొంటారు.

అదేవిధంగా యెషయాగ్రంథం 9:6లో బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి అని ఉంది గనుక యేసే యెహోవా గదా అని

ఆలోచించారు మరికొందరు. పై వాక్యంలో ముందుగానే ఆయన దేవుని కుమారుడని చెప్పాడు. ఆయన రాజ్యపాలన చేస్తున్న సమయంలో జనులచేత అనగా ఆనాటి మనుషుల చేత ఆపేర్లు పెట్టబడును అని వ్రాయించినాడు మనం అంటామని వ్రాయించి నాడు తప్ప ఆయనే పేర్లుపెట్టాను అని వ్రాయించలేదు. ఆయనే వ్రాయిస్తే ఎలా ఉండాలో తెలుసా? "ఏలయనగా మనకు శిశు వుపుట్టెను, ఆ దేవుడే అనగా నేనే కుమారుడుగా మీకు అనుగ్రహింప బడుతాను. ఆ దేవుడైన నా భుజముల మీద రాజ్యభారముండును. ఆయనే ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి" అని వ్రాయించాడా? లేదా ఈ బిరుదులు లేదా పేరు పెట్టబడును అని వ్రాయించాడు.

రాజు తర్వాత రాజు, ఇంట్లో అందరికన్నా పెద్దన్నయ్యను తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు అని పిలుస్తారు అలా యేసును మనం పిలుస్తాం అనే విధంగా వ్రాయించాడు. దానిని మనం వక్రీకరించకూడదు. అంతకు ముందు దేవుడే మోషేను ఫరోకు దేవుడుగా ఉంచాడు. ఇంకా అనేక మంది ఈ లోకంలోని జనుల చేత దేవుడుగా పూజింపబడు తున్నారు. అందుకే క్రీస్తును ఆ దేవుళ్ళ కన్నా బలవంతుడు అని చెప్పడానికి ఈ వాక్యం వ్రాయించాడు. అలాగే ఇశ్రాయేలీయులకు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, దావీదు ఇలా చాలా మంది పితరులు తండ్రులుగా పిలువబడ్డారు. వారంతా కొద్ది కాలము జీవించి మాయమైపోయినవారు. కాబట్టే ఎల్లకాలము ఉండే తండ్రి అని ఆయనకు ఆనాటి ఇశ్రాయేలీయుల చేత పేరు పెట్టబడుతుంది అని వ్రాయించాడు. అయితే క్రీస్తు బ్రతికి ఉన్నప్పుడు

ఆయనకు ఆ పేరు పెట్టుకొని సంతోషించి, ఆ ప్రవచనాన్ని నెరవేర్చారు. (లూకా 24:44; అపొ.కా. 3:18, 13:29) అవి ఇశ్రాయేలీయులు పెట్టుకొని, పిలుచుకొన్న పేర్లు లేక బిరుదులు తప్ప మనకు చెప్పినవి కావు. మనం పిలుచుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఎందుకంటే ఆయన అందరికి ప్రభువు అనేదే సరిపోతుంది గదా!

అలాగుననే సమాధానకర్తయగు అధిపతి అని వారు పేరుపెట్టుకొన్నారు. అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడు ఆయన మనుషులందరి సమాధానానికి కర్తయే. ఆయనను దేవుని కుమారుడని నమ్మి, నిత్యజీవానికి వారసులైన వారందరికి సంతోషము, సమాధానము కలిగింది, కలుగుతుంది, కలుగబోతుంది కూడా. దేవుడు కూడా సమాధానాధిపతియే కాని క్రీస్తు ద్వారా మనకు ఆ సమాధానాన్ని పంచుచున్నాడు. ఎన్ని బాధలున్నా యేసువైపు చూస్తే ఆ బాధలన్నీ మటుమాయమైపోతాయి గనుక ఆయనకు ఆ బిరుదులు లేక పేరు అన్ని చక్కగా సరిపోతాయి. ఆయన తన వాక్యములో చెప్పిన రీతిగా ఇప్పటికైనా మనం అర్థం చేసుకుంటే ఎంతో ఆనందిస్తాడు. లేదంటే భయంకరంగా శిక్షిస్తాడు. చెప్పిన మాట కాదంటే రాజైన సౌలుకు ఆనాడు ఏ గతిపట్టిందో మనందరికి తెలిసినదే.

# 21 నేనే - ఆయనను

**నాటి** ఇశ్రాయేలీయులకు, నేటి క్రైస్తవులకు అర్థంగాని మరో అద్భుతమైన మాటనే ఈ నేనే – ఆయనను అనే పదము. నేను ఆయనను అనే మాటలు పాత నిబంధనలోని యెషయా గ్రంథంలో ఉన్నాయి. నూతన నిబంధనలోని యోహాను సువార్తలో గూడా ఉన్నాయి. వీటిని బట్టి యేసే చెప్పాడు గదా నేనే, ఆయనని అలాగే దేవుడైన యెహోవా చెప్పాడు గదా నేనే ఆయనని గనుక ఆయనే ఈయన, నేనే తండ్రి నామమున వచ్చాను అన్నాడు గనుక ఆయన పేరులోని 'య' అక్షరం ఈయనకు కూడా ఉన్నది గనుక యషువ (హిబ్రూలో యేసును గూర్చి వ్రాసిన పేరు) అని వ్రాసిన పుస్తకాలు, పత్రికలు కూడా చూశాను. అలాగే నా నామము ఆయనకున్నదని ఒక దేవదూతను గూర్చి దేవుడు చెబితే ఆ దూతను గూర్చి ఇతను మరో యెహోవా అనియు అక్కడ ఇద్దరు యెహోవాలు కనబడుతున్నారని అపార్థం చేసుకొని, తప్పుడు పుస్తకాలు వ్రాసిన దొంగ అపొస్తలుల, దొంగ ప్రవక్తల పుస్తకాలు కూడా చూశాను. కాబట్టి ఈ **"నేనే–ఆయనను'** అనే వాక్యాలను గూడా ధ్యానించి యేసు–దేవుడు ఒక్కరేనా? త్రిత్వమా–ఏకత్వమా అనే విషయాన్ని గూర్చి మరోసారి పరిశోధన చేద్దాం.

"కాగా మీ పాపములోనే యుండి మీరు చనిపోదురని మీతో చెప్పితిని – నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను. కాబట్టి వారు–నీవెవరవని ఆయననడుగగా యేసు వారితో మొదటనుండి నేను మీతో ఎవడనని చెప్పుచుంటినో వాడినే. మిమ్మును గూర్చి చెప్పుటకును తీర్పు తీర్చుటకును చాలా సంగతులు నాకుకలవు గాని నన్ను పంపిన వాడు సత్యవంతుడు. నేను ఆయన యొద్ద వినిన సంగతులే లోకమునకు బోధించుచున్నానని చెప్పెను. తండ్రిని గూర్చి తమతో ఆయన చెప్పెనని వారు గ్రహింపకపోయిరి. కావున యేసు– మనుష్యకుమారుని పైకెత్తినప్పుడు నేనే ఆయనననియూ, నా అంతట నేనేమిచేయక, తండ్రి నాకు నేర్పినట్లు ఈ సంగతులు మాటలాడుచున్నాననియూ మీరు గ్రహించెదరు" (యోహాను 8:23–30).

వారి మధ్య తాను ఎన్ని సూచక క్రియలు చేసినా, అద్భుతాలు చేసినా యూదులు యేసును ఒక ప్రవక్తగా, మరియమ్మ సుతునిగా, వడ్లవాని కుమారునిగానే నమ్మారుగాని యేసు దేవుని కుమారుడని తాము ఎదురు చూసిన మెస్సయ్య ఈయనే అని అస్సలు నమ్మటం లేదు. అందుకే యేసు నేనే దేవుని కుమారుడనని చాలాసార్లు చెప్పి ఇది మీకెప్పుడు అర్థం అవుతుందంటే నేను పైకి ఎత్తబడిన తర్వాతనే సంగతి మొత్తం అంతా అర్థం అవుతుంది. అప్పుడు నేనే ఆయనను అనగా మొదట నుండి నేను యెవడనని చెప్పుచున్నానో ఆయననే నేను అని మీరు గ్రహిస్తారు అని చెప్పాడు. ఆయన యూదులతోను, శిష్యులతోను అందరితోను మొదట నుండి అప్పటి వరకు నేను దేవుని కుమారుడనని మాత్రమే చెప్పుకుంటూ వచ్చాడు గదా.

ఇక్కడ నేనే ఆయనను అంటే నేనే తండ్రినని అని చెప్పినట్లుగా కాదుగదా నేను తండ్రి చెప్పమన్న మాటలు చెప్పుతున్నాను అని

మరోసారి గుర్తు చేశాడే తప్ప నేనే తండ్రిని అని చెప్పడం లేదు. ఇక్కడొక ముఖ్య విషయము ఉంది. అదేదనగా మనుష్యకుమారునిన్ని పై కెత్తినప్పుడు అంటే నన్ను తండ్రి పైకెత్తినప్పుడైనా నేనే దేవుని కుమారున్నని మీరు నమ్ముతారు అన్నాడు. నన్ను పైకెత్తే వాడు వేరే ఉన్నాడు అతడు సత్యవంతుడు అని కూడా చక్కగా తెలియజేసాడు. సందర్భాన్ని సరిగా ఆలోచించి, సత్యవాక్యాన్ని సరిగా విభజిస్తేనే గాని అసలు విషయం అర్థంకాదు. ఇక దేవుడు మాట్లాడినటువంటి యెషయా గ్రంథంలోని వాక్యాల వద్దకు వెళదాం. సత్యాన్ని సత్మముగానే గ్రహిద్దాం.

''మీరు తెలుసుకొని నన్ను నమ్మి నేనే ఆయనని గ్రహించునట్లు మీరును, నేనే ఏర్పరచుకొనిన నా సేవకుడును నాకు సాక్షులు... నేను నేనే యెహోవాను, నేనే తప్ప వేరొక రక్షకుడు లేడు, ప్రకటించిన వాడును నేనే రక్షించినవాడను నేనే... ఈ దినము మొదలుకొని నేనే ఆయననియు నా చేతిలో నుండి విడిపించు వాడెవడును లేడు. నేను కార్యము చేయగా త్రిప్పివేయువాడెవడు?" (యెషయా 43:10-13).

"యాకోబు, నేనే పిలిచిన ఇశ్రాయేలూ, నాకు చెవియొగ్గి వినుము నేనే ఆయనను నేను మొదటి వాడను, కడపటివాడను" (యెషయా 48:12,13).

ఇక్కడ సందర్భాన్ని గమనిస్తే యెషయా ప్రవక్త కాలానికొచ్చే సరికి ఇశ్రాయేలీయుల సంతానము పూర్తిగా చెడిపోయి అన్యదేవతలవైపు, పాడైన లోకమువైపు చూస్తున్నది. దేవుడు ఆనాడు వారి పితరులకు చేసిన కార్యములన్నిటిని మరచిపోయారు. ఆనాడు మీ పితరులను ఐగుప్తు నుండి, కానానుకు మిమ్ముల్ని పిలిచింది, ఏర్పరచుకొని రక్షించినది సమస్తము నేనే. ఇప్పుడు యెషయా ద్వారా మీతో మాట్లాడుతున్నది పూర్వము మీ పితరులతో కూడా

మాట్లాడినవాడను నేనే. ఈనాడు మాట్లాడిన నేనే ఆనాడు మాట్లాడాను మిమ్మల్ని – మీ పితరులను ఆశీర్వదించినది నేనే అని చెబుతూ ఆ యెహోవాను నేనే కాబట్టి నేనే ఆయనను (దేవుడను) అని మాట్లాడుతున్నాడు దేవుడు. అంతేకాని నేనే రాబోయే మెస్సయ్యను అని అక్కడ చెప్పడం లేదు.

అయితే అపార్థము చేసుకొనుటకు ఇక్కడ ఒక పదము అవకాశమిచ్చింది. అదే రక్షకుడు. అనే పదం యేసు అంటేనే రక్షకుడు కదా! యేసు రక్షకుడే, దేవుడు కూడా రక్షకుడే గనుక ఇద్దరూ ఒక్కరే అని అనవచ్చు గనుక యేసే, యెహోవా అంటున్నారేమో. దేవుడు రక్షకుడే, యేసు కూడా రక్షకుడే అయితే యేసు దేవుడు పంపితే వచ్చి మనల్ని రక్షించాడు. దేవుడు తనంతటతానే మనల్ని రక్షించుచున్నాడు. అనగా దేవుడు యేసుక్రీస్తు ద్వారా మనల్ని రక్షించాడు గనుక ఈయన (దేవుడు) రక్షకుడే, ఆయనా (క్రీస్తు యేసు కూడా) రక్షకుడే అనగా రక్షించే విషయంలో ఇద్దరూ ఒక్కటిగా అనగా ఒక్కమాట మీదనే ఉన్నారని అర్థం. అంతేగాని దేవుడే స్వయంగా కాని అవతారమెత్తాడని గాని అనడం సత్యము అస్సలు కాదు.

ఉదా :– మీలో ఎవరైనా ఒకరోజు మా ఇంటికొచ్చారనుకొండి నేను ఈ బ్రదర్‌కు భోజనం పెట్టమంటే మా ఆవిడ మీకు భోజనం పెడుతుంది. మీరు బయటకు వెళ్ళాక జాన్ గారు చక్కని భోజనం పెట్టారు అంటారు. ఇంతకీ భోజనం పెట్టింది మా ఆవిడ అయినా నేను పెట్టినట్లే ఎందుకంటే నేను చెబితేనే మా ఆవిడ భోజనం పెట్టింది గనుక. ఆలాగుననే దేవుడు, యేసు మనకు రక్షకులయ్యారు. ఇది వాక్యంలో ఉన్న పరిశుద్ధాత్ముని బోధ. ఆయన (దేవుడు) ఆయనే, ఈయన (క్రీస్తు) ఈయనే ఇద్దరూ ఇద్దరే, ఇద్దరూ ఒక్కరు కాదు కాని ఒక్కటే.

ఈ మధ్యనే యావే సమాజం వారు పేస్‌బుక్‌లో ఒక కరపత్రం పెట్టి అందులో రెండు రెఫరెన్సులిచ్చి యేసే యెహోవా అని చెప్పుచున్నారు. అవేవనగా 1) ప్రకటన 1:8 "మృతుడనైతిని గాని యుగయుగములు సజీవుడనై యున్నాను". 2) ప్రకటన 2:8 "మృతుడై మరల బ్రదికినవాడు చెప్పు సంగతులేవనగా" నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆలోచించే ఓపికలేని అవిశ్వాసులు మరో వాక్యాలతో రుజువు చెయ్యాలని ప్రయత్నిస్తుంటారు. అయితే బైబిల్‌లోని ఒక వాక్యము, మరో వాక్యమును వ్యతిరేకించదు. ఎందుకంటే అవి ఒకే దేవుడు చెప్పగా ఒకే పరిశుద్ధాత్ముడు ప్రేరేపించి వ్రాయించినది. ఇక్కడ వచనాలు యేసును గూర్చి వ్రాసినవే కాని యేసు నేను మృతుడనైతిని గాని మరలా బ్రతికి సజీవుడనైనాను అంటున్నాడు. అలాగే పరలోకంలో పుట్టి భూలోకంలోనికి దిగివచ్చిన వాడు. అనగా యేసు క్రీస్తు పుట్టినవాడు, చనిపోయినవాడు, మరలా దేవుడు లేపితే సజీవుడైన వాడు అని మర్చిపోతున్నారు (1కొరింథీ 15:1-3).

కాని దేవుడు "ఉన్నవాడు" ఆయనకు చావు-పుట్టుకలు లేవు (1తిమోతి 6:16). అమరత్వము గలవాడని సిలువవేయబడిన క్రీస్తే బోధించాడు గనుక యేసు - యెహోవా ఎలాగవుతాడో కొంచెం బుర్రపెట్టి ఆలోచించండి. మరియు ఇంకో రెఫరెన్సును వెదికి చూపాలని ప్రయత్నించకండి. మీరెన్ని వాక్యాలు చూపినా దానికి జవాబు మరలా తప్పక బైబిల్‌లో ఉంటుంది. నాకు దేవుడంటే పిచ్చి, యేసుక్రీస్తు అంటే మహా పిచ్చి, పరిశుద్ధాత్ముడంటే మరీ మరీ పిచ్చి అని మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. ఎందుకంటే ఒకాయన కన్నవాడు, మరొకాయన తన రక్తమిచ్చి కొన్నాడు, ఇంకొకాయన నన్ను సరియైన మార్గంలో నడిపిస్తూ నా చేత ఇన్ని పుస్తకాలు వ్రాయిస్తూ, ఎన్నో వాక్యానుసారమైన ప్రసంగాలు చేయిస్తున్నవాడు. ఇలా ఆలోచిస్తే అద్భుతంగా ఉంటుంది.

# 22 యెహోవా సాక్షులు

దేవున్ని గురించి, ఆయన ఉనికిని గురించి ఇంతవివరంగా నేను వ్రాస్తుంటే మీ మనసులో నేనేమైనా యెహోవా సాక్షుల గుంపుకు చెందినవాడనేమోని అనుమానం రావచ్చు. నేను క్రీస్తుకు అనగా వాక్యానికి సాక్షినే. దేవుడెవరు అనే అంశంమీద వ్రాయుచున్నాను గనుక దేవుని గూర్చి వివరిస్తూ క్రీస్తు ఎవరో కూడా కొంత వరకు మీకు లేఖనానుసారంగా సాక్ష్యమిచ్చుచున్నాను. బైబిల్‌లో వ్రాయబడిన వాక్యానుసారంగా (యెషయా 43:10-12; 44:8) యెహోవాకు సాక్షులు ఇశ్రాయేలీయులు, దేవుని సేవకుడైన యేసుక్రీస్తు, పరిశు ద్ధాత్మలని కూడా అర్థమగుచున్నది. సాక్షులు అనగా కనిన, వినిన వారు అని అర్థం కాబట్టి దేవుని మాటలు నానా విధాలుగా విన్నవారు ఇశ్రాయేలీయులు (వారి ప్రవక్తలు) ఒకప్పుడు దేవునిని చూచి, ఆయన మాటలు విన్నవాడు క్రీస్తు, వీరు మాత్రమే యెహోవాకు సాక్షులు. ఈ రోజు భారతీయులు గాని, ఇశ్రాయేలుతో సహా ఏ దేశంలో ఉన్నవారైనా క్రీస్తును గూర్చి అనగా సువార్తను చెప్పవలసినవారై ఉన్నారు. గనుక మనమంతా అనగా అపొస్తలులు మొదలుకొని రాబోయే ఎన్ని తరాలలోని క్రైస్తవులైనా క్రీస్తుకు ఆయన చెప్పిన

వాక్యానికి సాక్షులు (అపొ.కా. 1:8) మనం ఈనాడు దేవున్ని చూడలేదు. క్రీస్తును గూడా చూడలేదు. ఆయన మాటలు అనగా పాతనిబంధనను పాటించడం లేదు. మరియు వాటిని కూడా వినలేదు గదా! నేడు యూదులం అనుకుంటున్న వారు కూడా వ్రాయబడిన వాక్యానికి మాత్రమే సాక్షులు. అందులో ఉన్నదే చెప్పాలి గాని మరొకటి కాదు గదా!

మరిప్పుడున్న యెహోవా సాక్షులు, యావే సమాజము వారిపేర్లు వాక్యానుసారమైనవోకాదో మీరే పై వాక్యాలను బట్టి గ్రహించుకోగలరు. నిజానికి ఇప్పుడున్న క్రైస్తవులు కూడా క్రీస్తును చూడలేదు, ఆయన మాటలు సరాసరి వినలేదు గనుక మనం కేవలం వాక్యానికి సాక్షులం. అపొస్తలులు క్రీస్తుకు సాక్షులైతే వారు బోధించిన బోధను గూర్చి, వాక్యాన్ని గూర్చి మనం సాక్ష్యమిచ్చుచున్నామని గ్రహిస్తే మరీమంచిది. ఇప్పుడెవరు క్రీస్తులేకుండా అనగా క్రీస్తు ద్వారా తప్ప దేవుడు లేదా తండ్రి వద్దకు వెళ్ళే అవకాశం ఎట్టి పరిస్థితిలో కూడా లేదు (యోహాను 14:6). గనుక ఒకసారి యెహోవా సాక్షులు, యావే సమాజము వారు వారివారి పరిధిని గూర్చి గూడా ఆలోచించమనండి. ఆ సంఘము/ సమాజము పేరుమార్చుకుంటే బాగుంటుందని చెప్పండి.

అయితే ప్రకటన గ్రంథంలో 11వ అధ్యాయంలోని ఇద్దరు యెహోవా (దేవునికి) సాక్షులు మాత్రం మోషే, ఏలియాలే. బైబిల్‌లోని సాక్ష్యాలు వారినే సమర్థిస్తున్నది. ఇకపోతే ఇప్పుడు అనగా ఈ కాలంలో యెహోవా ధర్మశాస్త్రము పూర్తిగా కొట్టివేయబడింది. యూదుల బలము అయినదే తీసివేయబడినది గదా. అందుకని ఇప్పుడు యెహోవాకు సాక్షులుగా ఎవరూ ఉండకూడదు.

పాతనిబంధన స్థానంలో క్రొత్తనిబంధన వచ్చింది. గనుక ఇశ్రాయేలీయులే ఉండకూడదంటేనే (గలతీ 3:23–29) దేవుని పేరు తండ్రి గనుక యెహోవా సాక్షులు అనే పేరు ఇప్పుడు విలువలేనిది. ఇప్పుడు, ఎప్పుడు లోకంలో దేవుని ప్రజలు, అన్యులు మాత్రమే ఉంటారు, ఉండాలి అంతే. ఒకప్పుడు ప్రపంచంలో ఇశ్రాయేలీయులు, అన్యులు మాత్రమే ఉన్నారు. నేడు కూడా క్రైస్తవులు అన్యులు మాత్రమే ఉండాలి. మధ్యలో ఇశ్రాయేలీయులకు కూడా స్థానం లేదు. వారికి అంటకట్టబడినా, వారి పేరు మార్చబడి క్రైస్తవులుగా, అనగా ఆనాడే క్రైస్తవులుగా మరియు విశ్వాసులుగా పిలువబడినది. ఈ విషయం యెషయా గ్రంథంలో 56:5లోను, దాని నెరవేర్పు జరిగిందని అపొ.కా. 11:26లో జరిగింది కూడాను. మళ్ళీ భాషల జోలికెళ్ళకండి ఆపైన మీ ఇష్టం. ఇదే 'యావే' సమాజం వారికి కూడా వర్తిస్తుంది.

ఇంకా వీరి సిద్ధాంతాలు, సంస్కృతి బైబిల్‌కు చాలా భిన్నంగా ఉన్నాయి. యెహోవాయే దేవుడు మిగతా ఎవ్వరు దేవుడు కాదు అనేది ఒక్కటి మాత్రమే కరెక్టు. రోగమొచ్చినప్పుడు మందులు (మెడిసిన్) వాడకపోవడము, వేరే వారి రక్తాన్ని అవసరమైనప్పుడు ఎక్కించుకోకపోవడం. నరకం–పరలోకం అంతా భూమిపైన ఉన్నది అని చాలాచాలా తప్పుడు సిద్ధాంతాలలో ఉన్నారు గనుక వారితో చాలా జాగ్రత్తగా నడుచుకోవాలి. వారిని ప్రేమతో క్రీస్తు నొద్దకు నడిపించాలి. దేవుని సంకల్పములో ఉన్నవారు తప్పక క్రీస్తుకోసం చెరపట్టబడుతారు.

# 23 నిజమైన దేవుడెవరు?

**దేవుడు** ఎవరు అనే విషయాన్ని ఈ పుస్తకంలో ముందే చర్చించి దేవుడెవరో గ్రహించాం కాని కొందరు క్రైస్తవులకు ఎన్ని రెఫరెన్సులు చూపినా ఇంకో రెఫరెన్సు చూపించాలనే తపనతో మనం చెప్పేది గూడా వినరు. ఎందుకని పరిశోధిస్తే నేను చెప్పేది తప్పుగనుక నన్ను రక్షించడానికి వారు మరో రెఫరెన్సుతో ప్రయత్నిం చేస్తున్నారంట. మనం వారిని కాపాడాలని ప్రయత్నిస్తే, వారేమో మనల్ని కాపాడాలని మనం చెప్పేది వినిపించుకోవడం లేదంట. క్రైస్తవులు కాని వారికి దేవుడెవరో చెప్పి తొందరగా ఒప్పించవచ్చును గాని తప్పుడు బోధలో ఉండి తలతిక్కప్రశ్నలతో సతమతమయ్యే క్రైస్తవులమనుకొంటున్న దుర్మార్గులతోనే ఈ చిక్కు అంతా. నిజమైన దేవుడెవరు? అని ఎందుకు వ్రాస్తున్నానంటే యేసుక్రీస్తే నిజమైన దేవుడని అనేకులు ఆ దేవుని వాక్యాన్ని అపార్థంచేసికొని, బోధించి అన్యాయమైపోతున్నారు. వాక్యాన్ని వక్రీకరించి బోధించిన వారిది అసలు తప్పైనా దానిని అనగా మన విశ్వాసాన్ని మనమే పరీక్షించుకోవాలి గదా! (2 కొరింథీ 13:5). ఎందుకంటే మన ఆత్మరక్షణ మనది. అవతలి వాడు మాయలోనో, మోసంలోనో పడి

తెలియక తప్పుచేప్పినా శిక్ష అతడికి ఉన్నా, అతనితో పాటు మనకు శిక్ష తప్పదు గనుక ఎవరి విశ్వాసాన్ని వారే పరీక్షించుకోవాలని హెచ్చరించాడు దేవుడు. కాబట్టే మరోసారి పరీక్షిద్దాం.

"మనము సత్యవంతుడైన వానిని యెరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకమునను గ్రహింపించియున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందున్నవారమై సత్యవంతునియందున్నాము. ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునైయున్నాడు" (1యోహాను 5:20).

సత్యము అనగా వాక్యము (యోహాను 17:11) అనగా క్రీస్తు. సత్యవంతుడు అంటే సత్యాన్ని కలిగియున్నవాడు అని అర్థం. ధనవంతుడు అనగా ధనాన్ని కలిగియున్నవాడు అని అంటాము గదా సత్యాన్ని అనగా క్రీస్తును కలిగియున్నవాడు తండ్రియైన దేవుడు అని సుళువుగా అర్థమవ్వాలి (యోహాను 1:1,2). ఆ సత్యవంతుడైన దేవున్ని యెరుగవలెనని ఆ దేవుని కుమారుడైన క్రీస్తు వచ్చి మనకు బోధించియున్నాడు. ఆ సత్యవంతుడే, ఆయనే అనగా ఆ దేవుడే (తండ్రే) నిజమైన దేవుడు, నిత్యజీవమునైయున్నాడు అని పరిశు ద్ధాత్మ ద్వారా యోహాను గారు చక్కగా చెప్పారు అంతేగాని యేసుక్రీస్తును గూర్చి కాదు. యేసే నిజమైన దేవుడని అనేక మంది విశ్వసిస్తూ పాటలు వ్రాసి పాడుతున్నారు. ఆ వాక్యాము పై వాక్యము కూడా దేవునిమూలముగా అనగా దేవుని వాక్యమును విని, ఒకప్పుడు వాక్యమైయున్న దేవుడు ద్వారా తిరిగి పుట్టిన (బాప్తీస్మం తీసుకొన్న వాడు) వాడు పాపం చేయడని యెరుగుదుము అంటున్నాడు (1యోహాను 4:7). పాపం చేయకుండా తన్నుతాను

కాపాడు కొంటాడు అని గూడా చెప్పాడు. ఇంతకు ఏమిటా పాపమో తెలుసా? యేసే నిజమైన దేవుడు అని ఎట్టి పరిస్థితిలో చెప్పకూడదు.

మనల్ని మనం ఆత్మ చేత భద్రపరచుకోవడం అంటే యేసు క్రీస్తు నిజమైన దేవుని కుమారుడని చెప్పాలి, మరియు ఇదే చెప్పి అనేకులను క్రీస్తునొద్దకు నడిపించి, దేవునిలో ఉంచాలన్నా ఈ బోధనే అవసరం. ఎందుకంటే క్రీస్తు భూమి మీదకొచ్చే సరికే దేవుడెవరో ప్రపంచానికి తెలియపర్చబడింది. ప్రపంచంలోని ప్రజలందరూ ఏ మతం వారైనా దేవుడొక్కడే ఆయనపైనున్న వాడని నమ్ముతున్నారు. ఇప్పుడు యేసే నిజమైన దేవుడంటే ఈ విదేశీ దేవుడు, విదేశీ మతం మా కొద్దు అని అంటున్నారు గదా! కొందరు ఈ కొత్త దేవుడు మాకొద్దు, మా దేశపు దేవుళ్ళు చాలామంది ఉన్నారు అని అనడం గూడా చూస్తున్నాం. ఒక రకంగా సాతాను కూడా దేవునిని గూర్చి బైబిల్‌లో చెప్పిందే కరెక్టు అని రుజువు చేస్తుంది. యేసు నిజమైన దేవుని కుమారుడంటేనే అన్యులందరూ త్వరగా నమ్మే అవకాశం ఉంది. అందుకే దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు, దేవుని ఆత్మ అందరూ యేసు దేవుని కుమారుడనే చెప్పారు, మనల్ని కూడా చెప్పమన్నారు.

ఇప్పుడు మన దేశ పతాకంలో సత్యమేవజయతే: అని ఉంటుంది. వీరు వెతుకుతున్న ఆ సత్యమే యేసుక్రీస్తు, ఆ సత్యాన్నికని, కలిగియుండి, ఆ సత్యాన్ని గూర్చి సాక్ష్యమిచ్చుటకే ఆయను అనగా క్రీస్తును శరీరధారిగా ఈ లోకానికి పంపిన వాడే సత్యవంతుడు అని చెప్పేటందుకే మనల్ని సువార్త చెప్పే పని చేయమన్నాడు. యేసుక్రీస్తు సత్యమని, ఆయన తండ్రియైన దేవుడే సత్యవంతుడని,

ఆయనే నిజమైన దేవుడు, నిత్యజీవమునైయున్నాడని చెప్పేవారే నిజమైన దేవునికుమారులు, క్రీస్తు శిష్యులైన క్రైస్తవులు లేదా విశ్వాసులు. యేసుకు తండ్రియైన ఆ దేవుడే సత్యవంతుడు (యోహాను 8:26; రోమా 15:8,9; 1థెస్స 1:9–10) అని చెప్పాలి. ఎప్పుడైనా, ఎవరైనా, ఎన్నిసార్లడిగినా తండ్రియైన దేవుడే నిజమైన దేవుడు (యిర్మీయా 10:10) అని గూడా చెప్పాలి. అలాగుననే ప్రవక్తలు, అపొస్తలులు గూడా బోధించారు. అలా చెప్పేవారు మాత్రమే ఆయన నిత్యజీవాన్ని రుచిచూస్తారు.

ఇలా ఓపికతో, ఆలోచనతో దేవుని వాక్యాన్ని చదువలేక తొందరపడి యేసే నిజమైన దేవుడును నిత్యజీవమునైయున్నాడని బోధించి, పాటలు పాటి, పాపము చేసి ఎందరో నరక పాత్రులగు చున్నారు. పరిశుద్ధాత్మప్రేరణతో వ్రాయబడిన బైబిల్‌లో ఉన్నదానిని కాదంటే పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా మాట్లాడినట్లే గనుక వారికి ఏ యుగంలోను పాప క్షమాపణలేదు. తండ్రి ఎవరో తెలియదు, ఆయన కుమారుడెవరో తెలియదు అయినా చర్చీలలో పెద్దలుగా, రెవరెండు, బిషప్‌లుగా బైబిల్ కాలేజీలు పెట్టి ప్రిన్సిపాల్స్‌గా, డైరెక్టర్లుగా నేడు ఊరేగుచున్నారు చాలా మంది.

అలాగే పరిశుద్ధాత్మను గూర్చి యేసు సాక్ష్యము చెబుతూ నేను వేరే, పరిశుద్ధాత్మ కూడా వేరుగా ఉన్నాడని చెప్పాడు. పరిశుద్ధాత్మ కూడా దేవత్వాన్ని కలిగియున్నాడు గనుకనే ఆయన కూడా ప్రభువు లేక దేవుడని సంభోధిస్తూ వ్రాయబడియున్నది. అయితే ఎవరి పని వారు జరిగించుచూ మనందరి రక్షణ కోసం ఈ ముగ్గురు ఒకే మాట మీద నిలబడి మన రక్షణ విషయంలో ఏకీభవించి మనలను

కాపాడుచున్నారు. తండ్రి కుమారున్ని కంటాడే గాని కుమారుడుగా మారడు, అవతారమెత్తడు. అలాగే కుమారుడు తనో కుమారున్ని కంటేనే తండ్రికాగలడు. ఇది మనందరికి తెలిసిన పచ్చి నిజం. వేరే వాళ్ళు కన్న పిల్లలను పెంచి, పోషించి, రక్షించిన ఆయన కూడా తండ్రి అని పిలువబడుతాడు. కాని ఎప్పటికి కన్న తండ్రి కాడు. కాబట్టి మరలా చెబుతున్నాను కుమారుడు కుమారుడే, తండ్రి తండ్రే ఇప్పటికైనా క్రైస్తవులమని చెప్పుకుంటూ ఊరేగుతున్నవారు తెలుసుకొన్నారనుకొంటున్నాను. దేవుడు, దేవుడేనని అందరూ నమ్మి, క్రీస్తులోనికి బాప్తీస్మం తీసుకోవాలనే ఆశ, ఆశయంతోనే ఈ పుస్తకం వ్రాస్తున్నాను. కాబట్టి తండ్రి దేవుడు, యేసుక్రీస్తు కుమారుడు, పరిశుద్ధాత్ముడు ఆదరణకర్త. ఈ ముగ్గురు ముగ్గురుగా అనగా ప్రత్యేకమైన శక్తులుగాను, వ్యక్తులుగాను ఉన్నారు. మానవాళి రక్షణ విషయంలో ఎల్లప్పుడు ఏకంగా వున్నారు. సత్యవంతుడైన దేవుని యొద్దనుండి ముందు సత్యము వచ్చింది, తర్వాత సర్వసత్యము కూడా వచ్చి బోధ చేసింది. సత్యవంతుడే నిజమైన దేవుడు వీరిద్దరూ (క్రీస్తు, పరిశుద్ధాత్మ) దేవుడు పంపితే వచ్చిన దేవుని పిల్లలుగానే చెప్పబడినారు గనుక మనమంతా అలాగే నమ్మి, విశ్వాసములో బలపడాలి.

# 24 స్తోత్రార్హుడెవరు?



**నేటి** తెలుగుక్రైస్తవ ప్రపంచలో 95% వరకు ప్రతి మీటింగ్‌లోను, ప్రతి శుభకార్యాలలోను అందరికి వచ్చే పాటపాడుకుందాం అనగానే, పాటలపుస్తకం లేకుండా ఓ పాట ఎత్తుతాం. అదే "స్తోత్రం చెల్లించెదము.... యేసునాధుని మేలును తలచి స్తోత్రము చెల్లించెదము" ఇలా ఎన్నో యేసుక్రీస్తును మాత్రమే స్తుతించి, ఘనపరచి ఆరాధించే పాటలు వేలకొలది ఉన్నాయి. ఇలాంటి చాలా వరకు పాడటానికి, జ్ఞాపకముంచుకోవడానికి చాలా సుళువుగా ఉంటాయి. ఇంకా ఇంగ్లీషు, తమిళ, కన్నడ, మరాఠీ మొదలగు భాషలలో గూడా అలాగే ఉంది కాని ఆ భాషలలో నాకు ప్రావీణ్యం లేదు గనుక వాటిని గూర్చి వ్రాయలేదని గమనించండి. ఈ పాటలు పాడుతూ దేవున్ని స్తుతిస్తున్నామనుకొని అమాయకంగా చిన్నలు మొదలుకొని పెద్దలవరకు కంఠస్తం చేసుకొని పాడుతారు. దీంట్లో ఉన్న అర్థం ఆ పాటను వ్రాసిన వారిని అడిగితే సరియైన వాక్యాన్ని చూపిస్తాడా? పాడేవారు, వినేవారు ఏనాడైనా ఈ పాటలు ఎంతవరకు వాక్యానుసారంగా ఉన్నాయి అని ఆలోచించారా? చెప్పండి. బైబిల్ మాకే బాగా తెలుసు అనుకునే పరిశుద్ధులు, వీరులు

కూడా క్రీస్తును స్తుతించే విషయాన్ని జాగ్రత్తగా ఆలోచించలేక పోతున్నారు. దీనికంతటికి కారణమైన బైబిల్‌లోని ఓ వాక్యాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాం. ఇలా క్రీస్తును స్తుతించే ఈ పాటలన్నిటికి మూలకారణం ఈ వాక్యమే. ఇది తెలుగు బైబిల్‌లోనే ఉన్నా ఇంగ్లీషులో ఉన్నా అది మిగతా వాక్యాలన్నిటితో పోలిస్తే ఎంతవరకు సత్యానికి స్తంభంగా నిలబడుతుందో చూద్దాం.

"పితరులు వీరివారు, శరీరమును బట్టి క్రీస్తు వీరిలో (ఇశ్రాయేలీయులలో) పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడై ఉండి నిరంతరము స్తోత్రార్హుడై ఉన్నాడు. ఆమేన్" (రోమా 9:4,5).

ఈ వాక్యములో యేసుక్రీస్తు సర్వాధికారియైన దేవుడై ఉన్నాడనియు, ఆయనే నిరంతరం స్తోత్రార్హుడై ఉన్నాడనియు అర్థమిచ్చుచున్నట్లు ఉంది. అయితే ఇది పరిశుద్ధాత్మపూర్ణుడైన పౌలు ఇశ్రాయేలీయుల గురించి బాధపడుతూ వారి రక్షణ కోసం వ్రాస్తున్నాడు కాని అదే పౌలు వ్రాసిన మరే పత్రికలలోనూ ఇలా లేదు. పైగా ఈ వాక్యానికి వ్యతిరేకంగా అదే రోమా పత్రికతో పాటు మిగతా అన్ని పత్రికలలో          ఉన్నది. అందుకే ఈ వాక్యముపైన జాగ్రత్తగా ధ్యానించాలి. పరిశోదించి, పరిశీలించాలి. ఇది అతి సున్నితమైన విషయం. ఇప్పటికే క్రైస్తవ ప్రపంచంలో అనేకులు పైవచనాన్నే గుడ్డిగా నమ్మియున్నారు.

నిజంగా పౌలు గారు పరిశుద్ధాత్మ ప్రేరణతో దీనిని వ్రాస్తే (2పేతురు 1:20,21) ఇలా రెండు విధాలుగా అనగా రెండు నాలుకలతో మాట్లాడినట్లు ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉండవు. సాతాను రెండు నాల్కలతో మాట్లాడుతాడు గాని, దేవుడు ఎప్పుడు

మాట్లాడడు. బైబిల్‌లో కొన్ని వచనాలు ఒకదానికొకటి వ్యతిరేకంగా మాట్లాడినట్లు ఒకవేళ మనకు అనిపిస్తే వాటిని మళ్ళీ, మళ్ళీ చదివి, ఒకే అర్థం వచ్చేటట్లుగా ఆలోచించి అర్థం చేసుకోవాలి. పౌలు గారి మీద నేటికి అనేకులకు విశ్వాసం లేదు. ఎందుకంటే ఆయన బోధను చదివి, ఆలోచించి అర్థం చేసుకొనే ఓపిక లేక (2పేతురు 3:15-17) చాలా మంది ఆయన వ్రాసిన పత్రికల జోలికెళ్ళరు. కాని వీటిలోనే సర్వ సత్యమున్నది, వీటి ద్వారానే మనకు అంత్య దినమున తీర్పు జరుగుతుంది. (రోమా 2:16) అని మర్చిపోతున్నారు.

పౌలు పత్రికలలో ఉన్నంత దేవుని జ్ఞానం బైబిల్‌లోని మరే పుస్తకాలలో లేదంటే అతిశయోక్తికాదు. (రోమా 15:15-21) ఇతడు బోధించిన బోధనలన్నియు పాతనిబంధనలోని ప్రవక్తల లేఖనాలను ఆధారం చేసుకొని బోధించినవే తప్ప మరొకటి కాదు. ఎందుకంటే ఆయన ధర్మశాస్త్రాన్ని బాగా చదివిన వాడుగదా! అపొ.కా.లో పౌలు గారు ఒకచోట ఇచ్చిన సాక్ష్యము చూద్దాం.

"...ప్రవక్తలును, మోషేయు ముందుగా చెప్పినవికాక మరి ఏమియు చెప్పక, అల్పులకును, ఘనులకును సాక్ష్యమిచ్చుచుంటిని" (అపొ.కా. 26:2-23)

"అతినికి ఒక దినము నియమించి అతని బసలోనికి అతనియొద్దకు అనేకులు వచ్చిరి. అతడు (పౌలు) దేవుని రాజ్యమును గూర్చి పూర్తిగా సాక్ష్యమిచ్చుచు, మోషే ధర్మశాస్త్రములోనుండియు, ప్రవక్తలలోనుండియు సంగతులెత్తి యేసును గూర్చి వివరముగా బోధించుచు, వారిని ఒప్పించుచుండెను" (అపొ.కా. 28:23).

మోషే గ్రంథములోని పది ఆజ్ఞలలో దేవుడు (నిర్గమా.కా. 20:4) నన్ను తప్ప ఎవరినిగాని, దేనిని పూజింపకూడదనే విషయాన్ని ముందుగానే చర్చించాం. అలా చేయాలంటే ఆయన భీకరుండు, భయంకరుడైన దేవుడు అనే విషయాలు కూడా మోషే గ్రంథాలలో ఉన్నది. ఇక ప్రవక్తల గ్రంథాలలో కూడా ఎలావుందో చూద్దాం. అపుడు రోమా 9:5లో ఉన్నది ఎంతవరకు వాస్తవమో, అది ఒరిజినల్లో అలాగే ఉందా? లేక ఇది అచ్చుతప్పా? తర్జుమా తప్పా? అనేది సులువుగా అర్థం అవుతుంతది. కాబట్టి ముందుగా క్రీస్తుకు మూలపురుషుడైన దావీదు గారి మాటల్లోనే స్తోత్రార్హుడెవరో? చదువుదాం.

“రాజైన దావీదు కూడను బహుగా సంతోషపడి సమాజము పూర్ణముగా ఉండగా యెహోవాకు ఇట్లు స్తోత్రములు చెల్లించెను– మాకు తండ్రిగానున్న ఇశ్రాయేలీయులదేవా యెహోవా, నిరంతరము నీవు స్తోత్రార్హుడవు” (1దిన 29:10,11).

“యెహోవా జీవముగలవాడు, నా ఆశ్రయదుర్గమైన వాడు స్తోత్రార్హుడు. నా రక్షణకర్తయైన దేవుడు బహుగా స్తుతినొందును గాక” (కీర్తన 18:46; 106:48).

“వారు సైన్యములకధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది అని గొప్ప స్వరముతో గానప్రతిగానములు చేయుచుండిరి” (యెషయా 6:3,4; 42:10).

ఇలా మోషే మొదలుకొని ప్రవక్తలందరు దేవునిని స్తుతించుచూ, ఆయనే స్తోత్రార్హుడు అని వ్రాశారు. ఇక దావీదు

కీర్తనలన్నింటిలో కీర్తనీయుడు, స్తుతి పాత్రుడు, పూజార్హుడు స్తుతుల మీద ఆసీనుడు ఇలా ఎన్నో కీర్తనలలో ఎన్నోరకాలుగా దేవునిని స్తుతించమన్నాడు. ఇన్ని చదివిన పౌలు క్రీస్తును ఎలా స్తుతించమని తన రోమాపత్రికలో వ్రాశాడు? ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. రోమా 9:5లో తప్ప మరెక్కడైనా ఇలా ఉందా? అని ఆయన పత్రికలన్నింటిని వెతకడం ప్రారంభించాను. ఆశ్చర్యంగా మిగతా చోట్లన్నిటిలో ప్రవక్తలబోధల ప్రకారంగా ఆయన కూడా దేవునినే స్తుతించాడు, అందరిని తనలాగే స్తుతించమన్నాడు. అందుకే ఆయన పత్రికల్లోనే ఆయన వ్రాసిన విషయాలను ఒకసారి కూడా ఆలోచించమని కూడా వ్రాసాడు (2 తిమోతి 2:7). దేవుని ఆత్మతో ఆలోచించినప్పుడు, అన్యజనులకు అపొస్తలుడైన అనగా మనందరికి అపొస్తలుడైన పౌలుగారి పత్రికలో గాని మరెక్కడ రోమా 9:5నకు మరొక జతపక్షి సాక్షిగా దొరకలేదు.

"మీ విశ్వాసము సర్వలోకమున ప్రచారము చేయబడు చుండుటను బట్టి, మొదట మీ అందరి నిమిత్తము యేసుక్రీస్తు ద్వారా నా దేవునికి కృతజ్ఞస్తుతులు చెల్లించుచున్నాము". (రోమా 1:8, 7:25; 1కొరింథీ 1:4; 2కొరింథీ 1:2,3; ఎఫెస్సి 1:3; ఫిలిప్పీ 1:6; కొలస్సి 1:3-4; 1థెస్స 1:2,3,13; 2థెస్స 1:3, 2:13; 1పేతురు 1:3; ఫిలేమోను 6). (ఇంకా చాలా చోట్ల దేవునికి స్తోత్రములు అని ఉన్నది.)

"అట్టివారు దేవుని సత్యమును, అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై ఉన్నాడు. ఆమేన్" (రోమా 1:25).

“నేనబద్ధమాడుట లేదని నిరంతరము స్తుతింపబడుతున్న మన ప్రభువగు యేసు యొక్క తండ్రియగు దేవుడు ఎరుగును” (2కొరింథీ11:31).

ఇలా సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించిన పౌలుగారు తన సంపూర్ణ సువార్త లేదా సర్వసత్యములో ఎక్కడా ఆయన గమలీయేలు పాదాల వద్ద నేర్చుకొన్న ధర్మశాస్త్రానికి, నాటి ప్రవక్తలబోధకు ఏనాడు అడ్డురాలేదు. పైగా క్రైస్తవులైన ప్రతివారు క్రీస్తు ద్వారా దేవున్ని మాత్రమే స్తుతించాలి అని ఆజ్ఞాపించాడే తప్ప మరొకటికాదు. పౌలు చేసిన సువార్త, దానిని గూర్చిన వాదోపవాదాలు, తర్కాలు అందులోని దేవుని జ్ఞానం క్రీస్తు సంఘస్థాపకుడు, ఆనాటి మొదటి సంఘ స్థాపకుడు పెద్ద అయిన పేతురుకే మొదట్లో కొన్ని సంగతులు అర్థం కాలేదంటే ఆశ్చర్యపడాలి (2పేతురు 3:15-17). పౌలుగారు మన పాటలన్నీ, పనులచేత కూడా దేవునినే స్తుతించాలని ఎంత ఖచ్చితంగా చెప్పాడో చూద్దాం.

“సంగీతములతోనూ, కీర్తనలతోనూ, ఆత్మసంబంధమైన పద్యములతోనూ, ఒకనినొకడు బోధించుచూ, బుద్ధిచెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యండి మరియు మాటచేతగాని, క్రియచేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరిట చేయండి” (కొలస్సి 3:16,17; ఎఫెస్సి 5:19-21).

దీనినిబట్టి మనం పాటలు వ్రాసినా, పాడినా వాయిద్యాలు ఉన్నా లేకపోయినా రాగం తాళయుక్తంగా వాటితో తండ్రియైన దేవునినే స్తుతించాలని, కీర్తించాలని, ప్రతిపాటలోనూ దేవుని బోధ, హెచ్చరిక తప్పక ఉండాలని, దేవుడైన ప్రభువు యొక్క పనిచేయాలనే మేలుకొలుపు ఉండాలని అర్థమగుచున్నది. సంగీతం, సాహిత్యం బాగుండి మంచి ఊపుమీద, పాడటానికి సులువుగా ఉందికదా అని ఏ పాటపాడినా ఏముందిలే అని వాక్యానికి వ్యతిరేకమైన పాటలు పాడి, దేవుని మనస్సునొప్పిస్తే మనకు నరకములో శిక్షేగతి. కాబట్టి దేవునినే స్తుతిస్తున్నామనే భక్తి, భ్రమలో ఉన్న వారలారా ఒకసారి ఆలోచించండి. ఏ పాటలో దేవుని స్తుతి, బోధ, హెచ్చరిక ఉందో ఒకసారి మన దగ్గర ఉన్న పాటల పుస్తకాలు, క్యాసెట్లు, సిడిలను తిరగేద్దాం లేకపోతే పాట వ్రాసినవారు, పాడినవారు, సంగీతం సమకూర్చి వాయిద్యాలు వాయించిన వారు, చివరగా విన్నవారు కూడా సరిచేసుకోకపోతే మాత్రం దేవుని శిక్షకు బాధ్యులవుతారని మరచిపోకండి. ఎందుకంటే మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూసుకొనండి (మార్కు 4:24) అని మన జీవగ్రంథములో ఉంది.

ఇంతకీ పైన వ్రాసినవన్నీ బాగానే ఉన్నాయి గాని మరి రోమా పత్రిక 9:5లోని (తెలుగు ప్రొటెస్టెంట్ బైబిల్) స్తోత్రార్హుడని ఉన్న సంగతేమిటో అని ఇంకా ఆలోచనలో ఉన్నా అక్కడ జరిగిన అచ్చుతప్పును ఈ పాటికే గ్రహించేసారా? లేదా? ఇంగ్లీషులో నుండి తెలుగును తర్జుమా చేయకపోయినా, నాకు బాగా వచ్చిన భాష అయిన ఇంగ్లీషుబైబిల్‌లోని 4,5 ఎడిషన్‌లు చూశాను అందులో ఈ వాక్యము చాలాబాగుంది.

“whose are the Fathers, and from whom is the Christ according to the flesh, Who is over all, God blessed forever. Amen (Roma 9:5) ఇదే విషయాన్ని ఈ మధ్యనే రోమన్‌కాథలిక్ వారు తెలుగు బైబిల్‌లో చాలా వరకు సరిచేసి అనువదించి ప్రింట్ చేశారు.

“వారు మన పితరుల వంశీయులే. క్రీస్తుమానవరీత్యా వారి జాతివాడు. సమస్తమునకు ఏలికయగు దేవుడు సదా స్తుతింపబడును గాక... ఆమేన్” (పవిత్ర గ్రంథము రోమా 9:5).

పైన వ్రాయబడిన వాక్యాలలో ఆర్.సి.ఎం. వారు ఒక సంగతిని మరచినట్లుగా ఉన్నది ఏమంటే దేవుడు సమస్తమునకు ఏలిక అని వ్రాశారు అందులో అనడానికి ఏమీలేదు కాని క్రీస్తు సర్వాధికారి అనే విషయం వ్రాయడం మరిచారు ఎందుకంటే ఆయనను గూర్చి ఇంగ్లీషులో Who is over all అనే మాట ఉన్నది. మత్తయి సువార్తలో ప్రభువు చెప్పాడు గదా! నాకు ఇప్పుడు సర్వాధికారము ఇయ్యబడియున్నదని (మత్తయి 28:18) కావున మనం వాడుతున్నది అనగా మన చేతిలో ఉన్న ప్రొటెస్టెంట్ తెలుగు బైబిల్‌లో ఈ వచనం నిజానికి ఎలా ఉండాలంటే...

“పితరులు వీరివారు, శరీరమునుబట్టి క్రీస్తు వీరిలోపుట్టెను. ఈయన సర్వాధికారి, దేవుడు నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు. ఆమేన్” అని ఉండాలి.

ఈ పని బైబిల్ సొసైటీవారు ఎప్పుడో చేసిఉండాలి. ఎవరో, ఎప్పుడో చేసిన పొరపాటుకు అనగా సాతాను మన ముందు తరం వారికి అనగా అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గుడ్డితనాన్ని

కలుగజేసింది (2కొరింథీ 4:4). ఇలాంటి అచ్చుతప్పులు, తర్జుమా తప్పులు, కలుపుట, తీసివేయడాలు చాలా జరుగుతాయని ముందే తెలిసిన దేవుడు మనల్ని అంతకుముందే హెచ్చరించాడు. ఆ హెచ్చరికలను మనం జ్ఞాపకం చేసుకోవడం లేదు. అవేమిటంటే వింటున్న ప్రతీది బైబిల్ ప్రకారంగా చూసుకోవాలి (మార్కు 4:24), మన విశ్వాసాన్ని మనమే పరీక్షించుకోవాలి (2కొరింథీ 13:5), దేవుడు చెప్పిన ప్రతిమాటను ఆలోచించాలి (2తిమోతి 2:7), (యెహెజ్కేలు 7:26) బైబిల్‌లోని సంగతులు ఎవరు చెప్పినా అవి బైబిల్‌లో ఉన్నా అవి అలాగున్నాయో లేదోనని ప్రతి దినం పరిశోధించాలి. (అపొ.కా. 17:11; ఎఫెస్సి 3:3; 1పేతురు 1:10,1; యెషయా 34:16; ఎజ్రా 7:10). వీటన్నిటిని నా ప్రతి పుస్తకంలో, కరపత్రాలలో, మాట్లాడిన ప్రతి ప్రసంగంలో ఎప్పుడూ జ్ఞాపకం చేస్తూనే ఉన్న సంగతి మీకే తెలుసు.

అపొస్తలుల బోధ అనగా సిలువ వేయబడిన క్రీస్తు బోధలో ఇన్ని వాక్యాలను రుజువు చూపినా ఇంకా కొందరు అజ్ఞానముతో యేసు జన్మించినప్పుడు వచ్చిన జ్ఞానులు ఆయనను పూజించి, నమస్కరించారు గదా అని ప్రశ్నించుచున్నారు. వచ్చిన ఆ జ్ఞానులు దేవుని పిల్లలు కారు, యెరుషలేముకు తూర్పున ఉన్న మోయాబు దేశానికి చెందిన లోక జ్ఞానులు, మాత్రమే. వారు రాజులు కూడా అయి ఉండవచ్చును. ఎందుకనగా ప్రవక్తల ప్రవచనాల నెరవేర్పు అది. (కీర్తన 72:10–15; యెషయా 60:6,7) వారికి లోక జ్ఞానం తప్ప దేవుని జ్ఞానం (ధర్మశాస్త్రం) లేనివారు. రాజులను, మనుషులను పూజించే అలవాటున్న వారు గనుక, యూదులరాజు అనుకొని

మొక్కినారే తప్ప, ఆయన మెస్సయ్య అని గాని, దేవుని కుమారుడని గాని దేవుడని గాని అని వారు క్రీస్తును మొక్కలేదు. నాటి ఇశ్రాయేలీయులను గాని, నేటి క్రైస్తవులలైన దేవుని ప్రజలను గాని దేవునికి తప్ప మరెవ్వరికి మొక్కకూడదని, పూజింపకూడదనే ఆజ్ఞలను మరచిపోతే ఎలా. అలాగే ప్రభువు ఈ లోకానికి వచ్చిన దినాన వచ్చిన గొల్లలు, దేవదూతలు కూడా దేవునిని స్తుతిస్తూ, ఆయననే మహిమపరుస్తూ వెళ్ళారు అనే సంగతిని ఈ అవిశ్వాసులెప్పుడు గుర్తిస్తారో తండ్రీ (లూకా 2:13-20).

మరికొందరు మూర్ఖాగ్రేసరులు ప్రకటన గ్రంథములోని 5:11-14 వచనాలను చూపించి ముల్లోకాలలో ఉన్న ప్రతి సృష్టము దేవునితో పాటు గొర్రెపిల్లకు స్తోత్రము చెల్లించారని అమాయకంగా, అక్రమంగా మాట్లాడుతున్నారు. ఇంత వరకు పరలోకమునకు ఎవ్వరూ పరలోకం వెళ్ళలేదు గనుక ఆ 24గురు పెద్దలు గూడా దేవదూతలు, సృష్టిలోని ప్రతి సృష్టము దేవదూతల మయం (కీర్తన 148), ఆ దూతలు (భూమి, నీరు) పుట్టించిన ప్రతి జీవి గూడా వారి సృష్టికర్తయైన ప్రభువును అనగా క్రీస్తును స్తుతించాలి, పూజించాలి అదే సంగతిని మర్చిపోయారు (హెబ్రీ 1:6-8). అన్యులవలె, అజ్ఞానముతో అనగా దేవుని వాక్యములోని దానికి వ్యతిరేకముగా మాట్లాడే మూర్ఖుల నోరు మూయుటకే నేనీ సంగతిని మరీ మరీ గుర్తుచేస్తున్నాను.

ఇకపోతే దేవుడు తన స్వరూపంలో పుట్టించిన మనం, ఆయన హస్తములతో నిర్మించిన మన దేహంలోని ప్రతి అవయవం, ముఖ్యంగా ప్రతివాని మోకాలు యేసు నామంలో దేవుని ముందు

వంగాలే తప్ప, యేసుముందు కాదనే సంగతిని కూడా జ్ఞాపకం చేస్తున్నాను. (ఫిలిప్పీ 2:9; యెషయా 45:22,23; కీర్తన 103:1,2; కీర్తన 111:9,10, 96:4,9). ఈ విషయంలో ధర్మశాస్త్రము ఇంకా ఉన్నది, పూర్తిగా కొట్టివేయబడలేదని వాదించే యావే సమాజము కూడా యేసే, యెహోవా అనుకొని, ఆయన నామము, ఈయన నామము ఒకటేననుకొని భయంకరమైన తప్పుచేస్తున్నారు. వాక్యానుసారముగా నేను చెప్పునదేమనగా దేవుని ప్రజలైన వారిని కూడా (నాడు–నేడు) యేసుప్రభువును, స్తుతించండి, పూజించండి అనే ఒక్క రెఫరెన్సు డైరెక్టుగా బైబిల్‌లో ఉన్నది చూపించండి లేదా నోరుమూయండి.

ఇంత చదివాక గూడా మీ అనుమానం తీరకపోతే నేనేమి చెయ్యలేను. బైబిల్‌లో ఉన్నది. అందరూ అపార్ధము చేసుకొనే దాన్ని సరిచేసి వివరించాను. ఆయన అనగా యేసుక్రీస్తు ప్రభువు స్తోత్రించటానికి అర్హుడైనా మనం ఆయనను స్తుతించగూడదన్నదే దేవుని ఆజ్ఞ, ఆయన మాట. ఉదా:– ఐ.ఎ.యస్ చదివిన వారికి కలెక్టర్ అయ్యే అర్హతలు అన్నీ ఉన్నా అతడు కలెక్టర్ అయినప్పుడే మనం అతన్ని కలెక్టర్‌గా గుర్తించాలి, పిలవాలి, గౌరవించాలి. ఎందుకంటే ఐ.ఎ.యస్ చేసినవాళ్ళంతా తప్పనిసరిగా కలెక్టర్ అవ్వాలనే రూలులేదు అవకపోవచ్చుగదా. కొందరు సెక్రటరీలు, కొందరు పర్సనల్ అసిస్టెంట్, పర్సనల్ సెక్రటరీలు, మరికొందు కమీషనర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు అవుతున్నారుగదా! మరలా చెబుతున్నాను. నేను క్రీస్తు యొక్క గొప్పతనాన్ని ఏ మాత్రం తగ్గించడం లేదు. ఆయనకున్న మహిమ ఆయనకున్నది. ఎవరి

గొప్పతనాన్ని వారికే ఆపాదించాలి అనేదే ఇందులోని అసలు విషయం. ప్రతి కృతజ్ఞతాస్తుతి యేసుక్రీస్తు ద్వారా తండ్రియైన దేవునికి చేరాలి. ప్రతి ఆరాధన క్రీస్తు, పరిశుద్ధాత్మల ద్వారా తండ్రియైన దేవుని సన్నిధికి చేరాలి (యోహాను 4:24). ఇదే సిలువవేయబడిన మనలను రక్షించి తీర్పుతీర్చే క్రీస్తు బోధ (రోమా 2:16, 25-27). నిర్మలమైన మనస్సాక్షితో గ్రహించడానికి ప్రయత్నించండి. ఇలా చేస్తేనే యేసును మహిమపరచినట్లు అని గుర్తు చేస్తున్నాను.

బైబిల్ గ్రంథములోని ప్రతి మాట పరిశుద్ధాత్మ ప్రేరణ లేకా దైవావేశము వలన వ్రాయబడినదని మనకు తెలుసు. అయితే దానిని తర్జుమా చేసేవారు కూడా ఆత్మ నడిపింపుతో తర్జుమా చేయాలి. లేదంటే తప్పుడు తర్జుమా జరిగే అవకాశం చాలా ఉంది. అలాగే ఒరిజినల్ వ్రాత ప్రతులను తిరిగి వ్రాసి భద్రపరచే వారికి భయభక్తులు ఆత్మ నడిపింపు ఉండాలి. కాని దానిని ప్రింట్ చేసే వారికి ఇవేవి ఏమి అవసరం ఉండదు గదా! తన మాటలు అనేక భాషలలో తర్జుమా అవుతాయని, అందులో దొంగలు, సాతాను అనుచరులు ప్రవేశిస్తారని ముందే ఎరిగిన దేవుడు తన పిల్లలైన దైవజనులకు వాటిని సరిదిద్దే అనగా ఆ తప్పుదిద్దే అవకాశం ఇచ్చాడు (2తిమోతి 3:16,17). అయితే అలా సరిదిద్దే వారు పూర్ణముగా సిద్ధపడి అనగా పరిపూర్ణులై ఇందులో జరిగిన తప్పులను దిద్దుటయు, తప్పుడు బోధలను ఖండించుటకు కూడా అధికారమిచ్చాడు. అది దేవునికి ప్రీతికరము అంటే ఇష్టము. అదే దేవుని చిత్తము అని గూడా చెప్పాడు (1పేతురు 2:15).

అలాగే ప్రతి దానిని స్థిరపరచుటకు దేని జతపక్షి దాని కుంటుంది గనుక దానిని చూసి (యెషయా 28:10-13) సరిదిద్దాలనియు, మరియు ఇద్దరు లేక ముగ్గురు సాక్షులుంటేనే నిర్ధారణ చేయాలనే ఆజ్ఞనుబట్టియు (ద్వితియో 17:5,6, 19:15,16; యోహాను 8:17,18; 2కొరింథీ 13:1). మిగతా చోట్ల ఉందా లేదా అని చూసి ఎన్నో వాక్యాల సాక్ష్యాధారాలతో ఈ మాటను లేదా ఈ అచ్చుతప్పును (రోమా 9:5) సరిచేసాను. ఇలా బైబిల్‌లోని చాలా చోట్ల ఉన్న అచ్చుతప్పులు, తర్జుమా తప్పులను సరిచేసి బోధించడం, వ్రాయడం మా బైబిల్ కాలేజీలో చేయుచున్నాను. అలా చేసినదే మరో అచ్చుతప్పును (ప్రింట్ మిస్టేక్) క్రింద సరి చేసి వ్రాయుచుచున్నాను. ఓపికతో చదివి ఆలోచించి నిర్ణయం తీసుకొని మన ఆత్మలతో పాటు అనేక ఆత్మలను రక్షణలోనికి నడిపిద్దాం.

ఇది కూడా బైబిల్‌లో ఒకటి కలుపుట, మరొకటి తీయుట క్రిందికి రాదు. తప్పుగా కలిపిన దానిని తీసువేస్తున్నామే తప్ప మరొకటి కాదు. ఇలా ప్రతి తరంలోని వారిని, ఆ తరంలోని దేవుని జనాంగమును దైవజనుడైన వారు కాపాడాలి. ఇదే దేవుని చిత్తము, ప్రతి విశ్వాసి, బోధకుని ప్రథమ కర్తవ్యము. ఎందుకంటే ఒక బోధకుడు తప్పుడు బోధ చేస్తే కొన్ని వేల మంది లేదా కాపరి తాను చెప్పే వాక్యము విషయంలో చాలా జాగ్రత్తపడాలి. అందుకే దేవుడు యాకోబు గారి ద్వారా మీలో అనేకులు బోధకులు కావద్దు అని చెప్పాడు (యాకోబు 3:1),

# 25 మహాదేవుడెవరు?

**నాటి** నుండి నేటి వరకున్న చాలామంది మన తెలుగు క్రైస్తవుల మనోనేత్రములకు మాత్రమే గుడ్డితనాన్ని కలుగజేసిన మరో భయంకరమైన  అచ్చుతప్పును గూర్చి పరిశీలిద్దాం. ఎందుకంటే కన్నడ తెలిసిన వారితో కన్నడ బైబిల్ చూశాను. గ్రీకు మరియు ఇంగ్లీషు ఇంటర్ లైనర్ బైబిల్లో చూశాను. నావద్ద బైబిల్‌నేర్చుకొనే వాళ్ళలో మరాఠి వాళ్ళున్నారు గనుక మరాఠి బైబిల్‌లో చూశాను, హిందీ కూడా నాకు వచ్చిన అన్యభాష గనుక ఇందులో కూడా చూసుకొన్నాను. అన్నింటిలో కాస్తా సరిగానే ఉన్నది. ఈ విషయాన్ని నేను ఇంతకముందే “సిలువ వేయబడిన క్రీస్తు” అనే పుస్తకంలో వ్రాశాను. త్రిత్వమా? ఏకత్వమా? అనే ఒక్కరోజు బైబిల్ రీసెర్చ్ సెమినార్‌లో కూడా ప్రకటించాను. అది తెలిసికొన్న అనేకులు నేను క్రీస్తు వ్యతిరేకినని, యేసు దేవుడుకాదంటున్నాననే తప్పుడు వదంతులు ప్రచారం చేస్తూ యేసు దేవుడేం ఖర్మ, ఆయనే మహాదేవుడనే వాదనకుదిగారు. ఇది వారికున్న ఇంటర్‌నేషనల్ అజ్ఞానానికి ఒక మంచి ఉదాహరణ కూడా వారికున్న బలం మన తెలుగు బైబిల్‌లోనే ఉన్నమరో అచ్చుతప్పుతో ఉన్న క్రింద వ్రాసిన

వాక్యమే అని వేరే చెప్పనవసరం లేదు. పౌలు పత్రికలలోని బోధలను గూర్చి నేను ముందే వివరించి వ్రాసాను గనుక మళ్ళీ మళ్ళీ చెప్పనవసరం లేదు. కాబట్టే సరాసరి వాక్యాన్ని చూపి, అదే వాక్యాము బైబిల్‌లోని అనేక వాక్యాలకు వ్యతిరేకంగా ఉందోలేదో జాగ్రత్తగా చూద్దాం. మన చేతుల్లో ఉన్న తెలుగు ప్రొటెస్టెంట్ బైబిల్‌లో ఉన్న వాక్యమేమంటుందంటే

"అనగా మహాదేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షతకొరకు ఎదురుచూచుచూ, ఈ లోకములో స్వస్థబుద్ధితోనూ, నీతితోనూ, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:13).

మనుష్య జ్ఞానము ఆలోచనతో చూస్తే ఈ వాక్యములో యేసుక్రీస్తే మహాదేవుడు మరియు మన రక్షకుడు అనే అర్థమిచ్చుచున్నది కూడా. కాని నా అంతటి బైబిల్ పండితులు ప్రపంచంలో లేరని విర్రవీగే దుర్మార్గులు, ఇంటర్నేషనల్ ఏకైక ఛాలెంజింగ్ వీరులం అని చెప్పుకునే వారు కూడా పప్పులో కాలేసి తప్పు చేస్తున్నారు. ఎందుకంటే ఇది ఎంతవరకు కరెక్టు అనేది తేలాలంటే దీనిని కూడా ప్రవక్తల బోధతో సరిచూడాలి గదా! ఇలాంటి పరిశోధన అన్ని సందర్భాలలో అవసరం రాకపోవచ్చు. కాని అపార్థం కలిగే అవకాశమున్న చోట తప్పని సరిగా చెక్‌చేసుకొని తీరాలి గాని అనవసరంగా ఇతరుల మీద నోరుపారేసుకోకూడదు. ఎందుకంటే నాకు ఒకప్పుడు బోధచేసిన అతనే బైబిల్‌ను 25 సం॥లు ధ్యానించి పరిశోధించానని అబద్ధం చెప్పాడు. ఎందుకంటే బైబిల్‌ను 25 సం॥లు చదివిన వారికి ఇందులో ఏది బైబిల్‌లోని ఇతర

వాక్యాలకు ఎదురొచ్చి అవతలి మాటలను తప్పు చేస్తుందనేది తెలియాలి గదా!

ఆత్మతో వ్రాయబడిన సంగతులను ఆత్మతో ఆలోచించి చదువకపోతే ఎన్ని సం॥లు చదివినా, ఎన్ని వందల సార్లు చదివినా ప్రయోజనం శూన్యం. పైగా నలుగురిలో నవ్వుల పాలు అవుతాం. దేవుని శిక్షకు పాత్రులమవుతాం. బైబిల్‌లోని అన్ని విషయాలను కూలంకషంగా ఎరిగియుండాలి గాని తొందరపడి ఎదుటి వ్యక్తుల మీద బురద జల్లకూడదు, ఎదుటి బోధకులను విమర్శించి, తక్కువ చేసి మాట్లాడకూడదు. దైవజనులకు అనగా ప్రతి క్రైస్తవుడికి అహంకారము, మూర్ఖత్వము తగదు. క్రీస్తునొద్ద నేర్చుకొన్న సాత్వీకము, దీనమనస్సు, వినయము, జాలిగల మనస్సు మొ॥ ఉంటాయి, ఉండాలి. ఈ విషయం గూర్చి జ్ఞానియైన సొలొమోను ఎన్నో సామెతలు వ్రాశాడు. అందుకే ఇక్కడ మనందరం జాగ్రత్తపడాలంటున్నాను. మనుషులలో ఎవరిని నమ్మక, ఎవరిమీద ఆధారపడకుండా మన ఆత్మను మనమే రక్షించుకోవాలి పరిశుద్ధాత్మ సహాయసహకారాలతో, మరియు ప్రభువు కృపతో, కాబట్టి మహాదేవుడెవరో ముందుగా ప్రవక్తల దగ్గరకెళదాం, ఆ తర్వాత అపొస్తలుల బోధలోకెళుదాం.

"నీ దేవుడైన యెహోవా నీ మధ్యనున్నాడు, ఆయున భయంకరుడైన మహాదేవుడు" (ద్వితియోప 7:21).

"ఏలయనగా నీ దేవుడైన యెహోవా పరమప్రభువైయున్నాడు. ఆయనే మహాదేవుడు, పరాక్రమవంతుడు, భయంకరమైన దేవుడు, ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు, లంచము పుచ్చుకొనని వాడు" (ద్వితియోప 10:17).

"ఎజ్రా మహాదేవుడైన యెహోవాను స్తుతింపగా జనులందరు తమ చేతులెత్తి ఆమేన్, ఆమేన్ అని పలుకుచు, నేలకు ముఖములు వంచుకొని యెహోవాకు నమస్కరించిరి" (నెహెమ్యా 8:6).

"దేవా, నీ మార్గము పరిశుద్ధమైనది. దేవుని వంటి మహాదేవుడు ఎక్కడున్నాడు" (కీర్తన 77:13).

"యెహోవా మహాదేవుడు, దేవతలందరికి పైన మహత్యముగల రాజు" (కీర్తన 95:3).

"యెహోవా, ప్రభువా సైన్యములకధిపతియగు యెహోవా అను పేరు వహించువాడా, శూరుడా, మహాదేవ, నీయధిక బలము చేతను చాచిన బాహువు చేతను భూమ్యాకాశములను సృజించితివి. నీకు అసాధ్యమైనదేదియు లేదు" (యిర్మీయా 32:17; దానియేలు 2:45).

పైన వ్రాయబడిన లేఖనాలన్నిటిని చూచినప్పుడు తీతు పత్రికలో వ్రాయబడిన లేదా తెలుగులో తర్జుమా చేసి, ముద్రించిన ప్రక్రియలో ఎక్కడో పొరపాటు జరిగినట్లు గ్రహించగలము. ఎందుకంటే బైబిల్ అంతా తండ్రియైన దేవుడే, మహాదేవుడని, సర్వోన్నతుడని, సర్వశక్తిమంతుడని, దేవాధి దేవుడని సెలవిచ్చుచున్నది. యేసైతే దేవుని కుమారుడు, మనుష్య కుమారుడని రకరకాల పేర్లు, బిరుదులను గూర్చి సెలవిచ్చుచున్నదిగదా. అయితే యేసు దేవుడు కాదా? అని మీరు మళ్ళీ అడుగవచ్చు. యేసుక్రీస్తు వాక్యమై, దేవుని యొద్ద ఉన్నప్పుడు మాత్రమే కుమారుడైన దేవుడు (యోహాను 1:1,2) కాని శరీరధారియైవచ్చినాక నరుడుగా మనకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఘనుడు. అయితే మనం ప్రకటించవలసినది సిలువ వేయబడిన క్రీస్తును గనుక, మనకోసం

సిలువ వేయబడిన క్రీస్తుయేసనే నరుడు అని మాత్రమే ప్రకటించాలి. ఆదియందు దేవుడుగా దేవుని యొద్ద ఉన్న వాక్యానికి మరణం, సమాధిపునరుత్థానాలు లేవు. అందుకే అప్పుడు కుమారుడైన దేవుడు.

కాని శరీరధారియై మన మధ్య మనతో జీవించిన క్రీస్తుకు మరణ, సమాధి పునరుత్థానాలున్నాయి. కాబట్టి తీతు పత్రికలో ఈ వాక్యం ఎలా ఉండాలో సరిచేసుకొందాం. అంతకుముందు రోమన్ కాథలిక్ వారు తెలుగు బైబిల్ అయిన పవిత్ర గ్రంథంలోనూ, ఇంగ్లీష్ బైబిల్‌లోనూ ఎలా ఉందో చూద్దాం.

‘‘ఇట్లు ఇహలోకమందు జీవించుచూ సర్వోన్నతుడగు మనదేవుని యొక్కయు, (ఇక్కడ కామా ఉన్నది గమనించండి) రక్షకుడగు మన యేసుక్రీస్తు మహిమ ప్రత్యక్షమగు శుభదినము కొరకు నిరీక్షణతో వేచి ఉండవలసియునని ఆ కృప తెలుపుచున్నది” (తీతు 2:13 ఆర్.సి.ఎం. బైబిల్).

“Looking for the blessed hope and glorius appearing of our great God and Sovior Jesus Christ” (Titus 2:13 KJV).

ఇక్కడ చాలా ఇంగ్లీషు తర్జుమాలలో గ్రేట్‌గాడ్ తర్వాత ‘కామా’ పెట్టలేదు కేవలం మరియు (And) అనేది మాత్రం పెట్టారు. అందుకే అనేక మంది ఇంగ్లీషువాళ్ళు కూడా యేసుక్రీస్తే మహాదేవుడు అని అపార్థం చేసుకొన్నట్లుంది. ఇది సాతాను తంత్రములలో ఒకటి. హిందీలో చూద్దాము. “ఔర్ ఉస్ ధక్ష్య ఆశకీ అర్థాత్ అప్‌నే మహన్ పరమేశ్వర్ ఔర్ ఉద్దార్ కర్తా ఈషుమ సీహకే మహిమాకే బాట్ జోహ్‌తే (తీతూస్ 2:13). ఇంతకీ మన బైబిల్‌లో ఎలా సరిచేసు కోవాలండీ అని అంటే సరిదిద్దుకునే అధికారం దైవజనులందరికి

దేవుడే ఇచ్చాడు గదా (2తిమోతి 3:16,17) చాలా జాగ్రత్తగా ఆ అధికారాన్ని ఉపయోగించుకోవాలి. భావంలో తప్పుగా ఉంది గనుక అక్షరాన్ని సరిచేయాలి. అక్షరం యొక్క విలువ, పదము యొక్క ప్రభావము ప్రతి మనిషి జీవితంలో చాలా ప్రాధాన్యతను కలిగి ఉంది. ఈ విషయం విలువ ఎక్కువగా లాయర్లకు, జడ్జీలకు బాగా తెలుసు. ఒక అక్షరము మనిషిని చంపగలదు, బ్రతికించగలదు అని ఈనాటి మనుష్య జ్ఞానం, అనుభవం చెప్పుతుంది.

అయితే బైబిల్‌లోని అక్షరం తప్పుగా పడితే అది మనిషిని చంపుతుందని దేవుడు ఎప్పుడో చెప్పాడు. “అక్షరము చంపును గాని ఆత్మ జీవింపజేయును” (2కొరింథీ 3:6). కాబట్టి తర్జుమా చేసే వారు ప్రింట్ చేసినవారు చూడకపోయినా, చదువుకొని బాగుపడి, నిత్య జీవాన్ని పొందాలనుకొనే వారు మాత్రం తప్పక వీటి విషయమై జాగ్రత్త పడగలరు. ఇది బైబిల్‌లో ఒకటి కలపడం ఒకటి తీసివేయడం క్రిందకురాదు. ఎందుకంటే మన తెలుగు రెఫరెన్సు బైబిల్‌లోని పదాలు లేదా అక్షరాలకు మన అందరి చేతుల్లో ఉన్న మామూలు బైబిల్‌లోని పదాలు చూస్తే తేడాను సుళువుగా గుర్తు పట్టవచ్చు. ఈ తర్జుమా తప్పులు కేవలం తెలుగు బైబిల్ మాత్రమే కాదు ప్రపంచంలోని అన్ని భాషలలోకి తర్జుమా చేయబడిన బైబిల్లలోనూ ఉండి తీరుతుంది. ఎందుకంటే సాతానుడు సామాన్యుడు కాడు.

ఒక సంగతి ఇంగ్లీషులో అలాగే ఉంటే అప్పుడు గ్రీకు చూడాలి, గ్రీకులో అలాగే ఉంటే హిబ్రూ చూడాలి. హిబ్రూలో కూడా అలాగే ఉందనుకో అపుడేం చేయాలి. అప్పుడు ప్రవక్తలు వ్రాసిన హిబ్రూ, పత్రాలను ఆత్మతో ఆలోచించి సరిచేసుకోవాలి. ఎందుకంటే ప్రవక్తలు

వ్రాసిన హిబ్రూ, అపొస్తలులు వ్రాసిన గ్రీకు, ఈ కాలంలో ఉన్న ఇంగ్లీషు కూడా ఎన్నో మార్పులు చేర్పులకు లోనైయ్యాయి గదా! గనుక విశ్వాసుల్లారా బహుపరాక్ నేడు హిబ్రూ, గ్రీక్ అంటున్నవారితో కూడా జాగ్రత్తగా ఉండండి. దేవున్ని అడగండి, ఆలోచించండి. ఇది చాలా సున్నితమైనది, చాలా రిస్క్‌తో కూడుకొన్నది. ఏ మాత్రం తేడా వచ్చినా, నాతోపాటు లేదా మన బోధకునితో పాటు మీరందరు నరకానికెళ్ళే అవకాశమున్నది. కాబట్టి చాలా జాగ్రత్తపడుదాం.

"అనగా మహాదేవుడును, (ఈ కామాలేదు, తప్పనిసరిగా ఉండి తీరాలి) మరియు (ఈ మరియు అనే పదం తెలుగులో లేదు) మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదరుచూచుచూ ఈ లోకములో స్వస్థబుద్ధితోనూ, నీతితోనూ, భక్తితోనూ బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:13) అని ఉండాలి. మామూలు పుస్తకాలలోనే కామా, ఫుల్‌స్టాపు, కొమ్ములు, దీర్ఘాలు అన్నీ జాగ్రత్తగా చూస్తాం లేకపోతే భావం మారిపోతుంది. మరి మనుష్యులందరి జీవగ్రంథముపై మనం ఇంకా ఎక్కువగా జాగ్రత్తపడాలి గదా. ఎందుకంటే మహాదేవుడు మరియు యేసుక్రీస్తు అనే పదాల మద్యన కామా ఉంటేనే ఇద్దరిని గుర్తు చేసినట్లు అవుతుంది. లేఖనాల ప్రకారం మహాదేవుడు మన తండ్రి గనుక కామా తర్వాత మరియు అని వ్రాసి అప్పుడు మనల్ని రక్షించిన యేసుక్రీస్తు అని ఉండాలి. ఈ సృష్టికి తీర్పు జరిగే సమయంలో అనగా క్రీస్తు రెండవ రాకడ సమయంలో మనకు దేవుని మహిమ అనగా మన తండ్రి యెలా ఉంటాడో, మన క్రీస్తు మహిమ అనగా క్రీస్తు ఎలా ఉంటాండో ఆ రోజే అందరికి బయలుపరచబడుతుంది

గనుక. ఆ రోజే ఇద్దరి ప్రత్యక్షతను చూడబోతున్నాం. ఇప్పటి వరకు ఇద్దరూ ఎలా ఉంటారో మనం చూడకయే విశ్వసించుచున్నాము. ఇదే విషయాన్ని థెస్సలోనికయ పత్రికలో కూడా చక్కగా తెలియ జేస్తున్నాడు.

"యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతో కూడా వెంటబెట్టుకుని వచ్చును" (1థెస్స 4:13–14–17).

క్రీస్తు రెండవ రాకడలో మనం క్రీస్తుతోపాటు మహాదేవుడైన మన తండ్రిని కూడా చూడబోతున్నాం. ఎందుకంటే ఆ రోజు మన మట్టి శరీరాలు మహిమ శరీరాలుగా మారుతాయి. మహిమ లేదా ఆత్మ సంబంధమైన శరీరంతో లేవకపోయినా (1కొరింథీ 15:35–57) ఒకవేళ మారు మనస్సు పొందక, పొందినామని చెప్పి మారక నామకార్థ క్రైస్తవులంగా బ్రతికి చచ్చినా, ఆత్మలుగా నరకంలో కాలుతున్నా, ఆత్మకు అన్ని సంగతులు తెలుస్తాయి గనుక ఆ రోజు నరకంలో ఉన్నా ఈ ఇద్దరి ప్రత్యక్షతను గ్రహించగలము. ఇంకా మహాదేవుడెవరో, దేవుని కుమారుడైన వాక్యమైన దేవుడు కూడా ఎవరో అర్థంకాకపోతే మళ్ళీ బైబిల్ చదివి ఆలోచించండి. బైబిల్ సొసైటి ఆఫ్ ఇండియా వారిని ఈ తప్పులను సరిదిద్దమని తీవ్రమైన ఒత్తిడి చేయండి. దేవుని చిత్తాన్ని నెరవేర్చి దేవునికి స్తోత్రములు చెల్లించండి. పెదవులతో కాదు గాని చేతులతో చేతలతో అనగా క్రియలతో దేవున్ని స్తుతించాలి.

# 26 దేవుని చిత్తము

**ఇప్పటికీ** దేవునిని గూర్చిన ఓ పరిపూర్ణమైన అవగాహన కొచ్చిన మనం, మనకు అత్యంతప్రాముఖ్యమైనది, దేవుడు మనకు చెప్పాలనుకొన్నది. ఆయన చిత్తమును గురించే. చిత్తము అంటే ఇష్టం లేదా అభీష్టం అనే అర్థం కూడా ఉన్నది. దీనికి పర్యాయ పదాలుగా ఆయన ఆలోచన, సంకల్పం అనే పదాలుకూడా ఉన్నాయి. ఇంతకీ ఈ సకల చరాచరసృష్టిని దేవుడు ఎందుకు చేశాడు. అందులో మనల్ని ఎందుకు పుట్టించాడు. దీనివెనుకాల ఆయనకు ఏదైనా బలమైన కారణం ఉన్నదా? అని ఆలోచించవలసిన అవసరం ఎంతైనా మనకు ఉంది. దానిని చెప్పాల్సిన బాధ్యత లేదా కర్తవ్యం సృష్టికర్తగా దేవునికి కూడా ఉంది. ఈ దేవుని చిత్తాన్ని గూర్చి చాలామంది చాలావిధాలుగా చెప్పుచున్నారు. ప్రతివారు వారికి తోచిన విధానంలో సమాధానాన్ని వెతుక్కొని, తమ పరిస్థితి కనుకూలంగా సరిపుచ్చుకొని లేదా మలచుకొని సంతృప్తి పడుతున్నారు గాని మనలను పుట్టించిన వానిని అడగడం లేదు. అందుకే ఈ లోకంలో అందరూ ఈ విషయంలో ఆయోమయంగా

ఉన్నారు. ఇంతకూ దేవుని చిత్తం అంటే ఏమిటో చూద్దాం దేవుని మాటయైన బైబిల్లో.

దేవుని చిత్తం అనేపదాన్ని ప్రతీసారి, ప్రతిచోట ఎక్కువగా వాడుతున్న క్రైస్తవుల కేమైనా ఈ మాట అర్థం అయ్యిందా అని అంటే వాళ్ళమాటలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఏదైనా ఊరు వెళ్ళాలనుకోండి బస్సు, రైలు యొక్క సమయానికి ముందుగా వెళ్ళక ఆలస్యంగా వెళ్ళి అవి మిస్ అయినప్పుడు తమ ప్రయాణం దేవుని చిత్తంలో లేదండీ అని అంటారు. ఏదైనా ఒక పనిని సరియైన ప్రణాళిక లేకుండా మొదలుపెట్టి మధ్యలో ఆగిపోతే వాటికి సరియైన కారణాలు వెతుక్కోకుండానే ఈ పని దేవునికిష్టం లేదని, ఆయన చిత్తంలో లేదనో చెప్పుకొని తృప్తి పడుతున్నారు. ఒకవేళ మనలోపంతో జరుగకూడనిదేమైనా జరిగితే అది కూడా దేవుని చిత్తంలో ఉంది కాబట్టి జరిగింది, దానిని మనం ఆపలేం అని కూడా సరి పుచ్చుకొంటాం.

ఈ మధ్యనే చాలామంది క్రైస్తవులు పెళ్ళి సంబంధాల కెళ్ళినప్పుడు అమ్మాయి నచ్చినా, వారు ఇచ్చే కట్నకానులు నచ్చకపోతే, దేవుని చిత్తమైతే మళ్ళీవస్తాం, ప్రార్థనలో పెట్టండి అనే భయంకరమైన మోసపు మాటలను ఆత్మవంచనతో మాట్లాడటం చూస్తున్నాం. అమ్మాయి రంగు, రూపురేఖలు, చదువు, కట్నం మాత్రమే చూసి ఎందుకంటే గుణం అప్పటికి తెలియకపోయినా తమకు నచ్చగానే మేం వచ్చేముందే ప్రార్థించుకొని వచ్చాము దేవుడు మాకు మంచి సంబంధమొస్తుందని బయలుపరచాడని లేదా చూపాడని ఇది దేవుని చిత్తంలో ఉందని చెబుతారు. తమ ఊరికెళ్ళేదాక కూడా

ఆగకుండా వెంటనే కట్నకానుకలు మాట్లాడుకుందాం అంటారు. ఇలా మన చిత్తాన్ని దేవునిపేరు మీదకు నెట్టేసి ప్రతిదీ ఆయన చిత్తం బ్రదర్ అని చేతులు దులుపుకొని, ఆత్మవంచన చేసుకొంటున్నామే గాని అసలైన జ్ఞానాన్ని అందుకోలేకపోతున్నాము. దేవుని చిత్తాన్ని, సంకల్పాన్ని ఏదియూ దాచుకోకుండా వివరించిన సిలువ వేయబడైన క్రీస్తు బోధలోనికి వెళ్ళి ఆలోచిద్దాం (అపొ.కా. 20:27).

"మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక! ఆయన క్రీస్తునందు పలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతీ ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచ్చితముగా మనకను గ్రహించిన తన కృపామహిమకు కీర్తికలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా (పిల్లలనుగా) స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తనయెదుట పరిశు ద్ధులమును నిర్ధోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత ఆయన (దేవుడు) క్రీస్తులో మనలను ఏర్పాటు చేసుకొనెను" (ఎఫెస్సి 1:4-6; 11-12; 2-10).

ఈ జగత్తుకు ఆనగా సృష్టికి పునాది ఎందుకేశాడంటే దానికి కారణమే దేవుని చిత్తం లేకా దేవుని ఇష్టం, మరియు కోరిక అని చెప్పుచున్నాడు. సృష్టికి పూర్వం పరలోకంలో ఉన్న దేవాధిదేవుడైన తండ్రికి ఒక కోరిక కలిగినది. అదేదనగా అప్పటికే తనవద్దనున్న యేసుక్రీస్తు, పరిశుద్ధాత్మలతో పాటు తనకు తన పోలిక చొప్పున అనేక మంది పిల్లలుకావాలని, వారు ఈ భూమిమీదనే తన

కుమారుడైన క్రీస్తులాగా బ్రతికి ఆయన ద్వారానే తిరిగి తన యొద్దకు (పరలోకం) రావాలని ఆయన సంకల్పించుకొన్నాడని, అదే ఆయన చిత్తం, ఇష్టం లేదా కోరిక అని పై వాక్యము సెలవిచ్చుచున్నది. అందుకే ఈ భూమికి అనగా ఈ ప్రకృతికి పునాదివేసి దానినే మనకన్నా ముందుగా కలుగజేసి ఆ భూమి మీద మాత్రమే బ్రతకడానికి భూమిలోనుండి నరునికి దేహాన్ని తయారుచేసి, ఆ మట్టిబొమ్మలోనికి తన ఆత్మను పంపి మనల్ని కన్నాడని ఆదికాండము ప్రారంభ అధ్యాయంలో చెప్పాడు దేవుడు. దేవుని కోరికను లేదా చిత్తాన్ని నెరవేర్చుకొనుటకే ఆయన మనలను పుట్టించాడని, తిరిగి ఆయన యొద్దకు క్రీస్తు ద్వారా మాత్రమే వెళ్ళాలనుకునేది ఆయన అనాది సంకల్పం అనిగ్రహించి క్రీస్తులాగా బ్రతికి యేసుక్రీస్తు ద్వారానే పరిశుద్ధులై నిర్ధోషులై ఉండాలనేది ఈ జగత్తుపునాది వేయబడక ముందే నిర్ణయించాడు అని అదే దేవుని చిత్తము అర్థం చేసుకోవాలి.

మనం పుట్టకముందే క్రీస్తుయేసులో ఏమి పనులు అనగా ఏ క్రియలు చేస్తే పరిశుద్ధులమై పరలోకం వెళతామో, ఆ పనులన్నిటిని కూడా మనకన్నా ముందే వ్రాయించానని ఎఫెసి 2:10లో “మరియు వాటియందు మనము నడచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము యేసుక్రీస్తునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై ఉన్నాము” అని దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితమే పౌలు ద్వారా చెప్పి వ్రాయించాడు. ఎంతముందు అంటే జగత్తు పునాది వేయబడక ముందే అని ఇదే ఎఫెసి పత్రిక 1:1-12 వచనాలలో చెప్పాడు. ఆయన కోరిక ప్రకారము మనం పరిశుద్ధులం కావాలంటే యేసుక్రీస్తు భూమిమీదకు రావాలి. అలా దివి నుండి భువికి దిగి వచ్చిన ఆయన కూడా

దేవుని చిత్తమేమైయున్నదో చెబుతున్నాడు అదీ ఆత్మసంబంధమైనదేకాని శరీర సంబంధమైనది కాదు. "మరియు యావత్తు భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోనని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయ కాలములను, వారి నివాస స్థలము యొక్క పొలిమేరను ఏర్పరచెను". దేవునికి అనేక మంది పిల్లలు కావాలి, వారిని మనం పెళ్ళి చేసుకొని కనాలి. ఒక్క ఆదామును దేవుడుకంటే ఆ ఆదాముగారే మన అందర్ని కంటున్నాడు (అపొ.కా. 17:26) అంటే ఆశ్చర్యంగాలేదు. అనగా మనకు పుట్టే పిల్లలు మన ఇష్టానుసారంగా పుడుతున్నారా? లేదు కదా! ఆలోలచించండి. దేవుని ఇష్టానుసారంగానే మనకు పిల్లలుపుడుతున్నారని గ్రహించాలి. అనగా మనకు పిల్లలు పుట్టక పోవడం కూడా ఆయన ఇష్టమే కాని మన చేతుల్లో ఏమీ లేదు.

"తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చుచున్నాడు. కుమారులు (పిల్లలు) యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము గర్భఫలము ఆయన ఇచ్చు బహుమానమే" (కీర్తన 127:1-3).

చాలామంది భక్తులు గుడ్డిగా, మూర్ఖంగా దేవున్ని మహిమ పరుస్తున్నామనే భ్రమలో వాక్యానికి వ్యతిరేకంగా సాక్ష్యాలు చెబుతారు. అదేమంటే నేను ఎన్నో ఏళ్లుగా ఉపవాసముండి గోజాడి ప్రార్థన చేసి అడిగితే నాకు ఒక మగబిడ్డనిచ్చాడని గొప్పగా చెబుతారు. కొందరు ఆడపిల్ల కావాలని ప్రార్థించాను గనుకనే మాకు ఆడపిల్ల పుట్టిందని చెబుతున్నారు. అయితే మన గర్భఫలం మనకు దానమా? బహుమానమా? అని ఓసారి ఆలోచించండి. అడిగితే ఇచ్చేది దానము అడక్కుండా ఇచ్చేది బహుమతి తెలుసా? పోనీ మనల్ని

ఆడవారిగానో, మగవారిగానో పుట్టించమని మనం ప్రార్థన చేయలేదు. మన అమ్మ, నాన్నలు ప్రార్థిస్తే అడిగితే లేకా మనం పుట్టలేదు.

దేవునికి ఆడపిల్ల అనగా కుమార్తె కావాలంటే మనకు కుమార్తె పుడుతుందతి, దేవునికి కుమారుడు కావాలంటే మనకు మగపిల్లవాడు పుడతాడు. ఇందులో మన గొప్పతనంగాని, బలహీనతగాని ఏమి లేవు. ఖర్మ, గ్రహచారంలాంటి మూఢనమ్మకాలు కాని ఆడ మనిషి యొక్క అమ్మసాలు కాని, ఆమె అమ్మమ్మ సాలు గాని అసలు లేవు. అలాగే కొన్నిసార్లు మనం వద్దన్న వారే పుడుతారు. తమకు కుమారుడు కావాలని ఎంత ప్రయత్నించినా (6) ఆరుగురు ఆడపిల్లలను కన్నవారు మన మధ్యలోలేరా? ఆలోచించండి. పెళ్ళి అయిన సంవత్సరానికే పిల్లలు పుట్టడం ప్రారంభం అయి మరియు సం॥రానికి ఇద్దరిని కన్నవారున్నారు. పెళ్ళయి 20 యేండ్లు అయినా ఇంకా పిల్లలు పుట్టనివారున్నారు. ఇదంతా ఆయన చిత్తప్రకారం జరుగుచున్నది. మన ప్రయత్నంలేని దేవుని అసలుసిసలైన ఉచితమైన ఆశీర్వాదం మన పిల్లలే సుమా.

దేవుని ఆశీర్వాదం, అనగానే ఆస్తి అంతస్తులు, డబ్బు, హోదా అనుకొని దయగల దైవమా మమ్మల్ని ఆశీర్వదించమని ముసలివారు అనగా పిల్లలను కని వారికి పెళ్ళిళ్ళు చేసి మనవలను చూసిన వారు కూడా దేవుడా మమ్మల్ని ఆశీర్వదించు అని అడగడం వాక్యానికి చాలా వ్యతిరేకము. దేవుడు ఆత్మ గనుక, ఆయన ఇచ్చే ఆశీర్వాదము ఆత్మసంబంధమైనది. అది ఎల్లకాలం ఉండేది, పరలోకానికి చేరేది. మనం ఈ లోకములోనుండి దేనిని పరలోకం పంపలేముగదా. కాని మనం ఒకవేళ నరకానికి వెళ్ళినా మన పిల్లలనైనా పరలోకానికి

పంపగలిగేది ఒక్కటే ఉంది అదే ఈ ఆశీర్వాదము ( ఎఫెస్సి 1:3–6). కాబట్టి దైవాశీర్వాదం విషయంలో గూడా దేవుని చిత్తాన్నిగ్రహించి జాగ్రత్తగా అడుగాలి తెలుసా?

దేవుని ఆశీర్వాదం ఆదాము, అబ్రహాము నుండి మొదలుకొని నేటి వరకు బైబిల్‌లో ఎక్కడ చూసినా పిల్లలేసుమా! ఎందుకంటే మన పిల్లలు ఆయన పిల్లలు. ఆయన కోరిక ప్రకారమే మనకు పిల్లలు పుడుతున్నారు. అందుకే దానిని ఆయన ఆశీర్వాదము అని గూడా చెప్పుచున్నారు. గాని మనమే దానిని గ్రహించుటలేదు. (ఆది.కా. 1:28; 9:1–3; 17:1–6; 35:9–11; 48:3,16; కీర్తన 127, 128 అధ్యాయాలు, 115:12–15, గలతీ 3:14; రోమా 4:17–21; యెషయా 65:23).

అందుకే క్రీస్తు భూలోకానికొచ్చి ఆయన చిత్తాన్ని సంపూర్ణముగా నెరవేర్చాడు (యోహాను 17:4), మనల్ని కూడా నెరవేర్చమన్నాడు. మనం పిల్లలనుకని మన పిల్లలను జాగ్రత్తగా పెంచి పోషించి, వారి సంరక్షణతో పాటు సాధ్యమైనంత వరకు రక్షణలోనికి నడపాలి. ఇది మన యెడల దేవుని చిత్తం. అదే క్రీస్తుమాత్రం దేవుని పిల్లలందరిని తన పిల్లలుగా భావించి తను పెండ్లి చేసుకొని స్వంతంగా పిల్లలను కనక దేవుని పిల్లలందరిని రక్షించి వారిని పరిశుద్ధులుగాను, నిర్దోషులను గాను నిలబెట్టుటయే క్రీస్తు యెడల దేవుని చిత్తమైయున్నది. అందుకే ఆయన కూడా ప్రతిచోట దేవుని చిత్తాన్ని నెరవేర్చుటయే నాకు ముఖ్యమని చెప్పాడు. దేవుని చిత్తము ఎలా నెరవేర్చాలో చూద్దాం. నెరవేర్చి ఆయనను ఆనందింపజేద్దాం. మన లోకాన్ని తిరిగి చేరుదాం.

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తం ప్రకారం చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

"నా ఇష్టము నెరవేర్చుట కొరకు నేనురాలేదు నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని. ఆయన నాకు అనుగ్రహించిన దానియంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున దాని లేపుటయే నన్ను పంపిన వాని చిత్తమైయున్నది. కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము అంత్యదినమున నేను వానిని లేపుదును" (యోహాను 6:38-40).

"కాబట్టి ఆయన (క్రీస్తు) ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు. బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి. పూర్ణహోమములు పాపపరిహారార్థ బలులు నీకిష్టమైనవికావు. అప్పుడు నేను గ్రంథపు చుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారము, దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నాననంటిని" (హెబ్రీ 10:5-0).

దేవుని చిత్తాన్ని / ఇష్టాన్ని / కోరికను ఈ లోకంలో నెరవేర్చినవాడే ముందుగా పరలోక రాజ్యంలో అనగా సంఘములో ప్రవేశించి, తన్ను తాను భద్రము చేసుకొని చనిపోయాక పరలోకంలో ప్రవేశిస్తాడని ఖచ్చితంగా చెప్పి, ఆ పని చేయడమే నా ప్రథమ కర్తవ్యం అని క్రీస్తు చెప్పుచున్నాడు. మన ప్రథమ కర్తవ్యం కూడా అదే. జీవితంలో నీవు ఏమి అవుతావని ఎవరినైనా అడిగితే, డాక్టరో, ఇంజినీరో, శాస్త్రవేత్తనో, రాజకీయ నాయకుడో, సంఘసంస్కర్తనో,

పాటగాడుగానో, ఆటగాడుగానో, అయి మంచి ఉన్నత పదవులను అధిష్టించాల నుందనో చెబుతారు చాలా మంది.

ఈ పనులన్నీ ఈ లోకంలో పనికొచ్చేవి, ఈ లోకంతో పాటు నాశనమయ్యేవే గదా! ఇవి కేవలం ఈ భూమిమీద బ్రతకడానికి మాత్రమే అవసరం. మరి మనం ఈ లోకానికొచ్చింది కేవలం ఈ లోకములో ఉండి పోవడానికొచ్చామా? లేదే, ఇది తెలియక అనేక మంది అనేక రకాలుగా ఈ లోక సంబంధమైన వాటినే కోరుకుంటున్నారు గాని వీటన్నిటితో పాటు కనీసం ఒక్కరైనా నేను దేవుని కుమారునిగా బ్రతికి చనిపోయిన తర్వాత దేవుడున్న లోకం / పరలోకం చేరాలి. ఇదే నా ఆశ–ఆశయం అని చెప్పుచున్నారా? ఈ రోజుల్లో ఒక్కరు కూడా లేరని చెప్పవచ్చు. ఎందుకంటే ఉద్యోగాలు, మార్కులు, డబ్బులపై పోటి తత్వము పెరిగింది కాని మానవత్వము, దేవత్వముపై పోటి పెరగడం లేదు.

ఎందుకు చెప్పడం లేదంటే, వారికి ఈ విషయం చెప్పేవారే కరువయ్యారు. నా కొడుకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అనో, నా కూతురు కలెక్టర్ అనో చెప్పుకొని గర్వపడుతున్నామే గాని వీటితో పాటు నా పిల్లలు పరలోకం వెళ్ళగలరు. అని గర్వంగా చెప్పే వారెంతమంది ఉన్నారో హృదయపూర్వకంగా చెప్పండి. అలాగని ఈ లోక సంబంధమైన విద్య–ఉద్యోగాలు చేయొద్దనుటలేదు. వీటితోపాటు నీవు అనబడే నీ ఆత్మను రక్షించుకునే విద్య–ఉద్యోగం చేయడం యొక్క ప్రాముఖ్యతను గూర్చి ఆలోచించమంటున్నాను. అందుకే దేవుడు మనల్ని మన ఇష్టంతో పాటు నా ఇష్టం కూడా నెరవేర్చుమంటున్నాడు. మన శరీరకోరికలను, ఇష్టాలను దేవుడు

ఎప్పుడు కాదనలేదు. మనకవసరమని తెలిసే మనం అడగకుండానే ముందుగానే అన్నీ సిద్ధపరిచాడు. అవన్నీ అనుభవిస్తూనే (న్యాయమైన పద్ధతిలో మాత్రమే) దేవుని న్యాయమైన కోరికలను ఆయన చూపిన మార్గములోనే నెరవేర్చుమంటున్నాడు. ఇదే దేవుని చిత్తము.

మనలాగే రక్తమాంసాలతో మామూలు మానవుడుగా పుట్టిన యేసు ఈ లోకంలో ఎంతగానో చెడు ఉన్నా, మంచి వైపు మాత్రమే చూస్తూ, మంచి పనులే చేస్తూ, పరిశుద్ధుడై, నిర్దోషిగా బ్రతికి మనుషుల్లో దేవుడిలా దేవలోకాన్ని ఎలా తిరిగి చేరుకొన్నాడో, అలాగుననే ఆయన ద్వారా మనం కూడా దేవుని అంతటివారమై అనగా తిరిగి దేవుని స్వరూపంలోకి మారి (యోహాను 10:34-38) దేవలోకాన్ని చేరటమే దేవుని చిత్తమై ఉన్నది. దేవునికి క్రీస్తుతోపాటు మనం అందరం పిల్లలమే కదా! ఉదా:- నేను దేవుని కుమారుడనైతే నా భార్య దేవునికి కోడలు కాదుకదా! ఆమె కూడా దేవునికి కుమార్తె అలాగే నా తల్లిదండ్రులు, అత్తామామలు, సోదరసోదరీమణులు, బావ-బావమర్దులు, పిల్లలు, పిల్లలపిల్లలు అందరూ దేవునికి పిల్లలే. ఇలా ఈ ప్రపంచంలోని అన్ని జాతులు, మతాలు, కులాలు వాటికతీతమైన కుటుంబాల వారు కూడా అంతే.

మన దేశంలో ఉన్నమనమంతా మన పూర్వీకులనుండే వచ్చాం. ఇప్పుడు కులం, మతం, భాషా, ప్రాంతీయ బేధాలతో కొట్టుకొని చస్తున్నాం. కాని చిన్నప్పుడుబడిలో చదివేటప్పుడు చేసే ప్రతిజ్ఞను మాత్రం మరచిపోతున్నాము. అదేనండి **"భారతదేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సోదరులు"** ఈ ప్రతిజ్ఞ ఇప్పటిది కాదుసుమా. మనం పుట్టకముందే దేవుడు మనందరం

సహోదరులుగా కలిసిమెలసి ఉండాలనే మనకొరకు బైబిల్‌లో మాత్రమే వ్రాయించాడు. దీనిని కేవలం అనటానికి మాత్రమే గాక దీనిని నెరవేర్చడానికే మనల్ని పుట్టించాడు దేవుడు. బైబిల్ వాక్యాలద్వారా దేవుడు కోరుతున్న ఆయన చిత్తాన్నిబట్టే ఈనాడు ఈ ప్రతిజ్ఞపుట్టింది. దీనిని చదువుకొనేటప్పుడే కాదు జీవితంలో ప్రతిదినం ప్రతిక్షణం నెరవేర్చడానికే మనం పుట్టామని తెలుసుకొని, గ్రహించి దాని ప్రకారం ప్రవర్తించిన వారే దేవుని చిత్తాన్ని నెరవేర్చినవారు. అదే యేసుక్రీస్తు చేశాడు, ప్రారంభ క్రైస్తవులు చేశారు. ఇప్పుడు మనం కూడా చేసి తీరాలి. అలా చేయకపోతే మనకు నరకమే గతి.

మనం పుట్టకముందే మనందరం ఎలా జీవించాలో, బ్రతుకాలో ఆయన పని ఎలా చేయాలో మనుష్యులందరి జీవగ్రంథమైన లేఖనాలలో వ్రాయించాడు. తన చిత్తాన్ని ఎఫెసి పత్రిక 1వ అధ్యాయంలో చెప్పిన దేవుడు, ఆయన పనులను ఎలా నెరవేర్చాలో 2వ అధ్యాయములో మనం భూమిమీద బ్రతికినంతకాలం చేయవలసిన క్రియలను అనగా పనులను గూర్చి కూడా ముందే వ్రాయించాడు. మన పని అనగా మన కర్మను (ఖర్మకాదు) మన ఒక్కొక్కరి నుదిటిమీద వ్రాయలేదు కాని అందరు చేయాల్సింది ఒకే విధమైన పనులు గనుక తన గ్రంథములో అందరి విషయమై ఒకేసారి, ఒకేవిధంగా వ్రాయించాడు. "అవేమనగా మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపచిన సత్ క్రియలు చేయుటకై మనం క్రీస్తుయేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై ఉన్నాము" (ఎఫెసి 2:10).

ఈ వాక్యంలోని భావాన్ని మనం మరోసారి జాగ్రత్తగా ఆలోచిద్దాం. మనం ఈ లోకంలో పుట్టకమునుపే, అసలు ఈ జగత్తుకు పునాది వేయబడకమునుపే మనము చేయాల్సిన పనులను 'సత్ క్రియలు' అని తెలియజేస్తున్నాడు. ఈ సత్ క్రియలను గూర్చి ఈ లోకంలో భయంకరమైన కుల, మతాలను సృష్టించి దేవుని పేరుమీదనే మారణహోమం చేస్తూ సాటి మానవాళిని నాశనం చేస్తున్న మతోన్మాదులైన మనుషులనడిగితే తలోరకంగా సమాధానం చెబుతున్నారు. సత్ క్రియలు అంటే మంచి క్రియలు అని చాలామంది చెబుతున్నారు, మరికొందరు దానధర్మాలు చేయడం, పవిత్ర స్థలాలను దర్శించడం, చెడ్డ పనులు చేయకపోవడం వంటి ఎన్నో విషయాలను చెబుతారు. మనుషుల దృష్టిలో మంచిని, మంచి పనులను నిర్వచించడం చాలా కష్టం సుమా! ఎందుకంటే నాకు మంచిగా అనిపించిన పనులు నా భార్యకే నచ్చవుగదా! ఫలానా వ్యక్తి చాలా మంచి వాడమ్మ అని నేను చెబితే వెంటనే ఆమె వాడంతటి పరమదుర్మార్గుడు మరొకడు లేడంటుంది గదా! ఈ లోకమర్యాద, మంచి కాలాన్ని బట్టి, సందర్భాన్నిబట్టి, ప్రాంతాన్ని బట్టి మారిపోతుంది.

అందుకే మనుషుల ఆలోచన, అనుభవాలలోనుండి బయటకు వచ్చి అందరికి, నచ్చిన దేవుడి ఆలోచనలోనికెళ్ళాలి. అదేపనిగా దానధర్మాలు చేస్తుంటే అవతలివాడు పనిమానేసి బాగా తినటానికి అలవాటుపడి సోమరిపోతుగా మారిపోతున్నాడుగదా! ప్రతిరోజు అన్నదానం చేసి ఒకరోజు లేకా ఒక పూట అన్నం పెట్టకపోతే ఆ రోజు అతను మనల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి వెళ్ళిపోతాడు గదా! జీవితంలో మళ్ళీ నీ ముఖం చూడడు. నిన్ను ఆశీర్వదించే

మాటలు మాని శాపనార్థాలు పెడుతాడు. అందుకే ధర్మం చేయకూడదు అసలు భిక్షాటననే పూర్తిగా రద్దుచేయాలంటాడు మరొకడు. చెడ్డపనులు చేయనంత మాత్రాన మంచి వారవుతారా? పాపం చేయనంత మాత్రాన పుణ్యాత్ములవుతారా? అని ఆలోచించండి. పుణ్యం లేదా మంచి పనులు చేస్తేనే పుణ్యాత్ముడు మరియు మంచి మనిషి లేకా మహనీయుడు, మహాత్ముడు అని అంటారు గదా.

అయితే మంచి క్రియలు అనే వాటికి అన్ని కాలాల్లో, అన్ని దేశాలలో అందరికి నచ్చిన, అందరూ మెచ్చిన కొలమానం కావాలిగదా. అందరికి నచ్చేది, అందరిని పక్షపాతము అనగా ఏ బేధము లేకుండా ప్రేమించి, కాపాడుతున్నది దేవుడే గదా! కాబట్టి సత్క్రియలు అనగా ఏమిటో అదే దేవునిని అడిగి ఆయన చిత్తప్రకారమే (1కొరింథీ 2:11–15) ఆయన పనులు లేదా కోరికను నెరవేర్చి దేవుని పిల్లలమైన దేవుళ్ళం కాగలం ఆలోచించండి. నిర్ణయం మన చేతుల్లో ఉందేకాని మన ఒక్కొక్కరి నుదిటిమీద వ్రాసిలేదు. ఇప్పుడు మన స్థితిగతులు అన్ని మన చేతిలో, చేతల్లోనే ఉన్నాయి గాని దేవుని చేతిలో కూడా ఏమిలేదు అని గ్రహించినవారు చాలా ధన్యులు సుమా!

సత్క్రియలు అనగా సత్+క్రియలు అని చెప్పవచ్చును. అంటే సత్యసంబంధమైన క్రియలు అని అర్థం. సత్ అనగా సత్యము అనగా నిజం అనేది కూడా పూర్తి అర్థానివ్వదు. ఎందుకంటే మనుషులు తన కళ్ళతో చూసింది, చెవులతో విన్నది నిజం అని చెబుతాం కాని అదికూడా చాలాసార్లు నిజంకాదు గదా! సత్యం అంటే సత్యమే కాని దానికి నిజం అనే పర్యాయపదం కూడా నిజంగా సరిపోదు.

కాబట్టి దేవుని ప్రకారంగా దేవుని వాక్యమైన క్రీస్తే సత్యము (యోహాను 14:6; 18:38). "సత్యమందు వారిని ప్రతిష్ట చేయుము నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17) అని యేసుక్రీస్తు దేవునికి చేసిన ప్రార్ధనలో పలికాడు. కాబట్టి దేవుని వాక్యంలో ఉన్నవి, ఆయన అనగా దేవుని కుమారుడైన క్రీస్తు చేయమన్న క్రియలే సత్‌క్రియలు అని మనందరం ముఖ్యంగా క్రీస్తు శిష్యులైన క్రైస్తవులు అందరూ తప్పక గ్రహించాలి.

ఈ సత్ క్రియలను మనిషిగా పుట్టి దేవుళ్ళుగా అనగా దేవత్వములోనికి మారి, దేవలోకం వెళ్ళాలని ఆశించే అందరూ చేయాలి. దేవలోకం మన అందరిది, దేవుడు అందరివాడు. ఒకవేళ మనచుట్టూ ఉన్నవారు వీటిని చేయలేదనే సాకు చూపించి మనం మాత్రం మానేయకూడదు. ఎవరు ఈ వాక్య సంబంధమైన క్రియలు చేస్తే వారే దేవునికి పిల్లలై పరలోకం పోతారని మరచిపోకూడదు. దేవుని చిత్తాన్ని నెరవేర్చని వారు అనగా ఆయనను ఆరాధించని వారికి శిక్ష విధిస్తాడనేది మనకు ముందే తెలుసు. ఆయన మనకు స్వతంత్రమిచ్చి వాటిని చేయడానికి మన జీవితకాలమనే సమయమిచ్చాడు. మరియు అనేక సార్లు సువార్త, స్వస్థతల్లాంటి అనేక సభలలో మీ పనితో పాటు నా పని చెయ్యమని హెచ్చరిస్తూనే ఉన్నాడు. కాబట్టి ప్రతి మనిషి తానే నిర్ణయించు కోవాల్సిన అవసరముంది. మన భవిష్యత్ మన చేతిలోనే ఉంది తప్ప దేవుని చేతుల్లో లేదు. ఏ గ్రహం అనుగ్రహంకూ పని చేయలేదు. ఎవ్వరి చేతనైనా ఏ పనినైనా (మంచి–చెడు) దేవుడు బలవంతంగా చేయించడు. ఈ సత్యాన్ని మనం అనేకులకు అనుక్షణం గుర్తుచేస్తూ ఉండాలి. అదే దేవుని చిత్తం. మన జీవిత పరమార్ధం.

ఈ లోకంలో కొందరు ఊరికే అన్యాయంగా అందరి జోలికెళతారు. అందరిని బెదిరించి ఉరికే తిని బలుస్తారు. కొందరు మాత్రం ఎవ్వరిజోలికెళ్ళరు. కాని తమ జోలికి వచ్చినవారిని అస్సలు వదలరు. మనల్ని కొట్టిన వారిని కొట్టడం, తిట్టిన వారిని తిట్టడం ఈ లోకన్యాయ పరంగా సరియైనదే కావచ్చు కాదనలేం. అయితే ఈ లోకంలోని చట్టం మనల్ని ఎవరైనా తిట్టినా, కొట్టి చంపినా మనం తిరిగి అదే పని చేయకూడదని చెబుతుంది గదా! అలాచేస్తే జైలులో పెట్టి శిక్షిస్తుంది కూడా. ఇదే విషయాన్ని కూడా దేవుని న్యాయం+చట్టంలో ముందే చెప్పాడు. దేవునిచిత్తం నెరవేర్చడమంటే క్లుప్తంగా (టూకీగా) రోమా పత్రిక 12వ అధ్యాయం అంతా చదివి గ్రహించి దాని ప్రకారం ప్రవర్తించండి. పూర్తి వివరాలు “ఇదే పుస్తకంలో ముందే వ్రాశాను.

“మిమ్మును హింసించువారిని దీవించుడి, దీవించుడి గాని శపించవద్దు. సంతోషించువారితో సంతోషించుడి, ఏడ్చువారితో ఏడువుడి ఒకనితో ఒకడు మనస్సు కలిపియుండుడి. హెచ్చు వాటియందు మనస్సుంచక తగ్గు వాటియందు ఆసక్తులైయుండుడి. మీకుమీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు. కీడుకు ప్రతికీడెవనికి చేయవద్దు. మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి, శక్యమైతే మీ చేతనైనంతమటుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా మీకుమీరే పగతీర్చుకొనక దేవుని ఉగ్రతకుచోటియ్యుడి... నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము...” (రోమా 12:1-21).

దేవుని పని జరిగించడము లేదా ఆయన చిత్తాన్ని నెరవేర్చడము అంటే ఆయనను ఆరాధించడమే. ఆయనను ఆరాధించడమంటే దేవుడి ఫొటోకి దండవేసి ఓ దండం పెట్టుకొని, కళ్ళుమూసుకొని మోకాళ్ళూని ప్రార్థన చేసుకొని వెళ్ళడమూ కాదు. లెంపలేసుకోవడం తప్పులొప్పుకోవడం, సిలువను ముద్దాడటం, సాష్టాంగ నమస్కారం చేయడం, కానుకల పెట్టెలో నగలు, డబ్బు వేసి హమ్మయ్య నేను దేవున్ని బాగా పూజించాను, ఆరాధించాను అని అనుకొని వెళ్ళడము కాదు. కాని పైన చెప్పిన వాక్యప్రకారముగా ప్రవర్తించడమే, అనగా ఆయన పనియే పూజనీయం. ఇలా తిట్టినవారిని తిట్టకుండా ఉండి వారిని దీవించడం ఎంత కష్టమో ఆలోచించాలి. ఎందుకంటే దేవుడు కూడా ఆయనను లేదని తిట్టినవారిని కూడా క్షమించి, ఓపికతో ప్రేమించి, దీవించి వారిని కూడా అందరిలాగే అనగా నమ్మినవారితో సమానంగానే ఇప్పుడు కాపాడుతున్నాడు గదా! నీ కుడిచెంపమీద కొట్టినవాడికి నీయెడమ చెంప కూడా చూపమని మత్తయి సువార్త 5:39లో యేసు చెప్పిన వాక్యాన్ని నెరవేర్చడమే నిజమైన సత్క్రియయనియు ఇలాంటివి మరిన్ని చేయడమే దేవుని వాక్య సంబంధమైన క్రియలని బైబిల్ గ్రంథం ద్వారా దేవుడు చెప్పాడు.

కనుక భూమిమీద దేవుని చిత్తము ఏదో గ్రహించి సత్క్రియలు చేసి దేవునిని మహిమపరచి దేవునిలాంటి వారిగా బ్రతికి అనగా మనం జీవించుచున్న గ్రామం, రాష్ట్రం, దేశంలో ఉన్న మనమంతా పేద, ధనిక, కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలను మరచి అన్నదమ్ములుగా, దేవుని పిల్లలుగా బ్రతికి మనదేశాన్ని, మరియు ఈ ప్రపంచాన్నే దేవాలయంగా మార్చడమే దేవుని చిత్తం. అంతేకాని శరీర సంబంధమైన మన అవసరాలు, కోరికలు తీర్చడంలేకా

తీర్చుకోవడం కోసమే బ్రతుకటము కాదు దేవుని చిత్తం. ఆయన చిత్తం నెరవేర్చడానికిచ్చిన వనరులే మన అవసరాలు అన్నీ. ఒకవేళ మన అవసరానికి అవితీరకపోయినా, అనుకున్న సమయానికి ఆయన మనకు ఇవ్వకపోయినా దేవునిని మరచిపోకుండా స్తుతించాలి.

మనల్ని మనం పరిశుద్ధులుగా ఉంచుకోవడం దేవుడంతటి వారమై దేవుడున్న లోకం చేరడమే దేవుని చిత్తం అని అర్థం చేసుకొన్న వారు ధన్యులు, అర్థం చేసుకొని దాని ప్రకారం ప్రవర్తించిన వారు మరీ ధన్యులు. అనేకులకు ఈ విషయాలను తెలియజేసినవారు మరీమరీ ధన్యులు. కాబట్టి ఈ లోక సంబంధమైన ప్రతి పనికి మాలినటువంటి పనికి దేవుని చిత్తము అనే చిలుకపలుకులు పలుకక ప్రతి మాటను జాగ్రత్తగా ఆలోచించి పలికిన వారే నిజమైన దేవుని పిల్లలు! (దేవుని చిత్తము అనే ఈ అంశముపై ప్రత్యేకంగా విడుదల చేసిన కరపత్రాన్నే ఇక్కడ ముద్రించాము అని గ్రహించగలరు).

(ఇలాంటి అచ్చు మరియు తర్జుమా తప్పులను ఎన్నింటినో పరిశుద్ధాత్మ సహాయం, నడిపింపుతో మా టీమ్‌తో కలిసి సరిచేశాము. కొన్నింటిని నేను వ్రాసిన ఇతర పుస్తకాలలో సరిచేసి వ్రాశాను. తెలుసుకోవాలని ఆశించేవారు. మమ్మల్ని సంప్రదించగరు. బైబిల్ సొసైటీ ఇండియా వారిని ఒప్పించే ధైర్యం ఉన్నవారు, బైబిల్ మలి ముద్రణలోనైనా సరిచేయించి దేవుని బహుమానాన్ని పొందగలరు. దేవుని చిత్తం ఎప్పుడో ఉన్నది గాని, మాకు అన్నీ వనరులు కలిసొస్తే, బైబిల్ సొసైటీ వారి చిత్తమైతే మేమే ముందుగా సరిగా చేచసిన నూతన నిబంధనను ముద్రించటానికి ప్రయత్నించుచున్నాము. ప్రార్థన చేయండి.)

# 27 పరిశుద్ధత అనగానేమి?



**దేవుని** చిత్తాన్ని నెరవేర్చుటకు, దేవలోకం చేరుటకు మనకు కావాల్సిన ప్రత్యేకమైన మరియు అత్యవసరమైన అర్హతయే ఈ పరిశుద్ధత. దేవుడు అనేకసార్లు ఈ విషయమే మనకు ఆజ్ఞాపించాడు, తన గ్రంథములో వ్రాయించాడు. అయితే ఈ పరిశుద్ధత అనేది మనం ఎలా నిర్వచించగలము. ప్రతిదానికి అర్థమున్నట్లే దీనికి అర్థం వెతకాలి. అదీ దేవుని ఆలోచనతోనే దేవుని వాక్యాలలో మాత్రమే వెతకాలి. ఎందుకంటే ఈ మధ్యనే అనేక మంది దొంగలు బోధకుని వేషంలో తెల్లని బట్టలు ధరిస్తూ బైబిల్‌లోని రెఫరెన్సులు చూపించకుండా పరలోక రాజ్యానికి ప్రవేశించేటప్పుడు అనగా బాప్తిస్మము తీసుకొనేటప్పుడు ఇచ్చేవాడు, తీసుకొనే వాడు కూడా పరిశుద్ధులేనా కాదా? అని చూడమంటున్నారు. మరియు బాప్తిస్మము ఇచ్చాక తెల్లబట్టలు మాత్రమే వేసుకోవాలంటున్నారు. బాప్తిస్మమిచ్చే ముందు స్త్రీల గాజులు, నగలు, బొట్టు అన్నీ తీసేయమని బలవంతపెడుతున్నారు. దీనికి రెఫరెన్సు లేదు. అన్యుల అలంకరణను, పై వేషాన్ని అనగా సాంప్రదాయాలను మాత్రమే చూపుతున్నారు. లేదా విదేశీయుల వైపు చూస్తున్నారు. పాపక్షమాపణ

నిమిత్తము పై వేషము మారనవసరం లేదు. ఎందుకంటే దేవుడు మనుషుల పై వేషాన్ని చూడడు, అందుకే బైబిల్‌లో సాక్ష్యాధారాలు వెతకండి. అప్పుడు తప్పని సరిగా సమాధానం దొరికి తీరుతుంది.

"మీరు పరిశుద్ధులగుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము. మీలో ప్రతివాడును, దేవుని యెరుగని అన్యజనులవలె కామాభిలాషయందు గాక పరిశుద్ధత యందును తనతన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది ఎరిగియుండుటయే దేవుని చిత్తము" (1థెస్స 4:3,4; 5:12-18).

ఇక్కడ శరీర సంబంధమైన కామాభిలాషను గూర్చి దేవుడు మాట్లాడుచున్నాడు. దీనిని ఆపుకోవచ్చును మరియు జారత్వమునకు దూరముగా ఉండండి అంటున్నాడు. జారత్వమనగా పెండ్లి అయినవారు పెండ్లికాని వారితో చేసే కామ క్రియలు. అది వ్యభిచారమే కాని పెండ్లికాని వారితో సాగించేదానికి మరోపేరు. పెండ్లి అయినవారు పెండ్లిఅయిన వారితో చేసేది వ్యభిచారం అనే పేరును స్థిరపరచారు భాషా పండితులు. జారత్వములోను, వ్యభిచారంలోను ఆత్మ సంబంధమైన అర్థం గూడా ఉన్నది. సంఘానికి క్రీస్తుకు పెళ్ళిఅయింది గనుక, వధువైన సంఘము లోకముతో, సాతానుతో సాంగత్యము చేస్తే అది జారత్వము. శరీరకంగా పెండ్లి అయిన వారు చేసేది, ఆత్మీయంగా క్రైస్తవులు లోకంతో చేసే సాంగత్యమును కూడా వ్యభిచారం అని చెప్పాడు. సంఘము అనగా మనము ఈ లోకంతో స్నేహం చేయకుండా దూరంగా పోవాలి. అది పరిశుద్ధత అంటే అదెలా చెయ్యాలో థెస్సలోనిక 5:12 నుండి 18 వచనాలలో చెప్పాడు దేవుడు చాలా జాగ్రత్తగా చదివి ఆలోచించండి.

ఎందుకంటే దేవుడికి శరీరంలేదు కదా ఆయన పరిశుద్ధుడు అని చెప్పాడు గదా! శరీరంతో ఉండి కామాభిలాషకులోనైతే పాపానికి దాసులమైతాము గాని, శరీరం మన ఆధీనంలో లేనపుడు ఎలా పరిశుద్ధులం కాగలము. శరీరం లేకుండా దేవుడెలా పరిశుద్ధుడు అయ్యాడో మనం ఇప్పుడు ఆలోచించాలి. దేవుడు ఆత్మ అనగా ఇది ఆత్మకు సంబంధించినది. ఆత్మ అనగా అదృశ్య లక్షణాలు అనగా చేస్తున్న క్రియలకు సంబంధించనది అని అర్థం చేసుకోవాలి. చాలా మంది పరిశుద్ధంగా ఉండండి అంటే మొదట తెల్లని వస్త్రములు ధరించాలి అంటారు ఎందుకంటే తెలుపు పరిశుద్ధతకు సాదృశ్యముంగదా అంటారు. తెలుపు అనేది లోక న్యాయములో పరిశుద్ధతకు గుర్తుగా ఉంది నిజమే. అయితే ఆ తెలుపు నీవు ధరించిన బట్టలకు ఉంది గాని నీకు అనగా నీ హృదయానికి ఆ తెలుపు అనే పరిశుద్ధత ఉందా?

అంటే పరిశుద్ధత ఆ తెల్ల బట్టలదే గాని మనదికాదు గదా. చాలా మందిని గుడికి లేదా చర్చి లేదా మందిరానికి పరిశుద్ధంగా రావాలి అంటే ఉతికి ఇస్త్రీ చేసిన బట్టలు లేవని, స్నానం చేయలేదని, స్త్రీలు అయితే స్వాభావికమైన మైలతో ఉన్నామని ఆరాధన అనబడే దానికి అస్సలు రావడం లేదు. నూతన నిబంధనలో మన శరీరంలో నుండి బయటకు వెళ్ళేది మనలను అపవిత్రపరచదు గాని, మన హృదయం నుండి నోటి ద్వారా బయటకు వెళ్ళదే మనిషిని అపవిత్ర పరుస్తుంది అన్నాడు ప్రభువు (మార్కు 7:14-23). అన్నీ చేసుకొని శుభ్రంగా చర్చిలోకి వచ్చే సరికి పాస్టర్ గారు ఆమేన్ అని ఆశీర్వాదమిచ్చే సమయానికి వస్తారు. ఇది అత్యంత శోచనీయం,

బాధాకరం. మనసులో కుళ్ళు పెట్టుకొని, పైన శరీర పరిశుభ్రతకు పరిశుద్ధత అనే ముసుగు తగిలించు కొంటున్నారు.

పైన అపరిశుభ్రంగా ఉన్నా పర్వాలేదు, లోనకంపు ఉండకూడదు. అలాగని అపరిశుభ్రంగా రమ్మనికాదు. సమయం, సందర్భం చూడమని చెబుతున్నాను. దేవుడు నరుని పై వేషమును చూడడు (గలతీ 2:6). మనం పరిశుద్ధులం కావాలంటే శరీరకంగా, ఆత్మీయంగా తెల్లగా అనగా నీతిగా బ్రతుకాలని అర్థం. అయితే దానిని ఎలా సాధించాలో దేవుడు తన మాటల్లో సెలవిచ్చుచున్నాడు. జాగ్రత్తగా దానిని చదివి ధ్యానించి దాని ప్రకారంగా ప్రవర్తించి పరిశుద్ధులమై దేవుని చిత్తాన్ని నెరవేరుద్దాం. ఒకరి పరిశుద్ధతను మరొకరు (ఎంతటి భక్తులైనాసరే) ఎట్టి పరిస్థితిలో కొలువలేరు అనగా గుర్తించలేరు. అది దేవునికే సాధ్యము సుమా! ఎందుకంటే హృదయాలను పరిశోధించేవాడు దేవుడు, నరుని పైవేషాన్ని చూసే వాడు నరుడే కాని దేవుని కుమారుడు కాదు.

“నేను పరిశుద్ధుడనై ఉన్నాను గనుక మీరును పరిశు ద్ధులైయుండుడని వ్రాయబడియున్నది కాగా మీరు విధేయులగు పిల్లలై మీ పూర్వపు అజ్ఞాన దశలో మీకుండిన ఆశలననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులైయుండుడి” (1పేతురు 1:14-6).

దేవుడు, మీరు నన్ను ఎలాగుచూడలేరు, నా మాటలు గూడా మీరు వినలేరు నా పరిశుద్ధత మీరు ఏ మాత్రం కూడా గ్రహించలేక పోతున్నారు. గనుక నేను పరిశుద్ధుడనైయున్న ప్రకారం మీరును

పరిశుద్ధులై ఉండాలంటే మిమ్మును పిలిచినవాడైన యేసుక్రీస్తును చూడండి అన్నాడు. ఆనాడు యేసుప్రభువు తన బ్రతుకులో మనుషుల దయ యందును దేవుని దయయందును దినదినము వర్ధిల్లి అందరిచేత సర్టిఫికేట్ పొందాడు. ఎందుకంటే యేసును చూచిన వారు, ఆయన స్వరాన్ని స్వయంగా విన్నమనుషులున్నారు గనుక పరిశుద్ధత అనేది శరీరానికి సంబంధించినదికాదు. అది అందరి ప్రవర్తనకు సంబంధించినదని మరీమరీ నొక్కి చెప్పాడు. ఎందుకంటే యేసయ్య తన ప్రవర్తన ద్వారా తనేమిటో రుజువుచేసుకొన్నాడు.

దేవుడు నన్ను కూడా ఎరుగాలి అన్నాడంటే ఆయన నడవడిని చూడమన్నాడు. మనకెప్పుడు ఒక వ్యక్తి మాదిరికరంగా ఉండాలని, ఆయనను చూస్తు మారుట సులభం అని చెప్తాంగదా! అది తెలిసిన దేవుడు ముందుగా మనకు మార్గదర్శిగా లేక రోల్ మోడల్‌గా మనకు క్రీస్తునిచ్చాడు. ఆ క్రీస్తు ఎలా పరిశుద్ధుడయ్యాడు. ఆయనలోని గుణ, గణాలేమిటి అని ఆలోచించాలి గదా! మనల్ని తన దగ్గరకు పిలిచిన ప్రభువు తన క్యారెక్టర్ (గుణం–ప్రవర్తన) ఎలాంటిదో గూడా అక్కడే తెలియ జేస్తున్నాడు. గనుక ఆయన మాటల దగ్గరకెళదాం.

"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేసెదను. నేను **సాత్వీకుడను, దీనమనస్సు** కలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నా భారము తేలికగాను ఉన్నది" (మత్తయి 11:28–30).

ఇప్పటికే పరిశుద్ధత యొక్క అర్థాన్ని గ్రహించి ఉంటారు. దేవుడు, యేసుక్రీస్తు ఇద్దరు తాము ఎందుకు ఎలా పరిశుద్ధులుగా కనబడ్డారంటే తెల్లవస్త్రములు ధరించుకొనిగాదు. వారి లక్షణాలలో రెండు ముఖ్యమైన వాటిని గూర్చి చెప్పుచున్నాడు. మొదటిది సాత్వీకము, రెండవది దీనమనస్సు. సాత్వీకము అంటే తన్నుతాను తగ్గించుకోవడం. దీనమనస్సు అనగా మనస్సులో దీనత్వంను కలిగియుండుట అని అర్థం. మనిషి శరీరంలో తగ్గించుకొన్నట్లు కనబడ్డా అనగా చూడటానికి క్రిందగూర్చొని మోకాళ్ళేసుకొన్నా మనస్సులో గర్వం ఉంటుంది గనుక మనస్సులో అనగా కనబడని మనస్సులో నేను, నా హోదా అనే గూడా దీనత్వం అనగా తగ్గింపు అని అర్థం. మానవులందరికోసం యేసుప్రభువు ఎంతగా తన్ను తాను తగ్గించుకొన్నారో వివరించడానికి ఈ పుస్తకం సరిపోదు. అలాంటి పరిశుద్ధత కావాలంటే పాపులందరు ఆయన వద్దకే వచ్చి నేర్చుకోమంటున్నాడు. ఆ తర్వాతనే మనకు విశ్రాంతినిస్తానన్నాడు.

ఆయన(క్రీస్తు)కాడి అనగా పరిశుద్ధమైన జీవితం జీవించడం చాలా సుళువు, అలా బ్రతుకడం చాలాతేలిక అని తన బ్రతుకులో అడుగడుగునా రుజువుపర్చాడు. పరిశుద్ధత అంటే శరీరాశలను, కోరికలను కాదని బ్రతకడం మాత్రమే కాక ఆత్మ కూడా తన తగ్గింపు జీవనాన్ని కొనసాగించాలన్నమాట. ఉదా : సాత్వీకము, దీనమనస్సు అనగా ఒక వ్యక్తి ఎదురు అయినప్పుడు అన్నా/అక్కా వందనాలు అని అంటాము. అయితే అది మనస్పూర్తిగా రాదు. లోపల బిడ్డా నీ సమయం బాగుంది గనుక తప్పించుకొన్నావు. బిడ్డా నాకు దొరికినప్పుడు నీ అంతు చూస్తానులే అని అనుకొంటారు. ఇలాంటి

మనస్తత్వము లేకా ప్రవర్తన పరిశుద్ధతతోకూడినది కాదు. బయటకు ఏమి అంటున్నామో లోపల కూడా అదే అంకిత భావంతో ఉంటేనే అది దీన మనస్సు ఈ విషయాన్ని పరిశుద్ధాత్మని సర్వసత్యములో గూడా ఎంతో చక్కగా వివరించాడు చూడండి.

"కాగా, దేవుని చేత ఏర్పరచబడిన వారును, పరిశుద్ధులును, ప్రియులునైన వారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వీకమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి" (కొలస్సి 3:12-14).

పై వాక్యములో ఇంకా అనగా మరి కొన్ని గుణలక్షణాలను వివరించాడు. చాలా చాలా ఓపిక ఉండాలి, దానిని దీర్ఘశాంతము అంటారు ఇవన్నియు దేవుని లక్షణాలు కదా! మనకెలా ఉంటాయి అని అనుకోవద్దు. ఎందుకుండవు మనం కూడా ఆ దేవుని స్వరూపాలమే కదా! ఆయన మనల్ని క్షమించినలాగున మనం మన సోదరులను క్షమించాలి. ఇవన్నీ జరిగించాంటే సంపూర్ణమైన ప్రేమను ధరించుకోండి అని అంటున్నాడు. ప్రేమ అన్నింటిని సహిస్తుంది గదా (1కొరింథీ 13:1-13). దేవుడు ప్రేమాస్వరూపి (1యోహాను 4:8) అయిఉన్నాడు గనుక మనం కూడా ప్రేమా స్వరూపులంగా మారాలి. అందుకే దేవుడు పరిశుద్ధుడై ఉన్న ప్రకారం మనల్ని కూడా పరిశుద్ధులుగా ఉండండి అంటున్నాడు. మనం పుట్టుకతో అనగా ఈ లోకానికి వచ్చినప్పుడు పరిశుద్ధమైన ఆత్మలుగానే వచ్చాం. మధ్యలో ఈ లోకమనే కంపు, మన శరీరానికి బురదగా అంటుకొన్నది. దానిని పరిశుద్ధుడైన యేసురక్తంలో కడుగుకొని ఆయనవైపు చూస్తూ, మనం ఆయనలాగా బ్రతికి, ఆయన ద్వారానే

పరిశుద్ధులుగా, నిర్దోషులుగా దేవునిముందు నిలబడాలనేదే దేవుని అనాది సంకల్పం, మరియు ఆయన చిత్తం. ఇది న్యాయమైన ఆజ్ఞ అనగా మానవ న్యాయం ప్రకారం శాస్త్రీయమైనదే గదా!

మనం బ్రతికినంత కాలం ఆ మహా దేవునిని మహిమపరుస్తూ, దేవ దేవునినే కీర్తిస్తూ, స్తుతిస్తూ అనేకులకు తెలియజేస్తూ ఆయనను కాదన్నవారి నోరును ప్రేమతో వాక్యం చెప్పి మూయించడం కూడా దేవుని చిత్తములో ఒక భాగము (1పేతురు 2:15). అంతేగాని చాలెంజ్‌లు చేసో, భయపెట్టో, బలవంతపెట్టో, బ్రతిమాలో ఆశ చూపించో, బాధపడో మరియు ఏడ్చో ఎవ్వరి నోరు మూయించ వలసిన పనిలేదు. ఆత్మను రక్షించాలనే తపన (ప్రేమ)తో వారికి అర్థమయ్యే రీతిలో అనగా వారి హృదయంలో నాటబడే ఈ వాక్యము నీతిగా దేవుని రాజ్య సువార్తను ప్రకటిస్తే చాలు. అలాగే ఇతరులకు మేలుచేసి దు:ఖపడడం కూడా దేవుని చిత్తం. అన్యాయంగానో, దొంగతనం చేసో దానికి శిక్ష అనుభవిస్తూ బాధపడేకన్నా ఇతరులకు మేలుచేసి బాధపడటంకూడా దేవుని చిత్తము (1పేతురు 3:17) అదే చిత్తాన్ని యేసుసిలువలో తన శరీరాత్మలతో సహా రుజువుచేశాడు. మనంఆయన ముందు మన సిలువనెత్తుకొని ప్రతి దినం మన మేమిటో కూడా రుజువు చేసుకోవాలి.

“కాబట్టి దేవుని చిత్త ప్రకారము బాధపడువారు సత్ ప్రవర్తనగలవారై నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను” (1పేతురు 4:19). దేవునిలోనుండి వచ్చినది, ఒకప్పుడు దేవుడైయున్నది. కొద్దికాలము మానవ శరీర ఆకారములో ఉన్నదైన ఈ దేవుడైన ‘ఆత్మను’ సాతానుకు అప్పగించకుండ, మన

ఆత్మను సృష్టికర్తయైన దేవునికి అప్పగించడమే దేవుని చిత్తం. ఇందులో ఎంతో వాస్తవం, న్యాయం ఉంది. ఆ దేవుని చిత్తాన్నిబట్టే ఇదంతా జరుగుతున్నది. అందుకు దేవునికి స్తోత్రములు చెల్లిస్తున్నాను. దేవుని చిత్తము ఎంత న్యాయమైనదో మరియు శాస్త్రీయమైనదో చూడండి. దేవుడు మనలను ఆ చిత్తాన్ని నెరవేర్చమనడంలో కూడా న్యాయం ఉంది గనుక ఆయన చిత్తాన్ని నెరవేర్చడం మనకూ న్యాయమే.

కన్న తండ్రి కోరికను నెరవేర్చటము కుమారునిగా లేక పిల్లలుగా ప్రతి ఒక్కరి విధి. తండ్రి కోరికను నెరవేర్చనివాడు కుమారుడే కాడు కదా! ఆలోచించండి. కుమారుడినా? (జీతగాడివా) బానిసవా? కుమారుడివే అయితే ఆ తండ్రికి వారసుడవే. కుమార్తెలు కాదని కాదు సుమా. ఆత్మీయంగా ఆడవారు కూడా కుమారులుగానే పిలువబడుతారు. కీర్తనలో కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము అనగానే అనేకులు వారి బోధకుల అమాయకపు బోధను బట్టి తమ కుమార్తెలు స్వాస్థ్యం కాదనుకొని కుమార్తె అనగానే ఏడుపు ముఖం పెట్టడం మరియు గర్భస్రావాలకు అనగా భ్రూణ హత్యలకు పాల్పడి నరకపాత్రులవుచున్నారు.

# 28 ప్రార్థన ఎవరికి చేయాలి?

ఈ లోకంలో ఉన్నప్పుడు మనం ప్రతిక్షణం దేవుని చిత్తాన్ని నెరవేర్చాలన్నా, ఆ దేవునిలా బ్రతకాలన్నా దేవుని వాక్యం మరియు ఆయన ఆత్మసహాయం కావాలి. వీరిద్దరి ద్వారా వెళ్ళి ఎల్లప్పుడు దేవునికి మన అవసరాలను చెప్పుకొని ఆయన సహాయం కొరకు ఎదురు చూడటం చాలా అవసరం. అందుకే ఈ ప్రార్థన అనగానేమి? దానిని ఎలా చేయాలి? ఎవరికి చేయాలి? అనేవాటి మీద కూడా క్రైస్తవులందరికి ఒకేవిధమైన అభిప్రాయం లేదు. దేవుడు ఎవరు? అనే అంశం మొదలుకొని అనేకమైన, అన్ని విషయాల మీద వివిధమైన బేధాభిప్రాయాలతో కొట్టుకుచస్తున్న దేవుని ప్రజలకు, ఈ విషయంలో కూడా ఏకాభిప్రాయం కలుగాలనే ఆశయంతోనే ఈ ప్రశ్నవేసి సమాధానం చెప్పుచున్నాను. అంతేకాని మరొకటికాదు. ఈ ప్రశ్నచూసి ఈ మాత్రం మాకు తెలియదా? అని ఆలోచించవద్దు. అనేకులకుమాత్రం ఈ విషయం ఏ మాత్రం కూడా తెలియదు. కావాలంటే ఈ అంశము చదివిన తర్వాత అనేకులు అనగా పాస్టర్లు, రెవరెండులు, బిషప్పులు చేస్తున్న ప్రార్థనలు కూడా జాగ్రత్తగా విని

నేను చెప్పిన వాక్యాలతో, దాని వివరణలతో సరిచూచుకోండి. అప్పుడు సత్యవాక్య ప్రకారం ఏది సరియైనదో మీకే తెలుస్తుంది.

నేటికి అనేక మంది రెవరెండులు, బిషప్పులు సహితము ప్రార్థన చేసేటప్పుడు పరలోకమందున్న మా యేసయ్యా తండ్రి అని ప్రార్థించుట చూస్తున్నాము. ఇది ఎంతవరకు వాస్తవం అని ఆలోచించకుండానే అనేకులు ఆమేన్ అని అన్యాయంగా దేవుని ఉగ్రతకు లోనవుతున్నారు. మొదట ఇశ్రాయేలీయులలో నుండే క్రీస్తు శిష్యులైనవారు, యోహాను తన శిష్యులకు ప్రార్థననేర్పినట్లు మాకు కూడా ప్రార్థన నేర్పమని యేసును అడుగుతున్నారు. ఎందుకంటే అప్పటివరకు కేవలం వారి యాజకులు మాత్రమే దేవాలయంలో దేవునితో సంబంధాన్ని కొనసాగించేవారు. వారి సమస్యలన్నీ ధర్మశాస్త్రం ప్రకారం యాజకుడితో చెబితే, యాజకుడే దేవునితో విన్నవించేవాడు. అయితే క్రీస్తుకాలంలో అది కొద్దిగా మార్పు చేయబడింది గనుక యేసు సరాసరి తన శిష్యులందరిని ఇలా ప్రార్థన చేయమని వారికి ప్రార్థన నేర్పాడు (లూకా 11:4).

ప్రార్థన అనగానే చాలామంది ఏం సమాధానం చెబుతారో తెలుసా? ప్రభువుతో సంభాషణ అని రకీమని చెబుతారు, దేవునితో మాట్లాడుట అని కొంతమంది చెబుతారు. నిజంగా వాక్యప్రకారం ఆలోచిస్తే సంభాషణ అనేది తప్పు, మాట్లాడుట అనేది కొంతవరకు మాత్రమే సరియైనది. సంభాషణ అంటే ఇద్దరూ కలిసి మాట్లాడుకొనుట అని అర్థంగదా. ప్రార్థనలో మనం/నీవు ఒక్కడివే మాట్లాడుతావు కాని దేవుడు మనతో తిరిగి అప్పుడే మాట్లాడుతాడా? లేదు గదా! మరియు దేవునితో మనం మాట్లాడుతున్నామా? లేకా?!

మనకు కావాల్సిన వాటిని ఆయనతో విన్నివించుకుంటున్నామా అవును కేవలము విన్నవించుకొంటున్నాము. లేదా చెప్పుకుంటున్నాము. కాబట్టి ప్రార్థన అనగా దేవున్ని అడుక్కోవడమేకదా. ప్రభువును అర్థించడమే (ప్ర+అర్థన) ప్రార్థన సుమా. మన విన్నపాలు ఆయనకు నచ్చితే ఆయనకిష్టమొచ్చినప్పుడు మనకు సమాధానం అనగా అడిగింది అవసరమైతేనే ఇస్తాడు. ఆ అడిగేదికూడా మనకిష్టమొచ్చింది అడుగకూడదు, మనకిష్టమైన విధానంలో అడుగకూడదు. ఆయన అడుగమన్న విధానంలోనే అడుగాలిసుమా! అందుకనే ఈ విషయం మనకెంతో ప్రాముఖ్యమైనది గనుక జాగ్రత్తగా అడుక్కోవాలి. ప్రారంభంలో ప్రార్థన ఎలా చేయాలో తెలియని వారికి క్రీస్తునేర్పిన ప్రార్థనయే ప్రభువునేర్పిన ప్రార్థన అనియు దానినే పరలోక ప్రార్థన అనియు చెప్పుచున్నాము. వాక్యప్రకారముగా ఈ పేరు కూడా సరియైనది కాదు.

ధర్మశాస్త్రం అధికారం చెలాయిస్తున్న కాలంలో, దాని ప్రభావానికి లోనైయుండి కొత్తనిబంధన అమలులోని కాలం గనుక క్రీస్తుకు సర్వాధికారం ఇంకా ఇయ్యబడలేదు గనుక తన నామంలో గాక తండ్రినే డైరెక్టుగా అడుగమన్నాడు. "పరలోకమందున్న మా తండ్రీ, అని మొదలు పెట్టి, రాజ్యము బలము నీవే అయిఉన్నావు స్వామి...ఆమేన్" (లూకా 11:2-4; మత్తయి 6:10-13) అని దేవునికే ప్రార్థన చేయమన్నాడు. ఆ తర్వాత ఆయన అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే ఆయనే దేవుని కుమారుడు అని తెలియ జేయుటకు, తండ్రికి చెప్పినా, నాకు చెప్పినా ఒక్కటే అనే భావం వారిలో కలిగించడానికి "మీరు నా నామమున దేనినడుగుదురో

తండ్రి కుమారుని యందు మహిమపరచబడుటకై దానిని చేతును. నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును. మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు, నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్యస్వరూపియైన ఆత్మను మీ కనుగ్రహించును" (యోహాను 14:13-21).

పై వచనాలను జాగ్రత్తగా గమనిస్తే మీరు తండ్రి నడగండి, ఇప్పుడు అనగా నేను మీతో ఉన్నంతకాలము నన్ను కూడా అడగండి అని చెబుతూనే నేను కూడా తండ్రినే వేడుకొంటాను/ప్రార్థిస్తాను, మీరు కూడా ఆయననే అడగండి అని చెబుతున్నాడు. ధర్మశాస్త్రం ఇంకా అమలులోనే ఉన్నది గనుక ఆయన రాజు, యాజకుడు గనుక అప్పుడు ఆయనకు చెప్పినా అది సరియైనది గనుక ఆయననే అడుగమన్నాడు. కాని మరణించి, తిరిగి లేచాక, ఇశ్రాయేలీయుల బలము కొట్టివేయబడింది కాబట్టి ప్రతిది యేసునామంలో తండ్రిని అడుగాలి. తర్వాత నేను ఎల్లప్పుడు మీతో ఉండను గనుక నన్నే అడిగే కార్యక్రమం అయిపోతుంది కనుక ఇంకను నేను మీతో ఉండను కాని పరిశుద్ధాత్మను పంపిస్తాను. ఆయనే అన్ని విషయములు మీకు నేర్పిస్తాడు. నేను ఎన్నో చెప్పాలనుకొన్నాను. అయితే ఇప్పుడు మీరు వాటిని విని గ్రహించలేని స్థితిలో ఉన్నారు గనుక పరిశుద్ధాత్ముడొచ్చి మిమ్మల్ని సర్వ సత్యములోనికి నడిపిస్తాడు. అపుడు అన్ని విషయాలు వివరంగా మీకు అర్థం అవుతాయి అని చెప్పాడు. (యోహాను 14:25-26; 15:7-16) ఇవన్నీ చెప్పిన తరువాత అప్పుడు ఇకముందు నన్ను అడుగక కేవలం తండ్రిని నా నామములో

తప్పక అడగండి. మీకు కావాల్సినవన్నీ ఆయనే ఇస్తాడనే విషయం చెప్పాడు. అందుకే పరలోక లేక ప్రభువు నేర్పిన ప్రార్థన విశ్వాసులకు ఇప్పుడు అవసరమా అని ఆలోచించండి.

అయితే ఏది అడుగాలో ఏది అడుగకూడదో తెలుసుకొని అడుగాలి. లోక సంబంధమైనవేవియు అడుగాల్సిన పనిలేదు. ఆయన నీవు ఎంత డబ్బు ఇచ్చావో చూడడు, నీకెంత ఇవ్వాలో కూడా ఆలోచించడు. ఆయనను అడుగాల్సింది పాపక్షమాపణ, పరిశుద్ధాత్మ, పరలోకం ఇవి ఆయనను అడిగితేనే ఇస్తాడు. పిల్లలు ఆయన బహుమానం, ఇల్లు, చర్చి, దేవాలయము నీవు కష్టపడికట్టుకోవాలి. తిండి నీవే నీ చెమటోడ్చి పని చేసి సంపాధించుకొని తినాలి. అయితే నీవు కష్టపడి సంపాధించే పరిస్థితి లేకపోతే ఆయనే మనం అడుగకుండానే కూడు, గుడ్డ ఇస్తానన్నాడు. కాబట్టే రేపటి గూర్చి చింతించకూడదు అన్నాడు. దేవుని పని చేస్తే దేవుని రాజ్యములో ప్రమోషన్ వస్తుంది. మన కోసమే కాకుండా మనుషులందరి, ముఖ్యంగా మనం తెలిసిన వారెవ్వరైనా వారందరి రక్షణ కోసం లేదా మనకు తెలిసిన వారందరి రక్షణ కోసం దేవున్ని ప్రతిక్షణం అడగాలి, యెడతెగక ప్రార్థించాలి. ఇది మన ప్రథమ కర్తవ్యం. ఇప్పుడు ఏది అడిగినా ప్రభువైన యేసుక్రీస్తు నామంలోనే లేదా యేసు ప్రభువు ద్వారానే అడుగాలి. అలా చేయకపోతే మన ప్రార్థన ప్రభువైన దేవునికి చేరదు గదా!

“ఆ దినమున మీరు దేనిని గూర్చియు నన్ను అడుగరు. మీరు తండ్రిని నా పేరిట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఇది వరకు మీరేమియు నా

పేరిట అడుగలేదు. మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి మీకు దొరుకును" (యోహాను 16:23).

ఇప్పుడు దీనిని చదివిన మీరు కూడా చాలా బాగా గ్రహించారనుకొంటాను. క్రీస్తు శరీరంలో ఉన్నప్పుడే చేసిన బోధలో, నేర్పిన ప్రార్థన (దేవునిని అడిగే విధానం)లో ఎంత మార్పు జరిగిందో. ప్రభువు మొదట వారికి మాత్రమే నేర్పిన ప్రార్థనలో "యేసుక్రీస్తు" నామములో ఈ ప్రార్థన మీకు సమర్పిస్తున్నాం తండ్రీ అని లేదుకదా. ఎందుకంటే అప్పటికి యేసు మరణించి తిరిగి లేవలేదు గనుక, ధర్మశాస్త్రం ఆయన మీద అధికారం చెలాయిస్తున్నది గనుక. అందుకే బైబిల్‌ను కాలాన్ని, సంధర్భాన్ని బట్టి చదువమన్నాడు దేవుడు (1పేతురు 1:10,11). ఇప్పుడు నూతన నిబంధనలో ఉన్న మనం పాత ధర్మశాస్త్రం క్రిందలేము గనుక మనకు దేవునికి మధ్యవర్తి యేసు క్రీస్తును నరుడు (2తిమోతి 2:5) గనుక మనం దేవున్ని ఏమి అడుగాలన్నా క్రీస్తు పేరిట పరిశుద్ధాత్మ సహాయంతో దేవునికే ప్రార్థన చేయాలన్నమాట. (రోమా 8:26) ఇలా చేయని ప్రార్థన ఏదైనా దేవుని యొద్దకు చేరదు. ఇదే యేసు చూపిన మార్గము. ఇదే సత్యము. ఈ విధానంలోనే మనకు నిత్యజీవము ఖచ్చితముగా ఉంది. సిలువవేయబడిన క్రీస్తు బోధలోని వారు ఆనాడే ఎలా ప్రార్థనచేశారో వాక్యాన్ని చూద్దాం.

"మీ సహనమును సకలజనులకు తెలియబడనియ్యండి. ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనిని గూర్చియూ చింతపడకుడిగాని ప్రతి విషయములోనూ ప్రార్థన, విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయండి. అప్పుడు

సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును, మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:4-7).

"పక్షపాతము లేకుండా క్రియలను బట్టి ప్రతివారికిని తీర్పుతీర్చువాడు తండ్రి అని మీరాయనకు ప్రార్థన చేయుచున్నారు గనుక మీరు పరదేశులైయున్నంత కాలము భయముతో గడుపుడి" (1పేతురు 1:17; ఎఫెసి 5:15-21; కొలస్సి 3:12-17).

ఒకప్పుడు దేవుడు ఎవరో తెలిసినా తెలియదన్నట్లుగా ప్రవర్తించి ఆయనను ఎరుగలేదు ఇశ్రాయేలీయులు. ఇప్పుడు దేవుడెవరో తెలియని అన్యజనులైన మనందరికి ఆయన కుమారుడైన క్రీస్తు తెలియపరచినాడు గనుక మనం ఏం చేసినా ఆయన (క్రీస్తు) ద్వారానే దేవుని దగ్గరకు చేరడం న్యాయమే గదా! ఉదా:-మనకు రెకమెండేషన్ కోసం ఎవరైనా మంత్రియో, రాజకీయనాయకుడి వద్దకో, అధికారి వద్దకో వెళ్ళినప్పుడు వారిని మనకు పరిచయం చేసిన వ్యక్తిని మరిచిపోతామా? చెప్పండి. వారివద్దకు వెళ్ళిన ప్రతిసారీ మద్యవర్తిని తీసుకొనో, లేదా ఆయన పేరును తీసుకొనో ఆ పెద్దవారి వద్దకు వెళుతాంకదా! మద్యవర్తిని గుర్తు చెయ్యకపోతే వారు కూడా మనల్ని గుర్తుపట్టరు కదా! ఈ లోకంలో మనం చూసిన వ్యక్తులే మనల్ని మధ్యవర్తి లేకపోతే ఆయనను ప్రతిసారి గుర్తు చేయకపోతే, పరలోకంలో ఉన్న దేవుడు మనల్నెలా మళ్ళీ తన వద్దకు మధ్యవర్తి లేకుండా ఎలా రానిస్తాడో చెప్పండి. అందుకే ప్రభువైన క్రీస్తు అంత ధైర్యముగా, మొహమాటం లేకుండా నా ద్వారా తప్పయెవడును తండ్రి యొద్దకురాడు అని ఖచ్చితంగా చెప్పాడు (యోహాను 14:6).

కనుక మనమిక ప్రార్థన యేసుక్రీస్తుకే చెయ్యకుండా, ఆయన పేరిట తండ్రికి మాత్రమే చేయండి. దానికి సమాధానాన్ని కూడా క్రీస్తు ద్వారానే పొందండి. ఇదే దేవుడు చూపిన పరలోక మార్గము.

## కనుక దేవుని ప్రియులారా!

నాకు దేవుడనుగ్రహించిన జ్ఞానాన్ని బట్టి, దేవుని ఆత్మయైన పరిశుద్ధాత్మ సహాయాన్నిబట్టి, నాకున్న వనరులను బట్టి దేవున్ని గూర్చి కొంతమట్టుకే మీకు తెలియజేసాను. దేవుడు ఆత్మ అనియు, శక్తియు, శక్తిగల వ్యక్తి అనియు, ఆయన ఉన్నాడని గ్రహించాలి. ఆయనలేడని నాస్తికులన్నా, ఉన్నాడని ఆస్తికులన్నా ఆయనను తెలుసుకోవాలసిన అవసరం కూడా ఆయన పిల్లలమైన మనదేనని, పనిగట్టుకొని ఆయన నెరుగని వారికి భయంకరమైన శిక్ష (2థెస్స 1:6–8) ఎదురు చూస్తున్నది. కాబట్టి దేవుడున్నాడు అని జాగ్రత్తగా ఆలోచించండి! ఆయన యొద్దకు రండి ఆయనను క్రీస్తు పూర్వమే లోకాన్ని పరిపాలించిన మహాసామ్రాజ్యాధినేతలు ప్రపంచానికి ప్రకటించారు. ఇంతవరకు దేవునిని ఎవ్వరూ, ఎప్పుడైననూ చూడలేదు. ఆయన స్వరాన్ని కూడా డైరెక్టుగా వినలేదు అని జ్ఞాపకం పెట్టుకొని నేను దేవున్ని చూసానని, ఆయనతో ఇప్పుడే మాట్లాడి వస్తున్నానని చెప్పిన వారిని తరిమికొట్టి, మీతోపాటు అనేకులను నిజమైన దేవుని రాజ్యసువార్తలో ఉంచండి. ఆయనకు ఈ సృష్టిలో కనబడుతున్న ఏ రూపంలేదు గనుక విగ్రహారాధనకు అనగా క్రీస్తు, మరియమ్మ (వేలాంగిని మాత, మరియ మాత, సాగరమాత...) విగ్రహాలకు కూడా దూరంగా పారిపొండి. దేవుడొక్కడే అని చెబుతూనే అనేక సంఘాలుగా, గ్రూపులు విడిపోయి తలోరకంగా దేవుని

నామాన్ని దూషింపజేయకండి. ముందు వాక్యం కోసం మాత్రమే ఏకంకండి (యోహాను 12:21).

మనషులు సృష్టించిన దేవునికి, దేవుళ్ళకు మనలాగే పేర్లు, ఊర్లు, రూపాలు ఉంటాయి. అలాగే దేశీయ దేవుడు, విదేశీయదేవుడు ఊరుకో దేవుడు అనే తేడాలుంటాయి. కాని మనుషులను కంటున్న దేవునికి పేరుతో, ఊరుతో పనిలేదు. ఏ పేరుతో పిలిచినా, పెదవులతో పిలువక పోయినా, మనసులో దేవా తండ్రి అంటే కూడా పలుకుతాడని, మన మొర పూర్తిగా వింటాడని గుర్తుంచుకోవాలి. ఆయనకు మనుషుల్లాగే భార్యలు, పిల్లలు, భావోద్వేగాలు, పక్షపాతము, కుటిల, కపట, రాజనీతి లాంటి పదాలు లేవు. రక్తమాంసాలు కలిగిన వారు దేవుడు కాదని, దేవుని స్వరూపంలో ఉన్న దేవుని కుమారులని మరువద్దు. దేవుళ్ళు, దేవతలనబడిన వారు ఈ లోకంలో కోట్ల మంది ఉన్నారు. కాని దేవుడొక్కడేనని మరీమరీ గుర్తు చేసింది బైబిల్.

ఆయన పేరుమీద గొడవజేయకండి. దేవునిని తండ్రిగా భావించి ఆయనకు దగ్గర అవడానికి ప్రయత్నించండి. వాక్యాను సారమైన పాటలను మాత్రమే పాడి వాక్యం ద్వారానే దేవునిని స్తుతించి, ఆరాధించి ఆయనను మహిమపరచండి. యేసుదేవుని కుమారుడని మాత్రమే నమ్మి క్రీస్తుకు ఇచ్చే మహిమను క్రీస్తుకిచ్చి, దేవునికిచ్చే మహిమను దేవునికివ్వండి. స్తోత్రార్హుడెవరో, మహా దేవుడెవరో జాగ్రత్తగా బైబిల్‌ను ఆలోచించి చదివి అచ్చుతప్పులున్న చోట యేసే దేవుడా? దేవుని కుమారుడెవరో మనుష్య కుమారుడెవరో జాగ్రత్తగా సరిచేసుకొని, వాక్యాన్ని సరిగా విభజించి బోధించి,

అనేకులు నమ్మేవిధంగా క్రీస్తును ప్రకటించి, దేవుడు పరిశుద్ధుడై ఉన్నట్లు మనందరం కూడా పరిశుద్ధులుగా ఎలా, ఎందుకు అవ్వాలో ఆలోచించి నిర్ణయం తీసుకొని దేవుని ప్రేమకు పాత్రులుకండి. ఆ దేవ దేవునికే మీ ప్రార్థనా, విజ్ఞాపనలు ప్రతిక్షణం తెలియజేయండి.

దేవుని విషయంలో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఆయన భీకరుండు. ఆయనకు మనం మనస్సులో అనుకొన్నవి కూడా తెలిసిపోతాయి గనుక ఊహల్లో మరియు ఆలోచనలో కూడా దేవుని యెడల వ్యతిరేకత ఉండకుండా ప్రవర్తించండి. ప్రవక్తల బోధలో గాక, అపొస్తలులు బోధించిన సిలువవేయబడిన క్రీస్తు బోధలో ప్రతిక్షణం ఎదగండి. ఆయన చిత్తమెరిగి, ఆ చిత్తాన్ని నెరవేర్చుటకై బ్రతుకుకాలాన్ని ఉపయోగించండి. ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించండి.

దేవుడున్నాడా? లేదా అనే వాదాలు గాని, ఉన్నాడు రుజువు చేస్తామనే సవాల్ కూడా నేడు చేయకూడదు. అలాగే మా దేవుడు గొప్పవాడు మీ దేవుడు మంచివాడు కాదు, పాపి మరియు దొంగలాంటి పదాలు వాడి వారిని విమర్శించి గొడవలు పెట్టుకోక అనగా మత బేధాలు సృష్టింపక, లేక ఇద్దరు ముగ్గురు దేవుళ్ళు న్నారని మాత్రం ఒప్పుకోకండి. మీ దేవుడు తప్పు, మా దేవుడే రైటు అన్నామంటే వారికో దేవుడు, మనకు వేరే దేవుడు ఉన్నట్లుగా ఒప్పుకొన్నవారం అవుతాం. ఈ చిన్న జీవితంలో అనంత జ్ఞానాన్ని అందుకున్నామని విర్రవీగకుండా, ఆయన ఉన్నాడనే ఆవగింజంత నమ్మకంతో ఈ లోకంలో ఉన్న మనందరం మిగతా వారికి మేలు చేసి చనిపోయాక "ఆయన లేకపోయినా మనకొచ్చే నష్టం లేదుగాని,

లేదని నమ్మి, ఇష్టానుసారంగా బ్రతికి'పోయాక' ఆయన ఉంటే మాత్రం చాలా ప్రమాదం గనుక అనవసరంగా చాలా రిస్కు తీసుకోక జీవితంతో ఆటలాడక భయభక్తులతో బ్రదుకుదాం.

''తొట్రిల్లకుండా మిమ్మును కాపాడుటకును, తన మహిమయెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును, శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మహిమయు, మహాత్యమును, ఆధిపత్యమును, అధికారమును, యుగములకును పూర్వమును, ఇప్పుడును సర్వయుగములకును కలుగును గాక, ఆమేన్" (యూదా పత్రిక 24,25).

*దేవుని కుమారుడైన క్రీస్తు నిజమైన రాజ్య సువార్తలో*

*మీ సోదరుడు* ***డా॥ జాన్ బొంకూరి***

## డా॥ బి. జాన్‌గారి గళం నుండి వెలువడిన
## సత్యపు వెలుగులో నడిపించే దివ్యమైన వాక్య సందేశాలు
**ఆధునిక సమాజానికి ఆధ్యాత్మిక (వాక్యానుసారమైన) ఉపదేశములు**
**ఆడియో / సి.డి.లు (ఒక్కో సి.డి.లో 5లేక 6 ప్రసంగాలు కలవు)**

---

**1. విశ్రాంతి దినము**

- ✲ క్రీస్తును మరల సిలువ వేయుచున్న నవీన యూదులు (వాల్. 1,2)
- ✲ దేవునికి పేరు అవసరమా?
- ✲ యెరూషలేము
- ✲ ధర్మశాస్త్రము ఎవరికి?
- ✲ విశ్రాంతి దినం నాటి ఇశ్రాయేలియులకా లేక నేటి క్రైస్తవులకా?

**2. పరలోక రాజ్యము**

- ✲ పరలోక రాజ్యంలో అల్పుడెవరు?
- ✲ పరలోక రాజ్యం బలాత్కారముగా పట్టబడుచున్నదా?
- ✲ పరలోక రాజ్యపు తాళపు చెవులు
- ✲ నాశనకరమైన హేయవస్తువు
- ✲ గొఱ్ఱెలు - మేకలు ఎవరు?
- ✲ నీతిమంతుడు ఒక్కడు లేడా?
- ✲ పరలోకరాజ్యంలో గొప్పవాడు ఎవరు?

**3. తీర్పు తీర్చు దినము**

- ✲ తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 1)
- ✲ తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 2)
- ✲ తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 3)
- ✲ తీర్పు
- ✲ క్రీస్తు రెండవ రాకడ
- ✲ అంత్య తీర్పు

**4. దైవత్వము**

- ✲ ఏది నిజమైన దైవాశీర్వాదం
- ✲ దైవత్వము

✿ దేవుని ప్రేమించువారికి సమస్తము సమకూడి జరుగునా?

✿ పరిశుద్ధత అనగా?

✿ యేసువైపు చూచుట ఎలా?

**5. శ్రమల దినములు**

✿ 40 రోజులు శ్రమలా?

✿ 7 మాటలు

✿ మట్టల ఆదివారము

✿ శ్రమల దినములు

✿ ప్రవాసం

✿ యేసుక్రీస్తు మూడు రాత్రులు సమాధిలో ఉన్నాడా?

✿ యేసు రాజ్య పట్టాభిషేకము

**6. జ్ఞానము**

✿ యేసు అంజూరపు చెట్టును శపించుట

✿ హనోకు ఏలియాలు మరణించలేదా?

✿ పౌలు శరీరంలో ముల్లు

✿ మోషే శరీరం కొరకు తర్కం

✿ తూర్పు దేశపు జ్ఞానులు ఎవరు?

✿ ఇద్దరు, ముగ్గురు ఎక్కడ ఉంటే అక్కడ యేసు ఉంటాడా?

**7. ప్రకటన గ్రంథంలోని విషయాలు**

✿ 666 సాతాను ముద్ర (వాల్ - 1)

✿ 666 సాతాను ముద్ర (వాల్ - 2)

✿ 666 సాతాను ముద్ర (వాల్ - 3)

✿ 144000 మంది ఎవరు?

✿ బైబిల్ అంతా దర్శన గ్రంథమే

✿ మహా బబులోను

**8. సువార్త**

✿ సువార్త అనగానేమి? దానిని ఎలా ప్రకటించాలి?

✿ సువార్త ప్రకటన ఎవరు చేయాలి?

- భారతదేశమునకు సువార్త ఎప్పుడు వచ్చింది?
- సువార్తను ప్రకటిస్తున్న ప్రేతాత్మలు
- బైబిల్ పూర్తిగా ఆచరించడం అసాధ్యమా?
- అపోస్తలుడైన తోమా ఇండియా వచ్చాడా?

**9. రక్షణ**

- బాప్తిస్మము
- పరిశుద్ధత
- నిరీక్షణ అనగా ఏమిటి?
- రక్షణ అనగా ఏమిటి?
- విశ్వాసము దాని పరీక్ష
- మారుమనస్సు

**10. సందర్భానుసారమైన వాక్యం కొరకు**

- కృతజ్ఞత కూటము
- జ్ఞాపకార్థ కూటము
- నామకరణమహోత్సవము
- శిశు ప్రసూతి
- ఆలయ ప్రతిష్ఠ / గృహ ప్రతిష్ఠ
- పుష్పావతి కార్యక్రమము
- సీమంతము / శ్రీమంతము

**11. వాక్యమర్మములు**

- జీవ వృక్షము
- దానియేలు గ్రంథములోని ప్రవచన నెరవేర్పు
- మంచి చెడ్డల తెలివినిచ్చు చెట్టు
- బీదలు ఎల్లప్పుడూ ఉంటారా?
- బైబిల్‌లోని నాటి పరిశుద్ధ స్థలములు నేటికి పవిత్రమైనవా?
- దీప వృక్షము
- యోబును గూర్చి వివరణ

**12. దేవుని ధన్యతల కొరకు**

- ✿ విశ్రాంతి / నెమ్మది / ఆత్మలకు
- ✿ ధన్యతలు / ఎప్పుడు / ఎక్కడ
- ✿ జ్ఞానానుసారమైన ఆసక్తి
- ✿ భయము / భక్తి
- ✿ ఆత్మానుసారంగా జీవించుట
- ✿ మనుష్యుల యెడల దేవుని చిత్తం
- ✿ నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించడమెలా?

**13. దేవుని వాక్యమైన బైబిల్**

- ✿ బైబిల్ దేవుని వాక్యమా?
- ✿ బైబిల్ దేవుని వాక్యమే!
- ✿ ది. డావిన్సీ కోడ్ - 1
- ✿ ది. డావిన్సీ కోడ్ - 2
- ✿ వాక్య విభజన / దేవుని యెదుట యోగ్యత
- ✿ పరిశుద్ధ గ్రంథం / దేవుని వాక్యమేనా?

**14. మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము**

- ✿ సిలువ వేయబడని క్రీస్తు బోధ
- ✿ సిలువ వేయబడిన క్రీస్తు బోధ
- ✿ క్రీస్తు సిలువ వేయబడ్డాడు! జవాబులు!!
- ✿ సిలువకు శత్రువులు ఎవరు?
- ✿ అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయటకు వెళ్ళిరి!
- ✿ పరిశుద్ధాత్మ వరాల బోధకొరకైన హెచ్చరిక
- ✿ బాలయేసు / క్రిస్మస్

**15. నిబంధన తేడా నాడు - నేడు**

- ✿ సద్దూకయ్యులు / పరిసయ్యులు
- ✿ విశ్రాంతి అనువాగ్దానము
- ✿ మరుగై యున్నమన్నా
- ✿ హర్మెగిద్దోను యుద్ధం ఎప్పుడు?

✲ నిబంధన తేడా

✲ క్రైస్తవుడు

✲ క్రైస్తవ్యం నాడు - నేడు

**16. దయ్యాలు / మంత్రాలు**

✲ నేడు మంత్రాలు, దెయ్యాలు, మానవాతీత శక్తులున్నాయా?

✲ దయ్యాలు ఇప్పుడు ఉన్నాయా?

✲ శోధన సహించువాడు ధన్యుడు

✲ జ్యోతి శాస్త్రాన్ని సవాల్ చేసిన బైబిల్

✲ భూమిని వణికిస్తున్నదెవరు?

✲ దినములు చెడ్డవా?

✲ క్రైస్తవుడికి చదువురావాలా?

**17. పునరుత్తానము**

✲ పునరుత్థానము

✲ మొదటి పునరుత్థానము / రెండవ పునరుత్థానము

✲ జీవపునరుత్థానము / తీర్పు పునరుత్థానము

✲ శరీరముతో నరకమా?

✲ ప్రకటన గ్రంథ వివరణ

✲ ధర్మశాస్త్రం / ఆచరణ

✲ శాస్త్రమెరుగని ప్రాణం పోకడ

**18. పరిశుద్ధాత్మ దేవుని కొరకు**

✲ పరిశుద్ధాత్మ / అగ్ని బాప్తిస్మం

✲ పరిశుద్ధాత్మ ప్రేరణ

✲ అభిషేకం

✲ దేవుని పిలుపు

✲ అబద్ధ ప్రవక్తలు

✲ ప్రవచనం అంటే ఏమిటి?

✲ అంత్య క్రీస్తు ఎవరు?

**19. బోధకుల జాగ్రత్తలు**

- ✿ సంఘము
- ✿ సంఘము ఎలా ఉండాలి?
- ✿ బోధకుల జాగ్రత్తలు
- ✿ సమాజంలో స్త్రీ పాత్ర
- ✿ బైబిల్‌ను ఎలా చదవాలి?
- ✿ బైబిల్‌ను అర్థం చేసుకోవడం / పాటించడం కష్టమా?
- ✿ యేసువైపు చూచుట

**20. యేసు / రక్షకుడైన క్రీస్తు**

- ✿ యేసు ఎవరు?
- ✿ యేసు రక్తము?
- ✿ క్రీస్తు స్వరూపము?
- ✿ క్రీస్తు శరీరము
- ✿ జయశాలి ఎవరు?
- ✿ క్రొత్త నిబంధన
- ✿ ప్రకటన గ్రంథ వివరణ

**21. తండ్రి కుమార, పరిశుద్ధాత్మలు**

- ✿ దేవుడెవరు?
- ✿ దేవుడెలా ఉంటాడు?
- ✿ యేసుక్రీస్తు ఎవరు?
- ✿ పరిశుద్ధాత్మ ఎవరు?
- ✿ దేవదూతలు ఎవరు?
- ✿ సాతాను ఎవరు?
- ✿ సాతానును ఎరుగుట ఎట్లు?

**22. మనిషి కారణజన్ముడా?**

- ✿ మనిషి ఎవరు?
- ✿ మానవుడు జీవుడా? దేవుడా?
- ✿ మనిషి ఎందుకు పుట్టాడు?

* మానవుని అంతం ఎలా ఉంటుంది?
* మానవుని జీవన విధానం
* దేవాలయం
* యెహోవా కట్టిన యిల్లు

**23. పాపమును గూర్చి**

* పాపము
* మరణకరమైన పాపం
* పాపము యొక్క ఉనికిని ఎలా గుర్తించాలి?
* › పాపములోకి / పాపముతోకి ఉన్న తేడా
* ప్రకృతి / జంతువుల ద్వారా బోధ
* క్రైస్తవ్యం - మతమా?

**24. బైబిల్ శాస్త్రం**

* శాస్త్ర సాంకేతిక రంగం
* కరువులు భూకంపాలు
* కాలుష్యం
* మానవ క్లోనింగ్ సాధ్యమా?
* బూడిదయ్యే భూమితో అంతరిక్షం అంతరిస్తుందా?
* శాస్త్ర మెరుగని ప్రాణం పోకడ

**25. ప్రార్థన కొరకు**

* అడుగుడి / వెదకుడి / తట్టుడి
* ప్రార్థన అనగా
* ప్రార్థన ఎలా, ఎవరికి చెయ్యాలి?
* హన్నా ప్రార్థన
* స్తోత్రార్పుడెవరు
* దేవునితో / ఎవరైనా / ఎప్పుడైనా మాట్లాడారా

**26. హెచ్చరిక లేక ఆజ్ఞ / ఆచరణ**

* ఆచరణ ఆజ్ఞ సంస్కృతి సంప్రదాయము
* విశ్వాసము ప్రేమ నిరీక్షణ సువార్త

✲ యేసుక్రీస్తు ముద్రలు

✲ స్వస్థత శాలలు వాక్యానుసారమా?

✲ సత్యమును బట్టి ఆత్మ వర్ధిల్లుట

**27. క్రీస్తును, దేవుని, ఎందుకు ఎరగాలి?**

✲ దేవుని క్రీస్తును ఎరుగుట, ఎందుకు, ఎరగాలి?

✲ దేవుడు ఎవరు?

✲ సేవకై దేవుని పిలుపు అవసరమా?

✲ నిరీక్షణ

✲ రాజ్యహింస - రాజ్యాధికారము

✲ ఆత్మతోనా కట్టెతోనా కైలాసము?

**28. క్రైస్తవుని జాగ్రత్తలు**

✲ పవాసము అనగా?

✲ పరిశుద్ధాత్మ ఎవరు?

✲ డిసెంబరు 25న యేసు పుట్టాడా?

✲ అన్యాయపు సిరి అనగా?

✲ ఎవరు నీ శత్రువు

✲ చెడు కనిపిస్తే చట్టానికి నేరం.... దాన్ని తలిస్తేనే దేవునికి దూరం

✲ విశ్వాస పరీక్ష

✲ అబద్ధమాడితేనే కాదు పాపం

✲ భాషలు - వరాలు

**29. క్రిస్టమస్**

✲ క్రిస్టమస్ సందేశము, క్రీస్తు జననము

✲ నూతన సంవత్సర సందేశము

✲ క్రైస్తవులు దేనియందు ఐక్యతగా ఉండాలి

✲ ఏది నూతనమైనది

✲ సమయం వాచ్‌నైట్ సర్వీసు?

✲ ఇశ్రాయేలు దేశము

**30. పండుగలు - పుణ్యక్షేత్రాలు**

✲ పండుగలు - పుణ్యక్షేత్రాలు

✲ క్రొత్తభూమి - క్రొత్త ఆకాశము

✲ మానవ మేధస్సుకందని దేవుని ప్రేమ

✲ శుభ శుక్రవారము

**31. మనిషి జీవన యానం**

✲ దేవుని నీతి - రాజ్యము

✲ జీవాత్మని ద్వారా దేవుడు కోరుచున్నది

✲ మనిషి ఆయుష్కాలము

✲ మనిషి జీవన యానం

**32. పరలోక పట్టణము**

✲ దేవునిలో పరిపూర్ణత

✲ క్రొత్త ఆకాశము - క్రొత్త భూమి

✲ పరలోక పట్టణము

✲ రక్షణ - సువార్త - దేవునిపిలుపు

✲ దేవునికి విశ్రాంతి అవసరమా

**33. కఠినమైన తీర్పు**

✲ క్రైస్తవుడు దేశ చట్టమును ఉపయోగించుకొనుట

✲ విశ్వాసమునకు నిర్వచనము

✲ కఠినమైన తీర్పు

✲ మనిషి తన పనిలో నిజాయితి

✲ మరణము - దేవుని సన్నిధి

✲ సువార్త సేవకై ఈ దేశ చట్టమును ఉపయోగించుకొనుట

**34. జీవ వృక్షఫలము**

✲ దేవదూతలు సేవకులైన ఆత్మలు

✲ దేవుని కుమారులు / మనుష్య కుమార్తెలు

✲ జీవవృక్షఫలము / యెహోవా కట్టిన ఇల్లు

✲ మర్మము మరుగు చేయబడిందా?

✲ క్రీస్తు సిలువ మీద పలికిన ఏడు మాటలు

**35. వాక్య పరిశీలన?**

✲ దేవుని సేవకు పిలుపు ఈ కాలములో ఉన్నదా?

✲ కొత్తనిబంధన ఆజ్ఞ

✲ మట్టల ఆదివారము

✲ తమకు తెలియని దానిని ఆరాధించుట

✲ విగ్రహారాధన అనగా

✲ వెలుగు, జీవపు వెలుగు

**36. భార్యా - భర్తల సంబంధము**

✲ భార్యా - భర్తల సంబంధం

✲ దుష్టత్వము నుంచి మళ్ళించి ఆశీర్వదించుట

✲ దేవుని స్తుతించుట (ఫాదర్స్‌డే)

✲ క్రైస్తవ వివాహ చట్టము - విడాకులు

✲ మనిషి జన్మలో వివాహము అవసరమా?

**37. ఏది నిజమైన దైవారాధన?**

✲ బాధపడువారిని ఆదరించేవారు

✲ నేటి క్రైస్తవుల సాక్ష్యం

✲ ఉపమాన రీతిగా యేసు ఎందుకు బోధించాడు

✲ ఏది నిజమైన దైవారాధన

✲ క్రైస్తవుడు కనిపెట్టవలసినది దేనికోసం?

**38. మానవ జ్ఞానము?**

✲ దేవుని నీతి / జ్ఞానం తప్ప భూమిపై విస్తరించుటకు దేవుని ద్వారా అన్ని నేర్చుకున్న మనిషి

✲ భూమి బూడిదవుతుందా? యుగాంతం

✲ ఈ మట్టిలోకంలో మనిషికి మరో రూపం, జీవం ఉందా?

✲ గ్రహాంతర జీవులు ఎవరు?

✲ సమాధి చెప్పిన సజీవ సాక్ష్యం

**39. ప్రవక్తలు, అబద్ధప్రవక్తలు?**

- ✲ అబద్ధ ప్రవక్తలు
- ✲ ఆ ప్రవక్త ఎవరు?
- ✲ బైబిల్‌లో మహమ్మద్
- ✲ పూజార్హుడు ఎవరు?
- ✲ యేసుక్రీస్తు ఇండియా వచ్చాడా?

**40. మనిషి జీవన విధానం?**

- ✲ మనిషికి మరణం శాపమా? వరమా?
- ✲ మంచిపేరు అనగా
- ✲ నిర్దోషికి తీర్పు న్యాయమా?
- ✲ పేరులో ఏముంది?
- ✲ గ్రంథం, తీర్పు

**41. క్రీస్తు సిలువకు శత్రువులు ఎవరు?**

- ✲ పునరుత్థానం క్రైస్తవుల పండుగలు
- ✲ పుట్టనివానికి మేలా / పుట్టనివారుంటారా?
- ✲ ఆదికాండములోని మొదటి దినము వివరణ
- ✲ రూపాంతరము
- ✲ క్రీస్తు సిలువకు శత్రువులు ఎవరు?

**42. ధర్మశాస్త్రం దాని ఆవశ్యకత?**

- ✲ దేవుని ఆశీర్వాదం
- ✲ దేవుని చిత్తం అంటే ఏమిటి?
- ✲ మానవత్వమే మతం
- ✲ దేవుని పోలిక / స్వరూపం
- ✲ యుక్తి / కుయుక్తి
- ✲ ధర్మశాస్త్రం దాని ఆవశ్యకత

**43. త్రిత్వమా? ఏకత్వమా?**

- ✲ బైబిల్‌లో త్రిత్వ సిద్ధాంతం ఉన్నదా?
- ✲ దేవుడెవరు? దేవుడు ఎలా ఉంటాడు?

☆ యేసుక్రీస్తు ఎవరు?
☆ పరిశుద్ధాత్మ ఎవరు?
☆ పూజార్హుడు ఎవరు?
☆ త్రిత్వమా? ఏకత్వమా?

**44. ధార్మికము / దైవ భావన**

☆ చీకటిలో నుండి వెలుగులోనికి
☆ ధార్మిక గ్రంథాలలోని దైవభావన
☆ దేవుడిచ్చు స్వతంత్రము
☆ ఈ లోక అధికారము
☆ జ్ఞానానుసారమైన భక్తి మరియు బోధ
☆ హెచ్చరికలు

**45. వెలుగు నందు విశ్వాసము**

☆ జీవ పునరుత్థానము
☆ మెల్కిసెదెకు ఎవరు?
☆ తీర్పు పునరుత్థానము
☆ వెలుగునందు విశ్వాసముంచుట
☆ యేసుక్రీస్తు స్త్రీ సంతానమా?

**46. విశ్వాసము - వినుట వలననా / చూచుట వలననా?**

☆ చూడక నమ్మిన వారు ధన్యులు
☆ దైవభక్తిని గూర్చిన మర్మము
☆ హృదయ ప్రతిష్ఠ
☆ వెలుగు జీవపు వెలుగు
☆ విశ్వాసం - వినుట వలనా? చూచుట వలనా?
☆ యెహోవా దినం / క్రీస్తు దినము

**47. గత జన్మలోని పాపమే ఈ జన్మకు కారణమా?**

☆ భూ రాజులనేలు మహా పట్టణము
☆ గత జన్మలోని పాపమే ఈ జన్మకు కారణమా?
☆ ప్రార్థన ఎలా? ఎవరికి, ఎందుకు చేయాలి?

- సత్ సంవత్సరము న్యూ ఇయర్, వాచ్‌నైట్
- శకునములు / మూడనమ్మకాలు / మంత్ర తంత్రాలు

**48. నిషేదించిన రాయి**

- జీవవృక్షఫలం - 1
- జీవవృక్షఫలం - 2
- ఇల్లు కట్టువారు నిషేదించిన రాయి
- నీతిమంతుడే లేడా
- పునరుత్థాన భయం / భక్తి

**49. ఆత్మ విషయమైన దూషణ**

- జ్ఞానం క్రీస్తు విషయమైన నింద
- ఇతరులు పొందిన మేలుకొరక కృతజ్ఞత
- క్రీస్తు తైలాభిషేకం
- మనలో వున్న దైవత్వం
- వినుటకు వేగిరపడుట

**50. క్రీస్తే మన స్నేహితుడు**

- దేవుని నీతి స్వనీతి
- క్రైస్తవ బాబాలు
- క్రీస్తుతో స్నేహం (ఫ్రెండ్‌షిప్ డే)
- నీతిమంతుని జ్ఞాపకం చేసికొనుట
- వివాహబంధం / విడాకులు

**51. ప్రకటనలోని 7 సంఘాలు**

- ఎఫెసు - సంఘము
- స్ముర్న - సంఘము
- పెర్గము - సంఘము
- తుయతైర - సంఘము
- సార్ధీస్ - సంఘము
- ఫిలదెల్ఫియా - సంఘము
- లవొదికయ - సంఘము

**52. బైబిల్ అంతా దర్శన గ్రంథమే**

- మహా బబులోను
- ఇద్దరు సాక్షులు
- 144000మంది ఎవరు?
- 24 పెద్దలు ఎవరు?
- బైబిల్ అంతా దర్శన గ్రంథమే
- ఆలయ ప్రతిష్ఠ

**53. దేవుని చేత ప్రేమింపబడిన వారు**

- క్రిస్మస్ / వాచ్‌నైట్ / న్యూ ఇయర్
- దేవునిచేత ప్రేమింపబడినవారు
- మార్పు చెందిన జీవితాలు
- మంచి పేరు ఏది?
- పరిశుద్ధులైనవారి మధ్య జ్ఞానం

**54. యేసువైపు చూచుట**

- క్రీస్తు పుట్టుక రహస్యం
- యేసువైపు చూచుట
- జీవముగల దేవుని సంఘము
- మెల్కిసెదెకు - రామకృష్ణ
- మెల్కిసెదెకు - వేణు
- మెల్కిసెదెకు - డా॥ బి.జాన్
- అవినీతిపై ఉద్యమం

**55. విశ్వాసమూఢత్వం**

- వారి కడుపే వారి దేవుడు
- వెలుగులేని స్థితి చీకటి
- క్రైస్తవులే సిలువకు శత్రువులు
- మూఢనమ్మకములు
- సిలువ వేసుకున్న మనిషి
- విగ్రహం కన్ను తెరిచిందా?

**56. క్రైస్తవ్యంలో స్వతంత్ర్యము**

- ✲ ఫ్రీడమ్ ఇన్ క్రిష్టియానిటి - 1
- ✲ ఫ్రీడమ్ ఇన్ క్రిష్టియానిటి - 2
- ✲ తూరు (దేశపు) దేశాల జ్ఞానులా

**57. సంఘము సత్యమునకు ఆధారము**

- ✲ సంఘము కొరకు - 1
- ✲ సంఘము కొరకు - 2
- ✲ దేవుడు / దేవుని కుమారునికి తేడా
- ✲ అంత్య దినములు
- ✲ హృదయం ఎక్కడున్నది - 1
- ✲ హృదయం ఎక్కడున్నది - 2

**58. గుడ్ ఫ్రైడే**

- ✲ మట్టల ఆదివారం
- ✲ గుడ్ ఫ్రైడే
- ✲ పునరుత్థానం
- ✲ మరల నూతనపర్చుట
- ✲ మానవత్వం / దైవత్వం
- ✲ ప్రార్థన - సువార్త ప్రకటన

**59. జ్ఞానానుసారమైన బోధ**

- ✲ గ్రహఫలం / బలం
- ✲ ప్రాణం విలువ
- ✲ జ్ఞానానుసారమైన బోధ
- ✲ ప్రకృతిమార్పు
- ✲ దైవజ్ఞానం
- ✲ మహాబబులోను

**60. భీకరుడైన దేవుడు**

- ✲ దేవదూతలు / పాపం
- ✲ యేసును ఎలా నమ్మాలి

✲ జంతువుల సహవాసం
✲ దేవుని నమ్ముకొనుట మేలు
✲ భీకరుడైన దేవుడు
✲ ఆ సృష్టికి పూర్వం
✲ విశ్వాసమనగా

**61. ఏడేండ్ల శ్రమలు**

✲ ఏడేండ్ల శ్రమలు
✲ 1. మూఢనమ్మకాలు, 2. మూడున్నరేళ్ళ విందు
✲ పాతాళమెక్కడున్నది
✲ బోధలోని తేడా

**62. ధర్మోరక్షతి రక్షిత్త**

✲ మానవధర్మము
✲ జీవ వైవిధ్యము
✲ తల్లిదండ్రుల ధర్మాలు
✲ మతమార్పిడి (బలవంతపు)

**63. బలవంతపు మతమార్పిడి నశించాలి**

✲ బలవంతపు మతమార్పిడులు నశించాలి
✲ జీవ / తీర్పు పునరుత్థానము
✲ మరణ శాసనము
✲ నీతిధనము / కృపా ధనము
✲ యధార్థమైన భక్తి

**64. క్రైస్తవుల మరణం - సమాధి**

✲ వాక్యంలో ఐక్యత
✲ సత్యసువార్త
✲ శాస్త్రానికందని మరణం
✲ క్రైస్తవుల మరణం సమాధి
✲ క్రీస్తు పుట్టాడా / వచ్చాడా?
✲ ప్రాచీన నవీన స్వభావం

## 65. క్రీస్తు తత్వం ప్రజల్లో నాటబడాలి

- ప్రకృతి వైపరీత్యం / సంఘ భ్రష్టత్వం
- రాజ్య సువార్త రాజ్యాధికారం
- వాక్యమైన క్రీస్తు
- క్రీస్తు తత్వం ప్రజల్లో నాటబడాలి
- భాధ్యత గల జీవితం / క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు
- మందిర ప్రారంభోత్సవం ప్రార్థన మందిర ప్రారంభోత్సవం

## 66. దేవున్ని ఎలా ప్రేమించాలి

- పొరుగువాన్ని ఎలా ప్రేమించాలి
- బలి అర్పణ
- దశమభాగం దేవునికి ఏమి అర్పించాలి
- ప్రార్థన - పని ఏదిముందు?
- యేసుక్రీస్తు ఎవరు

## 67. పవిత్రయుద్ధము

- మరణకరమైన పాపము
- ఏది పరిశుద్ధ స్థలము
- పవిత్రయుద్ధము
- మానవ ప్రేమ
- క్రైస్తవ్యం
- భార్య భర్తల హెచ్చరిక

## 68. దేవాలయాలు

- ప్రేమ అంటే ఏమిటి?
- మదర్స్ డే
- పరిశుద్ధ పర్వతం / మృగములు
- దేవుని ముద్రలు
- ఉద్యోగస్తులు - దేవుని సేవ
- ఎవరు నీ శత్రువు
- దేవాలయాలు

**69. శాస్త్రానికందని మరణం**

- ✲ శాస్త్రానికందని మరణం
- ✲ పెళ్ళి ఎందుకు ఘనమైనది
- ✲ దీవించబడిన చర్చి
- ✲ పునరుత్థానము
- ✲ జ్ఞాపకార్థ కూడిక
- ✲ దైవ సేవకులకే ఎందుకు శోధన

**70. జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ**

- ✲ క్రీస్తు రాజ్య పట్టాభిషేకం
- ✲ క్రైస్తవుల మరణం సమాధి
- ✲ అపోస్తలులు / ప్రవక్తలు ఎవరు
- ✲ దేవుని ముసుగులో దేవాంతకులు
- ✲ జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ
- ✲ అన్యులను క్రీస్తులో నిలపడం

**71. అతిశయానికి పాపపు ముల్లు**

- ✲ పాపపుముల్లు
- ✲ పరలోకపు మన్నా
- ✲ దేవుని గ్రంథంలో పేరు
- ✲ జీవ గ్రంథంలో పేరు
- ✲ పునరుత్థానం
- ✲ పరిశుద్ధాత్మ అగ్ని అభిషేక బాప్తిస్మం
- ✲ యేసుక్రీస్తు స్త్రీయందు పుట్టాడా!

**72. ప్రకటన గ్రంథములోని ముద్రలు**

- ✲ మొదటి ముద్ర
- ✲ రెండవ ముద్ర
- ✲ మూడవ ముద్ర
- ✲ నాల్గవ ముద్ర
- ✲ ఐదవ ముద్ర

- ఆరవ ముద్ర
- ఏడవ ముద్ర (కడబూర)

**73. సత్యవాక్య పరిశోధన**

- హృదయాలోచన
- మనిషి ఆయుష్షు కొన్ని దినములేనా?
- క్రైస్తవుల ఐక్యత - కాపరుల బాధ్యత
- జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ
- వాక్య పరిశోధన
- విశ్వాస మౌలిక అంశములు
- దేవాలయాలు - గృహవాస్తు
- క్రీస్తుజన్మ రహస్యమా?
- మూర్ఖతరము వారికి వేరై రక్షణ పొందండి
- పరిశుద్ధులకప్పగింపబడిన బోధ
- సూర్యుని క్రింత నూతనమైనదేది లేదు


**ఇంకా లేటెస్టుగా మాట్లాడిన అంశాలు "విశ్వాసులెవరు"**

**అనే బైబిల్ రీసెర్చ్ సెమినార్ (31-03-2014)లో విడుదల కానున్నాయి.**

**6లేక 5 అంశాలతో కూడిన 1 సి.డి./యం.పి.3 వెల**

**రూ. 50/- మాత్రమే. పోస్టేజి అదనం.**

**సంప్రదించండి : బ్రదర్ జె. రవి - 9440792192, 9676744233**

**డా॥ బి. జాన్‌గారి గళం నుండి వెలువడిన**

**సర్వమానవాళిని సర్వసత్యపు వెలుగులోనికి నడిపించే దివ్యమైన వాక్య సందేశాలు**

**(సెమినార్ల డి.వి.డి. / వి.సి.డి.లు)**

| | | |
|---|---|---|
| **1.** | ముల్లోకాల మర్మములు (వి.సి.డి. - 4) | 15-8-2002 |
| 2. | వరకట్నమా? / కన్యాశుల్కమా? (వి.సి.డి. - 2) | 2-10-2002 |
| 3. | క్రీస్తు జన్మదినము (వి.సి.డి. - 4+1) | 6-12-2002 |
| 4. | నేటి క్రైస్తవుల సాక్ష్యం | 14-1-2003 |
| 5. | క్రీస్తు మరణదినం | 2-4-2003 |
| 6. | ఎయిడ్స్ భూతం (వి.సి.డి. - 2) | 1-5-2003 |
| 7. | త్రిత్వమా? ఏకత్వమా (2సెట్ వి.సి.డి. - 3) | 15-8-2003 |
| 8. | నేటి సువార్త పాటలు... వాక్యానుసారమా? (3సెట్ వి.సి.డి.-3) | 2-10-2003 |
| 9. | దయ్యాలు / మంత్రాలు, క్షుద్రశక్తులు-దైవిక శక్తులు ఉన్నాయా? (వి.సి.డి. - 4) | 26-11-2003 |
| 10. | సిలువకు శత్రువులు ఎవరు? | 15-1-2004 |
| 11. | సమసమాజ స్థాపనకు కావలసింది ఏది? (వి.సి.డి. - 4) | 6-3-2004 |
| 12. | క్రైస్తవ్యం కులమా? / మతమా? (వి.సి.డి. - 4) | 1-5-2004 |
| 13. | జన్మపాపమా? / ఖర్మపాపమా? (వి.సి.డి. - 3) | 14-8-2004 |
| 14. | సమాజంలో స్త్రీ పాత్ర - సంఘంలో అలంకరణ (వి.సి.డి. - 3) | 2-10-2004 |
| 15. | ఏది నిజమైన దైవారాధన? | 12-11-2004 |
| 16. | 1000 ఏండ్ల పరిపాలన | 14-1-2005 |
| 17. | సిలువ వేయబడిన క్రీస్తు?! (వి.సి.డి. - 3) | 8-3-2005 |
| 18. | జలయజ్ఞం | 14-5-2005 |
| 19. | 666-సాతాను ముద్ర (వి.సి.డి. - 3) | 15-8-2005 |
| 20. | పెండ్లి విందు / వివాహ మహోత్సవం | 12-10-2005 |

21. ప్రపంచ దేశాలకు స్వతంత్రం వచ్చిందా? (వి.సి.డి. - 4) 14-1-2006

22. తీర్పు దినం (వి.సి.డి. - 3) 30-3-2006

23. సంఘము / సంఘపెద్దలు (వి.సి.డి. - 3) 1-5-2006

24. జ్యోతిష్యం / వాస్తు / శాస్త్రాలా? (వి.సి.డి. - 3) 15-8-2006

25. నాశనకరమైన హేయమైన వస్తువు (వి.సి.డి. - 3) 2-10-2006

26. క్రీస్తు రెండవ ం ధకమా? (డి.వి.డి-3) 2-10-2010

49. గ్రహాంతర వాసులెవరు? (డి.వి.డి-2) 17-12-2010

50. పరలోక పట్టణము (డి.వి.డి-3) 26-1-2011

51. జీవ వృక్ష ఫలం (డి.వి.డి-2) 4-4-2011

52. గతజన్మ పాపమే ఈ జన్మకు కారణమా? (డి.వి.డి-2) 14-5-2011

53. మెల్కిసెదెకు ఎవరు? (డి.వి.డి.-2) 15-8-2011

54. ఆలయ ప్రతిష్ట (డి.వి.డి.-2) 06-10-2011

55. క్రిస్మస్ - వాచ్‌నైట్ - న్యూఇయర్ (డి.వి.డి.-2) - 06-12-2011

56. అంత్యదినములు (డి.వి.డి-2) - 26-01-2012

57. మహాబబులోను (డి.వి.డి.-2) - 23-03-2012

58. ప్రార్థన - సువార్త ప్రకటన (డి.వి.డి.-2) - 01-05-2012

59. ఏడేండ్ల శ్రమలు - ఎవరికి? ఎప్పుడు? ఎక్కడ? (డి.వి.డి.-2) - 15-08-2012

60. బలవంతపు మతమార్పిడులు నశించాలి (డి.వి.డి.-2) - 02-10-2012

61. ఆధునిక శాస్త్రానికందని మరణం (డి.వి.డి.-2) - 13-11-2012

62. యేసుక్రీస్తు ఎవరు? (డి.వి.డి.-2) - 26-01-2013

63. క్రైస్తవుల మరణము సమాధి?! (డివిడి.-3) - 27-03-2013

64. ప్రవక్తలు - అపొస్తలులు ఎవరు? (డి.వి.డి.-2) - 01-05-2013

65. పునరుత్థానం (డి.వి.డి.-2) - 15-08-2013

66. క్రైస్తవుల ఐక్యత - కాపరుల బాధ్యత (డి.వి.డి.-3) - 02-10-2013

67. జ్ఞానానికి మించిన క్రీస్తు ప్రేమ (డి.వి.డి.-3) - 14-11-2013

68. కడబూర - మ్రోగిందా? మ్రోగబోతుందా? (డి.వి.డి.-3) - 14-01-2014

69. విశ్వాసులెవరు? (డి.వి.డి.-3) - 31-03-2014

**బహిరంగ సభలు**

**1.** యేసుక్రీస్తు ఎవరు? (డి.వి.డి. - 1)

2. సృష్టికర్తకు కోడ్ వుందా? (వి.సి.డి.)

3. మనిషిని కాపాడేదే మతమా? ధర్మమా? (1,2,3 - డి.వి.డి)

4. దైవకణం - సృష్టి పుట్టుక (డి.వి.డి - 1)

5. మరణశాసనం వ్రాసిన వారెవరు? (డి.వి.డి. - 1)

6. ప్రకృతి మార్పులు (డి.వి.డి.- 1)

7. నీతిని విత్తువాడు (డి.వి.డి.- 1)

8. దేవుని యందలి భయము - భక్తి (డి.వి.డి. - 1)

## ADMISSION NOTICE

# కరస్పాండెన్స్ మరియు కాంటక్ట్ కోర్సు

### (అడ్మిషన్లు సంవత్సరమంతా జరుగును)

*మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. (1కొరింథీ 1:23).*

మానవులందరు సర్వేశ్వరుడైన దేవుని యొద్దకు తిరిగి చేరడానికి ఆయన ప్రియ కుమారుడైన క్రీస్తు యేసు చూపిన సర్వోన్నతమైన మార్గముపై నేటి మన అఖండ భారతావని ప్రశ్నలకు - అనుమానాలకు, శాస్త్ర సాంకేతికపరంగా, చరిత్ర - న్యాయ - ఆధ్యాత్మికంగా సకల విధములైన అనుభవ జ్ఞానంతో, ప్రేమ - సాత్వీకంతో సమాధానం చెప్పి అవసరమైనచోట తర్కించి - వాదించి - ఒప్పించి దేశరాజ్యాంగ చట్టాలకనుగుణంగానే ధైర్యముగా మాట్లాడే వారిగా, అనేకుల ఆత్మ రక్షణ కొరకు దేవుడే ఈ జీవుడి ద్వారా వ్రాయించిన జీవగ్రంథమైన బైబిల్‌లో తర్ఫీదునిచ్చి, మనిషిలోని రాక్షసత్వాన్ని రూపుమాపి, తనలోని దైవత్వాన్ని పైకి తీసి దేశంలోని, మూఢనమ్మకాలను సాంఘిక దురాచారాలను, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను మాన్పించి ఈ ప్రపంచాన్ని అందులోని ప్రతి మనిషి దేహాన్ని ఒక దేవాలయంగా చేయాలన్నదే మా ఆశ-ఆశయము.

ప్రపంచంలోని ఎన్నో బైబిల్ కళాశాలల్లో బోధించని సృష్టి రహస్యములను, అనేక దేశ చరిత్రలోనూ, రాజ్యాంగ న్యాయ చట్టాలలోను అణువణువునా కనిపించేవి, ఆధునిక శాస్త్రాలను సైతం అధిగమించినవి, మానవ మనుగడకు అత్యవసరమైన వాటిని పరిశోధించి ఉచితముగా బోధించుచున్నాము, ప్రస్తుతము బోధనా భాష తెలుగు.

**మావద్ద కోర్సులు :**

**1. D.B.Th. (Diploma in Bible Theology) - 1సం॥**

**2. B.B.Th. (Bachelor of Bible Theology) -1సం॥**

**3. M.B.Th. (Master of Bible Theology) - 1సం॥**

**4. Ph.D (Degree of Doctroate in Bible Philosophy) - 1సం॥**

కనీస విద్యార్హత : ఎ) 10వ తరగతి (ఎస్.ఎస్.సి.) పాస్ అయి ఉండాలి

బి) ఇంగ్లీషు, సైన్సు, చరిత్రలపై అవగాహనుండాలి.

2. ప్రతి సోమవారం సాయంత్రం 7:30 నుండి 9 గం॥ల వరకు నెలకు నాలుగు పాఠాలు బోధించబడును. ప్రతి నెల ఆఖరి ఆదివారం గాని సెలవురోజున గాని పరీక్ష నిర్వహించబడును. సర్టిఫికేట్ అవసరం లేనివారు కూడా వచ్చి విని వెళ్ళవచ్చు.

3. **ప్రతి ఆదివారం ఉదయం 10:30 నుండి 12:30 వరకు.**

4. సిలబస్‌లో ఇచ్చిన బోధనాంశముల క్రమసంఖ్యను అవసరాలన్నిబట్టి లేదా సమయానుకూలతను బట్టి మార్పులు చేసి బోధించబడును. ఏ విషయం ఒక వారం ముందుగా తెలియజేయబడును. బైబిల్‌పై మీకున్న అనుమానాలన్నిటికి పూర్తి వివరణ ఇవ్వబడును.

5. అవసరాన్నిబట్టి వారానికి రెండు క్లాసులు జరిపి ఇంకా ఎక్కువ సంగతులు బోధింపబడును. ప్రతిరోజు క్లాసు తర్వాత ఆ రోజు పాఠ్యభాగంపై సమగ్రమైన పరిశోధన (చర్చ), ప్రశ్నలకు సమాధానములు ఉంటాయి.

6. ప్రతి విద్యార్థి స్వంత నోట్ పుస్తకం, పెన్ను, పెన్సిల్, బైబిల్ తెచ్చుకొనవలెను. ఆసక్తి కలిగినవారందరు వయోబేధం - స్త్రీ-పురుష బేధం లేకుండా అప్లికేషన్ కొరకు పై ఆఫీస్ అడ్రస్‌కు వ్రాయండి. దరఖాస్తుతోపాటు 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలు తప్పక జతచేయండి.

7. పండుగ మరియు సెలవు దినములలో ఆత్మరోగులకు ఉచితవైద్య శిబిరములుగా ప్రత్యేకమైన సెమినార్లు సంవత్సరానికి 6లేక 5 జరుగును. సర్టిఫికేట్ కావల్సినవారు తప్పనిసరిగా ఈ సెమినార్లకు హాజరు కావలెను. ప్రతి సం॥ జనవరిలో జరిగే ఎగ్జామ్‌కు హాజరు కావలెను.

- కరస్పాండెంట్

**డా॥ బి. జాన్ గారి కలం నుండి వెలువడి అనేకులను వాక్యపు వెలుగులో నడిపిస్తూ దేవుని రాజ్యం యొద్దకు చేర్చుచున్న ఆత్మజ్ఞాన గ్రంథములు.**

1. ఏది నిజమైన దైవారాధన?
2. మనిషి జన్మ ఎందుకు?
3. పరిశుద్ధుని ముసుగులో భ్రష్టుడు!
4. దేవుడెవరు? (త్రిత్వమా? ఏకత్వమా?)
5. జన్మపాపమా? కర్మపాపమా?
6. వివాహము బంధమా? బంధకమా?!
7. వెయ్యేండ్ల పరిపాలన! (ఎప్పుడు? ఎక్కడ? ఎవరితో?)
8. సాతాను ముద్ర, దేవుని ముద్ర
9. యెహోవా ఏర్పాటు చేసిన దినము?!
10. సమాజంలో స్త్రీ పాత్ర?! (సంఘంలో స్త్రీల అలంకరణ)
11. సిలువ వేయబడిన క్రీస్తు!?
12. క్రిస్మస్ - వాచ్‌నైట్ - న్యూ ఇయర్
13. యెహోవా కట్టిన ఇల్లు - ఆలయ ప్రతిష్ఠ?!
14. క్రైస్తవ్యం కులమా? మతమా?
15. బలవంతపు మతమార్పిడులు సాధ్యమేనా?!
16. మానవ మేధస్సుకు అందని ప్రేమ
17. యేసుక్రీస్తు ఎవరు?

---

పుస్తకాలు, వీడియో సి.డి.లు, ఉచిత కరపత్రాల కొరకు సంప్రదించండి.

సంప్రదించండి : బ్రదర్ జె. రవి - 9440792192, 9676744233

**కులం కుళ్ళు...**

**మతం మత్తు...**

**ధనం దగా...**

**మనిషి మాయ...**

# దేవుడే దిక్కు?!



## బొంకూరి జాన్

దేవుడున్నాడా? వుంటే ఎలావుంటాడు? మన మనుషుల్లాగే వుంటాడా?

ఆ దేవున్ని ఎవరైనా, ఎప్పుడైనా చూసినవారు, ఆయనతో మాట్లాడిన వారున్నారా?

దేవుని చిత్తము లేకా ఇష్టము మరియు పరిశుద్ధత అనగా ఏమిటి?

దేవునికి పేరుందా? ఆయన ఏ పేరుతో పిలిస్తే పలుకుతాడు?

స్తోత్రార్హుడెవరు? మహాదేవుడెవరు? మనమెవరికి ప్రార్ధన చేయాలి?

**దేవుడొక్కడేనా? త్రిత్వమా – ఏకత్వమా? ముగ్గురు దేవుళ్ళా?**

మనిషి మతినుండి పుట్టిన మత సిద్ధాంతాల వలన విసిగిపోయి, సృష్టికర్తను మరచి సృష్టిమీద ఆధారపడ్డ నాస్తిక-శాస్త్రీయ వాదాలతో, సాతాను మాయ బోధలతో కలిగిన ఎన్నో అనుమానాలకు, ప్రశ్నలకు మానవులందరి మేలులకై దేవుడిచ్చిన ధర్మశాస్త్రము, మనిషి బ్రతుకు పుస్తకము, మన జీవగ్రంథమైన బైబిల్‌లోని దేవుని జ్ఞానానుసారమైన సమాధానములు కావాల్సిన వారంతా అర్జెంట్‌గా చాలా ఓపికతో చదివి జాగ్రత్తగా ఆలోచించి, బైబిల్‌తో సరి చూసుకొని, గ్రహించి అనేకులచేత అత్యవసరముగా చదివించాల్సిన పుస్తకమే ఈ **"దేవుడెవరు?!"**

SSGraphics @ 9550015417